సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 302

గురువారం 23-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'



వేతన జీవులను కనికరించేనా?

బడ్జెట్‌–2025పై మధ్య తరగతి, వేతన వర్గాల్లో ఎన్నో ఆశలు..

-15లో



ఆరంభం అదిరింది

తొలి టి20లో ఇంగ్లండ్‌పై 7 వికెట్లతో నెగ్గిన భారత్

-14లో



చర్చలకు రాకపోతే ఆంక్షలే

పుతిన్‌తో చర్చలకు సిద్ధమని అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్‌ స్పష్టంచేశారు. చర్చలకు రాకుంటే ఆంక్షలు తప్పవని హెచ్చరించారు.

వివరాలు 6లో ▸



జెనిన్‌లో భారీ ఆపరేషన్‌

ఆక్రమిత వెస్ట్‌ బ్యాంక్‌లోని జెనిన్‌లో ఇజ్రాయెల్‌ దళాలు జరిపిన భారీ ఆపరేషన్‌లో తొమ్మిది మంది పాలస్తీనియన్లు మరణించారు.

వివరాలు 6లో ▸



గగన్‌యాన్‌ మిషన్‌లో పురోగతి

'గగన్‌యాన్‌' దిశగా ఇస్రో ముందడుగు.. క్రూ మాడ్యూల్‌కు లిక్విడ్‌ ప్రొపల్షన్‌ సిస్టమ్‌ను విజయవంతంగా జతచేసింది.

వివరాలు 6లో ▸



బీజేపీకి జేడీ(యూ) ఝలక్‌

బీజేపీకి మిత్రపక్షమైన జేడీ(యూ) మణిపూర్‌లో ఆ పార్టీకి షాక్‌ ఇచ్చింది. బీరేన్‌సింగ్‌ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది.

వివరాలు 6లో ▸

రూ.45,500 కోట్ల పెట్టుబడి

సన్‌ పెట్రో కెమికల్స్‌ సంసిద్ధత.. దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం

రాష్ట్రంలో సోలార్‌ విద్యుత్‌ ప్రాజెక్టులతో పాటు 3 చోట్ల భారీ పంప్డ్‌ స్టోరేజీ హైడ్రో పవర్‌ ప్రాజెక్టులు నెలకొల్పనున్న సంస్థ

నిర్మాణ దశలోనే సుమారు 7 వేల ఉద్యోగాలకు అవకాశం

సుస్థిర ఇంధన వృద్ధి లక్ష్య సాధనలో ఓ మైలురాయి: సీఎం రేవంత్‌

రూ.10 వేల కోట్ల పెట్టుబడికి 'కంట్రోల్‌ ఎస్‌'తో మరో ఎంవోయూ



సన్‌ పెట్రో కెమికల్స్‌ ఎండీ దిలీప్‌ సాంఘ్వీని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్‌: దావోస్‌ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్‌) సమావేశాల్లో తెలంగాణ రూ.45,500 కోట్ల భారీ పెట్టుబడిని సాధించింది. దేశంలో ఇంధన రంగంలో పేరొందిన సన్‌ పెట్రో కెమికల్స్‌ రాష్ట్రంలో ఈ మేరకు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. బుధవారం సన్‌ పెట్రో ఎండీ దిలీప్‌ సాంఘ్వీతో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చర్చల నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ముఖ్యమంత్రి సమక్షంలో ఈ పెట్టుబడికి సంబంధించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా సన్‌ పెట్రో కెమికల్స్‌ రాష్ట్రంలో సోలార్‌ విద్యుత్‌ ప్రాజెక్టులతో పాటు మూడుచోట్ల భారీ పంప్డ్‌ స్టోరేజీ హైడ్రో పవర్‌ ప్రాజెక్టులను నెలకొల్పుతుంది. నాగర్‌కర్నూల్‌, మంచిర్యాల, ములుగు జిల్లాలో ఏర్పాటయ్యే ఈ మూడు ప్రాజెక్టుల ఇంధన సామర్థ్యం 3400 మెగావాట్లు. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే సుమారు 7 వేల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు.

హరిత ఇంధన ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా చేస్తాం: సీఎం

హరిత ఇంధన ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని, సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించాలనే లక్ష్య సాధనలో ఈ ఒప్పందం ఓ మైలు రాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని క్లీన్‌ అండ్‌ గ్రీన్‌ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని, నాగర్‌కర్నూల్‌, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతాయని ఆకాంక్షించారు. సన్‌ పెట్రో కెమికల్స్‌ చేపట్టబోయే ప్రాజెక్టు దేశంలోనే అత్యంత ప్రభావశీలంగా ఉంటుందని దిలీప్‌ సాంఘ్వీ చెప్పారు. గ్రీన్‌ ఎనర్జీ రంగంలో అందరి దృష్టినీ తెలంగాణ ఆకర్షిస్తుందన్నారు. పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌ రంజన్‌, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి ఇన్వెస్ట్‌మెంట్స్‌ ప్రమోషన్‌ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి చర్చల్లో పాల్గొన్నారు.

'కంట్రోల్‌ ఎస్‌' ఏఐ డేటా సెంటర్‌ క్లస్టర్‌

డబ్ల్యూఈఎఫ్‌ సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 400 మెగావాట్ల సామర్థ్యంతో అత్యాధునిక 'ఏఐ డేటా సెంటర్‌ క్లస్టర్‌' ఏర్పాటుకు 'కంట్రోల్‌ ఎస్‌ డేటా సెంటర్స్‌ లిమిటెడ్‌' ముందుకు వచ్చింది. దీనిద్వారా

మిగతా 12వ పేజీలో ▶

భార్యను చంపి, ముక్కలు చేసి..

కుక్కర్‌లో ఉడికించి..

హైదరాబాద్‌లోని మీర్‌పేటలో రిటైర్డ్‌ ఆర్మీ జవాన్‌ దారుణం

ఉడికించిన ముక్కలను ఎండబెట్టి, రోకలితో దంచి పొడిచేసిన తీరు

పొడిని డ్రైనేజీలో, ఎముకలను జిల్లెలగూడ చెరువులో కలిపిన వైనం

యూట్యూబ్‌లో శోధించి, క్రైమ్‌ సినిమాలు చూసి ఆధారాలు దొరక్కుండా ప్రయత్నాలు

ముందుగానే ఓ వీధి కుక్కపై ప్రయోగం.. తర్వాత భార్య మృతదేహంపై కిరాతకం

ఏమీ తెలియనట్టుగా భార్య తల్లిదండ్రులతో కలసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

అదుపులోకి తీసుకొని విచారించడంతో వెలుగులోకి..



భార్యతో గురుమూర్తి

భార్యపై అనుమానంతోనే ఘాతుకం

సాక్షి, హైదరాబాద్‌/మీర్‌పేట: ఓ వ్యక్తి అనుమానంతో తన భార్యను పాశవికంగా హత్య చేశాడు. అయినా కసి తీరక ఆమె మృతదేహాన్ని ముక్కలుగా నరికాడు. ఓ పెద్ద కుక్కర్‌ తీసుకొచ్చి శరీర భాగాలను ఉడకబెట్టాడు. తర్వాత ఎండబెట్టి, కాల్చాడు. ఇంట్లోనే రెండు, మూడు రోజుల పాటు రోకలి బండతో దంచి పొడిగా చేశాడు. ఆ పొడిని డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో కలిపేశాడు. మిగిలిన ఎముకల ముక్కలను సమీపంలోని జిల్లెలగూడ (చందన) చెరువులో పారేశాడు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీసు స్టేషన్‌ పరిధిలోని జిల్లెలగూడ న్యూ వేంకటేశ్వర కాలనీలో ఈ దారుణం

మిగతా 16వ పేజీలో ▶

పట్టాలపై మృత్యుఘోష



మహారాష్ట్రలో మాటలకందని ఘోరం..

రైల్లోంచి పట్టాలపైకి దూకి మరో రైలుకు బలి

12 మంది దుర్మరణం, 15 మందికి గాయాలు

మంటలంటుకున్నాయన్న వదంతులే కారణం

వివరాలు 6లో ▶



మ్యాథ్స్‌లో కొంత క్లిష్టత ఫిజిక్స్‌ సులభం

జేఈఈ–మెయిన్‌ తొలిరోజు పరీక్షలపై నిపుణుల విశ్లేషణ

సుదీర్ఘంగా మ్యాథ్స్‌ ప్రశ్నలు.. రెండు సెషన్లలోనూ ఇదే తీరు

మ్యాథ్స్‌లో సమాధానాలు ఇవ్వడానికి సరిపోని సమయం

కెమిస్ట్రీలో కొన్ని సులభం.. కొన్ని ఓ మోస్తరు క్లిష్టత

గత ప్రశ్నపత్రాల నుంచే ఎక్కువగా ప్రశ్నలు

కెమిస్ట్రీలో ఎక్కువ ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే..

వివరాలు 12లో▶

గూడెమంతా గుడిసెలే.. ఒక్కరికీ ఇల్లు రాలే!



సారంగాపూర్‌: జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్‌ మండలం కండ్లపల్లి నాయికపుగూడెంలో గ్రామస్తులందరికీ పూరిళ్లే ఉన్నా, ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు రాలేదు. ఈ గిరిజన గూడెంలో 60 కుటుంబాలున్నాయి. అందరివీ పూరి గుడిసెలే. ప్రజాపాలన కార్యక్రమంలో ఈ గూడెం వాసులంతా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన అధికారులు ఇటీవల గ్రామంలో సర్వే కూడా చేశారు. కానీ తాజాగా నిర్వహించిన గ్రామసభలో ప్రదర్శించిన జాబితాలో ఆ గూడేనికి చెందిన ఏ ఒక్కరి పేరు లేదు. దీనిపై రెవెన్యూ పరిశీలకుడు శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. నాయికపుగూడెంలోని గుడిసెలన్నీ రిజర్వ్‌ ఫారెస్ట్‌ కిందకు వస్తున్నందున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని తెలిపారు. తమ ఇళ్లు రిజర్వ్‌ ఫారెస్ట్‌ కిందకు వచ్చినప్పుడు అధికారులు సర్వే ఎందుకు చేశారని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.

అర్హుల జాబితాలపై అభ్యంతరాలు 16లో

రేణుక యార



నర్సింగ్‌రావు



తిరుమలాదేవి



మధుసూదన్‌రావు



హైకోర్టుకు కొత్తగా..

నలుగురు జడ్జీలు

సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులకు రాష్ట్రపతి ముర్ము ఓకే

ఉత్తర్వులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

25న బాధ్యతలు చేపట్టనున్న నర్సింగ్‌రావు నందికొండ, రేణుక, తిరుమలాదేవి, మధుసూదన్‌రావు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులను నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. సిటీ సివిల్‌ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రేణుక యార, సిటీ స్మాల్‌ కాజెస్‌ కోర్టు చీఫ్‌ జడ్జి నర్సింగ్‌రావు నందికొండ, హైకోర్టు రిజిస్ట్రార్‌ జనరల్‌ తిరుమలాదేవి ఈద, హైకోర్టు రిజిస్ట్రార్‌ (అడ్మినిస్ట్రేషన్‌) మధుసూదన్‌రావు బొబ్బిలి రామయ్య పేర్లను ఈ నెల 11న ఢిల్లీలో భేటీ అయిన సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. వీరంతా 2012లో జిల్లా జడ్జీలుగా ఎంపికై నవారు కావడం గమనార్హం. కాగా న్యాయాధికారుల కోటాలో వీరి ఎంపిక జరిగింది. తిరుమలాదేవి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 2026 జూన్‌ 1 వరకు హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా కొనసాగుతారని

మిగతా 12వ పేజీలో ▶



సెర్చ్‌ ఆపరేషన్‌!

అధికార, పార్టీ పదవులకు సమర్థుల కోసం అన్వేషణ 3లో

- 70 వరకు నామినేటెడ్‌ పోస్టులు ఖాళీ
- పీసీసీ కీలక పదవులకు 100 మంది నేతల అవసరం.. సామాజిక, ప్రాంతీయ సమీకరణాల ఆధారంగా కసరత్తు



చిటపట.. గజగజ..

రాష్ట్రంలో విచిత్ర వాతావరణ పరిస్థితి.. పగలంతా ఉక్కపోత.. రాత్రయితే వణికిస్తున్న చలి.. కనిష్ట ఉష్ణోగ్రతలు పతనం కావడం, చలిగాలుల ప్రభావంతో వాతావరణం వేగంగా చల్లబడుతోందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

- వివరాలు 3లో▶



రెండోరోజూ ఐటీ సోదాలు

దిల్‌రాజు ఇల్లు, మైత్రీ మూవీ మేకర్స్‌, మ్యాంగో సంస్థల్లో దాడులు

ఐటీ సోదాలు మొత్తం సినీ పరిశ్రమపై జరుగుతున్నాయి: దిల్‌ రాజు

సాక్షి, హైదరాబాద్‌: సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు రెండోరోజూ కొనసాగాయి. ప్రముఖ నిర్మాత, తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి మండలి చైర్మన్‌ దిల్‌ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌తోపాటు మైత్రీ మూవీ మేకర్స్‌, మ్యాంగో సంస్థల కార్యాలయాలు, కొందరు సినీ ఫైనాన్షియర్ల ఇళ్లలో మంగళవారం ఉదయం నుంచి మొదలైన సోదాలు, బుధవారం రాత్రి వరకు కొనసాగాయి. భారీ బడ్జెట్‌ చిత్రాలు రూపొందించే వారిపై ఐటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అధికారులు 55 బృందాలుగా

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మీరెన్ని 'ఫ్రీ'లిచ్చినా నా ఓటు మాత్రం 'ఫ్రీ' కాదు.. విలువైనది!



క్లుప్తంగా...

దమ్ముంటే గ్రామసభలకు రా!

సీఎంకు ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్



సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే గ్రామసభలకు రావాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. రైతుభరోసా, రుణమాఫీ తదితర అంశాలపై అక్కడ చర్చ పెడదామని అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని 15వ వార్డులో జరిగిన ప్రజాపాలన సభలో ఆయన పాల్గొన్నారు. తమకు రైతు రుణమాఫీ కాలేదని, రేషన్ కార్డులు మంజూరు కాలేదని ఈ సభలో పలువురు హరీశ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'రుణమాఫీ చేశామని రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో చెపుతున్నారు. దమ్ముంటే ఇక్కడికి రా.. ఎంత మందికి కాలేదో చూపెడతా. మీ సొంత గ్రామమైనా ఫర్వాలేదు. నేను కూడా వస్తా'అని అన్నారు. పోలీసులను పెట్టి నిర్బంధాల మధ్య గ్రామసభలు నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజాపాలనలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు.. ఇలా వివిధ పథకాల కోసం ఏడాది క్రితం దరఖాస్తు స్వీకరించారని, అయి తే వాటి గురించి ఇప్పటికీ దిక్కు లేదన్నారు. ఉపాధి హామీకి ఆత్మీయ భరోసాకు ఎందుకు లింక్ పెడుతున్నారని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలు అందరికీ ఇందిరమ్మఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ నిర్లక్ష్యంతోనే కేంద్రం చేతుల్లోకి సాగర్

ఎమ్మెల్సీ కవిత ఆరోపణ



సాక్షి, యాదాద్రి: సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వల్లే నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేంద్రబలగాల చేతుల్లోకి వెళ్లిందని, రాష్ట్ర రైతులకు ఎడమ కాలువ ద్వారా సాగునీరందక అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆమె బుధవారం ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం భువనగిరి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా రాష్ట్ర ప్రజలకు సాగునీరందని దుస్థితి నెలకొందని, మన అధికారులు డ్యాం వద్దకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. సాగర్ డ్యామ్‌ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా కోసం జరుగుతున్న గ్రామసభల్లో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆ తర్వాత పథకాలు రాకపోతే గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులను, మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలని కవిత ప్రజలకు పిలుపునిచ్చారు.

కొట్టుకున్న కాంగ్రెస్ యూత్

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కొట్టుకున్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం గాంధీభవన్‌లో అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి నేతృత్వంలో జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా చీకటి కార్తీక్‌ను నియమించారని, ఆయనకు నలభయ్యేళ్లు ఉన్నప్పటికీ పోటీకి అనుమతించారని కొందరు ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన సుధీర్ అనే వ్యక్తి.. సమావేశంలో ప్రస్తావించడంతో ఘర్షణ మొదలైందని తెలుస్తోంది. దీంతో సుధీర్‌ను సమావేశం నుంచి బలవంతంగా బయటకు తీసుకు వచ్చారు. ఆ తర్వాత వారి మధ్య మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. గొడవ సద్దుమణిగిన అనంతరం రెండు వర్గాలు విలేకరులతో మాట్లాడుతూ.. పరస్పర ఆరోపణలు చేసుకున్నాయి. ఘర్షణమై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆరా తీశారు. త్వరలోనే షోకాజ్ నోటీసులు జారీ చేస్తారని సమాచారం.

పగలు చిటపట.. రాత్రి గజగజ..



- రాష్ట్రంలో విచిత్రంగా వాతావరణ పరిస్థితులు
- పగటి వేళలో సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు
- రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే తక్కువగా నమోదు
- తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న చలిగాలులే కారణం

అత్యంత తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
సంగారెడ్డి	కోహీర్	6.9
ఆసిఫాబాద్	తిర్యాని	7.2
రంగారెడ్డి	మొయినాబాద్	8.1
ఆదిలాబాద్	బేలా	8.5
వికారాబాద్	మర్పల్లి	9.0
కామారెడ్డి	మేనూర్	9.6
రాజన్నసిరిసిల్ల	గజసింగారం	9.7
మహబూబ్‌నగర్	రాజాపూర్	9.9

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగలంతా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోతగా ఉంటే.. రాత్రిపూట గజగజమంటూ చలి వణికిస్తోంది. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం, కొన్నిప్రాంతాల్లో అంతకు మించి నమోదవుతుండగా.. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణంకంటే తక్కువగా నమోదవుతున్నాయి. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 1 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదు కాగా.. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత మహబూబ్‌నగర్‌లో 34.1 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 10.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతల్లో మార్పులు రావడంతో జనజీవనం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ మార్పులు అనారోగ్య సమస్యలకు దారితీస్తాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి. ఖమ్మంలో సాధారణం కంటే 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం భారీ వ్యత్యాసంతో నమోదయ్యాయి. మెదక్‌లో సాధారణ కనిష్ట ఉష్ణోగ్రతకంటే 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కాగా, హైదరాబాద్, రామగుండంలో 3డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదైంది.రాష్ట్ర ప్రణాళికా విభాగం వివరాల ఆధారంగా కనిష్ట ఉష్ణోగ్రత కోహీ ర్‌లో 6.9 డిగ్రీలుగా నమోదైంది. రానున్న 3 రోజులు కూడా రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈసారే ఎందుకిలా?

రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తక్కువ ఎత్తులో చలిగాలులు వీస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పతనం కావడం, చలిగాలుల ప్రభావంతో వాతావరణం వేగంగా చల్లబడుతోంది. భౌగోళికంగా రాష్ట్రం దక్కన్ పీఠభూమిలో ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గడం, పెరగడం జరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా చలికాలంలో సాధారణ ఉష్ణోగ్రతల కంటే తక్కువగా నమోదవుతుంటాయి. ప్రస్తుతం తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి బలమైన చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరిగింది. గతేడాది రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే నమోదు కాగా.. ఈ ఏడాది మాత్రం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నిజామాబాద్	34.8	15.3
మహబూబ్‌నగర్	34.1	17.7
ఖమ్మం	33.2	18.0
ఆదిలాబాద్	33.0	14.4
రామగుండం	32.6	12.3
హనుమకొండ	32.5	16.5
భద్రాచలం	32.2	18.0
హైదరాబాద్	31.6	14.6
దుండిగల్	31.5	14.5
హకీంపేట్	31.5	15.0
మెదక్	31.4	10.6
నల్లగొండ	30.5	16.8

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కొంగర వద్ద వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి: రాష్ట్రంలోని అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హులైన చివరి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందేవరకూ దరఖాస్తుల స్వీకరణ, మంజూరు కొనసాగుతుందని స్పష్టం చేశారు. గ్రామసభలో ప్రకటించే జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, మళ్లీ దరఖాస్తు ఇస్తే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారని మంత్రి తెలిపారు. అంతేకాకుండా అనర్హుల పేర్లు ఉన్నా సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా, కొన్ని పార్టీల నాయకులు ప్రజలను ఆందోళనకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారని, గ్రామసభల్లో ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఏనాడూ గ్రామసభలు నిర్వహించకపోగా, ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రైతుభరోసా ద్వారా సాగుకు యోగ్యమైన ప్రతీ ఎకరాకు రూ.12 వేలు, భూమి లేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ఏటా రూ.12వేలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరుచేస్తామని తెలిపారు. కాగా, మార్గమధ్యలో కొంగర గ్రామం వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలతో మంత్రి పొంగులేటి మాట్లాడారు.

25 నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర మహాసభలు

సాక్షి, హైదరాబాద్: సీపీఎం రాష్ట్ర మహాసభలను సంగారెడ్డి పట్టణంలో ఈనెల 25 నుంచి 28వరకు జరిపేందుకు ఆ పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. మహాసభల సందర్భంగా సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా వివిధ రూపాల్లో విస్తృత ప్రచారం చేస్తోంది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలపై సెమినార్లు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మహాసభల సందర్భంగా లక్ష కుటుంబాలను కలిసి సీపీఎం రాష్ట్ర మహాసభల ప్రాధాన్యత వివరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆహ్వాన సంఘం చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యాచరణ సభ్యులు చుక్క రాములు తెలిపారు.

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంత్రి జూమ్ సమావేశం



సాక్షి, హైదరాబాద్: అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు. రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బుధవారం ఆయన ప్రజా ప్రతినిధులు, అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. గ్రామసభలు, రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ అంశాలపై ఇందులో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సామాజిక ఆర్థిక సర్వే, ప్రజాపాలన దరఖాస్తులు, కులగణన, ప్రభుత్వ కార్యాలయాలలో ఇచ్చిన దరఖాస్తుల ఆధారంగా రేషన్ కార్డులు లేని వారిని గుర్తించడం జరిగిందని తెలిపారు. సంతృప్తికర విధానంలో అర్హులందరికీ రేషన్ కార్డు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. గతంలో ఆహార భద్రత కార్డులకు దొడ్డు బియ్యం ఇచ్చేవారని, కానీ తమ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యం ఇవ్వబోతోందని తెలిపారు. ఈనెల 26 నుంచి రాష్ట్రంలో కొత్త కార్డుల పంపిణీ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. రేషన్ కార్డులు ఇప్పుడు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన రేషన్ దొడ్డు బియ్యాన్ని ఎవరూ తినకపోయేవారని, ఆ బియ్యాన్ని లబ్ధిదారులు బయట అమ్ముకునేవారని తెలిపారు. కాగా, గ్రామాలలో పథకాలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు అబద్ధాలను తిప్పికొట్టి, ప్రజలకు సరైన సమాచారం అందించాలని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను ఆయన కోరారు. అర్హులకు రేషన్ కార్డులు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులదేనని అన్నారు.

కొత్తగా 8 ప్రాంతాల్లో గిడ్డంగుల నిర్మాణం

గిడ్డంగులు, ఎరువులపై సమీక్షించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన గిడ్డంగులను సమకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ సంవత్సరం ఇప్పటిదాకా కొత్తగా 30 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. బుధవారం ఆయన సచివాలయంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు, సంస్థ ఎండీ కొర్రా లక్ష్మితో కలిసి గిడ్డంగుల సంస్థ కార్యకలాపాలు, ఈ సంవత్సరం చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. అలాగే వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి ఎరువుల లభ్యతపై సమీక్ష జరిపారు. రాష్ట్రంలో 8 ప్రదేశాలలో నూతన గిడ్డంగుల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. తద్వారా కొత్తగా 1,03,800 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. అలాగే అల్లాపూర్‌లో మరో 3,800 మెట్రిక్ టన్నుల సామర్థ్యం పెంపునకు సంబంధించి పనులు చేపట్టినట్లు తెలిపారు. గిడ్డంగుల సంస్థ ఎండీ కొర్రా లక్ష్మి మాట్లాడుతూ, సన్న, చిన్నకారు రైతులు ధాన్యాన్ని లేదా పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుంటే వారికి 35 శాతం రిబేట్ ఇస్తున్నట్లు తెలిపారు.

పారదర్శక విచారణ జరగాలి

- నేరెళ్ల ఘటనపై హైకోర్టులో బాధితుడి ఇంప్లీడ్ పిటిషన్
- కౌంటర్ దాఖలు చేసిన పోలీసులు
- తదుపరి విచారణ ఫిబ్రవరి 27కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామంలో 2017లో దళితులపై దాడి జరిగిన ఘటనపై విచారణ పారదర్శకంగా సాగాలని బాధితుల్లో ఒకరైన కోలా హరీశ్ పేర్కొన్నారు. ఈ మేరకు హైకోర్టులో విచారణ సాగుతున్న ప్రజా ప్రయోజన వ్యాజ్యాల్లో తనను ఇంప్లీడ్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. నాటి కేసులో వాస్తవాలు తెలియాలంటే తన వాదనలు కూడా వినాలని కోరారు. అలాగే, న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. సిరిసిల్ల జిల్లా చీర్లవంచ, కొదురుపాక ప్రాంతాల నుంచి వందలాది ఇసుక లారీలు టిప్పర్లు నడిచేవి. ఈ క్రమంలోనే 2017, జూలై 2న నేరెళ్లకు చెందిన ఎరుకల భూమయ్యను ఇసుక లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. తీవ్ర ఆగ్రహానికి గురైన స్థానికులు ఐదు ఇసుక లారీలను తగలబెట్టారు. దీంతో పోలీసులు, స్థానికుల మధ్య ఘర్షణ జరగ్గా.. 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల తర్వాత రాత్రి 11:30 గంటలకు నేరెళ్లకు చెందిన పెంట బానయ్య, కోలా హరీశ్, చెప్యాల బాలరాజు, పసుల ఈశ్వర్ కుమార్, గంధం గోపాల్, రామచంద్రాపూర్‌కు చెందిన భక్తుల మహేశ్, జిల్లెలకు చెందిన కోరుకొండ గణేశ్, చీకోటి శ్రీనివాస్‌లను పోలీసులు అనుమానితులుగా అదుపులోకి తీసుకొని, జూలై 7న అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు.

ఎస్‌ఐ తప్పు లేదని విచారణలో తేలింది

ఈ ఘటనలో బాధితులను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని, బాధ్యులైన ఎస్పీ విశ్వనాథ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉప్పల్‌కు చెందిన గడ్డం లక్ష్మణ్ దాఖలు చేసిన పిల్‌తో పాటు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ రాసిన లేఖతో మరో పిల్ దాఖలైంది. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రాధారాణి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది డి.సురేశ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ మంగళవారం అందిందన్నారు. దీనిపై వివరాలు తెలుసుకుని, బదులివ్వడానికి 15 రోజుల సమయం కావాలని కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే నెల 27కు వాయిదా వేసింది. అయితే, సదరు ఎస్‌ఐ ఎలాంటి తప్పు చేయలేదని విచారణాధికారి నివేదిక ఇచ్చారని, దీంతో సస్పెన్షన్‌ను ఉపసంహరించుకున్నామని అఫిడవిట్‌లో ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

టీపీసీసీ సెర్చ్ ఆపరేషన్!

- అధికార, పార్టీ పదవులకు సమర్థుల కోసం అన్వేషణ
- 70 వరకు నామినేటెడ్ పోస్టులు ఖాళీ
- పీసీసీ కీలక పదవులకు 100 మంది నేతల అవసరం
- సామాజిక, ప్రాంతీయ సమీకరణల ఆధారంగా కసరత్తు
- ఈ నెలాఖరు నాటికి భర్తీ చేయాలని ఏఐసీసీ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పార్టీ, ప్రభుత్వ పదవుల భర్తీ ప్రక్రియ టీపీసీసీకి కత్తిమీద సాములా మారింది. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, కార్పొరేషన్ల చైర్మన్లు, కమిషన్ల సభ్యులు, ఏఐసీసీ కార్యదర్శులు, ఎమ్మెల్సీ పదవులకు సమర్థుల కోసం ఏఐసీసీ, పీసీసీ అన్వేషిస్తున్నాయి. పార్టీ కార్యవర్గంతో పాటు నామినేటెడ్ పోస్టులను ఈ నెలాఖరు నాటికి భర్తీ చేయాలన్న ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ కసరత్తు ముమ్మరం చేసింది.

జంబో కార్యవర్గం..

ఈసారి టీపీసీసీ కార్యవర్గాన్ని ఆచితూచి ఎంపిక చేయాలని ఏఐసీసీ, టీపీసీసీ భావిస్తున్నాయి. పీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమిస్తారని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేత ఉన్నందున, రెడ్డి సామాజిక వర్గానికి వర్కింగ్ ప్రెసిడెంట్ (ఆర్గనైజేషన్) ఇస్తారని, మరో మూడు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నేతలకు ఇస్తారనే చర్చ జరుగుతోంది. వీటి తో పాటు ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక వైస్ ప్రెసిడెంట్ పదవి, ప్రతి జిల్లాకు ఇద్దరు ప్రధాన కార్యదర్శులను నియమించాలని నిర్ణయించారు. పార్టీ అధికార ప్రతినిధులుగా మరో 10 మంది, పీసీసీ కార్యదర్శులుగా 50 మందిని నియమించే అవకాశాలున్నాయి. ఇవన్నీ కలిపి దాదాపు 200 వరకు పెరిగి పీసీసీ జంబో కార్యవర్గం ఉండవచ్చని అంచనా. ఈ పదవుల భర్తీపై ఇప్పటికే రెండు సార్లు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలు భేటీ అయ్యారు. దాదాపు 10 జిల్లాలకు ఎమ్మెల్యేలే పార్టీ అధ్యక్షులుగా ఉన్నారు. వీరిలో కొందరిని తప్పించి, సమర్థులైన మరికొందరు ఎమ్మెల్యేలను డీసీసీ అధ్యక్షులుగా నియమించాలని భావిస్తున్నారు.

నామినేటెడ్ పోస్టులపై ఆచితూచి..

నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా గత ఎనిమిది నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. పార్లమెంటు ఎన్నికలకు ముందు 33 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. మరో 40 వరకు కార్పొరేషన్ పదవులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. వీటితో పాటు పలు కమిషన్లలో మరో 30 మంది వరకు అవకాశం కల్పించవచ్చు. అంటే 70 వరకు పదవులు ఇవ్వొచ్చని ప్రచారం జరుగుతోంది. వీటికి ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్ల పోస్టులను కలిపితే వందల సంఖ్యలో ఉంటాయి. ఈ పోస్టుల భర్తీపై సామాజిక, ప్రాంతీయ సమీకరణల కసరత్తు ఎటూ తేలకపోవడంతో ఇప్పటికే పలుమార్లు ఈ ప్రక్రియ వాయిదా పడింది.

ఎమ్మెల్సీ హడావుడి

కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు ఎమ్మెల్సీ హడావుడి కనిపిస్తోంది. మార్చి నాటికి 8 ఎమ్మెల్సీలు పదవీ విరమణ చేస్తారు. వీటిలో మెజారిటీ సీట్లు దక్కించుకునేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల స్థానం నుంచి పోటీకి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, ముస్కు రమణారెడ్డి, ముదసం గంగాధర్, హరికృష్ణ, వెల్చాల రాజేందర్ పేర్లు రేసులో వినిపిస్తున్నాయి. రెండు టీచర్ ఎమ్మెల్సీల విషయంలో మిత్రపక్ష ఉపాధ్యాయ సంఘాలకు మద్దతిచ్చే ఆలోచనలో కాంగ్రెస్ ఉంది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీల్లో మూడు పదవులు నికరంగా కాంగ్రెస్‌కు రానున్నాయి. ఈ కోటాలో ప్రస్తుత ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డికి మళ్లీ అవకాశం వస్తుందని చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన అనంతరం ఇతర పోస్టులపై స్పష్టత వస్తుందని, నెలాఖరు కల్లా అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది.



ప్రార్థన ఉద్దేశం దేవుడిని ప్రభావితం చేయడం కాదు, ప్రార్థించేవారి స్వభావాన్ని మార్చడం.
– సొరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 23 జనవరి 2025

ఆశయాన్ని దెబ్బతీసే ఆచరణ?

రాజకీయాలకు అతీతంగా సాగాల్సిన విద్యారంగానికీ రంగులు అంటుకున్నాయి. కేంద్రం ఇటీవల జారీ చేసిన 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలు – 2025' ముసాయిదా చర్చనీయాంశమైంది. విశ్వవిద్యాలయ ఉపకులపతుల ఎంపిక ప్రక్రియను సమూలంగా మార్చేస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి వెలువరించిన ఈ ముసాయిదా బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలలో రచ్చ రేపుతోంది. ఉమ్మడి జాబితాలోని అంశమైన విద్యారంగంలో సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం పెత్తనం చేయాలనుకుంటున్నదన్నది ప్రతిపక్షాల ఆరోపణ. తాజా యూజీసీ ముసాయిదా అందుకు నిదర్శనమన్నది వాటి భావన. రాష్ట్ర గవర్నర్ నిర్వాకమా అని ఇప్పటికే పలు యూనివర్సిటీల్లో వీసీలు లేకుండా పోయిన తమిళనాడు ఈ ముసాయిదాను తక్షణమే ఉపసంహరించాలని కేంద్రాన్ని కోరుతూ చట్టసభలో తీర్మానం చేయడం గమనించాల్సిన అంశం. వీసీల పదవీ కాలాన్ని మూడు నుంచి అయిదేళ్ళకు పెంచడం మంచిదే అయినా, పరిశ్రమ నిపుణులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల పేరిట కాషాయ భక్తుల్ని వీసీలను చేస్తారన్న అనుమానాలకు జవాబు దొరకడమే కష్టంగా ఉంది.

ముసాయిదా ప్రకారం వైస్‌ఛాన్సలర్ల (వీసీల) నియామకం కోసం ముగ్గురు సభ్యుల అన్వేషణ, ఎంపిక కమిటీని నియమించే అధికారాన్ని ఛాన్సలర్లకు, అంటే కేంద్రసర్కార్ నియమించే ఆ యా రాష్ట్రాల గవర్నర్లకు కట్టబెట్టారు. ఒకవేళ మార్గదర్శకాలను గనక అమలు చేయకుంటే... సదరు విద్యా సంస్థను యూజీసీ పథకాల నుంచి, లేదంటే అసలు డిగ్రీ కోర్సులు చెప్పడానికైనా వీలు లేకుండా బహిష్కరించవచ్చు. ఈ ముసాయిదాపై సంబంధిత వర్గాలు, సామాన్య ప్రజలు నెల రోజుల్లోగా తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు చెప్పాలని కేంద్రం కోరుతోంది. వైస్-ఛాన్సలర్ మాట అటుంచి, పాఠశాల నుంచి కాలేజీలు, విశ్వవిద్యాలయాల దాకా విద్యా రంగంపై రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తుంటే, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదానైనా కేంద్ర ప్రభుత్వం నియమించిన వ్యక్తి (గవర్నర్)కి అసలెలా కట్టబెడతారన్నది తమిళనాడు సీఎం స్టాలిన్ సహా పలువురి ప్రాథమిక ప్రశ్న. సమాఖ్య స్ఫూర్తినే దెబ్బ తీసేలా ఉన్న తాజా ముసాయిదాను వ్యతిరేకిస్తూ, ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలు చట్టసభల్లో తీర్మానాలు చేయాలని ఆయన ఏకంగా పిలుపునివ్వడం విశేషం.

ఇప్పటికే తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ సహా అనేక రాష్ట్రాల్లో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలకూ, పై నుంచి వచ్చిన గవర్నర్లకూ మధ్య నిత్య ఘర్షణ చూస్తూనే ఉన్నాం. రాష్ట్ర సర్కార్లు నడిపే పలు విశ్వవిద్యాలయాల్లో సదరు గవర్నర్లే ఛాన్సలర్లు. వీసీల నియామకంపై వాళ్ళు రాష్ట్ర ప్రభుత్వాల అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఉదంతాలు కోకొల్లలు. ఇప్పటి వరకు వీసీల నియామక అన్వేషణ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వాలే ఏర్పాటుచేసేవి. తాజా ముసాయిదా ప్రకారం ఆ కమిటీల నియామకం సైతం ఛాన్సలర్లయిన గవర్నర్ల చేతిలోకి వెళ్ళిపోనుంది. ఢిల్లీ నుంచి తాము పంపే రబ్బరు స్టాంపులతో రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్ని సైతం తమ చేతుల్లోకి తీసుకోవాలన్న ప్రయత్నమిది అని ప్రతిపక్షాల ఆరోపణ. కేంద్ర పాలకులు ఆ ఆరోపణల్ని నిజం చేయరాదు.

నిజానికి, నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) అమలు చేస్తామంటూ కేంద్రం ప్రకటించి మూడున్నరేళ్ళు దాటినా, ఉన్నత విద్యాసంస్థల సంస్కరణ నేటికీ నత్తనడక నడుస్తోంది. దీర్ఘకాల లోపాల్ని సవరించి, ఆధునిక కాలానికీ, విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ అవసరాలకూ తగ్గట్లు యూనివర్సిటీలను తీర్చిదిద్దాల్సి ఉంది. ఉన్నత విద్యకు సంబంధించి నియంత్రణ వ్యవస్థయిన యూజీసీది అందులో ప్రధాన బాధ్యత. అతిగా నియంత్రిస్తోందంటూ గతంలో విమర్శలను ఎదుర్కొన్న యూజీసీ వైఖరి తాజా ముసాయిదాలో కొంత మారినట్టు కనిపిస్తోంది కానీ, కొత్త విమర్శలకు తావిచ్చింది. ఫలానా అంశం బోధించాలంటే అందులో పీజీ చేసి ఉండాల్సిందేనన్న అర్హత ప్రమాణాల్ని సడలించడం, వీసీ పదవికి పరిశ్రమలోని సీనియర్లు, ఉన్నతాధికారులకు సైతం వీలు కల్పించడం లాంటివి కొందరు స్వాగతిస్తే, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా, సంస్థాగత స్వతంత్రత ఎన్ఈపీ ప్రధానోద్దేశమైతే... తద్విరుద్ధంగా వీసీల నియామకంలో గవర్నర్లకు పెద్దన్న పాత్ర కల్పించడంతో కథ మళ్ళీ మొదటికొచ్చింది. 'నీ ఎడమ చేయి తీయి... నా పుర్ర చేయి పెడతా' అన్నట్టు ఇక వీసీల ఎంపికలో రాష్ట్రం బదులు కేంద్రం పట్టు బిగుస్తుందన్న మాట. పార్లమెంట్ చేసిన 1956 నాటి చట్టం ప్రకారం తన పరిధిలోకే రాని వీసీల ఎంపిక, నియామకాన్ని యూజీసీ నియంత్రించాలనుకోవడం సమస్యే కాదు రాజ్యాంగపరమైన చిక్కులు తెస్తుంది.

గతంలో శాస్త్రవేత్త నాయుడమ్మ లాంటి వారిని వీసీలుగా నియమించినప్పుడు, వారి విజ్ఞానం విద్యాలయాలకు వన్నె తెచ్చింది. అలా చూస్తే, అధ్యాపక వర్గానికి ఆవల ఉన్న వృత్తి నిపుణులకు సైతం తలుపులు తెరవడం వల్ల ఉన్నత విద్యా సంస్థల్లో ప్రతిభావంతుల సమూహం పెరగడం మంచిదే. యూనివర్సిటీల్లో నియామక నిబంధనల్ని సరళం చేయడం స్వాగతించాల్సిందే. కానీ, ఇప్పుడైనా, అప్పుడైనా వీసీ పదవిని రాజకీయ నియామకంగా మార్చడంతోనే అసలు సమస్యంతా! వీసీల నియామకాల్లో రాజ్‌భవన్‌ను కీలకంగా మార్చడమన్నది అసలు ఎన్ఈపీ లక్ష్యాలకే విరుద్ధం. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో యూనివర్సిటీలు అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలకూ, గవర్నర్లకూ మధ్య నలిగిపోతున్నాయి. వీసీల ఎంపిక సైతం గవర్నర్ల చేతికొచ్చాక పరిస్థితేమిటో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఉన్నత విద్యాలయ ప్రాంగణాన్ని నడిపే ఉత్తముడి ఎంపిక ఇటు రాష్ట్రం, అటు కేంద్రాల రాజకీయ ఒత్తిళ్ళకు అతీతంగా ఉన్నప్పుడే ఫలితం ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు
పుష్య మాసం, తిథి: బ.నవమి ప.3.26 వరకు, తదుపరి దశమి,
నక్షత్రం: విశాఖ రా.3.31 వరకు, తదుపరి అనూరాధ,
వర్జ్యం: ఉ.7.19 నుండి 9.03 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.23 నుండి 11.11 వరకు, తదుపరి ప.2.52 నుండి 3.40 వరకు,
అమృతఘడియలు: సా.5.41 నుండి 7.26 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.46
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సంతాన సాఫల్య తంత్రం

అభిప్రాయం



జి. శ్రీరామమూర్తి

చైనాకు మించిన జనసంఖ్యతో భారత దేశం పేదరికానికి పెద్ద పీటగా మారినందుకు బాధపడుతున్న సమయంలో మాన్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు మరింత మందిని కనండని ప్రజలకు పిలుపునివ్వడం కలయా, వైష్ణవ మాయయా అనిపిస్తున్నది. గతంలో ఒకసారి అస్పష్టంగా ఈ ప్రకటన చేసిన చంద్రబాబు ఇప్పుడు దీనికొక ప్రణాళికను జోడించారు. ఇద్దరికంటే ఎక్కువ సంతానం గలవారికే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆ మేరకు చట్టం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు వెల్లడి అవుతున్నది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కూడా ఎక్కువమందిని కనాలేమో అన్నారు గానీ ఈ ఇద్దరు సీఎంల ఆలోచనల్లో స్పష్టమైన తేడా ఉంది.

ముందు ముందు దేశ జనాభాలో యువత శాతం తగ్గిపోయి ముసలివారు అధికమవుతారని, ఆ ప్రమాదాన్ని తొలగించడానికి ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు అంటున్నారు. మేమిద్దరం, మాకు ఇద్దరు అనే నినాదాన్ని ఆచరణలో పెట్టి కుటుంబ నియంత్రణను గట్టిగా పాటించినందువల్ల దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పరిమితమయిందని, అందువల్ల 2026 తర్వాత జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో పార్లమెంటులో మన స్థానాలు తగ్గిపోతాయని, కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా మరింతగా కుంచించుకు పోతున్నాయనే కారణాల మీద ఎక్కువమంది బిడ్డలను కనాలేమోనని స్టాలిన్ అన్నారు. ఇందుకు తమిళనాట దీవెనగా ఉన్న 16 రకాల భాగ్యాల ప్రస్తావన తెచ్చి ఒక్కొక్కరూ అంతమందిని కనవలసి వస్తుందేమోనని ఆయన అభిప్రాయపడ్డారు. చంద్రబాబు ఈ విషయంలో వల్లమాలిన ఆత్రం ప్రదర్శించడం మాత్రం ఆశ్చర్యం కలిగిస్తున్నది.

కుటుంబ నియంత్రణను జాతీయ విధానంగా చేపట్టి 1950 లోనే అమలు ప్రారంభించిన దేశం ఇండియా. అయినా జనాభాలో ప్రథమ స్థానంలో ఉంటూ వచ్చిన చైనాను ఈ మధ్యనే దాటిపోయాము. ప్రస్తుతం భారత జనాభా 145 కోట్లమంది. ఇందులో 25 సంవత్సరాల లోపు వయసువారు 40 శాతం మంది. 40 ఏళ్ల లోపు జనం 74 శాతం. ఈ పరిస్థితి 2061 వరకు కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. పనిచేసే వయసులోని జనం ఇంత ఎక్కువగా ఉండటం ఒక వరం. వీరందరికీ పని కల్పించగలిగితే సంపద పెరిగి ఇండియా త్వరితంగా అభివృద్ధి చెందిన దేశం కాగలుగుతుంది. కానీ పాలకులు ఇందులో ఘోరంగా విఫలమవుతున్నారు.

కుటుంబ నియంత్రణ పాటింపువల్ల జనాభా తగ్గిపోవడం, ఉత్తరాదికంటే అధిక తలసరి ఆదాయం కలిగి ఉండటం దక్షిణాది రాష్ట్రాలకు పెనుశాపమయ్యింది. అయిదు దక్షిణాది రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ) ఉమ్మడి జనాభా 24 కోట్లు. ఒక్క ఉత్తరప్రదేశ్ జనాభాయే ఇప్పుడు దాదాపు 25 కోట్లని అంచనా. 2026 తర్వాత జరిగే నియోజక వర్గాల పునర్విభజనలో అప్పటికి ఉండే జనాభా ప్రకారం దక్షిణాది రాష్ట్రాలు ఇప్పుడున్న వాటిలో 20 పార్లమెంటు స్థానాలు కోల్పోవచ్చు; ఉత్తరాది రాష్ట్రాలు అదనంగా 31 స్థానాలు పొందవచ్చు. ఒక్క ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికే 11 పార్లమెంటు స్థానాలు వచ్చి చేరుతాయని అంచనా. దాంతో ఇపుడున్న 80 స్థానాలు 91కి పెరుగుతాయి. తమిళనాడు 8 స్థానాలను కోల్పోవచ్చు. ప్రస్తుతం దానికున్న 39 స్థానాలు 31కి కుదించుకుపోతాయి. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఉండిన 42 పార్లమెంటు స్థానాలు 34కి తగ్గిపోతాయంటున్నారు. బిహార్ పది, రాజస్థాన్ ఆరు స్థానాలను, మధ్య ప్రదేశ్ నాలుగింటిని, గుజరాత్, హరియాణా, జార్ఖండ్, ఢిల్లీ, చత్తీస్‌గఢ్ ఒక్కో పార్లమెంటు స్థానాన్ని అదనంగా పొందవచ్చని భావిస్తున్నారు.



పునర్విభజన వాయిదా ఒక పరిష్కారం

ఈ మార్పు కారణంగా కేంద్ర పాలకులు ఎన్నికల్లో అధిక స్థానాలను గెలుచుకోవడానికి దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేసి నిధులను ఉత్తరాది రాష్ట్రాలకే మరింత ఎక్కువగా కేటాయిస్తారు. పర్యవసానంగా దక్షిణాది ఇంతవరకు సాధించిన అభివృద్ధిని కోల్పోయే ప్రమాదం పొంచి ఉన్నది. జనాభా నియంత్రణను చిత్తశుద్ధితో పాటించినందువల్ల ఇలా నష్టపోవలసి వస్తున్నది కాబట్టి ఎక్కువమందిని కనక తప్పదా అని తమిళనాడు ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమస్యకు పరిష్కారాలు లేకపోలేదు.

లోక్‌సభ సభ్యుల సంఖ్య ఇప్పుడు 543. ఇది 1971 జనాభా లెక్కల ప్రకారం నిర్ణయించినది. కుటుంబ నియంత్రణ పాటింపు దెబ్బ తినకుండా చూసుకొనేందుకు, దానిని ప్రోత్సాహించడం కోసం ఈ సంఖ్యను 30 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించాలని భావించి 42వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. అలా ఆ సంఖ్యను అక్కడే ఆపి ఉంచారు. ఈ నియోజకవర్గాల పునర్విభజనను 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల అనంతర కాలానికి వాయిదా వేస్తూ 2000 సంవత్సరంలో మళ్ళీ నిర్ణయం తీసుకొన్నారు. అదే విధంగా మరి కొన్ని సంవత్సరాలపాటు యథాతథ స్థితిని కొనసాగిస్తూ 2026లో ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా జనసంఖ్యను బట్టి ప్రజా ప్రాతినిధ్య నియోజకవర్గాల పునర్విభజనను పార్లమెంటుకు బదులు రాష్ట్రాల శాసనసభలకు బదలాయించవచ్చు. కొంపలేం మునగవు.

లోక్‌సభ స్థానాలను కాపాడుకోవడం కోసం, వాటిని పెంచుకోవడానికి ఎక్కువ మందిని కనాలనడం ఎంతమాత్రం హర్షించవలసినది కాదు. అసలే వనరులు తక్కువగా ఉన్న దేశంలో జనాభాను పెంచుకోడం ఆత్మహత్యా సదృశమే. దేశ జనాభాలో 60 శాతం మంది సగటున రోజుకి 250 రూపాయలతో జీవిస్తున్నారు. జీవన హక్కు అంటే అన్ని సౌకర్యాలతో గౌరవప్రదంగా బతికే హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టంగా నిర్వచించింది. దేశంలో 50 శాతానికి మించిన జనాభా కనీస సౌకర్యాలకు దూరంగా బతుకుతున్నారు. ఇటువంటి నేపథ్యంలో ఇద్దరు కంటే ఎక్కువమందిని కనాలని చంద్రబాబునాయుడు అనడం పరమ హాస్యాస్పదంగా ఉన్నది.

పరిమిత సంతానమే మేలు

ఏ రోజు పని ఉంటుందో ఏ రోజు ఉండదో తెలియని స్థితిలోని ప్రజలను, అందీ అందని ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్రులు చాచేవారిని కనండి కనండి అంటూ అదిలించడం మానవీయం కాదు. దేశంలో ఐదేళ్ల లోపు బాలల్లో 44 శాతం మంది వయసుకు తగిన బరువు లేమితో బాధపడుతున్నారు. బాలల్లో 72 శాతం మంది, వివాహిత మహిళల్లో 52 శాతం మంది రక్త హీనతతో తీసుకుంటున్నారు. గర్భవతులకు పోషకాహారం లోపిస్తే పుట్టే పిల్లలు రోగాల బారిన పడతారు. 2013 నుంచి స్థూల దేశీయ ఉత్పత్తి 50 శాతం పెరిగినప్పటికీ ప్రపంచమంతటిలో గల పోషకాహార లోపమున్న పిల్లల్లో మూడింట ఒక పాలు కంటే ఎక్కువ మంది ఇండియాలోనే ఉన్నారనీ, ఇందుకు విపరీతమైన ఆర్థిక వ్యత్యాసాలే కారణమనీ నిపుణులు నిగ్గు తేల్చారు.

శారీరకంగా చితికిపోయినా ఉదయం నుంచి సాయంత్రం వరకు గుక్కెడు గంజి కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటున్న అత్యధిక శాతం మహిళలు ఎక్కువ మంది బిడ్డలను కనడమంటే చావుకి త్వరితంగా దగ్గరవ్వడమే. పిల్లలు లేనివారికీ ఇద్దరే బిడ్డలు కలవారికీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేకుండా చేయడం ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరచడమే. పరిమిత సంతాన సూత్రం ప్రజలకు మంచి చేసింది. బతుకు భారాన్ని తగ్గించి ఎండిన పెదాలను తడిపింది. దక్షిణాది సాధించుకున్న ఈ సౌభాగ్యాన్ని నాశనం చేయాలనే దుర్బుద్ధి హానికరం. ఒకవైపు పిల్లల విద్యను, వైద్యాన్ని నానాటికీ ప్రియం చేస్తూ ఇంకా ప్రసవించండని అనడం దుర్మార్గమే. చంద్రబాబునాయుడుకి ఈ ఆలోచన ఎందుకు కలిగిందో గాని అది ప్రజలపట్ల ద్రోహ చింతనే. ఈ దురాలోచనను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మానుకోవడం మంచి చేస్తుంది. ఎప్పుడో వచ్చే విపత్తు కోసం ఇప్పుడే శోక గంగలో దూకమనడం విజ్ఞతా కాదు, విజ్ఞతా అనిపించుకోదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

కరెంటు లాంటి విప్లవం



500 బిలియన్ డాలర్ల ప్రారంభ పెట్టుబడితో 'స్టార్‌గేట్' ప్రాజెక్ట్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం కృత్రిమ మేధ అభివృద్ధి దిశగా స్పష్టమైన సంకేతం. ఈ విషయంలో అమెరికా, చైనా మధ్య పోటీ మిగతా ప్రపంచానికి మేలు చేస్తుంది. కృత్రిమ మేధతో ప్రపంచం మునుపెన్నడూ లేనంతగా మారనుంది. మన జీవితకాలంలో మనం చూస్తున్న అత్యంత ప్రజాస్వామిక సాంకేతిక పరిజ్ఞానం ఇది. ముస్ముందు జనాలు దీన్ని కరెంటులాగా వాడుతారు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

గొప్ప శక్తి



ఎప్పుడు మనసు ఊగిసలాట లేకుండా స్థిమితంగా ఉంటుందో; భయ, పశ్చాత్తాప, కోప రహితంగా ఉంటుందో దానికి ఏ జబ్బునైనా నయం చేసే శక్తి ఉంటుంది.

– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక బోధకుడు

అసలేం జరుగుతోంది?



నటుడు సైఫ్ అలీఖాన్ ఏమైనా సూపర్‌మ్యానా? ఆరు కత్తి పోట్లు, వెన్నెముక గాయానికి ఐసీయూలో ఉన్నవాడు అత్యంత ఆరోగ్యంగా కనబడుతూ, సాధారణంగా నడుచుకుంటూ వస్తున్నారు. అది కూడా ఎనిమిది గంటల సర్జరీ చేశారని చెప్పాక. ఏదో తేడా ఉంది. దేన్నో దాస్తున్నారు. అసలే ముంబయి పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తారని పేరు.

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

గాగా!



ఈ సీజన్‌లో ఏం నడుస్తోంది? అమెరికాలో 'మాగా' (అమెరికాను మళ్లీ గొప్పగా చేద్దాం!). ఇండియాలో 'నాగా' (సాధువులు).

– ఉర్విశ్ కొఠారీ, రచయిత

అదే పద్ధతిలో...



అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను ఇండియాకు పంపాలన్న అమెరికా నిర్ణయం పట్ల కొందరికి ఏ సమస్యా ఉన్నట్టు లేదు. అలాంటప్పుడు, అక్రమంగా ఇండియాలో ఉంటున్న బంగ్లాదేశీయులను, ఈశాన్య రాష్ట్రాల్లోని మయన్మారీలను ఇండియా వెనక్కి పంపితే కూడా అభ్యంతరం చెప్పకూడదు.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

అంగీకరించాల్సిన నిర్ణయం



వీసా అనేది గౌరవమే గానీ హక్కు కాదు. విదేశాల్లో ఉద్యోగం చేయమని ఎవరూ ఒత్తిడి చేయడం లేదు. అది ఒకరి ఎంపిక. విదేశీ పౌరులు తమ దేశ చట్టాలను మార్చగలరు. దాన్ని అంగీకరించాలి. లేదా ఆ చట్టాన్ని మార్చేట్టుగా రాజకీయంగా ప్రభావితం చేయగలగాలి. ఏదైనా సరే, బాధిత కార్డు మాత్రం వాడకూడదు.

– సి. రామ్‌ప్రసాద్, ఆంట్రప్రెన్యూర్

మౌనమే జవాబు



మరీ ఎక్కువ మాట్లాడటం అనేది మన ఆరోగ్యం, విశ్వాసాలకు చెరుపు చేస్తుంది. కొన్నిసార్లు కేవలం వినడం, ఏదీ మాట్లాడకుండా ఉండటం అనేది అత్యుత్తమ జవాబు అవుతుంది. మన నిశ్శబ్దాన్ని ఎవరూ తప్పుగా ఉటంకించరు అని గుర్తుంచుకోండి.

– ముఫ్తి మెంక్, ఆధ్యాత్మిక బోధకుడు

ఇన్ బాక్స్

భారత ఆత్మగౌరవ ప్రతీక!

మాతృభూమి దాస్య శృంఖలాలను తుంచడానికి ఆనాటి అత్యున్నత సర్వీస్ అయిన ఐసీఎస్‌ను తృణప్రాయంగా త్యజించిన ఘనుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. భారతీయులను బానిసలుగా చూస్తున్న ఆంగ్లేయులను ఈ దేశం నుండి గెంటేయడానికి సాయుధ పోరాటమే శరణ్యమని భావించిన యోధుడు. 'ఛలో ఢిల్లీ', 'జైహింద్' నినాదాలను జాతికి అందించిన భారత మాత ముద్దుబిడ్డ. 'ఆజాద్ హింద్ ఫౌజ్' సేనానిగా 'నేను మీకు కేవలం ఆకలి, దాహం, కష్టం, మృత్యువును మాత్రమే ఇవ్వగలను, భారతదేశ స్వాతంత్ర్యమే మన జీవన ధ్యేయం, దానికోసం సర్వం అర్పించడానికి మనమంతా సిద్ధంగా ఉండాలి' అని ఉద్బోధించారు. ఐసీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేస్తూ తన అన్నకు రాసిన ఉత్తరంలో 'నేను ఆంగ్లేయుల సేవ చేయడమా? అసంభవం. క్రూరులైన, నిర్దయులైన, జలియన్ వాలాబాగ్ హంతకులైన ఆంగ్లేయులకు నేను సహకరించడమా? నేను మన మాతృదేశానికి శత్రువుగా మారగలనా? అసంభవం. ప్రజలంతా ఎవరిళ్ళలో వాళ్ళుంటే, దేశం గురించి ఎవరు ఆలోచిస్తారు? మాతృభూమి ఆర్తనాదాలే నా చెవుల్లో గింగురుమంటున్నాయి. సమర రంగంలోకి ప్రవేశించి దేశానికి స్వాతంత్ర్యం లభించే దాకా పోరాడటమే దేశం పట్ల మన కర్తవ్యమవుతుంది. స్వాతంత్ర్య సంగ్రామంలో సైనికుడిని కావడం కోసమే ఐసీఎస్‌ను వదిలేశాను' అని పేర్కొన్నారు.



సుభాష్ చంద్రబోస్

ఆయన బెంగాల్ ప్రాంతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్‌కు సహ కార్యదర్శిగా, అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కానీ కాంగ్రెస్ పార్టీలోని అంతః కలహాలలో ఇమడలేక పార్టీని వదిలి 1939 మే 3న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారు. ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడిగా మద్రాసులో నిర్వహించిన సభలో ఆ రోజుల్లోనే దాదాపు లక్ష మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఆనాటి రాజకీయాలలో ఇది ఒక పెను సంచలనం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉన్న జర్మనీ, జపాన్, ఇటలీ వంటి దేశాలు, అలాగే విదేశాలలో ఉన్న భారతీయుల సహాయ సహకారాలతో 'ఆజాద్ హింద్ ఫౌజ్' పగ్గాలు చేపట్టారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఈ సైన్యంతో వీరోచిత పోరాటం చేసిన బోస్ బాబు అత్యుత్తమ ఆదర్శాలకు ప్రతీక!

– ఆచార్య వై.వి. రామిరెడ్డి, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ ఏపీ అధ్యక్షులు

(నేడు సుభాష్ చంద్రబోస్ జయంతి)

ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించాలి!

అభిప్రాయం



డా॥ తిరుణహరి శేషు

బడ్జెట్ అంటే కేవలం ఆదాయ వ్యయాల సమాహారం కాదు. దేశ ప్రగతికి, ప్రజల సమస్యలకు దర్పణం పట్టే ఒక దిక్సూచి. బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పుడు రైతులు, వేతన జీవులు, సామాన్యులు, పేదలు, పెట్టుబడిదారులు, యువత, మహిళలు వంటి వివిధ వర్గాలు ప్రభావితం అవుతాయి. మోదీ సర్కార్ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 48 లక్షల కోట్ల రూపాయలతో ఉపాధి కల్పనకు అగ్ర తాంబూలం ఇస్తూ... రైతులు, మహిళలు, పేదలు, యువత లక్ష్యంగా 9 అంశాలకు ప్రాధాన్యమిస్తూ పూర్తిస్థాయి బడ్జెట్‌ను 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశ పెట్టింది. ఫిబ్రవరిలో 2025–26 బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టబోతున్నారు. ఈ బడ్జెట్‌పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.



నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం, ఆశాజనకంగా లేని వృద్ధిరేటు, రైతాంగ సమస్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లుగా నిలుస్తున్న నేపథ్యంలో విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సవాళ్లను అధిగమించడానికి బడ్జెట్‌లో ఏ ప్రతిపాదనలు చేయబోతున్నారనే దానిపై ఆసక్తి నెలకొన్నది. 2024– 25 బడ్జెట్‌లో నిర్దేశించుకున్న తొమ్మిది అత్యంత ప్రాధాన్యత కల అంశాలలో ఉద్యోగ కల్పన, నైపుణ్య శిక్షణ ప్రధానమైనవి. ఉద్యోగాల కల్పన కోసం మూడు, నైపుణ్యాల అభివృద్ధి కోసం రెండు ప్రోత్సాహక పథకాలను ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో 4.1 కోట్ల మంది యువతకు ప్రయోజనం కలిగేలా రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు అనేక ప్రోత్సాహకాలను నిరుటి బడ్జెట్‌లో ప్రకటించారు. యువత సులభంగా ఉద్యోగాలను సాధించటానికి 'ఇంటర్న్ షిప్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే 'మోడల్ స్కిల్ లోన్ స్కీం' కింద యువతకు రుణాలు, 'ముద్ర' రుణాల పెంపు లాంటి చర్యలు ఉపాధి – ఉద్యోగాల కల్పనకు పెద్దగా దోహదపడలేదనే చెప్పాలి. ఉద్యోగ ఉపాధి కల్పనలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇవ్వక పోవడం వలన దేశంలో గడిచిన సంవత్సరంలో నిరుద్యోగితా రేటు ఏడు శాతం నుండి 9.2 శాతానికి పెరిగిందని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' సంస్థ అంచనా వేసింది.

రైతాంగం కూడా బడ్జెట్‌పై పెద్దగానే ఆశలు పెట్టుకుంది. గత కొంత కాలంగా కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని 'సంయుక్త కిసాన్ మోర్చా' ఆధ్వర్యంలో రైతాంగం ఉద్యమిస్తోంది. కాబట్టి ఎమ్ఎస్‌పీకి చట్టబద్ధత కల్పించే విషయం, 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన' కింద రైతుకి పెట్టుబడి సహాయం 6,000 నుండి 10,000 రూపాయలకు పెంపు నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో తీసుకుంటారని రైతాంగం ఆశిస్తోంది. ఆదాయ పన్ను పరిమితి పెంపు, 80(సి) కింద రాయితీల పరిమితిని పెంచాలని వేతన జీవులు కోరుకుంటున్నారు. ద్రవ్యలోటు అదుపులో ఉన్నదని చెప్తున్నా ఆహార ద్రవ్యోల్బణం పెరగటం, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ ధరలు పెరగటం సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్న సందర్భంలో ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పతనాన్ని నియంత్రణ చేసే చర్యలు చేపట్టాలని అన్ని వర్గాల ప్రజలూ కోరుకుంటున్నారు.

'ఆత్మ నిర్భర భారత్', 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్', 'వికసిత్ భారత్' లాంటి భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు దోహదం చేసేలా 2025–26 బడ్జెట్ ఉంటుందని ఆశిద్దాం.

వ్యాసకర్త కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్
మొబైల్: 98854 65877

ఆత్మసాక్షాత్కారం

ఆత్మసాక్షాత్కారం అనేది కొత్తగా తెచ్చి పెట్టుకొనేది కాదు, ఉన్నదానిని తెలుసుకోవడమే. ఎప్పుడైతే నీలో ఆలోచనలు నిలచిపోతాయో, మానసిక చర్యలు ఆగిపోతాయో... అప్పుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. ఎంత కాలం నీలో ఆలోచనలు కలుగుతాయో, అంత కాలం అవి నీ ఆత్మను కప్పివేస్తాయి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సముద్రంపై కనబడే నీటి బుడగల వంటివే ఈ ఆలోచనలు. ఇవన్నీ లెక్కలేనన్ని పూర్వ జన్మల నుండి ఒకటిగా వచ్చి మనస్సునందు చేరిన సంస్కారాలు. వీటిని నాశనం చేయడమే మన లక్ష్యంగా ఉండాలి.

నీవు మీ ఇంటి డాబాపైకి వెళ్లడానికి నిచ్చెనను ఉపయోగించి, ఒక మెట్టు తర్వాత ఇంకొక మెట్టును ఎక్కి పైకి చేరుకుంటావు కదా. అలాగే ఆత్మసాక్షాత్కారం కూడా! ఒకేసారి పైకి ఎగబాకి ఎవరూ ఆత్మసాక్షాత్కారం పొందలేరు. ఇందుకు నీవు స్థిరంగా, నెమ్మదిగా కార్యాచరణ చేయాలి. నీవు ఆత్మసాక్షాత్కారం పొందడానికి ఏ మార్గం ఎన్నుకున్నప్పటికీ... ముందుగా నీలోని ఆలోచనలను తొలగించుకోవడానికి సాధన చేయాలి. ఇది ఒకటి పూర్తయితే, నీవు నీవుగా 'ఉంటావు'. నీకు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. అదే నీ నిజమైన ప్రకృతి.

నిజంగా ఉండేది ఒకే ఒక స్థితి. అదే 'చైతన్య స్థితి'. జాగ్రత్, స్వప్న, నిద్ర అనే మూడు అవస్థలు నిజమైనవి కావు. అవి వస్తూ, పోతూ ఉంటాయి. కేవలం 'నిజమైనది' మాత్రమే ఎల్లప్పుడూ ఉంటుంది.

చైతన్యం ఒక తెర. దీనిపైకి అనేక బొమ్మలు వస్తూ, పోతూ ఉంటాయి. తెర నిజమైనది. బొమ్మలన్నీ కేవలం దీనిపై పడే నీడలు మాత్రమే. జ్ఞానికి లేదా సిద్ధపురుషునికి జాగ్రదావస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ (సుషుప్తి అవస్థ) అనేవి ఉండవు.

జాగ్రదావస్థలోని ప్రపంచాన్ని జ్ఞానులు పట్టించుకోరు. వారికది నిద్రావస్థలాంటిది. అన్ని ప్రాణులూ ఏ నిద్రావస్థలో జగత్తును మరచిపోయి ఉన్నాయో అటువంటి స్థితిలోనే జ్ఞానులు (యోగులు) మెలకువగా ఉన్నారు. అనగా ఏ అఖండ చైతన్యం సర్వప్రాణులకు శూన్యంగా నిద్రలో ఉన్నదో అటువంటి స్థితిలోనే జ్ఞానులు మెలకువగా ఉంటున్నారు.

అవి ఇంజనీర్లకు వదిలేయండి

టెక్నికల్ అంశాలపై గత ప్రభుత్వం తరఫు సాక్షి ప్రకాశ్‌రావుతో జస్టిస్ పీసీ ఘోష్
- 'కాళేశ్వరం కమిషన్'ముందు హాజరైన టీఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్
- మేడిగడ్డకు మరమ్మతులు చేసి పునరుద్ధరించవచ్చన్న ప్రకాశ్‌రావు
- తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేకనే ప్రాజెక్టును మేడిగడ్డకు తరలించినట్టు వివరణ


కార్యాలయానికి వస్తున్న జస్టిస్ పీసీ ఘోష్


మీడియాతో మాట్లాడుతున్న ప్రకాశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: 'మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించిన సాంకేతిక అంశాలతో మీకు సంబంధం లేదు. వాటిని ఇంజనీర్లకు వదిలేయండి..' అంటూ జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ వ్యాఖ్యానించింది. 'మేడిగడ్డ బరాజ్‌లో కుంగిపోయిన 7వ బ్లాక్‌కు మరమ్మతులు చేసి పునరుద్ధరించాలి. అది సాధ్యం కూడా..' అని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఐడీసీ) మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత వి.ప్రకాశ్‌రావు చెబుతుండగా.. జస్టిస్ ఘోష్ ఆయన్ను మధ్యలోనే అడ్డుకున్నారు. 'అంతే చాలు..టెక్నికల్ అంశాలతో మీకు సంబంధం లేదు..' అని అన్నారు. కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలపై కమిషన్ విచారణ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కాగా బుధవారం నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు గత ప్రభుత్వం తరఫున ప్రకాశ్‌రావు 'సాక్షి'గా హాజరై సమాధానాలిచ్చారు.

రాజకీయాలు చేయొద్దు

తుమ్మిడిహెట్టి నుంచి బరాజ్ నిర్మాణాన్ని మేడిగడ్డకు ఎందుకు తరలించారు? అని కమిషన్‌ప్రశ్నించింది. గత ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ ప్రకాశ్‌రావు మాట్లాడేందుకు ప్రయత్నించగా..'రికార్డుల్లో ఏం ఉందో అదే అంతిమం. దానిని ఎవరూ మార్చలేరు..' అని కమిషన్ స్పష్టం చేసింది. ప్రజల సాగునీటి డిమాండ్లను నెరవేర్చడానికి 200 టీఎంసీలు అవసరం కాగా, తుమ్మిడిహెట్టి వద్ద తగిన నీటి లభ్యత లేకపోవడంతోనే బరాజ్‌ను తరలించాల్సి వచ్చిందని ఆ తర్వాత ప్రకాశ్ వివరణ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి వద్ద కేవలం 165 టీఎంసీల జలాల లభ్యతే ఉందని కేంద్ర జలసంఘం పేర్కొందని, అందులోనూ ఇతర రాష్ట్రాల వాటా 63 టీఎంసీలు పోగా తెలంగాణకు 102 టీఎంసీలే మిగులుతాయని చెప్పారు. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలు పలు జలాశయాలను నిర్మించి నీటిని తరలించుకుంటుండడంతో గత 50 ఏళ్లుగా తెలంగాణకు వచ్చే ప్రవాహాలు తగ్గిపోయాయన్నారు. సాగునీటి కోసమే తెలంగాణ ఉద్యమం జరిగిందని ప్రకాశ్‌రావు చెప్పగా.. రాజకీయాలు చేయవద్దని, ఉద్యమంతో తమకు ఏం సంబంధం అంటూ కమిషన్ అభ్యంతరం తెలిపింది.

రిటైర్డు ఇంజనీర్లు వద్దన్నా..

తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్‌తో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించడమే ఉత్తమమని, దీనిని ఎలాగైనా సాధ్యం చేయాలని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ 2015 ఏప్రిల్‌లో సిఫారసు చేసిన విషయాన్ని కమిషన్ గుర్తు చేసింది. ప్రతిపాదిత మేడిగడ్డ బరాజ్ అనవసరమని, అధిక వ్యయంతో కూడినది కావడంతో పాటు ఎక్కువ సమయాన్ని తీసుకుంటుందని కమిటీ చెప్పిందని తెలిపింది. దీనిపై ప్రకాశ్‌రావు మాట్లాడేందుకు ప్రయత్నించగా, టీఎస్‌ఐడీసీ చైర్మన్‌గా నాటికి మీరు నియామకం కానందున మీ సమాధా నం అవసరం లేదని కమిషన్ స్పష్టం చేసింది. నీటి లభ్యత లేకపోవడంతో పాటు ముంపును తగ్గించడం కోసం తుమ్మిడిహెట్టికి బదులుగా వెన్‌గంగా నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో వార్ధా బరాజ్ నిర్మించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.


నీట మునిగిన వరి నాట్లు

అన్నదాత ఆశలు వరదపాలు

ఎస్సారెస్పీ ఉప కాల్వ గేటు ఎత్తిన దుండగులు
- 40 ఎకరాల్లో కొట్టుకుపోయిన వరినాట్లు
- పొలాల్లో ఇసుక మేట వేయటంతో రైతుల ఆవేదన

వర్ధన్నపేట: ఎవరో చేసిన దుశ్చర్యకు కష్టపడి సాగుచేసిన వరినాట్లు కొట్టుకుపోవడంతో పేద గిరిజన రైతులు లబోదిబోమంటున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం శ్రీరామోజీ కుమ్మరిగూడెం తండా శివారులో ఎస్సారెస్పీ కెనాల్ స్టేజ్-1 డీబీఎం గేట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి పూర్తిగా ఎత్తివేశారు. దీంతో ఉప కాల్వ తెగి పంట పొలాల్లోకి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. రైతులు బుధవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించి, గేటును మూసే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. దీంతో ఎస్సారెస్పీ ఇంజనీరింగ్ అధికారులకు, వర్ధన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. ఇంజనీరింగ్ అధికారులు అక్కడికి చేరుకుని గేటును మూసివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉప కాల్వ వెంట ఉన్న దాదాపు 40 ఎకరాల్లో వరి నాట్లు వరదలో కొట్టుకుపోయాయి. కొంత మేర ఇసుక మేట వేసింది. కాల్వ వెంట ఉన్న తన నాలుగు ఎకరాల పొలంలో వరద వల్ల కొంతమేర ఇసుక మేట వేసిందని బాధిత రైతుల్లో ఒకరైన మల్లు నాయక్ తెలిపాడు. 10 రోజుల క్రితం వేసిన వరి నాట్లు సైతం కొట్టుకుపోయాయని వాపోయాడు. 10 మంది రైతుల భూముల్లో వరి నాట్లు పాడయ్యాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు.

రాజకీయం లేదు.. రైతు సంక్షేమం కోసమే

రేవంత్ అనాలోచిత నిర్ణయాల వల్లే రైతుల ఆత్మహత్యలు: కేటీఆర్
- ఈ నెల 24 నుంచి బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ పర్యటన
- గ్యారంటీల అమలుపై గ్రామసభల్లో జనం నిలదీస్తున్నారు


అధ్యయన కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో పువ్వాడ అజయ్, నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, జోగు రామన్న, రసమయి బాలకిషన్, బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతు ఆత్మహత్యలపై తమ పార్టీ వేసిన అధ్యయన కమిటీ వెనుక రైతు సంక్షేమం తప్ప ఎలాంటి రాజకీయం లేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, హామీల అమలులో వైఫల్యం వల్లే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో జరిగిన పార్టీ అధ్యయన కమిటీ తొలి సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. కమిటీ సభ్యులు సత్యవతి రాథోడ్, యాదవరెడ్డి, జోగు రామన్న, బాజిరెడ్డి గోవర్ధన్, అంజయ్య యాదవ్, రసమయి బాలకిషన్, పువ్వాడ అజయ్ కుమార్‌తో జరిగిన భేటీలో రైతు ఆత్మహత్యలు, రైతు భరోసా అమలు, సంపూర్ణ రైతు రుణమాఫీ, యాసంగి పంటకు సాగునీరు, ఇతర రైతాంగ సమస్యలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఆదిలాబాద్ బ్యాంకులో రైతు ఆత్మహత్య ఘటనకు స్పందించి పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు అధ్యయన కమిటీ వేశాం. ఈ నెల 24 నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కమిటీ పర్యటన ప్రారంభమవుతుంది. రుణమాఫీ, కరెంటు సరఫరా, సాగు తీరు, మద్దతు ధర, బోనస్, కొనుగోలు కేంద్రాలు, రైతు వేదికల పనితీరు వంటి అంశాలపై అధ్యయనం చేస్తుంది. రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న పరిస్థితులపై అధ్యయనం చేసి కేసీఆర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ నివేదిక ఇస్తుంది' అని కేటీఆర్ చెప్పారు.

అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్నారు

'ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి రైతులు అధికారం ఇస్తే, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ దారుణంగా విఫలమైంది. రైతాంగం పట్ల కేసీఆర్‌కు ఉన్న ప్రేమ, ఆర్తి ప్రస్తుత పాలకుల్లో మచ్చుకైనా కనిపించడం లేదు. ఒకే అబద్ధాన్ని వంద సార్లు చెప్తే నిజమవుతుందనే అపోహతో కాంగ్రెస్ పనిచేస్తోంది. ప్రతిపక్ష నేతల మీద అక్రమ కేసులు పెడుతూ భయపెట్టాలని చూస్తున్నారు. హైకోర్టు తీర్పు మేరకు నల్లగొండలో రైతు ధర్నా నిర్వహిస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'ప్రభుత్వ గ్యారంటీల అమలుపై జనం గ్రామసభల్లో గల్లా పట్టి కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు గ్రామ సభల్లో టెంట్లను పీకేస్తున్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని గ్రామసభలు నిరూపిస్తున్నాయి' అని కేటీఆర్ అన్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం నేతల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భవిష్యత్తులో సత్తుపల్లిలో తిరిగి బీఆర్‌ఎస్ విజయం సాధించడంతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గెలుపు జెండా ఎగురవేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. త్వరలో సత్తుపల్లి నేతలతో కేసీఆర్ సమావేశమవుతారని కేటీఆర్ చెప్పారు.

ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ అమలు చేయాలి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు హెల్త్ స్కీమును వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. సాధారణ ఎన్నికల కోసం బదిలీ చేసిన తహసీల్దార్లను వెంటనే సొంత శాఖకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సమావేశం బుధవారం హైదరాబాద్‌లో చైర్మన్ వి.లచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగింది. భార్యాభర్తలు, వితంతువులు, దివ్యాంగులు, మెడికల్ కేటగిరి కింద ఉద్యోగులను జోన్, పరస్పర, ఎన్నికల బదిలీ చేసినందుకు ఈ సందర్భంగా టీజీఈజేఏసీ తరఫున చైర్మన్ వి.లచ్చిరెడ్డి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

రెండోరోజూ ఐటీ సోదాలు

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఈ సోదాలు సాగించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లో సోదాలు కొనసాగాయి. దిల్‌రాజు, ఆయన కూతురు హన్షిత, సోదరుడు శిరీష్ నివాసాల్లో సోదాలు చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ కార్యాలయం, నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ ఇళ్లు, మ్యాంగో సంస్థల యజమాని యరపతినేని రామ్ ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. సినీ ఫైనాన్షియర్స్ సత్య రంగయ్య, అభిషేక్ అగర్వాల్ ఇళ్లల్లోనూ సోదాలు జరిపారు. ఆయా సంస్థల బ్యాలెన్స్ షీట్స్, బ్యాంకు లావాదేవీలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. తనిఖీలు జరిగిన ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించారు. ఐటీ దాడులపై దిల్‌రాజు స్పందించారు. తన ఒక్కరి ఇళ్లు, కార్యాలయాల్లోనే సోదాలు జరగడం లేదని.. సినీ ఇండస్ట్రీ మొత్తంపై జరుగుతున్నాయని తెలిపారు.

రైతు మహా ధర్నాకు అనుమతి

నల్లగొండ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28న బీఆర్‌ఎస్ నిర్వహించ తలపెట్టిన రైతు మహా ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అయితే పలు షరతులు విధించింది. 1,500కంటే ఎక్కువ మంది పాల్గొనవద్దని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించుకోవాలని ఆంక్షలు విధించింది. ఆ మేరకు చర్యలు చేపట్టాలని నల్లగొండ పోలీసులను ఆదేశించింది. నల్లగొండ జిల్లాలోని క్లాక్ టవర్ సెంటర్ వద్ద మంగళవారం (21న) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైతు మహాధర్నా నిర్వహించాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఈ ధర్నాకు అనుమతి కోరుతూ పోలీసులకు ఈ నెల 17న బీఆర్‌ఎస్ నల్లగొండ అధ్యక్షుడు దేవేందర్ దరఖాస్తు చేశారు. అయితే పోలీసులు అనుమతి నిరాకరించారు. పోలీసుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దేవేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం వాదనలు విన్నారు.

25న బీసీల విస్తృత స్థాయి సమావేశం

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడానికి ఈ నెల 25న బీసీల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశానికి వివిధ బీసీ, కుల సంఘాల నేతలు హాజరవుతారని పేర్కొన్నారు.

ఎస్‌జీటీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి తమ సంఘం తరఫున సంకినేని మధుసూదన్ రావు పోటీ చేస్తున్నట్టు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్‌జీటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్ రెడ్డి, అరికెల వెంకటేశం ప్రకటించారు.



చర్చలకు రాకపోతే ఆంక్షలే

రష్యా అధినేత పుతిన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక ● తాను అధికారంలో ఉంటే ఉక్రెయిన్-రష్యా యుద్ధం జరిగేది కాదని వెల్లడి

వాషింగ్టన్: రష్యా అధినేత పుతిన్‌ను కలుసుకోవడానికి ఆసక్తితో ఉన్నానని, ఎప్పుడైనా సరే ఆయనతో చర్చలకు తాను సిద్ధమని అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. చర్చలకు ముందుకు రాకపోతే రష్యాపై అదనపు ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. చర్చల బల్ల వద్ద కలుసుకుందామని పుతిన్‌కు సూచించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఇప్పటికే లక్షలాది మంది మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. సైనికులతోపాటు సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడం, నగరాలు, పట్టణాలు శిథిలాలుగా మారుతుండడం బాధాకరమని అన్నారు. మీడియాలో వస్తున్న వార్తల కంటే ఉక్రెయిన్‌లో మృతుల సంఖ్య అధికంగా ఉందన్నారు. వాస్తవాలు చెప్పడం లేదని మీడియాపై మండిపడ్డారు. ట్రంప్ స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం తాను అధ్యక్షుడిగా ఎన్నికై ఉంటే ఉక్రెయిన్-రష్యా యుద్ధం జరిగేది కాదని స్పష్టం చేశారు. సమర్థుడైన పాలకుడు అధికారంలో ఉంటే యుద్ధాలకు ఆస్కారం ఉండదని అన్నారు. పుతిన్ చాలా తెలివైన వ్యక్తి అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమ గత అధ్యక్షుడు జో బైడెన్‌ను, రష్యా ప్రజలను పుతిన్ అగౌరవపర్చారని ఆక్షేపించారు. పుతిన్ గురించి తనకు బాగా తెలుసని చెప్పారు. తాను పదవిలో ఉంటే మధ్యప్రాచ్యంలో సంక్షోభం తలెత్తేది కాదని పునరుద్ఘాటించారు.

200 మిలియన్ డాలర్లు అధికంగా ఖర్చు చేశాం

ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరా, ఆర్థిక సాయం నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తామని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాట్లాడుతున్నామని, త్వరలో పుతిన్‌తోనూ మాట్లాడుతామని చెప్పారు. ''ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి యూరోపియన్ యూనియన్ కంటే అమెరికా 200 మిలియన్ డాలర్లు అధికంగా ఖర్చు చేసింది. మాతో సమానంగా యూరోపియన్ యూనియన్ భారం భరించాల్సిందే. మేము ఎక్కువ ఖర్చు పెట్టాం అంటే నిజంగా మూర్ఖులమే. అందులో సందేహం లేదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. శాంతిని కోరుకుంటున్నట్లు జెలెన్‌స్కీ తనతో చెప్పారని వివరించారు. ఏం జరుగుతుందో చూద్దామని చెప్పారు. పుతిన్ ఎప్పుడు కోరుకుంటే అప్పుడు చర్చలకు సిద్ధమని ట్రంప్ తేల్చిచెప్పారు. యుద్ధంలో మరణాలు ఇక ఆగిపోవాలని అన్నారు.

కృత్రిమ మేధలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

చైనా నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం టారిఫ్ విధించాలని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి ఇది అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. చైనా నుంచి ఫెంటానైల్ అనే ప్రమాదకరమైన మాదకద్రవ్యం రాకుండా అడ్డుకోనున్నట్లు చెప్పారు. చైనా నుంచి మెక్సికో, కెనడా వంటి దేశాలకు, అక్కడి నుంచి అమెరికాకు ఫెంటానైల్ చేరుకుంటోందని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్‌తోపాటు అక్రమ వలసదార్లను అమెరికాలోకి పంపిస్తున్న దేశాల ఉత్పత్తులపై భారీగా పన్నులు విధిస్తామని ఆయన గతంలోనే హెచ్చరించిన సంగతి తెలిసిందే. కృత్రిమ మేధ(ఏఐ) మౌలిక సదుపాయాల కల్పనకు 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఒక కొత్త కంపెనీ ద్వారా నిధులు ఖర్చు చేస్తామన్నారు. ఒరాకిల్, సాఫ్ట్ బ్యాంక్, ఓపెన్ ఏఐ భాగస్వామ్యంతో ఈ కంపెనీని స్థాపిస్తామన్నారు. స్టార్‌గేట్‌గా పిలిచే ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు.

పట్టాలపై మృత్యుఘోష

రైల్లోంచి పట్టాలపైకి దూకి మరో రైలుకు బలి

12 మంది దుర్మరణం ● 15 మందికి గాయాలు

- **మంటలు అంటుకున్నాయంటూ వదంతులు చెలరేగడమే కారణం**
- **మహారాష్ట్రలో మాటలకందని ఘోరం**

జల్‌గావ్ (మహారాష్ట్ర): రైల్లో మంటలు అంటుకున్నాయని భయపడ్డారు. ప్రాణాలు కాపాడుకునేందుకు చైను లాగి మరీ పట్టాలపైకి దూకేశారు. కానీ మరో రైలు రూపంలో ఆ పట్టాలపై దూసుకొచ్చిన మృత్యువుకు బలయ్యారు. దానికింద నలిగి నిస్సహాయంగా మృత్యువాత పడ్డారు. మాటలకందని ఈ ఘోరం మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో జరిగింది. లఖ్‌నవూ నుంచి ముంబై వెళ్తున్న పుష్పక్ ఎక్స్‌ప్రెస్ జల్‌గావ్ స్టేషన్ దాటి మహేజీ, పర్ధాడే స్టేషన్ల మధ్య పచోరా ప్రాంతంలో ఉండగా బుధవారం సాయంత్రం 4.45 సమయంలో జనరల్ బోగీల మధ్య నిప్పురవ్వలు, పొగ ఎగసిపడ్డాయి. దాంతో ఆ బోగీల్లోని ప్రయాణికులు ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు. రైల్లో భారీగా మంటలు అంటుకున్నాయంటూ వదంతులు వ్యాపించడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు వెంటనే ఎమర్జెన్సీ చైన్ లాగేశారు. రైలు ఆగీ ఆగగానే పట్టాలపైకి దూకేశారు. అదే సమయంలో బెంగళూరు-ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ ఆ పట్టాలపై శరవేగంగా దూసుకొచ్చింది. దాంతో చాలామంది తప్పుకునే అవకాశం కూడా లేక ఆ రైలు కింద నలిగి ప్రాణాలొదిలారు. ఇప్పటిదాకా 12 మృతదేహాలను వెలికితీశారు. ప్రమాదంలో 15 మంది స్వల్పంగా గాయపడ్డారు. తెగిపడ్డ అవయవాలతో ఘటనా స్థలి భీతావహంగా మారింది. ప్రమాద సమయంలో కర్నాటక ఎక్స్‌ప్రెస్ గంటకు 130 నుంచి 140 కి.మీ. వేగంతో ఉన్నట్టు సమాచారం. పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో చిన్న నిప్పురవ్వలు మాత్రమే రేగాయని, దాంతో కాస్తంత పొగ వెలువడిందని ప్రాథమిక విచారణలో తేలింది. యాక్సెల్ వేడెక్కడమో, బోగీల మధ్య బ్రేక్ జామవడమో నిప్పురవ్వలకు కారణం అయ్యుంటుందని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

షా దిగ్భ్రాంతి

రైలు ప్రమాదం పట్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఫోన్లో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ఫడ్నవీస్ రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తదితరులు కూడా ప్రమాదంపై విచారం వెలిబుచ్చారు.



ప్రమాదం అనంతరం పట్టాల వద్ద బారులు తీరిన ప్రయాణికులు, స్థానికులు

మృత్యుమలుపు

మలుపే ప్రయాణికుల పాలిట మృత్యువైంది. ప్రమాదాన్ని తప్పించేందుకు రెండు రైళ్ల డ్రైవర్లు శాయశక్తులా ప్రయత్నించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ''పుష్పక్ రైలు ఆగగానే డ్రైవర్ ఫ్లాషర్ లైట్ వేశాడు. దాన్ని చూస్తూనే కర్నాటక ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ ఎమర్జెన్సీ బ్రేకులు వేశాడు. కానీ అదప్పటికే పుష్పక్ రైలుకు అతి సమీపానికి వచ్చేసింది. పైగా అక్కడి మూలమలుపు వల్ల పట్టాలపైకి దూకిన ప్రయాణికులకు రైలు కన్పించలేదు'' అని వివరించారు.

చక్రాల్లోంచే నిప్పురవ్వలు

ప్రత్యక్ష సాక్షుల కథనం

పుష్పక్ రైలు చక్రాల్లోంచి నిప్పురవ్వలు రావడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోయినట్టు రైల్లోని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ''ఎవరో చైను లాగడంతో కల్వర్ట్ వాల్ సమీపంలో రైలు ఆగింది. చాలామంది చెరోవైపు దూకేశారు. పట్టాలవైపు దూకిన వారిపైకి ఎదురుగా వచ్చిన రైలు దూసుకెళ్లింది'' అని వివరించారు. సమీప గ్రామాల ప్రజలు తక్షణం రంగంలోకి దిగి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

సమర్థులైన వ్యక్తులే రావాలి

హెచ్-1బీ వీసాలపై ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్: అమెరికాలోకి సమర్థులైన వ్యక్తులు రావడాన్నే తాను ఇష్టపడతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. హెచ్-1బీ వీసాలపై తీవ్రమైన చర్చ జరుగుతున్న సందర్భంలో ఒరాకిల్ సీటీవో లారి ఎల్లిసన్, సాఫ్ట్‌బ్యాంక్ సీఈఓ మసయోషి సన్, ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్‌తో కలిసి ట్రంప్ వైట్‌హౌస్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్-1బీ వీసాలపై జరుగుతున్న చర్చపై అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానమిచ్చారు. హెచ్-1బీ వీసాలను ఎలాన్ మస్క్ వంటి ట్రంప్ సన్నిహితులు, పారిశ్రామికవేత్తలు సమర్థిస్తుండగా, రిపబ్లికన్ పార్టీలో చాలా మంది నేతలు వ్యతిరేకిస్తున్నారు. అమెరికన్ల ఉద్యోగాలు లాగేసుకుంటున్నాయని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు కీలకంగా మారాయి. ''అయితే తాను రెండు వైపులా వాదనలు విన్నా. రెండు వాదనలూ నచ్చాయి. ఒక్క ఇంజనీర్లే కాకుండా అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో సమర్థులైన వ్యక్తులే తమదేశంలోకి రావాలని కోరుకుంటున్నా. అందుకు ఏకైక మార్గం హెచ్-1బీ వీసా'' అని ట్రంప్ స్పష్టం చేశారు. అత్యంత వృత్తి నైపుణ్యమున్న విదేశీయులకు అమెరికన్ కంపెనీలు తమ సంస్థల్లో నియమించుకునేదుకు హెచ్-1బీ వీసాలు ఇచ్చి అమెరికాకు రప్పించుకుంటున్న విషయం తెల్సిందే. హెచ్-1బీ వీసాల్లో దాదాపు 72 శాతం వీసాలను భారతీయులే సాధించడం తెల్సిందే. హెచ్-1బీ వీసాదారుడు గరిష్ఠంగా ఆరేళ్ల పాటు అమెరికాలో ఉండేందుకు వీలుంటుంది. ఈ వీసాను తొలుత మూడేళ్ల మంజూరు చేయగా, మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. అయితే హెచ్-1బీ వీసా పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు పరిశీలన దశలో ఉండగా అమెరికాను వీడొద్దనే నిబంధన ఉంది. తాను అధికారంలోకి వస్తే అమెరికన్లకే అత్యధిక ఉద్యోగ అవకాశాలు దక్కేలా చేస్తానని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించడంతో హెచ్-1బీ వీసాలకు కోతపడొచ్చన్న ఆందోళనకు ఎక్కువైన సంగతి తెల్సిందే. అయితే సోమవారం ప్రమాణస్వీకారం చేసిన కొద్ది గంటల్లోనే పలు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన ట్రంప్ హెచ్-1బీపై పరోక్షంగా మాట్లాడారు. ' లీగల్ ఇమ్మిగ్రేషన్‌ను నేను సమర్థిస్తాను. ఎందుకంటే మాకు అలాంటి వ్యక్తుల అవసరం ఉంది. వాళ్లు కచ్చితంగా కావాల్సిందే'' అని ట్రంప్ అన్నారు. 2024లో భారత్‌సహా 192 దేశాలకు చెందిన 2,70,000 మందికి పైగా అక్రమవలసదారులను యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బహిష్కరించింది. 2014 ఏడాది తర్వాత ఇంతమందిని ఒకేసారి బహిష్కరించడం ఇదే తొలిసారి. బహిష్కరణకు గురైన వారిలో 1,529 మంది భారతీయులు ఉన్నారు. 2024 ప్యూ రీసెర్చ్ నివేదిక ప్రకారం అమెరికాకు అక్రమంగా వచ్చిన వారిలో భారతీయమూలాలున్న వ్యక్తులు మూడో అతిపెద్ద సమూహంగా ఉన్నారు. మొదటి, రెండో స్థానాల్లో మెక్సికో, సాల్వడార్ దేశస్తులు ఉన్నారు.

మోదీ, ట్రంప్ భేటీ ఫిబ్రవరిలో?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ ఫిబ్రవరిలోనే జరగనుందా? ఈ దిశగా ఇరు దేశాల దౌత్యవేత్తల స్థాయిలో ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయా? అవుననే అంటోంది రాయిటర్స్ వార్తా సంస్థ. వారు వాషింగ్టన్‌లో భేటీ కానున్నారని భారత దౌత్యవర్గాలను ఉటంకిస్తూ కథనం వెలువరించింది. ''ఇరు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంలో మోదీ, ట్రంప్ మధ్య ఉన్న స్నేహబంధం కీలకపాత్ర పోషించనుంది. చైనా దూకుడును అడ్డుకోవడంపై ఈ భేటీలో నేతలిద్దరూ దృష్టి సారించే అవకాశముంది. ఇక భారతీయులను ఆందోళన పరుస్తున్న వలసలపై కఠిన వైఖరి, జన్మతః పౌరసత్వం రద్దు తదితర అంశాలను మోదీ ప్రముఖంగా లేవనెత్తవచ్చు. హెచ్-1బీ వీసాల్లో సింహభాగం భారతీయులే దక్కించుకుంటారన్నది తెలిసిందే. అమెరికా వస్తువులపై భారత్ విధిస్తున్న సుంకాలు మరీ ఎక్కువని పదేపదే ఆక్షేపిస్తున్న ట్రంప్ ఈ అంశాన్ని మోదీతో లేవనెత్తవచ్చు. సుంకాలను తగ్గించడంతో పాటు అమెరికా పెట్టుబడులను మరింతగా ఆకర్షించే దిశగా పలు నిర్ణయాలను ఈ భేటీలో ట్రంప్ ముందుంచాలని మోదీ భావిస్తున్నారు'' అని రాయిటర్స్ పేర్కొంది. భారత్‌కు అతి పెద్ద వర్తక భాగస్వామిగా అమెరికా కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2023–24లో 118 బిలియన్ డాలర్ల మేరకు ద్వైపాక్షిక వర్తకం జరిగింది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఈడీకి లక్ష జరిమానా

ప్రజలను వేధించొద్దని బాంబే హైకోర్టు హితవు

ముంబై: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి బాంబే హైకోర్టు మంగళవారం రూ.లక్ష జరిమానా విధించింది. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిపై మనీ లాండరింగ్ కింద దర్యాప్తు చేపట్టడాన్ని తప్పుపట్టింది. ప్రజలను అనవసరంగా వేధించవద్దని ఈడీకి తేల్చిచెప్పింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం తగదని హితవు పలికింది. ఎవరైనా సరే చట్టం పరిధిలోనే పని చేయాలని, అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. ముంబైకి చెందిన రాకేశ్ జైన్ అనే స్థిరాస్తి వ్యాపారిపై ఈడీ మనీ లాండరింగ్ కింద దర్యాప్తు ప్రారంభించగా, ఆయన హైకోర్టు ను ఆశ్రయించారు. ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఒకరు ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదైంది. ఇందులో మనీ లాండరింగ్ కోణం లేదని హైకోర్టు గుర్తించింది. రాకేశ్ జైన్‌ను వేధించాలన్న ఉద్దేశంతోనే ఈడీ దర్యాప్తు చేపట్టినట్లు తప్పుపట్టింది.

జెనిన్‌లో ఇజ్రాయెల్ సైన్యం ఆపరేషన్

9 మంది పాలస్తీనియన్ల మృతి

జెనిన్: ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్‌లో ఇజ్రాయెల్ దళాలు జరిపిన భారీ ఆపరేషన్‌లో తొమ్మిది మంది పాలస్తీనియన్లు మరణించారు. 35 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. సాయుధ సంస్థలకు కంచుకోటగా ఉన్న జెనిన్‌లో ఉగ్రవాదాన్ని తరిమికొట్టేందుకు విస్తృతమైన ఆపరేషన్‌ను ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. ఇజ్రాయెల్ కాల్పుల్లో గాయపడిన వారిలో ముగ్గురు వైద్యులు, ఇద్దరు నర్సులు ఉన్నారని జెనిన్ ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ విస్సామ్ బకర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఇజ్రాయెల్ దళాలు వెళ్లడానికి ముందే జెనిన్ శరణార్థి శిబిరం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల నుంచి స్థానిక భద్రతా సిబ్బంది వైదొలిగారు. ఇజ్రాయెల్ దళాలు పౌరులపై కాల్పులు జరిపాయని, దీంతో పలువురు గాయపడ్డారని పాలస్తీనా భద్రతా దళాల ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ అన్వర్ రజాబ్ తెలిపారు. జెనిన్‌లో ఒక టీనేజర్‌సహా 9 మందిని ఇజ్రాయెల్ బలగాలు అన్యాయంగా పొట్టనబెట్టుకున్నాయని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం సాయంత్రం ప్రకటించింది. టియానిక్ గ్రామంలోనూ ఇజ్రాయెల్ దళాలు ఒక వ్యక్తిని కాల్చి చంపాయి. గాజాలో కాల్పుల విరమణ ప్రారంభమైన మూడు రోజుల తర్వాత, వెస్ట్‌బ్యాంక్‌లో దాడులు జరగడం గమనార్హం. ''వెస్ట్ బ్యాంక్‌లో భద్రతను బలోపేతానికి, మా లక్ష్యాలను సాధించడానికి మరో ముందడుగుగా జెనిన్ ఆపరేషన్ చేపట్టాం. లెబనాన్, సిరియా, యెమెన్, వెస్ట్ బ్యాంక్‌లలో ఇరాన్ ఏ ప్రాంతంపై ప్రభావం చూపించాలనుకున్నా మేం దానిని అడ్డుకుంటాం'' అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. వెస్ట్‌బ్యాంక్‌లోని హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్, ఇతర సాయుధ గ్రూపులకు ఇరాన్ ఆయుధాలు, నిధులను అందిస్తోందని ఆరోపించారు. '' ఈ ప్రాంతాల్లో సాయుధ బృందాల మౌలిక సదుపాయాలను విచ్ఛిన్నం చేయడం ఈ ఆపరేషన్ ముఖ్య లక్ష్యం'' అని ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది.

మణిపూర్ బీజేపీ సర్కార్‌కు జేడీ(యూ) మద్దతు ఉపసంహరణ!

ఇంఫాల్: బీజేపీకి మిత్రపక్షంగా కొనసాగుతున్న జేడీ(యూ) మణిపూర్‌లో మాత్రం ఆ పార్టీకి షాక్ ఇచ్చింది. బీరేన్‌సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి జేడీ(యూ) మణిపూర్ యూనిట్ మద్దతు ఉపసంహరించింది. ఈ మేరకు జేడీ(యూ) మణిపూర్ అధ్యక్షుడు క్షేత్రిమయూమ్ బీరేన్‌సింగ్ రాష్ట్ర గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాకు లేఖ రాశారు. రాష్ట్రంలో జేడీ(యూ)కు ఒకే ఒక్క ఎమ్మెల్యే మొహమ్మద్ అబ్దుల్ నసీర్ ఉన్నారు. ఆయన ఇకపై ప్రతిపక్ష స్థానంలో కూర్చుంటారని పార్టీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. జేడీ(యూ) మద్దతు ఉపసంహరించినప్పటికీ బీరేన్‌సింగ్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. 60 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలున్నారు. నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలతోపాటు ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జేడీ(యూ) నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు గెలిచారు. వీరిలో ఐదుగురు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విచారణ స్పీకర్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉంది.

మణిపూర్ జేడీ(యూ) చీఫ్‌పై వేటు

జేడీ(యూ) మణిపూర్ అధ్యక్షుడు క్షేత్రిమయూమ్ బీరేన్‌సింగ్‌ను పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ బుధవారం ప్రకటించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వానికి తమ మద్దతు యధాతథంగా కొనసాగుతుందని వెల్లడించారు.



బుధవారం త్రివేణి సంగమంలో కేబినెట్ మంత్రులతో కలిసి స్నానం చేస్తున్న యూపీ సీఎం యోగి

10 రోజులు 10 కోట్లు

మహా కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

సాక్షి, న్యూఢిల్లీ/మహాకుంభ్ నగర్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో 10 రోజుల్లోనే ఏకంగా 10 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. త్రివేణి సంగమ స్థలికి భక్తులు బారులు తీరుతున్నారు. కుంభమేళాకు చేరుకోవడానికి రైళ్లు, విమానాలపై ఆధారపడుతున్నారు. వెయ్యికి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నా భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. ప్రతి రైల్లోనూ చాంతాడంత వెయిటింగ్ లిస్టులు ఉంటున్నాయి. జనరల్ బోగీల పరిస్థితైతే వర్ణనాతీతం! ఒక్కో రైలుకు నాలుగైదు చొప్పున జనరల్ బోగీలున్నా అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి! ఢిల్లీ, ముంబై, బెంగళూర్ వంటి నగరాల నుంచి విమాన సర్వీసులు ప్రయాణికుల అవసరాలకు ఏమాత్రం చాలడం లేదు. పైగా అప్పటికప్పుడు ప్రయాణ వేళలు మార్చడం, టికెట్ ధరలను విపరీతంగా పెంచడంతో బెంబేలెత్తిపోతున్నారు.

ఇవి పాటించాలి


కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించే విషయంలో పలు అంశాలు దృష్టిలో పెట్టుకోవాలని వేద పండితులు సూచిస్తున్నారు. కుంభమేళాలో స్నానం మనసులోని మాలిన్యాన్ని తొలగించుకోవడానికని గుర్తుంచుకోవాలి. స్నానం ఆచరించే ముందు సంగమ జలాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. మేళాలో తొలి స్నానం క్షేమం కోసం, రెండోది తల్లిదండ్రుల పేరుతో, మూడోది గురువు పేరుతో ఆచరించాలి. త్రివేణి సంగమ పవిత్ర జలాన్ని ఇంటికి తెచ్చుకోవాలి.

యోగి పుణ్యస్నానం

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుధవారం తన మంత్రివర్గ సహచరులతో కలిసి మహా కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించారు. అంతకుముందు ప్రయాగ్‌రాజ్‌లోనే కేబినెట్ సమావేశం నిర్వహించారు. రాజకీయ, పాలనాపరమైన అంశాలపై చర్చించారు. ప్రయాగ్‌రాజ్‌లో రెండు నూతన వారధుల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్శించబోతున్నట్లు తెలిపారు. యూపీ యువతకు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. సరిగ్గా ఏడాది క్రితం అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కూడా త్రివేణి సంగమంలో యోగి పుణ్యస్నానం ఆచరించారు.

అంతరిక్షం నుంచి కనువిందు

కోట్లాది భక్తుల పుణ్య స్నానాలతో సందడిగా కనిపిస్తున్న మహా కుంభమేళా దృశ్యాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) బుధవారం విడుదల చేసింది. వీటిని అంతరిక్షం నుంచి శాటిలైట్ ద్వారా చిత్రీకరించారు. టెంట్ సిటీ ఏర్పాటవక ముందు, ఏర్పాటైన తర్వాతి ఫొటోలు ఆకట్టుకుంటున్నాయి. ఇసుకేస్తే రాలనంత జనం కనిపిస్తున్నారు. మేళా పరిసర ప్రాంతాలు సైతం ఆకర్షిస్తున్నాయి. 2023 సెప్టెంబర్‌లో, 2024 డిసెంబర్ 29న చిత్రీకరించిన ఫొటోలు కూడా వీటిలో ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు దర్శనమిస్తున్నాయి.



గగన్‌యాన్ మిషన్‌లో పురోగతి

క్రూ మాడ్యూల్‌కు లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను జతచేసిన ఇస్రో

సూళ్లూరుపేట: భవిష్యత్తులో మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలకు సన్నాహక ప్రాజెక్టుగా పేరొందిన గగన్‌యాన్-1 మిషన్‌లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అడుగు ముందుకేసింది. సంక్లిష్టమైన లిక్విడ్ ప్రొపెల్షన్ సిస్టమ్‌ను క్రూ మాడ్యూల్‌తో విజయవంతంగా అను సంధానించింది. అనుసంధానం తర్వాత ఈ మాడ్యూల్‌ను మంగళవారం శ్రీహరి కోటలోని సతీశ్ ధవన్ స్పేస్‌సెంటర్‌కు తరలించినట్లు బెంగళూరులో ఇస్రో వారి లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ బుధవారం ప్రకటించింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల్లో తమ సామర్థ్యాలను నిరూపించుకునేందుకు ఇస్రో తొలిసారిగా గగన్‌యాన్ పేరిట ఒక మానవరహిత ప్రయోగాన్ని చేపడుతున్న విషయం తెల్సిందే. ఈ మానవరహిత ప్రయోగం కోసమే తొలిసారిగా ఈ క్రూ మాడ్యూల్‌ను సిద్ధంచేస్తున్నారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) లో రూపొందించిన క్రూ మాడ్యూల్ అప్‌రైటింగ్ సిస్టంను మహేంద్రగిరిలోని లిక్విడ్ ప్రపొల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ)లో ప్రొపల్షన్ సిస్టంతో అనుసంధానించారు. క్రూ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం అనేది ఒక రియాక్షన్ కంట్రోల్ సిస్టం (ఆర్‌సీఎస్). అంటే క్రూ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి తీసుకెళ్లి స్వేచ్ఛగా వదిలేశాక భూమి దిశగా దిగొచ్చేటప్పుడు దాని వేగాన్ని నియంత్రించి పారాచూట్‌ల సాయంతో నెమ్మదిగా సముద్రం మీదకు దిగేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞా నాన్ని ఇందులో ఇమ డ్చారు. కిందకు పడేటప్పుడు సూటిగా వచ్చేలా, అటు ఇటూ తిరక్కుండా, పల్టీలు కొట్టకుండా మూడురకాలుగా దాని భద్రతను చూడ టమే ఆర్‌సీఎస్ పని. వ్యోమనౌక నుంచి విడిపోయి అంతరిక్షంలోకి చేరుకునే టప్పు డు, తిరిగి భూవాతావరణంలోకి ప్రవేశించేటప్పుడు పారాచూట్‌లు విచ్చుకోకముందు ఆర్‌సీఎస్‌ను వాడతారు.

భారత్‌తో అమెరికా వాణిజ్యం బలోపేతం

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో జైశంకర్ భేటీ

వాషింగ్టన్: భారత్‌తో తమ వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు అమెరికా నూతన విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. అమెరికా విదేశాంగ మంత్రిగా ప్రమాణంచేసిన కొద్దిసేపటికే ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. 53 ఏళ్ల రూబియో బాధ్యతలు చేపట్టగానే భారత్‌తో భేటీకి సిద్ధపడటం అమెరికా భారత్‌కు ఇస్తున్న అత్యధిక ప్రాధాన్యతను చాటిచెబుతోంది. వాస్తవానికి అమెరికా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవం, తర్వాత క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు జైశంకర్ అమెరికాకు వచ్చిన విషయం తెల్సిందే. క్వాడ్ భేటీ తర్వాత అమెరికా విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో రూబియో, జైశంకర్ విస్తతస్థాయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.



రోడ్డును మింగేశారు..
ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం కృషి చేయాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు తమ కళ్ల ముందే ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.
-8లో



రోప్.. హోప్!
నగరంలోని చింతల్‌బస్తీలో ఆపరేషన్ రోప్‌నకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఆక్రమణలను కూల్చివేశారు. బంజారాహిల్స్–షాదన్ కాలేజీలకు అనుసంధానం చేయనున్నారు.
-10లో

గరిష్టం/కనిష్టం
32.0/16.0

వాతావరణం
నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 16 ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మ్యాన్‌హోల్.. క్లీనింగ్ రోబో

మద్రాస్ ఐఐటీ రూపొందించిన 'హోమ్‌సెప్ సీవర్'



హోమ్‌సెప్ సీవర్ రోబో

- సీఎస్ఆర్ కింద కంటోన్మెంట్‌కు అందజేత
- ప్రారంభించిన బోర్డు అధికారులు
- రాష్ట్రంలోనే ఇది తొలి రోబో.. దీని విలువ రూ.60 లక్షలు

సెన్సర్‌లు కలిగిన ఏకైక రోబో..

మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని మానవ రహితంగా క్లీనింగ్ చేసేందుకు ఈ రోబోలను వినియోగించనున్నారు. సోలినాస్ సంస్థ రూపొందించిన 16 రోబోలు ప్రస్తుతానికి చెన్నై, బెంగళూరు, రాయ్‌చూర్, పాండిచ్చేరి, కేరళలో ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నారు. ఆయా రోబోల కంటే మరింత అధునాతనమైన పూర్తిస్థాయి సెన్సర్‌లతో కూడిన రోబో కంటోన్మెంట్‌కు అందజేయడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రంలో ఈ తరహా రోబో కంటోన్మెంట్‌లో మాత్రమే ఉంది.

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఇకపై మ్యాన్‌హోళ్ల క్లీనింగ్‌ను రోబో సాయంతోనే చేయనున్నారు. ఐఐటీ మద్రాస్ సౌజన్యంతో రూపొందించిన 'హోమ్‌సెప్ సీవర్' రోబో ద్వారా మ్యాన్‌హోల్స్ క్లీనింగ్‌కు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఐఐటీ మద్రాస్‌కు చెందిన సోలినాస్ ఇంటిగ్రిటీ ప్రైవేట్ లిమిటెడ్, వెల్స్ ఫార్గో సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.60 లక్షల విలువైన ఈ రోబోను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ఉచితంగా అందజేశారు. కంటోన్మెంట్ అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్వీ నంజుండేశ్వర.. సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యుడు రామకృష్ణలతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం సోలినాస్ సంస్థ ప్రతినిధులు ఈ రోబో పని తీరును కంటోన్మెంట్ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ సూపరింటెండెంట్‌లు రాజ్‌కుమార్, దేవేందర్, మహేందర్, ఇంజినీర్‌లు పి. సావన్ కుమార్, సోలినాస్ సంస్థకు చెందిన నితీష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకతలు ఇవీ..

- వీల్స్, టైర్లతో కూడిన ఈ రోబోను సీవరేజీ వాహనాలకు అనుసంధానం చేసి మ్యాన్‌హోల్స్ ఉన్న ప్రాంతాలకు సులభంగా తీసుకెళ్లవచ్చు.
- బ్లేడ్, బకెట్ సక్షన్‌లతో కూడిన ఈ రోబో తానే స్వయంగా మ్యాన్‌హోల్ మూతలను తొలగించి అందులోకి ప్రవేశిస్తుంది.
- క్విక్ బ్లేడ్ బకెట్ సిస్టమ్, రొటేటింగ్ మోటార్‌లు, స్లయిడింగ్ యాక్చువేటర్స్ ద్వారా మ్యాన్‌హోల్ లోపల సులభంగా ప్రయాణిస్తుంది.
- జీపీఎస్ ఎనేబుల్డ్ సిస్టమ్ ద్వారా మ్యాన్‌హోల్ లోపల ఎంత లోతుకు, దూరం వెళ్లింది తెలుసుకోవచ్చు.
- ఈ రోబోలో మొత్తం 4 ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు ఉన్నాయి. ఇందులో మూడు నైట్ విజన్‌తో పనిచేస్తాయి. 170 డిగ్రీల కోణంలో ఫొటోలు, వీడియోలు తీస్తాయి. మరొకటి అండర్ వాటర్ కెమెరా.



హోమ్‌సెప్ సీవర్ రోబోను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డు అధికారులు

- రోబో కెమెరాల్లో నిక్షిప్తం చేసిన ఫొటోలు, వీడియోలను హై రిజల్యూషన్ కలిగిన డిస్‌ప్లే ద్వారా గమనించవచ్చు. ఆయా కెమెరాల్లో నిక్షిప్తమైన ఫుటేజీని నెల రోజుల వరకు స్టోర్ చేసుకునే వెసులుబాటు ఉంది.
- రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే రోబో మ్యాన్‌హోల్‌లోని చెత్తను సేకరించి, దానికి అనుసంధానం చేసిన స్టోరేజ్ బిన్‌లలోకి మారుస్తుంది.
- ఈ రోబోలో మరో ప్రత్యేకత ఏమిటంటే మ్యాన్‌హోల్ లోపల ఉన్న విషవాయువులను గుర్తిస్తుంది. మిథేన్, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్ సల్ఫైడ్, అమోనియా, నైట్రోజన్ డయాక్సైడ్, ఈథేన్ వంటి వాయువుల గుర్తించడంతో పాటు గాఢతను సైతం బయట ఉన్న ఎల్‌సీడీ డిస్‌ప్లేలో చూపిస్తుంది.
- పెట్రోల్‌తో నడిచే ఈ రోబో నిరంతరాయంగా 8 గంటల పాటు పనిచేస్తుంది.

పద్మారావును పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు



పద్మారావును పరామర్శిస్తున్న కేటీఆర్, తలసాని, శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సహా పలువురు నేతలు పరామర్శించారు. ఈ నెల 18న డెహ్రాడూన్ వెళ్లిన పద్మారావు మరుసటి రోజు గుండెపోటుకు గురి కావడంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆయన గుండెకు స్టెంట్ వేశారు. చికిత్స అనంతరం ఆయన మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. మోండా మార్కెట్ డివిజన్ టకారబస్తీలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పద్మారావును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పువ్వాడ అజయ్, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులు దానోజు శ్రావణ్, సలీమ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు పరామర్శించారు.

కటకట.. ఎక్కడెక్కడ?

తాగునీటి కొరతపై జలమండలి క్షేత్రస్థాయి సర్వే

- ఎద్దడి ఉన్న బస్తీల గుర్తింపు
- లోప్రెషర్ సరఫరాపై స్పష్టత
- ట్యాంకర్ల తాకిడిపై దృష్టి
- ముందస్తు ప్రణాళికతో వేసవి నీటి ఎద్దడికి చెక్



సాక్షి, సిటీబ్యూరో: వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు జలమండలి సిద్ధమవుతోంది. గత వేసవి అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పదిహేను రోజులుగా ముందస్తు ప్రణాళికల కోసం క్షేత్రస్థాయి సర్వే నిర్వహించింది. కోర్‌సిటీతో పాటు శివారులోని సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి పరిస్థితులను అంచనా వేశారు. ఎక్కడ.. ఏ మేరకు నీటి ఎద్దడి ఉంటుందో.. లోప్రెషర్‌తో పాటు ట్యాంకర్ల తాకిడి అధికంగా అవకాశా లుండే ప్రాంతాలను గుర్తించారు. సెక్షన్‌కు ఒక యూనిట్‌గా తీసుకొని సర్వే నివేదికల ఆధారంగా వేసవి కంటే ముందే ఫిబ్రవరి 15 వరకు సమస్య పరిష్కారం దిశగా చర్యలకు ఉపక్రమించేందుకు జలమండలి సిద్ధమవుతోంది.

ఆరు డివిజన్ల నుంచి ట్యాంకర్లకు డిమాండ్

నగరంలోని సుమారు ఆరు డివిజన్లలోనే ట్యాంకర్ల డిమాండ్ అధికంగా ఉంటుందని క్షేత్ర స్థాయి సర్వేలో వెల్లడైంది. మొత్తమ్మీద ఇప్పటికే 20 నుంచి 30 సెక్షన్లలో పరిధిలో భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో వేసవిలో ట్యాంకర్ల తాకిడి అధికంగా ఉంటుందని జలమండలి గుర్తించింది. సాధారణంగా మాదాపూర్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, మణికొండ, హయత్‌నగర్, సరూర్‌నగర్, అత్తాపూర్ బంజారాహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, కేపీహెచ్‌బీ, ప్రగతినగర్, నిజాంపేట తదితర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల సరఫరాకు డిమాండ్ అధికంగా ఉండే అవకాశం ఉంటుందని సర్వేలో బహిర్గతమైంది. ఇప్పటికే ప్రగతి నగర్, వైశాలి నగర్, కొండాపూర్ తదితర ప్రాంతాలో ట్యాంకర్ల తాకిడి పెరిగింది.

వేసవిలో భారీ స్థాయిలోనే..

- సాధారణంగా వేసవిలో ట్యాంకర్ల డిమాండ్ భారీ స్థాయిలో ఉంటుంది. సగటున నెలవారీగా బుకింగ్‌ల సంఖ్య 1.50 లక్షల నుంచి 2.45 లక్షల వరకు చేరుతున్నాయి. ఈసారి కూడా అలాంటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని జలమండలి భావిస్తోంది. అవసరమైతే ఫిల్లింగ్ స్టేషన్లను పెంచడంతో పాటు ట్యాంకర్ల డెలివరీల్లో పెండెన్సీ లేకుండా సత్వర సరఫరా జరిగేలా తగిన ఏర్పాట్లకు చేయనుంది. ముఖ్యంగా వెయిటింగ్ పీరియడ్, పెండెన్సీ తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. గతేడాది భూగర్భ జలాలు అడుగంటడంతో ఫిబ్రవరిలో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ఏప్రిల్‌లో డిమాండ్ తారస్థాయికి చేరింది. దీంతో బుకింగ్.. సరఫరాకు మధ్య తీవ్ర కాలయాపన జరిగింది. ఈసారి ఆ సమస్య తలెత్తకుండా.. తగిన ఏర్పాట్లు చేసేందుకు సంసిద్ధమవుతోంది. మరోవైపు గతంలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసిన వినియోగదారులపై సర్వే నిర్వహించగా.. వారి ప్రాంగణాల్లో బోర్లు, భూగర్భ జలాలు ఎండిపోవడం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైనట్లు గుర్తించింది.
- ఉదాహరణకు ప్రస్తుతం తట్టిఖానా సెక్షన్‌లో 20 ట్యాంకర్లతో దాదాపు 150 ట్రిప్పుల వరకు ట్యాంకర్ల డెలివరీ జరుగుతోంది. ఇదే డిమాండ్ కొనసాగితే ఏప్రిల్ నాటికి రోజూ 400 ట్రిప్పులు పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఫిల్లింగ్ స్టేషన్‌లోని ఫిల్లింగ్ పాయింట్స్ నిర్మాణ పద్ధతి వల్ల ఒక ట్యాంకర్ నింపడానికి 15 నిమిషాలు పడుతుంది. ఫిల్లింగ్ సమయాన్ని 5 నిమిషాలకు తగ్గించుకుంటే అనుకున్నదాని కంటే రెట్టింపు ట్రిప్పులు సరఫరా చేయవచ్చని జలమండలి భావిస్తోంది.. దీంతో వెయిటింగ్ పీరియడ్, పెండెన్సీ తగ్గడంతో పాటు నగరవాసులకు సకాలంలో నీరు సరఫరా చేయవచ్చనే భావన జలమండలిలో వ్యక్తమవుతోంది.

నాంపల్లి చుట్టూ నరకమే!

ఈ పరిసర ప్రాంతాల్లోనే భారీగా ట్రాఫిక్ జాంలు

- 10 కి.మీ ప్రయాణానికి ఏకంగా 32 నిమిషాలు
- నగరంలో సరాసరి వేగం గంటకు 19 కి.మీ
- టామ్ టామ్ సంస్థ– 2024 సర్వేలో వెల్లడి
- ఆక్రమణల తొలగింపులో రాజకీయ జోక్యాలు
- 'రోప్'తో అయినా రూపుమారుతుందనే ఆశ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యలు అందరికీ విదితమే. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. రోజుకు 1,500 చొప్పున కొత్తగా వచ్చి చేరుతున్న వాహనాలు, గణనీయంగా పెరిగిపోయిన సెకండ్ హ్యాండ్ మార్కెట్, ఆక్రమణలకు గురవుతున్న రోడ్లు.. వెరసీ.. 'జాం'జాటాలు తప్పట్లేదు. సిటీలోని ఇతర ప్రాంతాల కంటే నాంపల్లి చుట్టుపక్కల ఉన్న ఏరియాల్లోనే ట్రాఫిక్ జాంలు ఎక్కువగా ఉన్నాయని టామ్ టామ్ సంస్థ తేల్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన ఈ టెక్నాలజీ సంస్థ 2024కు సంబంధించి స్లో మూవింగ్ ట్రాఫిక్ ఇండెక్స్ (14వ ఎడిషన్) పేరుతో ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 500 నగరాల్లో సర్వే చేయగా..ట్రాఫిక్ జాంలకు సంబంధించి హైదరాబాద్ ప్రపంచంలో 18వ స్థానం, జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది.

2023 కంటే 2024లో రెండు గంటలు అదనం

హైదరాబాద్‌లో రద్దీ వేళల్లో 10 కిమీ ప్రయాణించడానికి 32 నిమిషాల సమయం పడుతోంది. సగటున ఒక్కో హైదరాబాదీ ఏడాదికి 85 గంటల చొప్పున బంపర్ టు బంపర్ ట్రాఫిక్ జామ్‌లో ఉంటున్నాడు. పోలీసులు తీసుకుంటున్న చర్యలతో ఎప్పటికప్పుడు పరిస్థితి మెరుగుపడాల్సి ఉంది. అయితే నగరవాసి మాత్రం 2023లో కంటే 2024లో రెండు గంటల ఎక్కువ సేపు ట్రాఫిక్ జామ్‌లో గడిపాడని టామ్ టామ్ నిర్ధారించింది. హైటెక్ సిటీ, సాఫ్ట్‌వేర్ హబ్‌లు ఉన్న వెస్ట్రన్ హైదరాబాద్ కంటే సికింద్రాబాద్, పంజగుట్ట, లక్డీకాపూల్, అమీర్‌పేట, ఖైరతాబాద్‌ల్లోనే ఎక్కువ ట్రాఫిక్ జామ్స్ ఉన్నట్లు తేల్చింది. వీటితో పాటు నాంపల్లి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో ప్రయాణించే వాహనాలకే ట్రావెల్ టైమ్ ఎక్కువ పడుతోందని గుర్తించింది. నాంపల్లి, కోఠి, అబిడ్స్‌తో పాటు అంబర్‌పేట (ఫ్లైఓవర్ నిర్మాణ పనుల వల్ల), చాదర్‌ఘాట్‌ల్లో ఇది ఎక్కువని టామ్ టామ్ స్పష్టం చేసింది.

'రోప్' చుట్టూ రాజకీయ నేతల క్రీనీడలు..

నగరంలో ఈ పరిస్థితులు మార్చడానికి పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి వాటిలో 'ఆపరేషన్ రోప్' ఒకటి. దీనిపై ఓట్ బ్యాంక్ రాజకీయాల ప్రభావం, రాజకీయ క్రీనీడలు పడుతున్నాయి. అనేక ప్రాంతాల్లో రహదారి, ఫుట్‌పాత్ ఆక్రమణల్ని తొలగించకుండా స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు అనునిత్యం అడ్డు తగులుతున్నారు.

టామ్ టామ్ నివేదిక ప్రకారం..

- నగరంలోని వాహనాల యావరేజ్ స్పీడ్: పీక్ అవర్స్‌లో గంటలకు 17.8 కి.మీ, సాధారణ వేళల్లో 19 కి.మీ., సాయంత్రం వేళల్లో 15.6 కి.మీ.
- పది కి.మీ ప్రయాణించడానికి పట్టే సమయం: పీక్ అవర్స్‌లో 31 నిమిషాల 30 సెకన్లు, రద్దీ వేళ్లలో 33 నిమిషాల 41 సెకన్లు, సాయంత్రం వేళల్లో 33 నిమిషాల 24 సెకన్లు
- 2024లో మిగిలిన రోజుల కంటే సెప్టెంబర్ 21న వచ్చిన శనివారం రోజు నగర వాసి తీవ్ర ట్రాఫిక్ నరకం చవి చూశాడు. ఆ నెల మొత్తం ట్రాఫిక్ రద్దీ కొనసాగింది.
- **తీవ్రమైన ట్రాఫిక్ జామ్స్ ఉండే ప్రాంతాలు:** బేగంపేట, సోమాజిగూడ, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, బంజారాహిల్స్, హిమాయత్‌నగర్, మెహిదీపట్నం.

ఆ సర్జన్ ఎవరు?



కిడ్నీ దాతలది తమిళనాడు.. స్వీకర్తలది కర్ణాటక

సాక్షి, సిటీబ్యూరో:

కొత్తపేటలోని అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి చికిత్సల్లో కీలకంగా వ్యవహరించిన నెఫ్రాలజిస్ట్, అనస్థీషియన్ ఎవరు? అనే కోణంలో వైద్యారోగ్యశాఖ విచారణ ప్రారంభించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఉస్మానియా ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ నేతృత్వంలో ఏర్పడిన త్రిసభ్య కమిటీ బుధవారం అలకనంద ఆస్పత్రిని పరిశీలించింది. అనంతం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమిళనాడుకు చెందిన కిడ్నీ దాతలు నస్రీన్‌బేగం (35), ఫిర్దోస్‌బేగం (40) సహా కర్ణాటకకు చెందిన స్వీకర్తలు న్యాయవాది రాజశేఖర్ (68), సివిల్ ఇంజినీర్ భార్య, మాజీ స్టాఫ్‌నర్సు కృపాలత (45) ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎవరి ద్వారా ఇక్కడికి వచ్చారు? ఎలా వచ్చారు? ఇక్కడికి వచ్చిన తర్వాత ఏ డాక్టర్‌ను సంప్రదించారు? ఎక్కడ వైద్య పరీక్షలు చేయించారు? సర్జరీ కోసం ఎంత చెల్లించారు? వంటి అంశాలపై ఆరా తీశారు. అయితే.. ఇప్పటికే సరూర్‌నగర్ పోలీసుల అదుపులో ఉన్న ఆస్పత్రి నిర్వాహకుడు సుమంత్ ఇప్పటికీ నోరు మెదపనట్లు తెలిసింది. ఆయన నోరు తెరిస్తే కానీ అసలు విషయం బయటికి వచ్చే అవకాశం లేకపోలేదు. ఇదిలా ఉంటే.. కిడ్నీ రాకెట్‌కు పాల్పడిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలు ప్రజా సంఘాలు అలకనంద ఆస్పత్రి ఎదుట బుధవారం ఆందోళనకు దిగాయి.

దాతలు, స్వీకర్తల కేస్ షీట్లు మాయం..

- వైద్యులు ఏదైనా సర్జరీ చేసే ముందు రోగి ఊరు, పేరు, ఫోన్ నంబర్‌తో పాటు బీపీ, షుగర్ ఇతర ఆరోగ్య వివరాలు కేస్ షీట్‌లో నమోదు చేస్తారు. ప్రతి ఆరు గంటలకోసారి బీపీ, పల్స్‌రేట్‌ను మానిటరింగ్ చేస్తుంటారు. సర్జరీ చేసే వైద్యుడి పేరుతో పాటు మత్తుమందు ఇచ్చే వైద్యుడు సహా స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది వివరాలను కూడా ఇందులో నమోదు చేస్తారు. కానీ.. అలకనంద ఆస్పత్రి యాజమాన్యం ఇవేవీ పట్టించుకోలేదు. ఎవరికీ అనుమానం రాకుండా దాతలు, స్వీకర్తలను ఇక్కడికి తీసుకురావడంతో పాటు సర్జరీ చేసిన వైద్య సిబ్బంది వివరాలను కేషీట్‌లో నమోదు చేయకుండా గోప్యంగా వ్యవహరించింది.
- సర్జరీలో పాల్గొన్న వైద్య సిబ్బంది ఆ సమయంలో తమ ముఖాన్ని రోగులు, వారివెంట వచ్చిన బంధువులు గుర్తించకుండా మాస్కులు ధరించి, జాగ్రత్త పడినట్లు తెలిసింది. తనిఖీలకు వెళ్లిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కేస్ షీట్ కూడా దొరకకుండా జాగ్రత్తపడింది. నిజానికి ఎవరైనా రోగులు సర్జరీ చేయించుకునే ముందు ఆస్పత్రి ఎక్కడ ఉంది? చికిత్స చేసే డాక్టర్ ఎవరు? ఆయనకున్న అనుభవం ఏమిటీ? ఇప్పటి వరకు ఆయన ఎన్ని సర్జరీలు చేశారు? సక్సెస్ రేటు ఎంత? వంటి అంశాలపై ఆరా తీస్తారు. ఆ తర్వాతే సర్జరీకి అంగీకరిస్తారు. కానీ.. ఇక్కడ స్వీకర్తలిద్దరూ ఇవేవీ పట్టించుకోలేదు. వారిద్దరూ ఉన్నత విద్యావంతులే అయినప్పటికీ.. కేవలం మధ్యవర్తులు చెప్పిన మాటలు నమ్మి, చికిత్స కోసం వచ్చినట్లు తెలిసింది.

వేర్వేరు రాష్ట్రాలు.. వేర్వేరు మధ్యవర్తులు..

- తమిళనాడులోని పేద కుటుంబాలకు చెందిన నస్రీన్‌బేగం (35), ఫిర్దోస్‌బేగం (40)లు గత కొంత కాలంగా తీవ్రమైన ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. పెళ్లైన తర్వాత భర్తలు వదిలేయడంతో వీరు ఒంటరయ్యారు. రోజువారీ జీవనం దుర్భరంగా మారింది. వీరి బలహీనతను స్థానికంగా ఉన్న మధ్యవర్తి పూర్ణిమ అవకాశంగా తీసుకుంది. కిడ్నీ అమ్మకం ద్వారా సులభంగా డబ్బు సంపాదించ వచ్చని ఆశ చూపింది. ఆ మేరకు గతంలో తాను కూడా ఒక కిడ్నీ అమ్ముకున్నట్లు నమ్మబలికింది. ఆ మేరకు ఇద్దరు మహిళలను కిడ్నీ అమ్మకానికి ప్రేరేపించింది. అప్పటికే అలకనంద ఆస్పత్రి యజమానితో ఆమెకు పరిచయం ఉండటం, ఇదే అంశాన్ని ఆయన దృష్టికి తీసుకురావడంతో వారికి వైద్య పరీక్షలు చేయించారు.
- ఇదే సమయంలో కర్ణాటకకు చెందిన న్యాయవాది రాజశేఖర్, స్టాఫ్‌నర్సు కృపాలత కిడ్నీల పని తీరు దెబ్బతిని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. కిడ్నీ దాతల కోసం ఎదురు చూస్తున్న సమయంలో వారికి మధ్యవర్తి పవన్ పరిచయమయ్యాడు. ఆయన ద్వారా వీరు నగరంలోని అలకనంద ఆస్పత్రికి చేరుకున్నారు.



పూర్ణిమ, పవన్ ఏజెంట్ల ద్వారా నగరానికి రాక

- భర్త లేని పేద మహిళలకు డబ్బు ఆశ చూపిన వైనం
- స్వీకర్తల్లో ఒకరు న్యాయవాది, మరొకరు సివిల్ ఇంజినీర్ భార్య
- గాంధీలో చికిత్స పొందుతున్న దాత, స్వీకర్తలను కలిసిన త్రిసభ్య కమిటీ
- కొత్తపేట అలకనంద ఆస్పత్రి ఎదుట ప్రజాసంఘాల ఆందోళన

అప్పటికే దాతలు, స్వీకర్తల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షించారు. ఇరువురి బ్లడ్ గ్రూప్‌లు మ్యాచ్ అయ్యాయి. సర్జరీకి రూ.55 లక్షల వరకు ఖర్చు అవుతుందని స్పష్టం చేయడం, చెల్లించేందుకు వారు అంగీకరించడంతో గుట్టుగా వారిని నగరానికి తరలించారు. సర్జరీ సమయంలో వైద్యులు తమ ముఖాన్ని ఎవరూ గుర్తించకుండా ఉండేందుకు ముఖానికి మాస్కులు ధరించి జాగ్రత్త పడటం విశేషం. ఇదే బృందం గతంలో విజయవాడ కేంద్రంగానూ పలువురికి కిడ్నీ మార్పిడి చికిత్సలు చేసినట్లు తెలిసింది. సరూర్‌నగర్ పోలీసులు ఆ మేరకు ఓ బృందాన్ని విజయవాడకు పంపినట్లు సమాచారం.



అలకనంద ఆస్పత్రి ఎదుట ప్రజాసంఘాల ఆందోళన

నిందితులను కఠినంగా శిక్షించాలి: ఐఎంఏ

సుల్తాన్‌బజార్: అమాయకుల కిడ్నీలను మార్పిడీ చేసే ముఠాలను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథ రెడ్డి, కార్యదర్శి వి.అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం కోఠిలోని ఐఎంఏ రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు కూడా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మొదటికే మోక్షం లేదు!

సీఆర్ఎంపీ మార్గాల్లో పూడిక కూడా తీస్తారట!!

- ఇప్పటికి గ్రీనరీ, స్వీపింగ్‌లకే దిక్కూ దివాణంలేదు
- గడువు ముగిసినవాటి నిర్వహణకు ఆర్నెల్లకు టెండర్లు

సాక్షి, సిటీబ్యూరో: 'చెప్పేవారికి వినేవారు లోకువ' అనే నానుడి కొన్ని సందర్భాల్లో నిజమేననిపిస్తుంది. ఈ అంశం అందుకు ఉదాహరణగా నిలుస్తోంది. ప్రధాన రహదారుల మార్గాల్లో సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం (సీఆర్ఎంపీ) కాంట్రాక్టు ఏజెన్సీల గడువు ముగిసిపోవడంతో తదుపరి చర్యల కోసం జీహెచ్ఎంసీ రోజుకో ఆలోచన చేస్తోంది. రోడ్లన్నీ బాగున్నందున ఇప్పటికిప్పుడు సీఆర్ఎంపీ అవసరం లేదని తొలుత భావించారు. జీహెచ్ఎంసీయే సాధారణ నిర్వహణ, గుంతల పూడ్చివేతల వంటి పనులు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఒక వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఆర్ఎంపీ కింద చేపట్టిన పనులన్నీ పూర్తి కానిదే బిల్లులు చెల్లించవద్దని, అన్ని పనులూ పూర్తయిందీ లేనిదీ నివేదిక పంపాలని ఆదేశించినా పూర్తి చేయని పనులను పట్టించుకోలేదు. ఒప్పందం మేరకు ఫుట్‌పాత్‌లు, స్వీపింగ్, గ్రీనరీ తదితర పనులన్నీ చేయాల్సి ఉన్నా అవి పూర్తి కాలేదు. రీకార్పెటింగ్ తప్ప మిగతా పనులు నూరు శాతం పూర్తయిన దాఖలాల్లేవు. నిర్ణీత వ్యవధిలో పనులు చేయనందుకు ఏమేర పెనాల్టీలు విధించారో తెలియదు. గడువు ముగియ వస్తుండగా మార్కింగ్‌లు వంటివి చేపట్టారు. పూర్తి చేయని పనులేవో వెల్లడించి, పూర్తి చేయించాల్సి ఉండగా, వాటిని పట్టించుకోకుండా ఆర్నెల్ల నిర్వహణకు అని కొత్త టెండర్లు పిలిచారు.

రెండు ప్రతిపాదనలు..

తాజాగా స్టాండింగ్ కమిటీ ఆమోదం కోసమంటూ మరో అయిదేళ్ల సీఆర్ఎంపీ రెండో దశకు అంటూ రెండు రకాల ప్రతిపాదనలు ఉంచారు. అందులో ఒకటి దాదాపుగా పాత రోడ్లనే తిరిగి మళ్లీ నిర్వహణకు ఇవ్వడం. రెండోది వాటితో పాటు కొత్త రోడ్లను అదనంగా చేర్చడం. పాత రోడ్లకే అయితే 744 కి.మీ. నిర్వహణకు అంచనా వ్యయం రూ.2491 కోట్లు కాగా, కొత్త రోడ్లు కూడా కలిపి 1142 కి.మీ. నిర్వహణకు రూ.అంచనా వ్యయం రూ.3825 కోట్లు.

డీసిల్టింగ్ కూడా..

మొదటి దశలో స్వీపింగ్, ఫుట్‌పాత్‌లు, గ్రీనరీ పనులే చేయకపోగా రెండో దశ కింద అవసరమైన ప్రాంతాల్లో వరద కాల్వల నిర్మాణం, ఆధునికీకరణ పనులతో పాటు వాటి నిర్వహణ కూడా చేస్తాయని పేర్కొన్నారు. అంతేకాదు.. ఇప్పటికే ఉన్న వరద కాల్వల నిర్వహణతో పాటు పూడికతీత పనులు కూడా చేస్తాయన్నారు. ప్రత్యేంగా పూడికతీత టెండర్లు పొందిన ఏజెన్సీలే ఆ పనులు సవ్యంగా చేయడం లేదు. గడచిన అయిదేళ్లుగా సీఆర్ఎంపీ ఏజెన్సీలు స్వీపింగ్, ఫుట్‌పాత్‌ల పనులే చేయకపోగా కొత్తగా ఎంపికయ్యే ఏజెన్సీలు డీసిల్టింగ్ కూడా చేస్తాయనడం కేవలం అంచనా వ్యయం పెంచేందుకే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రతిపాదనల్లో ఏదో ఒకటి ఖరారు చేసి అవసరమైన నిధులకు పరిపాలన అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదించాల్సిందిగా గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ ముందుంచనున్నారు.



అనైతిక వైద్యం!



అల్లోపతి డాక్టర్లుగా చలామణి అవుతున్న ఆయుర్వేద వైద్యులు

- అనుమతులు లేకుండా అడ్డగోలుగా క్లినిక్‌ల ఏర్పాటు
- యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు
- మీర్‌పేట్, బడంగ్‌పేట్, తుర్కయాంజాల్, తుక్కుగూడ కేంద్రంగా దందా
- అలకనంద ఆస్పత్రి ఉదంతంతో జిల్లా వైద్యశాఖ అప్రమత్తం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, రోగనిర్ధారణ కేంద్రాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. గుట్టుగా లింగనిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు కనీస అనుభవం, అర్హత లేని వారితో చికిత్సలు చేయిస్తున్నాయి. ఆయుర్వేద వైద్యులు అల్లోపతి వైద్యులుగా చలామణి అవుతూ రోగులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. వనస్థలిపురం, హస్తినాపురం, తుర్కయాంజాల్, మీర్‌పేట్, బాలాపూర్, తుక్కుగూడ, శంషాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల, ఆమనగల్లు కేంద్రంగా యథేచ్ఛగా ఈ దందా కొనసాగిస్తున్నాయి. ఇందుకోసం మార్కెటింగ్ ఏజెంట్లను నియమించుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఆర్‌ఎంపీలకు కమీషన్లు ఆశ చూపి అనైతిక వైద్యానికి పాల్పడుతున్నాయి. 2024 జులైలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి తొమ్మిది పడకల(జనరల్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ విభాగాలు) ఆస్పత్రి కోసం అనుమతి పొందిన కొత్తపేట అలకనంద మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం ఏకంగా కిడ్నీ మార్పిడి చికిత్సలు చేయడం వివాదాస్పదమైంది.

మాస్క్‌లు ధరించి, చికిత్సలు..

జిల్లాలో స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, జనరల్ నర్సింగ్ హోంలు, సాధారణ క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్స్ కలిపి సుమారు 2,300 వరకు ఉన్నట్లు అంచనా. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి గుర్తింపు పొందినట్లు చెప్పుకొంటున్న మెజార్టీ ఆస్పత్రులకు ఫైర్ సేఫ్టీ లేదు. ఒకరి పేరుతో అనుమతి పొంది.. మరొకరితో చికిత్సలు చేయిస్తున్నారు. బోర్డుపై పేర్లు కనిపించే వైద్యులెవరూ ఇక్కడ అందుబాటులో ఉండటం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా ఆస్పత్రికి వస్తే కాంపౌండర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులే సీనియర్ వైద్యులుగా చలామణి అవుతున్నారు. రోగులు, వారి బంధువులు గుర్తించకుండా ముఖానికి మాస్క్‌లు ధరించి, సీనియర్ వైద్యుల ప్రిస్క్రిప్షన్ లెటర్లపై టెస్టులు, మందులు, ఇంజక్షన్లు రాస్తున్నారు. వనస్థలిపురం కాంప్లెక్స్ కేంద్రంగా పని చేస్తున్న ఓ ఆస్పత్రి ఏకంగా డిఫార్మసీ పూర్తి చేసిన ఇద్దరు వ్యక్తులతో పని చేస్తుండటం గమనార్హం. తుక్కుగూడ కేంద్రంగా పని చేస్తున్న ఓ డయాగ్నోస్టిక్ కేంద్రం ఏకంగా కడుపులో ఉన్నది ఆడ బిడ్డా.. మగ శిశువా చెప్పేస్తోంది. ఆర్‌ఎంపీలు, ఆశ వర్కర్లకు డబ్బుల ఆశ చూపి, పెద్ద మొత్తంలో దోచుకోవడంతో పాటు చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారు.

తనిఖీల పేరుతో వసూళ్లు..

పారదర్శకంగా పని చేయాల్సిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఆస్పత్రి గుర్తింపు కోసం రూ.లక్ష కుపైగా, అదే రెన్యూవల్ కోసం రూ.50 వేలకుపైగా వసూలు చేస్తున్నారు. అడిగినంత ఇస్తే సరి ఫైర్ సేఫ్టీ, భవన నిర్మాణ అనుమతి, డాక్టర్ సర్టిఫికెట్లతో పని లేకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు. నిరాకరించిన వాళ్లకు చుక్కలు చూపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తరచూ సర్జరీలు వికటిస్తున్నా.. అనేక రోగులు మృత్యువాతపడుతున్నా.. పట్టించుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు జిల్లాలోని పలు క్లినిక్‌లలో తనిఖీలు చేశారు. అర్హత లేని వైద్యులను గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఆయా ఆస్పత్రులను సీజ్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా కొత్తపేట అలకనంద ఆస్పత్రి ఘటనతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



బాలుడి మృతదేహం



కోనేరు వద్ద బాలుడి దుస్తులు

జగద్గిరిగుట్ట: కోనేరులో ఈతకు వెళ్లి గుర్తు తెలియని బాలుడు మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహాదేవపురం గుట్టపై ఉన్న శివాలయం కోనేరులో ఓ బాలుడు పడినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి గాలింపు చేపట్టారు. బుధవారం కోనేరులో నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికి తీశారు.

మిగతా ఇద్దరు ఎవరు?ఎక్కడ?

పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా సదరు బాలుడితో పాటు మరో ఇద్దరు బాలలు కోనేరు వరకు వచ్చినట్లు గుర్తించారు. అనంతరం ముగ్గురూ ఈత కొట్టేందుకు కొలనులోకి దిగారని, ఈ తర్వాత ఓబాలుడు మునిగిపోతుండగా మిగతా ఇద్దరూ కేకలు వేశారని, స్థానికులు అక్కడికి చేరుకునేలోగా వారు ఇద్దరూ అక్కడినుంచి పారిపోయినట్లు ఆలయంలో పనిచేసే సబిత అనే మహిళ తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డును మింగేశారు..

- కదులుతున్న ఆక్రమణల డొంక..
- మేయర్ పర్యటనతో మరిన్ని కబ్జాలు వెలుగులోకి
- అధికారుల పాత్రపై అనుమానాలు..



జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వెనుక కబ్జాకు గురైన ప్రాంతం...

బంజారాహిల్స్: ఇంటి ముందు ఖాళీ స్థలం కనిపిస్తే కాస్తా ముందుకు జరగడం పరిపాటి. అయితే తమ ఇళ్ల ముందు ఉన్న రోడ్డునే దిగమింగేసి ఎన్నో ఏళ్లుగా ఏమీ జరగనట్లు నటిస్తున్న వైనం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం కృషి చేయాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు తమ కళ్ల ముందే ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36 పోలీస్ స్టేషన్ వెనుక రెండు రోజుల క్రితం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ స్వయంగా వెళ్లి సుమారు 1300 గజాల జీహెచ్‌ఎంసీ స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ చేపట్టాలని మేయర్ ఆదేశాలతో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. జూబ్లీహిల్స్ సొసైటీకి చెందిన లేఅవుట్‌లో రోడ్డునెంబర్-19 నుంచి 21 వైపు ఎల్ ఆకారంలో సుమారు 40 అడుగుల వెడల్పుతో సుమారు 550 అడుగుల పొడవు గల లింక్ రోడ్డు ఉన్నట్లు స్పష్టంగా మ్యాపుల్లో కనిపిస్తుంది. దీనిలో కొంత భాగం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వెనుక ఖాళీగా ఉంది. సదరు ఖాళీ స్థలంలో పోలీస్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీంతో పాటు ప్లాట్‌నెంబర్ 457, 456, 455, 454,, 453 ప్లాట్ల వెనుక నుంచి రూట్స్ కాలేజ్ పక్క వరకూ లింక్ రోడ్డు ఉండేది. కాగా ప్లాట్ నెంబర్ 457 వెనుక ఉన్న సుమారు 1250 గజాల స్థలాన్ని సదరు ఇంటి యజమాని దర్జాగా ఆక్రమించుకుని భారీ ప్రహరీ నిర్మించాడు. తన ఇంటికి చెందిన ప్రహరీ నుంచి రోడ్డు స్థలాన్ని మొత్తం కూరగాయల తోటగా మార్చేశారు. ఇది బయట నుంచి పార్కు స్థలంగా కనిపించేలా కొన్నాళ్ల పాటు జీహెచ్‌ఎంసీ బోర్డు సైతం పెట్టాడు. ఎవరికీ అనుమానం రాకుండా రెండేళ్లుగా ఈ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు ఏకంగా కూరగాయల తోటనే ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ స్థలం పక్క నుంచి ఉన్న రోడ్డు స్థలాన్ని సైతం మరి కొందరు భవన నిర్మాణ దారులు దర్జాగా ఆక్రమించుకున్నట్లు తాజాగా వెల్లడైంది. ప్లాట్ నెంబర్ 471, 472, 473, 474లతో పాటు 453 ప్లాట్ల యజమానులు సుమారు 1500 గజాల రోడ్డు స్థలాన్ని కబ్జా చేసినట్లు అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో ఈ స్థలం విలువ సుమారు రూ.60 కోట్లు పైగానే ఉంటుందని తెలుస్తోంది. మేయర్ పర్యటన అనంతరం ప్లాట్‌నెంబర్ 457 వెనుక కబ్జాకు గురైన 1250 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రహరీలను కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు మిగిలిన 1500 గజాల స్థలాన్ని కూడా ఆక్రమణల భారీ నుంచి కాపాడేందుకు చర్యలు చేపట్టారు.

అధికారుల తీరుపై అనుమానాలు..?

ఇదిలా ఉండగా నగర మేయర్ వచ్చి చూసే దాకా ఇంత ఖరీదైన స్థలాలు ఆక్రమణకు గురవుతుంటే స్థానిక టౌన్ ప్లానింగ్, యూబీడీ, జీహెచ్‌ఎంసీ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పేదలు బతుకుదెరువు కోసం రోడ్డు పక్కన చిన్న డబ్బా పెట్టుకున్నా గద్దల్లా వాలిపోయే టౌన్‌ప్లానింగ్, హైడ్రా సిబ్బంది నగరలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఏకంగా రూ.100 కోట్ల విలువైన రోడ్డు స్థలాన్ని బడాబాబులు దర్జాగా ఆక్రమించుకుంటే ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఈ ఆక్రమణలపై సొసైటీ పెద్దలు సైతం జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసినా స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్థలాన్ని ఇప్పటికైనా కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌కు సర్వం సిద్ధం

- 24 నుంచి 26 వరకు..
- హాజరు కానున్న జాతీయ స్థాయి సాహితీవేత్తలు..
- సాహిత్యం, సంస్కృతి పై వర్క్ షాప్స్





రాజ్‌దీప్ సర్దేశాయ్, సునీతా రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ వేదికగా ఈ నెల 24 నుంచి 26 వరకు జరగనున్న ప్రతిష్టాత్మక 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్'కు సర్వం సిద్ధమైంది. నగరంలోని టీ–హాబ్ (సత్వ నాలెడ్జ్ సిటీ)లో నిర్వహిస్తున్న ఈ సాహితీ పండుగకు భారత్‌తో పాటు విదేశాల నుంచి సాహితీ ప్రియులు, విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ ఫెస్టివల్‌లో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్లీనరీలు ఉంటాయని., మొదటి రోజు ప్లీనరీలో భాగంగా ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో ఆయన రాసిన 2024: 'ది ఎలక్షన్ దట్ సర్‌ప్రైజ్ ఇండియా' పుస్తకంపై సాహితీ ప్రముఖులు సునీతా రెడ్డి చర్చించనున్నారు. ఈ 15వ ఎడిషన్ ఫెస్టివల్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణపై చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు, అంతరించిపోతున్న భారతీయ భాషలపై ప్రత్యేక సదస్సులు, కవిత్వానికి సంబంధించి ప్రత్యేకంగా కావ్యధార కార్యక్రమం ఉంటాయన్నారు. మీట్ మై బుక్ పేరుతో పుస్తక ఆవిష్కరణలు, మూవింగ్ ఇమేజెస్ టాకీస్ సినిమా ప్రదర్శనలు, సైన్స్ అండ్ సిటీ సెషన్స్, స్టేజ్ టాక్‌లు, స్టోరీ టెల్లింగ్, వర్క్‌షాప్స్, యంగిస్తాన్ యూత్ ఈవెంట్స్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సారి ఫెస్టివల్ ఆతిథ్య దేశంగా లూథియానా, దృష్టి సారించిన భాషగా సింధీ భాషను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మూడు రోజుల కార్యక్రమాల్లో విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులు షబానా అజ్మీ, అరుణా రాయ్, నందితా భవానీ,రీతా కొఠారీ,సునీతా కృష్ణన్, హుమా ఖురేషి, సినీనటుడు సిద్దార్థ్, దర్శకులు విద్యా రావ్, సాహిత్య ప్రముఖులు రాజ్ మోహన్ గాంధీ, కల్పన కన్నబిరాన్ తదితరులు పాల్గొననున్నారు.

తిరుమలగిరిలో జస్ట్ మిస్!

- దుండగులు నగదు 'మార్చుకుంది' అక్కడే
- ఓ ఎస్సై ఇంటి సమీపంలోనే ట్రాలీ నుంచి బ్యాగులోకి
- రొటీన్‌కు భిన్నంగా వాహనం రివర్స్‌తో వారు సేఫ్
- అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసు దర్యాప్తులో వెలుగులోకి

సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకతో పాటు నగరంలో తుపాకీతో కాల్పులకు తెగబడిన దుండగులు పారిపోతూ తిరుమలగిరిలో ఆగినప్పుడు పోలీసుల నుంచి తృటిలో తప్పించుకున్నారు. అక్కడ ఓ ఎస్సై ఇంటి సమీపంలోనే వారు నగదును ట్రాలీ బ్యాగుల నుంచి పెద్ద బ్యాగుల్లోకి మార్చుకున్నారు. ఆ సమయంలో సదరు ఎస్సై సైతం తుపాకీ కోసం తన ఇంటికి వెళ్లాడు. అయితే రొటీన్ భిన్నంగా ఆయన వాహనం రివర్స్ చేసుకోవడంతో నిందితులు వారి కంట పడలేదు.విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.

బ్యాగ్ టు బ్యాగ్ వయా ట్రాలీ...

బీదర్‌లో దోచుకున్న డబ్బును ఓ బ్యాగ్‌లో వేసుకున్న దుండగులు నగరానికి చేరుకున్నారు. మదీనా వద్ద ట్రాలీ బ్యాగులు కొనుగోలు చేసిన వారు తొలుత నగదును వాటిలోకి మార్చారు. అఫ్జల్‌గంజ్‌లో ఫైరింగ్ తర్వాత వారు ట్రాలీలతో ఆటోలో సికింద్రాబాద్ చేరుకున్నారు. అక్కడ మరో రెండు బ్యాగ్‌లు, నూతన వస్త్రాలు ఖరీదు చేశారు. తొలుత గజ్వేల్ వెళ్లాలని భావించిన ఇరువురూ ఆల్ఫా హోటల్ నుంచి ఆటోను అక్కడికే మాట్లాడుకున్నారు. అయితే మార్గమధ్యంలో డ్రైవర్ వ్యవహారశైలిపై వారికి అనుమానం రావడంతో తిరుమలగిరిలో దిగిపోయారు. ప్రధాన రహదారి నుంచి కొంత లోపలికి వెళ్లిన తర్వాత వీరు ఓ రహదారి డెడ్ ఎండ్ వద్ద ఆగారు. అక్కడ చీకటిగా ఉండటంతో ట్రాలీ బ్యాగుల్లో ఉన్న నగదును సికింద్రాబాద్‌లో కొన్న బ్యాగుల్లోకి మార్చుకున్నారు.

అదే సమయంలో ఎస్సై వచ్చినా...

దుండగులు నగదు మారుస్తున్న ప్రాంతానికి సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో నగరానికి చెందని ఓ ఎస్సై నివాసం ఉంటున్నారు. అఫ్జల్‌గంజ్ ఫైరింగ్ ఉదంతం తర్వాత నగర పోలీసు విభాగం ఒక్కసారిగా అప్రమత్తమైంది. దుండగుల వద్ద తుపాకులు కూడా ఉన్నట్లు తేలడంతో ప్రత్యేక విభాగాల అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాకులు ఉన్న వారంతా వాటిని తక్షణం దగ్గర పెట్టుకోవాలని స్పష్టం చేశారు. కొన్నాళ్లుగా అమలవుతున్న విధానాల నేపథ్యంలో ప్రత్యేక విభాగాల్లో పని చేస్తున్న ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు తమ తుపాకులను ఇళ్ల వద్దే ఉంచి వస్తున్నారు. ఈ తాజా ఆదేశాల నేపథ్యంలో తన తుపాకీ తెచ్చుకోవడానికి సదరు ఎస్సై అధికారిక వాహనంలో ఇంటికి వెళ్లారు. వీలైనంత త్వరగా తిరిగి తన కార్యాలయానికి చేరుకుని, దర్యాప్తులో నిమగ్నమవ్వాలనే కంగారులో సదరు ఎస్సై ఉన్నారు.

అక్కడికక్కడే వాహనాన్ని తిప్పేయడంతో...

సాధారణంగా సదరు ఎస్సైని తీసుకురావడానికి, దింపడానికి అధికారిక వాహనాన్ని డ్రైవర్ తీసుకువెళ్తుంటారు. ఆయన ఇంటి వద్దకు చేరుకున్న ప్రతిసారీ డ్రైవర్ కాస్తా ముందుకు వెళ్లి రోడ్డు డెడ్ ఎండ్ వద్ద రివర్స్ చేసుకుని మళ్లీ వచ్చిన దారిలోనే తిరిగి వెళ్లేవారు. అఫ్జల్‌గంజ్‌లో ఫైరింగ్ జరిగిన గత గురువారం రాత్రి కూడా ఇలానే చేసి ఉంటే... ట్రాలీల్లో ఉన్న డబ్బును బ్యాగుల్లోకి మారుస్తున్న దుండగులపై ఆ వాహనం లైట్లు పడేవి. దీంతో వారు అక్కడే చిక్కే అవకాశం ఉండేది. అయితే ఆ రోజు ఎస్సై కంగారులో ఉండటంతో తాను లోపలకు వెళ్లి ఆయుధం తెచ్చుకునే లోపే... వాహనం వెనక్కు తిప్పి ఉంచాల్సిందిగా డ్రైవర్‌ను ఆదేశించారు. దీంతో సదరు డ్రైవర్ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న చిన్న సందును ఆధారంగా చేసుకుని, అక్కడే రివర్స్ చేసి సిద్ధంగా ఉంచారు. ఈ కారణంగా ఆ సమీపంలోనే ఉన్న దుండగులపై వీరి దృష్టి పడలేదు.

వాహనాలు మారుస్తూ పరారీ...

నగదు సర్దుకోవడం పూర్తయిన తర్వాత ట్రాలీ బ్యాగుల్ని అక్కడే వదిలేసి కొంత దూరం వెళ్లిన దుండగులు చెట్ల చాటున తమ దుస్తులు సైతం మార్చుకున్నారు. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా బోయిన్‌పల్లి వైపు వచ్చి... అక్కడ ఆటో మాట్లాడుకుని శామీర్‌పేట వెళ్లారు. అక్కడి నుంచి షేరింగ్ ఆటోలో గజ్వేల్‌కు, ఆపై లారీలో ఆదిలాబాద్‌కు చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ నుంచి రాష్ట్ర సరిహద్దులు దాటి మహారాష్ట్ర లేదా మధ్యప్రదేశ్ మీదుగా బీహార్‌కు వెళ్లినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. తమ ఆచూకీ కనిపెట్టడం కష్టసాధ్యం చేయడానికి దుండగులు వాహనాలు మారినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటికే నగరంతో పాటు బీదర్‌కు చెందిన పోలీసులు మహారాష్ట్ర, బీహార్‌లకు చేరుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

డబ్ల్యు.ఆర్.రెడ్డికి ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ గౌరవ హోదా



సాక్షి, సిటీబ్యూరో: ఐఏఎస్ అధికారిగా కేరళ రాష్ట్రంలో పలు హోదాల్లో సేవలు అందించి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్‌ఐఆర్‌డీపీఆర్) డైరెక్టర్ జనరల్‌గా పని చేసిన డాక్టర్.డబ్ల్యు.ఆర్.రెడ్డికి సిల్చార్‌లోని అస్సాం యూనివర్సిటీ 32వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్' గౌరవ హోదా ప్రకటించింది. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజీవ్ మోహన్ పంత్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న విధానాలు, ఆవిష్కరణల ద్వారా కేరళ డెయిరీ పరిశ్రమ అభ్యున్నతికి, ఎన్‌ఐఆర్‌డీపీఆర్ బలోపేతానికి డాక్టర్.డబ్ల్యూ.ఆర్.రెడ్డి చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో తమ విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

సినీ దర్శకుడు అదృశ్యం



ఓం రమేష్ క్రిష్ణ (ఫైల్)

మియాపూర్: ఓ సినీ దర్శకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్ ఫ్రెండ్స్ కాలనీ, ఎస్‌వీహెచ్ ప్లాజాలో ఉంటున్న ఓం రమేష్ క్రిష్ణ(46) సినీ దర్శకుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న ఉదయం బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. భార్య, కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి భార్య శ్రీదేవి మంగళవారం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట్ జిల్లా, చిత్తనూర్ గ్రామానికి చెందిన భాగ్యమ్మ తన కుమారులు మహేందర్, శివకుమార్(22)తో కలిసి నగరానికి వలస వచ్చి చింతల్ శ్రీనివాస్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె చిన్న కుమారుడు శివకుమార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 6న భాగ్యమ్మ పెద్దకుమారుడు మహేందర్‌తో కలిసి సంక్రాంతి పండగ సందర్భంగా సొంతూరుకు వెళ్లింది.21న రాత్రి శివకుమార్ స్నేహితుడు నిఖిల్ మహేందర్‌కు ఫోన్ చేసి శివకుమార్ వంటగదిలో చీరతో వెంటిలేటర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పడంతో నగరానికి తిరిగి వచ్చారు. మృతుని సోదరుడు మహేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాజేంద్రనగర్: ప్రేమ పేరుతో నమ్మించి మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితునికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 8 వేల జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక(15) ఇంటర్ చదువుతుంది. ఇదే ప్రాంతానికి చెందిన పి.రమేశ్ కార్పెంటర్‌గా పని చేసేవాడు. సదరు బాలికను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పిన రమేశ్ 2018 జూన్ 2న విజయవాడ తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి బుధవారం నిందితునికి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు



బంజారాహిల్స్: టీవీఏసీ జేఏసీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు ఖైరతాబాద్‌లోని మింట్ కాంపౌండ్ ప్రాంగణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ చైర్మన్ ధనరాజ్, కన్వీనర్ శంకర్‌నాయక్, మీడియా ఇన్‌చార్జి రాజేశ్వర్, సౌత్ సర్కిల్ చైర్మన్ రాము, కో–చైర్మన్ సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను టీవీఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ ఈశ్వర్‌రావు బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో అరవింద్, శ్రీరామ్, రమేశ్, దేవదాస్, ఎంఆర్‌టీ సౌత్ సందీప్, రమేశ్, లక్ష్మీనారాయణ, మొహిన్, ఇర్ఫాన్, మహేశ్, లక్ష్మప్ప, అశోక్, ప్రవీణ్, శ్రీనివాస్, సాయిబాబా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హుస్సేన్ సాగర్, నారాయణగూడ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆదర్శ్‌నగర్, ఎస్‌బీఐ ఏరియా, బిర్లా మందిర్ టెంపుల్, డిప్లొమా అసోసియేషన్ కార్యాలయం, ఆదర్శ్ నగర్ ఈఎస్‌ఐ హాస్పిటల్ ఏరియా, ఆదర్శ్ కేఫ్, మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్, వాటర్‌వర్క్స్, సరోజిని టవర్స్, సంజయ్ గాంధీనగర్, బిర్లా ప్లానిటోరియం, సిటీ సెంట్రల్ లైబ్రరీ, సుధా హోటల్ ఏరియా, చిక్కడపల్లి కొంతభాగం, వివేక్‌నగర్, మోర్ సూపర్‌మార్కెట్ ఆర్టీసీ ఎక్స్ రోడ్డు, పార్థివాడ ఏరియా, ఎంసీహెచ్ మార్కెట్ ఏరియా, త్యాగరాయ గానసభ ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే జెడీపీ ఆఫీస్, హైదర్‌గూడ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రేణుకా ఎన్‌క్లేవ్, రవీంద్రనగర్ ఏరియా, జెడీపీ ఆఫీస్ ఏరియా లేన్, శ్రీధర్ ఫంక్షన్ హాల్, గాంధీ తాతానగర్ ఏరియా, వేంకటేశ్వర కాలనీ కొంతభాగం, శాంతి నివాస్ అపార్ట్‌మెంట్, హైదర్‌గూడ మెయిన్ రోడ్డు, బహార్ కేఫ్ ఏరియా, కింగ్ కోఠి షేర్‌గేట్, భారతి విద్యా భవన్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

లక్డీకాపూల్: నిమ్స్‌లో ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్సా విభాగంలో ఈనెల 6, 8 తేదీల మధ్య యూఎస్‌ఏ నుంచి వచ్చిన అంతర్జాతీయ విజిటింగ్ ఫ్యాకల్టీ సాయంతో క్రానియోఫేషియల్ చికిత్సలు నిర్వహించారు. ఏడేళ్ల బాలుడికి 6 నెలల వయస్సులోనే న్యూరో సర్జన్ శస్త్ర చికిత్స చేశారు. అసాధారణ ఆకారంలో కళ్లు పెరుగుతూ వస్తున్నాయి. పుర్రె, ముఖ ఎముకలు, నాసికా వాయుమార్గానికి దారితీసే మధ్యభాగం తగినంతగా పెరగకపోవడంతో అతనికి అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియాతో కూడిన సిండ్రోమిక్ క్రానియోసినోస్టోసిస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. నిరంతర సానుకూల వాయుమార్గ పీడనం లేకుండా నిద్రపోలేని పరిస్థితి. దీంతో నిమ్స్ వైద్యులు చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 7న యూఎస్ నుంచి వచ్చిన ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స విభాగానికి చెందిన విజిటింగ్ ఫ్యాకల్టీ డాక్టర్ డేవిడ్ ఎ స్టాఫెన్‌బర్గ్ సహాయంతో విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు.

నియామక పత్రం అందజేత

రహమత్‌నగర్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ రాష్ట్ర దళిత సేనా అధ్యక్షుడిగా ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్‌కు చెందిన దళిత నాయకుడు రాగిని యాదగిరి నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ చైర్మన్ డా.జేబీ రాజు బుధవారం నియామకపత్రం అందజేశారు. తెలంగాణ దళిత సేనా రాష్ట్ర అధ్యక్షుడు గంట మల్లేశ్, ఉపాధ్యక్షుడు బాలయ్య, ఎస్టీ విభాగం అధ్యక్షుడు నందునాయక్, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శులు సి. హనుమంతు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వార్షికోత్సవ వేడుకలు

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడలోని మహాత్మా గాంధీ మెమోరియల్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో కాన్వాస్ క్రియేటివిటీ పేరిట బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. స్కూల్స్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణిస్తే మరింత ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డిప్యూటీ డీఈఓ శ్యామ్యూల్‌రాజ్, స్కూల్ చైర్మన్ ఎం.ఎం.నాయుడు, ప్రిన్సిపాల్ కిరణ్ నాయుడు, కోచ్ ఇమ్రోజ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో త్యాగరాజ ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. పవిత్ర పుణ్యతిథిని పురస్కరించుకుని విద్యార్థులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అలాగే సంప్రదాయ కీర్తనలు, దివ్య నామ సంకీర్తనలను గానం చేసి అబ్బురపరిచారు. 'ఎందరో మహానుభావులు' అంటూ త్యాగరాజకు నివాళి హారతి ఇచ్చారు.

సినిమా లాభాలతో నిరుపేదలకు వైద్యమందిస్తాం

పంజగుట్ట: ఈనెల 24న విడుదల కానున్న 'డియర్ కృష్ణ' సినిమా ద్వారా వచ్చిన లాభాలతో క్రొనిక్ కంస్ట్రక్టీవ్ పెరికార్డిటిస్‌తో బాధపడుతున్న 20 ఏళ్ల లోపు వారికి ఉచితంగా శస్త్రచికిత్స చేయిస్తామని సినిమా నిర్మాత పీఎన్.బలరాం అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత కుమారుడు, సినిమా హీరో అక్షయ్ కృష్ణ, నటుడు లోహిత్, రవికిశోర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నందు గిడుతూరితో కలిసి మాట్లాడారు. దైవం, భక్తుడు, తండ్రి, కుమారుడి మధ్య జరిగిన యదార్థ ఘటన ఆధారంగా సినిమా తీసినట్లు ఆయన తెలిపారు.

ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగం పేరిట మోసం

బంజారాహిల్స్: ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగం పేరిట ఒకరిని మోసగించిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హకీంపేట్‌కు చెందిన వాచ్‌మెన్ రాజ్‌కుమార్ థాపా నంబర్‌కు గతేడాది అక్టోబర్ 26న వాట్సప్ మెసెజ్ వచ్చింది. డబ్బు సంపాదించాలంటే టెలీగ్రాం లింక్‌లో జాయిన్ కావాలని కోరగా వెంటనే రాజ్‌కుమార్ థాపా లింక్ ఓపెన్ చేసి కార్తీక పేరుతో ఉన్న టెలీగ్రాం లింక్‌లో జాయిన్ అయ్యాడు. ఆ వెంటనే వారి సూచన మేరకు ఓ సైట్‌లో రిజిస్టర్ చేసుకున్నాడు. వెంటనే కార్తీక టెలీగ్రాం కాంటాక్ట్ రాజ్‌కుమార్‌ను డీఎల్ఎఫ్ టెలీగ్రాం చానల్‌లో యాడ్ చేసింది. డీఎల్ఎఫ్ టెలీగ్రాం చానల్‌లో ఇతర సభ్యులు తాము డబ్బు సంపాదించినట్లుగా స్క్రీన్‌షాట్స్ పోస్ట్ చేశారు. గమనించిన రాజ్‌కుమార్ రూ.10 వేలు జీపే చేస్తే డబుల్ డబ్బులు వస్తాయని చెప్పగా పంపించాడు. తర్వాత వారు రూ.14,906లు పంపించారు. తర్వాత రూ.28,655లు చెల్లిస్తే రూ.45,000 వస్తాయని చెప్పగా ఆ మొత్తాన్ని కూడా రాజ్‌కుమార్ ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం డబ్బులు రాకపోవడంతో అడగగా మరోసారి రూ. 51,593లు డిపాజిట్ చేస్తే 1,45,000 పొందవచ్చని నమ్మబలికారు. దీంతో రాజ్‌కుమార్ మళ్లీ పంపించాడు. తర్వాత డబ్బులు పంపకపోవడంతో మరోసారి వారిని ప్రశ్నించగా ఈసారి రూ.2,52,514లు డిపాజిట్ చేస్తే రూ.4,50,000లు వస్తాయని చెప్పడంతో తాను మోసపోయాయని గ్రహించి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం చేస్తూ పట్టుబడిన వృద్ధురాలు

పంజగుట్ట: సేల్స్‌మెన్ దృష్టి మళ్లించి బంగారం దుకాణంలో దొంగతనానికి యత్నించిన వృద్ధురాలిని షాపు నిర్వాహకులు పట్టుకుని పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంటకు చెందిన వై.లక్ష్మి (60) భర్త చనిపోగా, కుమారుడు మహారాష్ట్రలో ఉంటున్నాడు. ఇక్కడే ఉంటున్న వృద్ధురాలు కల్లుకు బానిస కావడంతో పాటు దొంగతనాలకు అలవాటు పడింది. ఈనెల 20న మధ్యాహ్నం 1: 30 కి పంజగుట్టలోని లలితా జువెల్లర్స్ నగల దుకాణానికి వచ్చింది. చెవి పోగులు కావాలని కోరింది. దీంతో సేల్స్‌మెన్ చూపిస్తుండగా ఆయన దృష్టి మళ్లించి రెండు జతల బంగారు చెవిపోగులు హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకుంది. వీటి విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. తర్వాత చెవిపోగులు నచ్చలేదని చెప్పి బయటకు వెళ్తుండగా సెక్యూరిటీ డోర్ వద్ద ఓ ఉద్యోగికి అనుమానం వచ్చి హ్యాండ్‌బ్యాగ్ చెక్ చేయాలని కోరగా తడబడింది. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది బ్యాగ్‌ను పరిశీలించగా రెండు జతల బంగారు చెవి పోగులు బయటపడ్డాయి. వెంటనే షాపు మేనేజర్ మొగలి ప్రసాద్ పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. గత నెలలో పంజగుట్టలోనే ఓ నగల దుకాణంలో చైన్ దొంగతనం, మహంకాళి పోలీస్‌స్టేషన్, మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిల్లో కూడా దొంగతనాలు చేసినట్లు ఒప్పుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు.

టార్గెట్ 100 శాతం!

- ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- 45 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలుకు సన్నద్ధం
- ఇప్పటికే ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసులు
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో హాజరుకానున్న 3,500 మంది ప్రభుత్వ స్టూడెంట్స్



బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులయ్యేలా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించింది. ఇందు కోసం 45 రోజుల ప్రత్యేక కార్యాచరణను అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలుచేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో 2 గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలోని 17 ప్రభుత్వోన్నత, 2 రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలల నుంచి 3,500 మంది విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 2 గంటల పాటు టీచర్లు విద్యాశాఖ అధికారులు అందజేసిన టైంటేబుల్ ప్రకారం రోజుకొక పాఠాన్ని బోధిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన సమ్మిటివ్–1 పరీక్షా ఫలితాల్లోనూ ఆయా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. వాటి ఆధారంగా చదువులో వెనుకబడిన విద్యార్థుల వివరాలు సేకరించి వారిపై ప్రత్యే దృష్టిపెట్టారు. ఈనెల రెండో వారం నుంచి ప్రత్యేక బోధన చేసి రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దనున్నారు.



హైదర్‌గూడ ప్రభుత్వోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

టీచర్ల ప్రత్యేక చొరవ..

విద్యలో వెనుకబడిన కోసం విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రతిరోజూ ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. వారికి పాఠ్యాంశాలు బోధించి ఏ మేరకు నేర్చుకున్నారో తెలుసుకునేందుకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. అంతేగాకుండా ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులంతా చదువులో మెరుగయ్యేలా బాధ్యతను తీసుకుంటున్నారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. దీనికోసం రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్నారు.

ప్రత్యేక తరగతులతో ఎంతో మేలు..



స్కూల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.సబ్జెక్టుల్లో ఏదైనా సందేహం ఉంటే ఉపాధ్యాయులు వెంటనే నివృత్తి చేస్తున్నారు. వార్షిక పరీక్షల్లో మంచిగా మార్కులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు.
–బాలవెంకటప్రసాద్, విద్యార్థి

సందేహాలు నివృత్తి చేస్తున్నారు..



చదువులో వెనుకబడిన విద్యార్థులపై టీచర్లు ప్రత్యేక పెట్టారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుపై పూర్తిస్థాయి పట్టు సాధించేలా కృషి చేస్తున్నారు. ప్రశ్నలు ఎలా ఉంటాయి..? జవాబులు ఎలా రాయాలి..? ఇందుకోసం ఎలా సన్నద్ధం కావాలని వివరిస్తున్నారు. మంచి మార్కులు సాధిస్తానన్న నమ్మకం కలిగింది. –స్వరూప, విద్యార్థిని

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వేదశ్రీ

బంజారాహిల్స్: రోడ్ నంబర్–7లోని బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలిగా వేదశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత వారం డాక్టర్ లేని ఆస్పత్రుల వైనాన్ని 'సాక్షి'లో ప్రచురించిన నేపథ్యంలో స్పందించిన జిల్లా వైద్యాశాఖ అధికారి వెంకటి స్పందించి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించారు. బంజారాహిల్స్‌లో ఎంతో కీలకంగా ఉన్న ఈ సెంటర్‌కు నిత్యం 100 మందికి పైగా పేషెంట్లు రావడంతో పాటు బుధ, శని వారాల్లో పెద్ద సంఖ్యలో గర్భిణులు, చంటి పిల్లలు వ్యాక్సినేషన్ కోసం వస్తుంటారు.

అంబేడ్కర్ బాటలో నడవాలి



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ

లిబర్టీ: అంబేడ్కర్ ఆలోచన విధానంలో గౌతమ బుద్ధుడి తాత్విక వెలుగులో పని చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ తెలిపారు. అంబేడ్కర్ ఆలోచన విధానంపై జరుగుతున్న ఇష్ట గోష్ఠిలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా దేశాల రాజ్యాంగాలను అంబేడ్కర్ అధ్యయనం చేసి దేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడ, తవక్కల్‌నగర్‌తో పాటు పలు బస్తీల్లో కొనసాగుతున్న డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను కాంగ్రెస్ సీనియర్ నేత వనం శ్రీనివాసయాదవ్ వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్యామ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీల్లోని సమస్యలను అలాగే, ఎల్లారెడ్డిగూడలో పలుచోట్ల అక్రమ నిర్మాణాల విషయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నేతలు మనోజ్‌యాదవ్, మాజిద్, శరత్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు..



గ్రౌండ్‌లో పనులు పరిశీలిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని బిస్తీవాడ సంజయ్ గాంధీ ప్లే గ్రౌండ్స్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రౌండ్ వివాదాలులను పరిష్కరించి రూ. కోటి వ్యయంతో హాకీ కోర్ట్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, టూల్ రూం, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. నాయకులు ఖలీఫా, అఫ్జల్, సలీం, రాజా, అహ్మద్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అరెస్టు

పంజగుట్ట: మద్యం మత్తులో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ డ్రైవర్‌ను పంజగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సోమవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి కొండాపూర్ వెళ్తున్న 10హెచ్ ఆర్టీసీ (టీజీ 10టీ 1545) బస్సు అమీర్‌పేట దుర్గామాత ఆలయం సమీపానికి చేరుకున్నది. అదే సమయంలో రివర్స్‌లో వచ్చిన ఓ లారీ బస్సును ఢీకొట్టగా బస్సు ముందు విండోషీట్, కుడివైపు అద్దం ధ్వంసమయ్యింది. వెంటనే బస్సు డ్రైవర్ మల్లేశ్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు అక్కడికి చేరుకుని లారీ డ్రైవర్ రవిని అదుపులోకి తీసుకుని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా 120ఎంజీ/100ఎంఎల్ వచ్చింది. దీంతో రవిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా ఆటోడ్రైవర్ అరెస్ట్

వెంగళరావునగర్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న మహిళా ఆటోడ్రైవర్‌ను మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన వి.కమల కొంతకాలంగా స్థానిక జవహర్‌నగర్‌లో ఉంటూ ఆటో నడిపిస్తోంది. దీంతో పాటు మద్యాన్ని కూడా విక్రయిస్తుంది. ఈ విషయమై కొందరు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు నిఘా పెట్టి ఈనెల 21న రాత్రి మద్యం విక్రయిస్తుండగా ఆమెను పట్టుకుని 34 (90ఎంఎల్) సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై దాడి

యువతిని చంపుతామని బెదిరించిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన అనామిక ఘోష్ మధురానగర్ మెట్రో స్టేషన్ వద్ద ఆగ్రా స్వీట్స్ వ్యాపారం చేస్తోంది. ఈనెల 21న ఆమె షాపు తీస్తుండగా నలుగురు వ్యక్తులు వచ్చి అడ్డుకున్నారు. ఆమె వర్కర్లు వచ్చి అడిగినప్పటికీ వారిని సైతం పక్కకు నెట్టి షాపును తెరవనీయలేదు. అంతేగాకుండా షాపు తెరిస్తే చంపుతామని డబ్బులు ఇవ్వాలని కూడా బెదిరించారు. అయినా షాపును బలవంతంగా తెరవగా వస్తువులను విసిరేశారు. దీంతో ఆమె వారిని ప్రశ్నించగా తాము హరీష్ సేఠీ పంపితే వచ్చామని, షాపును ఓపెన్ చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. అంతేగాకుండా ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను మోసం చేసిన భర్తపై కేసు

వెంగళరావునగర్ : భార్యను మోసం చేసి నగదు, నగలు తీసుకెళ్లి మరొకరితో కాపురం చేస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన ఎం.స్వప్న, శివశంకర్‌రెడ్డి దంపతులు స్థానిక ఎల్లారెడ్డిగూడలో నివసిస్తున్నారు. ఆమె ఆర్టిస్ట్‌గా పని చేస్తుండగా అతను ఖాళీగా ఉంటున్నాడు. ఈనెల 13న సంక్రాంతి పండుగకు ఇద్దరు వరంగల్‌కు వెళ్లారు. అక్కడ రూ 18 లక్షల నగదు విషయమై భర్తను నిలదీసింది. దాంతో ఆగ్రహించిన శివశంకర్‌రెడ్డి 16న నగరానికి వచ్చాడు. ఆమె 17న బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకోగా రెండు లోన్లు ఆమెకు తెలియకుండా తీసుకున్నట్లుగా తెలిసింది. దీంతో భర్తకు ఫోన్ చేసి అడిగింది. అనంతరం ఇంటికి వచ్చేసరికి భర్త కనిపించలేదు. గతంలో కూడా దాదాపు రూ. 1 విలువైన బంగారం, నగదు తీసుకెళ్లాడు. ఈ విషయమై ప్రశ్నించగా సమాధానం ఇవ్వలేదు. కొన్ని రోజులకు ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీంతో ఆమె విచారించగా తమ ఇంటికి సమీపంలో నివసిస్తున్న భాను అనే మహిళతో 2021 నుంచి కలిసి ఉంటున్నాడని తెలుసుకుంది. తన భర్త నగలు, నగదు తీసుకుని వేరే మహిళతో కలిసి ఉంటూ తనకు అన్యాయం చేస్తున్నాడంటూ ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టాగ్రాం పేరిట మోసం

వెంగళరావునగర్ : ఇన్‌స్టాగ్రాంలో జాయిన్ అయితే డబ్బులు వస్తాయంటూ నమ్మించి మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీలో నివసించే పి.శ్రీనివాసరావు ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. గతనెల 27న ఇన్‌స్టాగ్రాం చూస్తుండగా టెలీగ్రాం కనిపించింది. అందులో జాయిన్ కావాలని మెసేజ్ రాగా చేరాడు. చిన్న టాస్క్ సమాధానం చెబితే డబ్బులు పంపుతామన్నారు. అదేవిధంగా వాటికి జవాబు ఇవ్వగానే రూ.250 అతని అకౌంట్‌కు పంపారు. రూ.2 వేలు పంపితే రూ.2500 తిరిగి ఇస్తామని చెప్పారు. రెండోసారి కూడా వాటిని అందుకున్నాడు. అనంతరం 32,800 పంపాలని ఆన్‌లైన్‌లో అడిగారు. అతను ఆ నగదును పంపగా తిరిగి రాలేదు. దాంతో బాధితుడు తాను మోసపోయానని గ్రహించి సైబరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చిన అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఫరాజుద్దీన్

శ్రీనగర్‌కాలనీ: షేక్‌పేట డివిజన్‌లోని హరిజనబస్తీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఫరాజుద్దీన్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ డి.సత్యనారాయణ, మోహన్‌రావు, బాలరాజ్, ముఖేష్, చంద్రకుమార్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

'భరతమాత మహా హారతి'కి రండి



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానిస్తున్న చింతల రామచంద్రారెడ్డి తదితరులు

బంజారాహిల్స్: భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 26న నెక్లెస్‌రోడ్డులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో 'భరతమాత మహా హారతి' నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేతలు రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బుధవారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, భారతమాత ఫౌండేషన్ సభ్యులు, నేతలు ఉన్నారు.

నేడు శ్రీరాముడి ఆలయానికి ధనుర్బాణాలు



అయోధ్య రామ మందిరానికి తీసుకెళ్లే ధనుర్బాణాలు

ఫిలింనగర్: అయోధ్య రామమందిరంలో భారీ ఎత్తున ప్రతిష్ఠించనున్న శ్రీరామచంద్రుడి విగ్రహానికి సంబంధించి చేతిలో ఉండాల్సిన ధనుర్బాణాలు గురువారం ఉదయం 8 గంటలకు జూబ్లీహిల్స్‌లోని శ్రీరాముడి ఆలయానికి రానున్నాయి. దాత చల్లా శ్రీనివాసశాస్త్రి వీటిని అయోధ్య ఆలయానికి అందిస్తున్నారు. 13 కిలోల వెండి, కేజీ బంగారంతో తయారు చేయించారు. ప్రతిష్ఠాపనకు ఇంకా సమయం ఉండడంతో భక్తుల సందర్శనార్థం ప్రముఖ ఆలయాల్లో ప్రదర్శన కోసం తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆలయంలో ఉంచుతారు.

స్వచ్ఛంద సంస్థలకు చేయూతనివ్వాలి

లిబర్టీ: సమాజ హితం, పేదల అభ్యున్నతి కోసం పని చేస్తున్న సంస్థలకు చేయూతనివ్వాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ అరికెపుడి గాంధీని బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. సమాజ ప్రగతి కోసం చేస్తున్న సంస్థలకు ప్రభుత్వాలు అండగా ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ భరోసా ఇచ్చారు.

మొబైల్‌కు లింక్.. ఖాతా ఖాళీ

ఫిలింనగర్: సైబర్ నేరగాళ్లు మొబైల్‌కు పంపిన లింక్ ఓపెన్ చేయగా బ్యాంక్ ఖాతా ఖాళీ అయిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్ మహావీర్ రెసిడెన్సీకి చెందిన ఎంఎన్‌రావు ఫోన్‌కు గతేడాది అక్టోబర్ 10న ఓ లింక్‌తో ఎస్ఎంఎస్ వచ్చింది. దీంతో అతను లింక్‌ను ఓపెన్ చేయగా వెంటనే ఫోన్ హ్యాక్ అయ్యింది. హ్యాకర్ సదరు ఖాతా నుంచి రూ.60 వేలను యూపీఐ గేట్‌వే ఉపయోగించి వేరే మొబైల్ నెంబర్‌కు బదిలీ చేశారు. దీంతో ఎంఎన్‌రావు కుమార్తె లక్ష్మీసుధా అప్రమత్తమై తన తండ్రి ఖాతా నుంచి రూ. లక్ష ఒకసారి, రూ.5 లక్షలు మరోసారి తన ఖాతాకు బదిలీ చేయించుకుంది. హ్యాకర్లు రూ.60 వేలు వేరే యూపీఐకు పంపించారంటూ లక్ష్మీసుధా ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసు నిందితుడికి ముగిసిన పోలీసు కస్టడీ

పంజగుట్ట: ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్యకేసు నిందితుడు కరణం రమేశ్ ఆరు రోజుల కస్టడీ పూర్తి కావడంతో పోలీసులు నిందితుడిని బుధవారం జ్యుడీషియల్ రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 29న ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే విష్ణు రూపాణి, తన స్నేహితుడైన నిందితుడు కరణం రమేశ్ ఇంటికి వెళ్లాడు. మద్యం తాగిన తర్వాత తనఖా పెట్టిన కారు విషయమై ఇద్దరి మధ్య గొడవ కావడంతో రమేశ్ విష్ణును గొంతుకోసి హత్య చేశాడు. అనంతరం విష్ణు బంగారు ఆభరణాలు, నగదు, బైక్, సెల్‌ఫోన్ తీసుకుని పారిపోయాడు. నిందితుడిని పట్టుకున్న పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు కస్టడీకి తీసుకుని విచారించగా దొంగిలించిన బంగారం అమ్మి వ్యక్తిగత ఖర్చులకు వాడుకున్నట్లు అంగీకరించాడు. హత్య చేసిన అనంతరం విజయవాడ, తిరుపతి వెళ్లినట్లు పోలీసులు నిర్ధారించారు. బైక్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్‌లను అందుకున్న జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి శ్రీ టీఎమ్‌టీ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించారు. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల విద్యాప్రగతికి తోడ్పడతాయన్నారు. మెస్సర్స్ దేవశ్రీ ఇస్పాత్ (ప్రై) లిమిటెడ్ నుంచి శ్రీటిఎంటి సంస్థ 16 మంది సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించింది. శ్రీ టీఎమ్‌టీ మార్కెటింగ్ హెడ్ శ్రీ రాజీవ్ సింగ్ బిష్ట్ మాట్లాడుతూ కమిటీ మొదట 14 మంది విద్యార్థులను ఎంపిక చేయాలని నిర్ణయించినప్పటికీ, విద్యార్థుల అసాధారణ కృషి కారణంగా సంఖ్యను 16కు పెంచాల్సి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ జీ.వి.నరసింహారెడ్డి, విభాగాధిపతి డాక్టర్ బి.డీన్ కుమార్ విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

24న రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు

మన్సూరాబాద్: రాష్ట్ర కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 24న రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మన్సూరాబాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐవోసీడీ స్వర్ణోత్సవాలతోపాటు సంఘం జాతీయ అధ్యక్షుడు జేఎస్ షిండే జన్మదిన వేడుకల సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మన్సూరాబాద్ సహారా స్టేట్స్ కాలనీ కమ్యూనిటీహాల్ వద్ద శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

29 నుంచి భారతీయ సంస్కృతి ఉత్సవ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచంలోనే అతి పెద్దదైన భారతీయ సంస్కృతి ఉత్సవ్–7 ఈ నెల 29 నుంచి ప్రారంభమవుతుందని కొత్తల బసవేశ్వర భారతీయ శిక్షణ సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రం సేడింలోని ప్రకృతినగర్ ఈ ఉత్సవానికి వేదికగా నిలవనుందన్నారు. మొత్తం 9 రోజుల పాటు 9 అంశాలపై 90 మంది ప్రభావవంతమైన నాయకులు మన సంస్కృతీ సంప్రదాయాలపై మాట్లాడుతారని తెలిపారు. 240 ఎకరాల విస్తీర్ణంలో 900 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఉత్సవాలు వచ్చే నెల 6వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

కేబీఆర్ ఫ్లై ఓవర్ల కోసం భూసేకరణ

సాక్షి,సిటీబ్యూరో: కేబీఆర్ పార్కు చుట్టూ నిర్మించనున్న ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల కోసం అధికారులు భూసేకరణలకు నడుంబిగించారు. వివిధ స్ట్రెచ్‌లలో 105 ఆస్తుల సేకరణకు సంబంధించిన ప్రతిపాదనలను జీహెచ్‌ఎంసీ అధికారులు స్టాండింగ్ కమిటీ ముందుంచనున్నారు. ఈ అంశాన్ని గురువారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశ ఎజెండాలో చేర్చారు. దీంతోపాటు గుల్‌మొహర్ పార్క్ జంక్షన్– బీహెచ్‌ఈఎల్ జంక్షన్ వరకు(వయా తారానగర్) రహదారి విస్తరణ పనులకు 227 ఆస్తులను సేకరించాల్సి ఉందని అధికారులు భావిస్తున్నారు. వీటితోపాటు సీఎస్‌ఆర్ కింద కొన్ని పార్కుల నిర్వహణ, హైసిటీలో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టనున్న ప్రాజెక్టుల అంచనా వ్యయం మార్పులు తదితరమైనవి స్టాండింగ్ కమిటీ సమావేశం అజెండాలో పొందుపరిచారు.

25న సైకిల్ మారథాన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ ఏడాది వెయ్యి సైకిళ్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గ్రూప్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 25న నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి సైకిల్ మారథాన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనిని 5 కిలో మీటర్లు, 10 కిలో మీటర్ల కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 5.30 గంటలకు పీపుల్స్‌ప్లాజా వద్దకు చేరుకోవాలని సూచించారు.

ముగిసిన ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్



గచ్చిబౌలి: జేకేఏ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్ ముగిసింది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించారు. 18 ఏళ్ల విభాగం కరాటే కథ, కుమిథ పోటీల్లో భారతదేశానికి చెందిన 36 మంది, ఇతర దేశాలకు చెందిన 48 మంది విజేతలుగా నిలిచారు. 18 ఏళ్ల పురుషుల విభాగంలో రష్యాకు చెందిన టిగరన్ రాష్మడ్డీయాన్, మహిళల విభాగంలో ఎక్టరియాన పాల్చాచుక్ విజేతలుగా నిలిచారు. బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించిన వారికి జేకేఏ హెడ్క్వార్టర్స్ ఇన్‌స్ట్రక్టర్ 8వ డాన్ ఇమురా షిహన్, జేకేఏ తెలంగాణ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్లు సెన్సే రాపోలు సుదర్శన్, సెన్సే దయానంద్ బహుమతులు అందజేశారు.

రోప్.. హోప్!

కీలక రహదారులపై ట్రాఫిక్ జామ్‌లకు చెక్!

నగరంలోని అత్యంత కీలకమైన లక్డీకాపూల్–ఖైరతాబాద్, బంజారాహిల్స్–మాసబ్‌ట్యాంక్ రహదారుల్లో అనునిత్యం ట్రాఫిక్ జామ్‌'జాటమే. రద్దీగా ఉండే ఆ మార్గాల్లో పీక్ అవర్స్‌ల్లోనే కాదు, సాధారణ సమయాల్లోనూ ప్రయాణం ప్రయాసే. ఈ నేపథ్యంలో వీటిని అనుసంధానిస్తూ ప్రత్యామ్నాయ రహదారిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే చింతల్‌బస్తీ మార్గంలో ఆపరేషన్ రోప్(రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్స్)కు శ్రీకారం చుట్టారు.

–సాక్షి, సిటీబ్యూరో/ఖైరతాబాద్

- చింతల్‌బస్తీలో 'ఆపరేషన్ రోప్'నిర్వహణ
- ఆక్రమణల కూల్చివేత చేపట్టిన పోలీసులు
- బంజారాహిల్స్–షాదన్ కాలేజీలకు అనుసంధానం
- అభివృద్ధి చేస్తే అనేక జంక్షన్లకు ఉపశమనం



నగరంలోని మిగిలిన ప్రాంతాల కంటే బంజారాహిల్స్ రోడ్ నెం.1 ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ మరీ ఎక్కువ. ప్రముఖులు, అధికారుల రాకపోకలు, ఆస్పత్రులకు అంబులెన్స్‌ల ప్రయాణాలు అధికం. వీటికి గ్రీన్ చానల్ ఇవ్వడానికి ఒక్కోసారి ట్రాఫిక్‌ను ఆపాల్సి ఉంటుంది. ఈ ప్రభావం అటు మాసబ్‌ట్యాంక్ చౌరస్తా నుంచి ఎన్‌ఎఫ్‌సీ చౌరస్తా వరకు కనిపిస్తోంది. బంజారాహిల్స్ ప్రాంతంలోని మరో రద్దీ రహదారి రోడ్ నెం.12. ఈ మార్గంలో వచ్చే వాహనాలు లక్డీకాపూల్, ఖైరతాబాద్ వైపు వెళ్లాలంటే ఎక్కువగా మాసబ్‌ట్యాంక్, మహావీర్ ఆస్పత్రి, నిరంకారి మీదుగా ప్రయాణించాలి. మెహిదీపట్నం నుంచి లక్డీకాపూల్, ఖైరతాబాద్ వైపు వచ్చే వాహనాలకూ ఇదే మార్గం.

ఇప్పుడు అక్కడ 'చింతల్'ఎన్నో...

మాసబ్‌ట్యాంక్–విరించి చౌరస్తాల మధ్య పరిస్థితి మరీ అధ్వానం. బంజారాహిల్స్, షాదన్ కాలేజీ మధ్య ఉన్న చింతల్‌బస్తీ రోడ్డును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే మాసబ్‌ట్యాంక్‌సహా అనేక ప్రాంతాలపై ట్రాఫిక్ రద్దీ భారం తగ్గుతుంది. ఇప్పుడూ ఈ మార్గం అందుబాటులో ఉన్నప్పటికీ ఆక్రమణలు, అక్రమ పార్కింగ్ వల్ల కేవలం ద్విచక్ర వాహనాలు, ఆటోల రాకపోకలకు మాత్రమే ఉపయుక్తం. దీంతో కార్లు వంటి తేలికపాటి వాహనాలు ఈ రహదారిలోకి ప్రవేశించినా ముందుకు కదలలేని పరిస్థితి ఉంటుంది. ఈ కారణంగా వాహనచోదకులు మాసబ్‌ట్యాంక్ మార్గాన్నే అనుసరించాల్సి వస్తోంది.

పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే...

మాసబ్‌ట్యాంక్ వైపు వచ్చే మార్గంలో విరించి హాస్పిటల్ చౌరస్తా సమీపంలోని నాలా దాటి ఎడమ వైపునకు తిరిగితే వాహనాలు చింతల్‌బస్తీ రోడ్డుపైకి ప్రవేశిస్తాయి. అలా నేరుగా వచ్చేస్తే షాదన్ కాలేజీ వద్ద ప్రధాన రహదారిపైకి చేరుతాయి. అట్నుంచి ఖైరతాబాద్, పంజగుట్ట వైపులతోపాటు 'యూ'టర్న్ తీసుకుని సెక్రటేరియేట్, లక్డీకాపూల్ వైపులకూ వెళ్లే అవకాశం ఉంటుంది. చింతల్‌బస్తీలో ఉన్న ఆక్రమణలతో స్థానికులు సైతం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆపరేషన్ రోప్ ద్వారా ఆక్రమణలు తొలగించడంతోపాటు ఈ రహదారి మళ్లీ కుంచించుకుపోకుండా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అలా చేస్తే భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు మినహా మిగిలిన తేలికపాటి వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తాయి. ఫలితంగా మాసబ్‌ట్యాంక్ సహా అనేక జంక్షన్లపై ట్రాఫిక్ భారం తగ్గుతుంది.



చింతల్‌బస్తీలో ఉద్రిక్తత

నాంపల్లి: చింతల్‌బస్తీలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ అధికారులు కన్నెర్ర చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న షెడ్లను కూల్చివేశారు. ఈ క్రమంలో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. బుధవారం ఉదయం జీహెచ్‌ఎంసీ మెహిదీపట్నం సర్కిల్–12 టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి, సెక్షన్ ఆఫీసర్ సునిత..సిబ్బందితో కలిసి చింతల్‌బస్తీకి చేరుకున్నారు. ప్రొక్లెయిన్లతో ఫుట్‌పాత్ కబ్జాలను నేలమట్టం చేశారు. పోలీసు బందోబస్తు నడుమ ఈ ప్రక్రియ కొనసాగగా...బాధితులు ఆందోళనకు దిగారు. ఇదే క్రమంలో కొందరు ప్రొక్లెయిన్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక నాంపల్లి శాసన సభ సభ్యులు మాజిద్ హుస్సేన్ అక్కడికి చేరుకుని పేదలను ఇబ్బంది పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. అయినా జీహెచ్‌ఎంసీ అధికారులు పోలీసుల సహాయంతో కూల్చివేతలను కొనసాగిస్తూ ముందుకు వెళ్లారు. ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ రాందాస్, ఏసీపీ, పది మంది లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు బందోబస్తు విధులు నిర్వహించారు.

నా అనుమతి లేకుండా ఎలా కూలుస్తారు?

- చింతల్‌బస్తీలో అధికారులపై దానం హల్‌చల్

సాక్షి, సిటీబ్యూరో: రోడ్డు ఆక్రమణల తొలగింపు ప్రక్రియను అడ్డుకునేందుకు ఇద్దరు ఎమ్మెల్యేలు యత్నించారు. ఆపరేషన్ రోప్(రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్స్)లో భాగంగా మంగళవారం నుంచి ఖైరతాబాద్ పరిధిలోని చింతల్‌బస్తీ ప్రధాన రహదారిలో అధికారులు ఆపరేషన్ రోప్ నిర్వహిస్తుండగా వారు జోక్యం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో కొంత భాగం ఖైరతాబాద్, మరికొంత నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వస్తాయి. షాదన్ కాలేజీ వైపు జరుగుతున్న కూల్చివేతల్ని అడ్డుకుంటూ 'నా అనుమతి లేకుండా నా ఏరియాలో ఎలా కూలుస్తారు' అంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు. బతకడానికి వచ్చినవారిపై దౌర్జన్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతోనూ ఫోన్‌లో మాట్లాడుతూ హంగామా చేశారు. దావోస్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే వరకు కూల్చివేతలను ఆపాలని డిమాండ్ చేశారు. అలా కాకుంటే ఆందోళన చేస్తానంటూ హెచ్చరించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్(ఎంఐఎం) సైతం ఇదే పంథా అనుసరించారు. మరోవైపు బీజేపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి తమ వర్గానికి చెందిన వారి దుకాణాలు, ఇళ్ల వద్దే మంగళవారం కూల్చివేతలు చేపట్టారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఇప్పుడు మరో పార్టీ, వర్గానికి చెందిన వారి ఆక్రమణలను కూల్చివేస్తుంటే ఆపాలని ఎమ్మెల్యేలు చూస్తున్నారని దుయ్యబట్టారు. దీంతో పరిస్థితులు అదుపు తప్పే ప్రమాదం ఉందంటూ ఎమ్మెల్యేలకు పోలీసులు సర్దిచెప్పారు. ఇరువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అక్కడ నుంచి వెళ్లిపోయిన తర్వాత కూల్చివేతలు కొనసాగాయి.







చింతల్‌బస్తీలో కూల్చివేతలు చేపడుతున్న అధికారులు..

బీఆర్ఎస్ పోరుబాట

ప్రజాసమస్యలపై ఆందోళనలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు అధికార కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టే చర్యలకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇప్పటికే తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టే ఆలోచనల్లో ఉన్న ఆ పార్టీ గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేతకు సిద్ధమైంది. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు అందరూ కలిసి కమిషనర్‌ను కలిసి ప్రజాసమస్యలు వివరించడంతోపాటు అభివృద్ధి పనుల గురించి ఆరా తీయనున్నారు. మేయర్ అవిశ్వాసానికి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఓటు హక్కు ఉండటంతో వారు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి రావడం ద్వారా పరోక్షంగా తమ బలాన్ని చాటినట్లవుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మేయర్‌పై అవిశ్వాసం అంశానికి సంబంధించి సరైన సమయంలో సరైన నిర్ణయం ఉంటుందని పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కె.తారకరామారావు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా అధికార కాంగ్రెస్‌ను అన్నివిధాలుగా ఇరకాటంలో పెట్టేందుకు పార్టీ కార్యాచరణ ఉంటుందని చెబుతున్నారు.

కాంగ్రెస్ సైతం..

బీఆర్ఎస్ చర్యలతో అధికార కాంగ్రెస్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గదనే ధీమా ఉన్నప్పటికీ, వీలైనంత మందిని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేర్చుకునే మంత్రాంగం ఇప్పటికే మొదలైందని వినిపిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో జరిగిన పార్టీ మార్పిడులు అనంతరం ఆగిపోయాయి. తిరిగి ఇప్పుడు మళ్లీ మొదలవుతాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ఆధునిక పద్ధతుల్లో చెత్త నిర్వహణ: సీతక్క



పీర్జాదిగూడ డంపింగ్ యార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

పర్వతాపూర్ డంపింగ్ యార్డులో మిషన్ ప్రారంభం

మేడిపల్లి: మహమ్మారిగా మారిన చెత్త సమస్య నుంచి విముక్తి చేయడానికి జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో చెత్త రీసైక్లింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ డంపింగ్ యార్డులో ఐటీసీ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ మిషన్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని చెత్త నిర్వహణలో ఆధునిక పద్ధతులను అనుసరించాలని సూచించారు. చెత్త వ్యర్థాలు విషతుల్యం కావడం, పర్యావరణంలో మార్పులు రావడంతో ప్రజలు వివిధ రకాల జబ్బుల బారిన పడుతున్నారని అన్నారు. చెత్త నిర్మూలనకు సీఎస్ఆర్ కింద ప్రయివేట్ కంపెనీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చామకూర మల్లా రెడ్డి, స్థానిక మేయర్ అమర్ సింగ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, కమిషనర్ త్రిలేశ్వర్ రావు, డిప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలి

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన పర్వతాపూర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు, స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు దుర్వాసనతో పరిసర కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారికి సర్దిచెప్పి వెనక్కి పంపించారు.

ఘనంగా నిఫ్ట్ వ్యవస్థాపక దినోత్సవం



మాదాపూర్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)కు చెందిన ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకున్నారని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాలిని దివాకల అన్నారు. మాదాపూర్‌లో బుధవారం నిఫ్ట్ 40వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిఫ్ట్ విజయాలను తెలిపే విధంగా చిత్రాలు ప్రదర్శించే మెమోరీ వాల్‌ను ప్రదర్శించారు. నిఫ్ట్ క్యాంపస్‌లో భారతదేశపు మొట్టమొదటి కృత్రిమ మేధ, భావోద్వేగ మేధ ద్వారా నడిచే ఫ్యాషన్ ఫోర్‌క్యాస్టింగ్ ప్లాట్‌ఫారం 'విజన్ నెక్స్ట్'ను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఫ్యాషన్ రిటైల్ మార్కెట్ ధోరణులను పరిశోధించడానికి ఈ ప్లాట్‌ఫారం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిఫ్ట్ పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పృథ్వీరాజ్ మల్, రామ్‌మోహన్, కె.కె. బాబు, ప్రాచీ బజాజ్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హై అలర్ట్

శంషాబాద్: గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైఅలర్ట్ విధించారు. భద్రతను కట్టుదిట్టం చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. లాంజ్‌ల వరకు ఇచ్చే పాస్‌ల జారీని ఈ నెల 30 వరకు నిలిపివేశారు. ప్రధాన గేటు నుంచి రోటరీలు, టెర్మినల్ల వరకు వివిధ ప్రాంతాల్లో తనిఖీలను ఏర్పాటు చేశారు. సీఐఎస్ఎఫ్ బలగాలు, సైబరాబాద్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నేడు అడ్వాంటేజ్ అస్సాం 2.0 రోడ్ షో

సాక్షి, సిటీబ్యూరో: 'అడ్వాంటేజ్ అస్సాం 2.0' పేరుతో గురువారం తాజ్‌కృష్ణ హోటల్‌లో రోడ్ షో నిర్వహించనున్నారు. గువాహటిలో ఫిబ్రవరి 25, 26 తేదీల్లో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల సదస్సుకు పెట్టుబడిదారులను సమాయత్తం చేసేందుకు హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అస్సాం ప్రభుత్వ విద్య, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ రనోజ్ పెగు, అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి బి.కల్యాణ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి కేఎస్ గోపీనాథ్ నారాయణన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కమిషనర్ ఎస్ సింగ్ తదితరులు హాజరుకానున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెద్దఎత్తున పెట్టుబడుల ఆకర్షణకు ఈ రోడ్ షో ఉపయోగపడుతుందని అస్సాం ప్రభుత్వం భావిస్తోంది.

ఆత్మీయ ఆతిథ్యానికి హైదరాబాద్ చిరునామా



మేడ్చల్‌రూరల్: ఇతర రాష్ట్రాలను నుంచి వచ్చిన వారిని అతిథులుగా చూసుకునే సంస్కృతి, సంప్రదాయం హైదరాబాద్ గడ్డ, తెలంగాణ రాష్ట్రానిదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేట్ గ్రామ పరిధిలో దక్షిణేశ్వర్ కేదార్‌నాథ్ మందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న పంచ్ కేదార్ మందిర్, నందిశాలకు బుధవారం ఎంపీ ఈటల ట్రస్ట్ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవభూమిగా పిలిచే ఉత్తరాఖండ్‌వాసులు హైదరాబాద్‌లో లక్షలాది మంది నివసిస్తున్నారని, ఏ రాష్ట్రం వారు వచ్చినా తెలంగాణ అక్కున చేర్చుకుని ఆతిథ్యం ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, నాయకులు నందారెడ్డి, సుదర్శన్, మల్లిఖార్జున్, మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శైలజ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్ట్‌కు నోటీసులు... గవర్నర్ గైర్హాజరు

దక్షిణాదిన కేదారేశ్వరుడి ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించిన దక్షిణేశ్వర్ కేదార్‌నాథ్ మందిర్ ట్రస్ట్ సభ్యులు మేడ్చల్ మండలం ఎల్లంపేట్‌లో కొంత స్థలాన్ని కొనుగోలు చేసి భూమి పూజలు నిర్వహించారు. బుధవారం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్‌ను ఆహ్వానించారు. కాగా ప్రసిద్ధిగాంచిన కేదార్‌నాథ్ ఆలయ నమూనాతో మరో ఆలయ నిర్మించవద్దని, దీనిపై 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని, రెండు రోజుల క్రితం కేదార్‌నాథ్, బద్రినాథ్ ఆలయ కమిటీ నిర్మాణసభ్యులకు నోటీసులు జారీ చేసింది. దీంతో బుధవారం నాటి శంకుస్థాపన కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గైర్హాజరయ్యారు. ఈ విషయంపై నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ ఆలయ ప్రాముఖ్యతకు భంగం కలిగేలా నిర్మాణం చేపట్టడం లేదని ట్రస్ట్ చైర్మన్ జైపాల్‌సింగ్, సభ్యులు రాంబాతియా తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు యూజీసీ షాక్

- గైడ్‌షిప్ కాలం కుదింపు.. తగ్గనున్న అడ్మిషన్లు
- ప్రవేశపరీక్షకు రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



వీసీ ప్రొ.కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీలోని ప్రొఫెసర్ల గైడ్‌షిప్ కాలాన్ని 57 ఏళ్లకు కుదిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) తీసుకున్న నిర్ణయం పరిశోధక విద్యపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గతంలో పదవీ విరమణ పొందిన తర్వాత కూడా అధ్యాపకులకు గైడ్‌షిప్ లభించేది. ఉస్మానియా విశ్వవిద్యాలయం 45 పీజీ కోర్సులు నిర్వహిస్తుంది. ఏటా 15 వేల మంది వివిధ కోర్సుల్లో చేరుతుంటారు. అయితే వర్సిటీ క్యాంపస్‌లో 1,257 మంది అధ్యాపకులకుగాను ప్రస్తుతం 376 మందే మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో వచ్చే మూడేళ్లలో 50 మంది వరకు పదవీ విరమణ చేయనున్నారు. ఆయా అధ్యాపకుల గైడ్‌షిప్ కాలాన్ని వారి పదవీ విరమణ వయసు కంటే మూడేళ్లు ముందే నిలిపివేయడంతో వారు పీహెచ్‌డీ విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ఒక్కో ప్రొఫెసర్‌కు ఎనిమిది అడ్మిషన్లు ఇస్తోంది. వచ్చే మూడేళ్లలో 400పైగా పీహెచ్‌డీ అడ్మిషన్లు దక్కకుండా పోతున్నాయి. మూడేళ్ల తర్వాత తాజాగా ఓయూలో పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025కు ఓయూ పాలకవర్గం నోటిఫికేషన్ జారీ చేసింది. శుక్రవారం నుంచి ఫిబ్రవరి 23 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. యూజీసీ నూతన నిబంధనల కారణంగా సీట్ల సంఖ్య 446కు తగ్గింది. సుమారు 50 వేల మంది ఇప్పటికే పీజీలు పూర్తి చేసి, పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఎదురు చూస్తున్నారు. యూజీసీ నిర్ణయాన్ని అధ్యాపకులు, విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.

విద్యార్థి సంఘాల అభ్యంతరం

యూజీసీ కొత్త నిబంధనలపై పలు విద్యార్థి సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి పాత పద్ధతిలో అడ్మిషన్లకు మరో నోటిఫికేషన్ జారీ చేయాలని వీసీ ప్రొ.కుమార్‌ను కోరారు.

ప్రతిభే పురస్కారం.. సేవే అలంకారం..

కొందరికి తాము రాణిస్తున్న రంగంలో ప్రతిభను కనబర్చడమే పురస్కారం.. మరి కొందరికి సమాజానికి తన వంతు సాయం చేయడమే అలంకారం.. పదవుల కోసం.. గుర్తింపు కోసం పాకులాడే ప్రస్తుత సమాజంలో నమ్ముకున్న కళ కోసం కొందరు.. తాము నివసించే పరిసరాల్లో మార్పు కోసం మరికొందరు కృషి చేయడం, చేస్తుండడం తెలిసిందే.. ఈ క్రమంలో మొట్ట మొదటిసారి దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా కళాకారులకు, సమాజ సేవకులకు, క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రత్యేకంగా గవర్నర్ గౌరవ అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ అవార్డు కింద రూ.2లక్షలు నగదు, జ్ఞాపికతో సత్కరిస్తారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ పురస్కారాలను ఇవ్వనున్నట్లు అవార్డు ఎంపిక కమిటీ సభ్యులు పద్మజారెడ్డి, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్ తెలిపారు. దీనికి నగరం నుంచి పలువురిని ఎంపిక చేయగా వారిలో కూచిపూడి నాట్యకారిణి కృష్ణభారతి, దివ్యాంగుల క్రీడల కోసం ఏర్పాటైన ఆదిత్య మెహతా ఫౌండేషన్ నిర్వాహకులు ఆదిత్య మెహతా ఎంపికయ్యారు.. ఈ నేపథ్యంలో వారి గురించిన వివరాలు..

– సాక్షి, సిటీబ్యూరో



కాచిగూడ: పాశ్చాత్య నృత్యాల హోరులో రెపరెపలాడుతున్న కూచిపూడి శాస్త్రీయ నృత్యకళను తన చేతులడ్డి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు నగరానికి చెందిన పీబీ కృష్ణభారతి. హైదరాబాద్ మల్లాపూర్‌కు చెందిన ఈమె కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తూ ప్రాచీన కళను భవిష్యత్ తరాలకు అందిస్తున్నారు. కృష్ణభారతి వద్ద ఈ నృత్యాన్ని అభ్యసించడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి, అమెరికా వంటి విదేశాల నుంచి సైతం ఔత్సాహిక కళాకారులు శిష్యులుగా చేరుతున్నారు. ఈ క్రమంలో ప్రముఖ కూచిపూడి నృత్యగురువు పీబీ కృష్ణభారతి (65) సాంస్కృతిక రంగంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తొలి గౌరవ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమె కూచిపూడి నృత్యచూడామణి, పద్మశ్రీ, దివంగత డాక్టర్ శోభానాయుడు తొలి బ్యాచ్ శిష్యురాలు.



కళామతల్లి ముద్దుబిడ్డ పీబీ కృష్ణభారతి

కూచిపూడి నాట్యంలో గవర్నర్ పురస్కారం



నాట్యంలో మేటి... నటనలో సాటి

కళాకారుల కుటుంబం నుంచి..

ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో కళాకారుల కుటుంబంలో కృష్ణభారతి పుట్టారు. తండ్రి ఎస్‌కే తిరుమలాచారి (వయోలిన్ విద్వాంసుడు). తల్లి ఎస్‌కే విజయలక్ష్మీ (వీణా, గాయని). కృష్ణభారతి కుటుంబంలో అన్న, తమ్ముడు, చెల్లి అందరూ కళాకారులే. ఆయా రంగాల్లో నిష్ణాతులు. తన ఆరో ఏట నుంచే ఏలూరులో వేదాంతం ప్రహ్లాద శర్మ వద్ద కూచిపూడి నృత్యం అభ్యసించారు. 1973 వరకూ ఏలూరులోనే ఉండి ఆ తర్వాత హైదరాబాద్, మల్లాపూర్‌లో స్థిరపడ్డారు. 1978లో దివంగత కూచిపూడి నృత్యచూడామణి పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు వద్ద శిష్యురాలిగా చేరారు.

తల్లిదండ్రులే ఆదర్శం..

తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకున్న వారి కూతురు కృష్ణభారతి ఆరేళ్ల ప్రాయంలో కూచిపూడి నృత్యం నేర్చుకునేందుకు నడుంబిగించారు. నాలుగేళ్లలో నాట్యంలో చక్కటి ప్రావీణ్యం సాధించి తనని తాను నిరూపించుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతి వేదికపై విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుంచి నృత్యంలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. వివిధ ఉత్సవాల్లో పద్మశ్రీ కే.శోభానాయుడు, అనురాధ జొన్నలగడ్డ బృందాలతో కలిసి నట్టువంగంలో పాల్గొన్నారు. నాట్య గురువుగా ప్రస్తుతం వందల మందికి శిక్షణనిస్తున్నారు. హైదరాబాద్, హబ్సిగూడలోని పల్లవి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు.

అవార్డులు.. పురస్కారాలు..

సంస్కృతిరత్న, నాట్యశ్రీ, ఉగాది పురస్కారం, ఎన్‌టీఆర్ పుస్కారం, నాట్య విశారద వంటి అవార్డులు, బిరుదులను కృష్ణభారతి అందుకున్నారు. అనేక నృత్య బ్యాలెట్లు, సోలో అంశాలకు కొరియోగ్రఫీ చేశారు. కొన్ని నృత్య నాటికలు కాళీయ మర్దన, అగ్రహానుగ్రహం, సంక్రాంతి, గురుభ్యోనమః, కథాకేళిక వంటివి ఉన్నాయి. అలాగే తరంగము తిల్లానాలు, వివిధ వాగ్గేయకార కీర్తనలు, జతిస్వరాలు మొదలైన సోలో పెర్ఫార్మెన్స్‌కు కొరియోగ్రఫీ చేశారు.

దివ్యాంగుల క్రీడల కోసం..



శిక్షణ, పరికరాలు సమకూర్చుతూ..

ఆసియాలోనే తొలి ఎన్‌జీవోకు నాంది పలికి

ఫౌండేషన్ తరపున ఇప్పటి వరకూ 300పైగా అంతర్జాతీయ మెడల్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఆదిత్య మెహతా 2013లో దివ్యాంగుల క్రీడల కోసం ఆదిత్య మెహతా ఫౌండేషన్ ప్రారంభించారు. అప్పటి నుంచి దివ్యాంగులకు విభిన్న రకాలుగా ఊతం అందిస్తూ వస్తోంది ఈ సంస్థ. మరీ ముఖ్యంగా దివ్యాంగుల క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యంగా అవసరమైన శిక్షణ, పరికరాలను సమకూర్చుతోంది. ఆసియాలోనే తొలిసారిగా ఈ తరహా ఎన్‌జీవోకు నాంది పలికిన ఈ ఫౌండేషన్.. క్షేత్రస్థాయి నుంచి మొదలుపెట్టి అన్ని రకాల వసతులు, వనరులూ సమకూరుస్తోంది. దివ్యాంగులకు క్రీడా సంబంధిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తద్వారా ఇప్పటికే 300పైగా అంతర్జాతీయ మెడల్స్ ఈ ఫౌండేషన్ సొంతం చేసుకుంది.

పారా ఒలింపిక్స్‌లో..

పారా స్పోర్ట్స్ (దివ్యాంగుల క్రీడలు)కు సంబంధించి నవోదయ విద్యాలయ సమ్మిట్స్, జవహర్ నవోదయ విద్యాలయతో ఒప్పందాలు కుదుర్చుకుంది. కేంద్ర ఆయుధ పోలీసు బలగాల్లోని 5 విభాగాల్లో పారా స్పోర్ట్స్‌ను పరిచయం చేసిన సంస్థగా ఘనతను దక్కించుకుంది. ఈ బలగాల్లో పనిచేస్తూ పలు సందర్భాల్లో అవయవాలు కోల్పోయిన దాదాపు 1000 మందికి కౌన్సిలింగ్, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించింది. వేసవి క్రీడలు, శీతాకాలం క్రీడలు కింద విభజించి మొత్తం 28 రకాల క్రీడాంశాల్లో ఔత్సాహికులకు శిక్షణ అందిస్తోంది. త్వరలో జరుగనున్న పారా ఒలింపిక్స్‌లో సత్తా చాటే క్రీడాకారుల్ని తయారు చేయాలనే లక్ష్యంతో పని చేస్తోంది.

ఈ పురస్కారం మా అందరిదీ..



ఒక దివ్యాంగుడిగా వారి సమస్యలను అనుభవపూర్వకంగా తెలుసుకుని, మరికొందరితో కలిసి ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేశాం. అప్పటి నుంచి నాతో పాటు నా బృందం అంతా ఎన్నో వ్యయప్రయాసల కోర్చి లక్ష్యం దిశగా ప్రయాణం చేస్తోంది. నేను కూడా ఈ బృందంలో ఒక సభ్యుడిగా ఉన్నందుకు గర్విస్తున్నాను. ఉన్నత ఆశయంతో సాగుతున్న మా ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించేందుకు ఈ పురస్కారం ఒక స్ఫూర్తిగా పనిచేస్తుంది. మా బృందం కృషిని గుర్తించి గవర్నర్ పురస్కారం ప్రకటించినందుకు ధన్యవాదాలు.

– ఆదిత్య మెహతా, ఫౌండేషన్ నిర్వాహకులు

ఆ పుట్టగొడుగు.. ఐదు లక్షలటు?!



- రిచ్ ఫుడ్ కేంద్రంగా హైదరాబాద్
- విదేశాల నుంచి అరుదైన పండ్లు, స్పైసెస్ దిగుమతి
- బంజారాహిల్స్‌లో పారిస్ మల్హైర్బే ఆధ్వర్యంలోని ఫుడ్‌స్టోరీస్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అన్ని రంగాలతో పాటు ఆహార రంగంలోనూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. విభిన్న సంస్కృతుల సమ్మేళనంలో భాగంగా విభిన్న రకాల ఆహారానికీ నగరం కేంద్రంగా నిలుస్తోంది. ఇందులో భాగంగానే బంజారాహిల్స్‌లో నూతనంగా ప్రారంభమైన ఫుడ్‌స్టోరీస్ వేదికగా అక్షరాల రూ.5 లక్షల విలువ చేసే పుట్టగొడుగు (మష్రూమ్) అందరినీ ఔరా అనిపిస్తోంది. కాంటినెంటల్ ఫుడ్‌తో విభిన్న ప్రాంతాలకు చెందిన ఆహార పదార్థాలకు నెలవైన నగరంలో మొట్టమొదటి సారి ఈ రిషీ మష్రూమ్ సందడి చేస్తోంది. పారిస్‌కు చెందిన ఆర్కిటెక్చరల్ ఏజెన్సీ మల్హైర్బే ఏర్పాటు చేసిన ఈ ప్రముఖ ఫుడ్‌స్టోరీస్ దేశంలో రెండోది కావడం విశేషం. ఈ ఫుడ్‌స్టోరీస్ వేదికగా ప్రపంచంలోని అత్యంత విలాసవంతమైన డియోర్, మోయెట్-హెన్నెస్సీ, పారిస్ ఏరోపోర్ట్, గివెన్చీ వంటి బ్రాండ్‌లు సందడి చేస్తున్నాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన పండ్లు, సుగంధ ద్రవ్యాలు, లగ్జరీ జపనీస్ చాక్లెట్లు, గ్లోబల్ ప్యాంట్రీ, చీస్, మాంసాహార ఉత్పత్తులు ఆకర్షిస్తున్నాయి. ఫుడ్‌స్టోరీస్ కిచెన్ స్టూడియో ఫుడ్ లవర్స్‌ను అలరిస్తోందని సహ వ్యవస్థాపకురాలు అష్మి బియానీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 8 వేలకు పైగా అత్యుత్తమ పదార్థాలను 4 గంటల్లోపు ఇంటికే డెలివరీ చేసే సేవలు ప్రారంభించామన్నారు.

అవమానాల నుండి అంతర్జాతీయ స్థాయికి

- మిస్ ట్రాన్స్ ఆసియా-2024 హర్షిని మేకల
- అలైట్ క్వీన్ యూనివర్స్, మిస్ యూనివర్స్ ట్రాన్స్‌లో ఐదో స్థానం

పంజగుట్ట : చిన్నతనం నుండి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా.. కనీసం పక్కన కూర్చోడానికి కూడా ఒప్పుకోని పరిస్థితిని దాటుకుని మిస్ యూనివర్స్ ట్రాన్స్ 2024 ఐదో స్థానంలో నిలిచానని హర్షిని మేకల అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓ కార్యక్రమానికి మంగళవారం వచ్చిన హర్షిని మాట్లాడుతూ మిస్ యూనివర్స్ ట్రాన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 2024 డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగిన పోటీల్లో 24 దేశాల నుండి మోడల్స్ పాల్గొనగా మిస్ యూనివర్స్ ట్రాన్స్‌లో ఐదో స్థానం, మిస్ ట్రాన్స్ ఆసియా 2024, అలైట్ క్వీన్ యూనివర్స్‌తో మొత్తం మూడు టైటిల్స్ గెలుచుకున్నానని ఆమె పేర్కొన్నారు.

అంతర్జాతీయ వేదికపై..

అంతర్జాతీయ వేదికపై ఇండియా తరపున తాను పోటీలో ఉండడం, వేదికపై హర్షిని మేకల అని అనౌన్స్ చేసినప్పుడు ప్రేక్షకుల నుండి కేరింతలు రావడం, ఆ కేరింతల మధ్య తనకు మిస్ యూనివర్స్ ఆసియా కిరీటం పెట్టడం ఎప్పటికీ మర్చిపోలేనని హర్షిని అన్నారు. మిస్ ట్రాన్స్ ఆసియా గెలుపొందిన తరువాత ఇప్పటివరకూ కృష్ణలంక, బైరాజులపల్లి, బాలామణి అనే మూడు సినిమాల్లో నటించానని, ఓ వెబ్ సిరీస్, రెండు సీరియల్స్‌లోనూ నటిస్తున్నట్లు తెలిపారు.

మార్చిలో మిస్ ట్రాన్స్ తెలంగాణ



తెలంగాణలో మొదటిసారిగా సంచారీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో ఐకానిక్ స్టార్స్ మిస్ ట్రాన్స్ తెలంగాణ ఫ్యాషన్ షో 2025 నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను మిస్ ట్రాన్స్ ఆసియా హర్షిని, మొదటి ట్రాన్స్ డాక్టర్ ప్రాచీ రాథోడ్, హైదరాబాద్ మోడల్ సీఈవో వంశీ పల్లె, నిర్వాహకుడు శ్రీనాథ్, నటుడు కామేష్ గౌడ్, నిర్మాత నవీన్ గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. విజేతలకు సర్టిఫికెట్, కిరీటం, నగదు బహుమతి, యాడ్, యూట్యూబ్‌లో సాంగ్ అవకాశం కల్పిస్తామన్నారు. మార్చి 1 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 9010691111లో సంప్రదించొచ్చు.

29న త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవం



గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఈ నెల 29న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవం(హెచ్‌టీఏఎంఎఫ్) వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ప్రముఖ సంగీత విద్వాంసుల కచేరీలతో ఆకట్టుకోకున్నారు. 18వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి రచించిన అనేక కీర్తనలు, శాస్త్రీయ సంగీత రాగాలను విభిన్న శైలిలో ప్రయోగించారు. ఆ కీర్తనలు రామభక్తిని చాటిచెప్పడమే కాకుండా తాత్వికత, ఆధ్యాత్మికతను లోతైన రీతిలో వెలువరిస్తాయి. త్యాగరాజ స్వామి కర్నాటక శాస్త్రీయ సంగీతానికి అందించిన సేవలను స్మరిస్తూ యేటా సంగీతోత్సవం నిర్వహిస్తారు. భారతీయ సంస్కృతి, కళలను, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయాలనే లక్ష్యంతో సంస్కృతి ఫౌండేషన్ 16 ఏళ్ల క్రితం హెచ్‌టీఏఎంఎఫ్‌ను స్థాపించింది. పదేళ్లుగా త్యాగరాజ ఆరాదనా సంగీతోత్సవం నిర్వహిస్తోంది.

29న ప్రారంభం..

శిల్పారామంలో త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవం జనవరి 29న ప్రారంభమవుతుంది. ప్రతి రోజూ 15కు పైగా సుమధుర సంగీత కచేరీలు ఉంటాయి. 4వ రోజు గురుకులం పేరిట విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన ఉంటుంది. జంట నగరాల్లోని సంగీత పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు. ఫిబ్రవరి 2న ఉదయం 9 గంటలకు 'పంచరత్న సేవ' ఉంటుంది. కర్నాటక శాస్త్రీయ సంగీతానికి చేసిన సేవకు గుర్తింపుగా 'గురు సన్మానం' పేరిట ప్రసిద్ధ సంగీత విద్వాంసులను సంస్కృతి ఫౌండేషన్ సత్కరిస్తుంది. 400 మందికి పైగా సంగీతకారులు త్యాగరాజ కీర్తనలను ఆలపించనున్నారు. హనుమత్సమేత సీతారామలక్ష్మణులు, త్యాగరాజ స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేక సేవ ఉంటుంది.

మనసారా.. సేవకే అంకితం



తమ కోసం ఏదైనా పని చేసుకుంటే స్వార్థం.. అదే సమాజం కోసం చేస్తే సేవ. ఇందులోనూ ఒక్కొక్కరి ఆలోచనా విధానం ఒక్కోలా ఉంటుంది. కొంత మంది వృద్ధులకు సహాయం చేస్తే, మరి కొందరు అనాథలకు, పేద పిల్లలకు సహకారం అందిస్తారు. ఇలా పేద విద్యార్థులు, దివ్యాంగులు, అనాథ వృద్ధుల సంక్షేమం కోసం పరితపిస్తూ, తనకు తోచిన సేవలు అందించడమే కాకుండా, తన లాంటి ఎంతో మందికి దక్సూచిలా నిలుస్తున్నారు. అంగవైకల్యం కలిగిన వారికి భరోసా కల్పిస్తూ వారి కాళ్ల మీద వారు నిలబడేలా చేయూతనిస్తున్నారు. ఇలా ఒకరిద్దరు కాదు ఏకంగా 200 మంది విద్యార్థులు, 150 మంది దివ్యాంగులకు అండగా ఉన్నారు డాక్టర్ సారథామురుగన్. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారు ఈ సేవకురాలు..

– అడ్డగుట్ట



విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం..

ప్రస్తుత సమాజంలో ధనిక, పేద అనే భేదాలు లేకుండా ఉండాలంటే అది విద్యతోనే సాధ్యమని నమ్ముతాను. అందుకే మా ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులు, వికలాంగులకు సహాయ సహకారాలు అందించే దాతల సహాయంతో విద్యార్థులను చదివిస్తాం. ఇటీవల బాబా సాహెబ్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక చేయడం గర్వంగా ఉంది.

– డాక్టర్ సారా, సెవెన్ రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

పేదలకు ఉన్నత విద్య లక్ష్యంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు మెరుగైన ఉన్నత విద్యను అందించేందుకు సారా నిరంతరం శ్రమిస్తున్నారు. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, ఓల్డ్ సఫీల్‌గూడ, మౌలాలి ప్రాంతాల్లోని 6 ప్రభుత్వ పాఠశాలను సెవెన్‌రేస్ ఫౌండేషన్ దత్తత తీసుకుంది. ప్రతి ఏడాదీ ఉచితంగా నోటు పుస్తకాలు, స్టేషనరీ, విద్యార్థినులకు శానిటరీ కిట్స్ పంపిణీ చేస్తుంటారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సెవెన్‌రేస్ సంస్థ సొంతంగా చదివిస్తుంది.

- సమాజంలో సమానత్వం లక్ష్యంగా
- తొమ్మిదేళ్లుగా పేద విద్యార్థులు, దివ్యాంగుల సేవలో
- ఉత్తమ సేవకురాలిగా నేషనల్ అవార్డుకు ఎంపిక
- విద్యతోనే భేదాభిప్రాయాలు నివారించవచ్చు : డాక్టర్ సారా

కేరళకు చెందిన ఈమె పదిహేను ఏళ్ల క్రితం నగరానికి వచ్చి సికింద్రాబాద్‌లోని తన బంధువులతో కలిసి ఉంటున్నారు. మొదట ఐటీ ఉద్యోగం చేస్తూ జీవనం సాగించిన సారా అనంతరం, ఉద్యోగం మానేసి పేద విద్యార్థులు, దివ్యాంగుల సేవకు 2016లో సెవెన్ రేస్ ఫౌండేషన్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. ఈమె సేవలను గుర్తించి ఇటీవల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెలలో మహారాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు డాక్టర్ సారా.

దివ్యాంగుల్లో స్ఫూర్తి నిపుతూ..

దివ్యాంగుల్లో స్ఫూర్తిని నింపి మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తోంది. సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా దివ్యాంగులతో చిరు వ్యాపారాలు పెట్టించడం, కుట్టు మిషన్లు పంపిణీ వంటి ఉపాధి మార్గాలను కల్పిస్తున్నారు. మురికివాడల్లోనూ, రోడ్లపైనా ఎలాంటి ఆసరా లేని వారికి ఆహారం పంపిణీ చేస్తారు. దాదాపు 150 మంది దివ్యాంగులకు కుట్టు మిషన్లతో పాటు 200 వీల్ చైర్లు పంపిణీ చేశారు.



30 వేల గ్రాసరీ కిట్ల పంపిణీ..

కోవిడ్ మహమ్మారి సమయంలో రెక్కాడితే కానీ డొక్కాడని పేదలకు సెవెన్ రేస్ ఫౌండేషన్ ద్వారా 30 వేల నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఎంతో ముఖ్యమైన ఆక్సిజన్ సిలిండర్లు కూడా సప్లై చేశారు. సహాయం కోసం ఎదురు చూస్తున్న ఎందరికో అండగా నిలిచారు.





క్లుప్తంగా...

త్వరలో గ్రామపంచాయతీ ఎన్నికలు: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగొచ్చాక బీసీ కమిషన్ నివేదికకు ఆమోదం తెలుపుతారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన నివేదిక దాదాపు పూర్తయిందని తెలిపారు. బుధవారం సచివాలయంలో సీతక్క మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని చెప్పారు. పథకాలకు సంబంధించి గ్రామసభల్లో ప్రదర్శించే జాబితాపై ప్రజల అభిప్రాయాలు తీసుకుని.. లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ పెన్షన్ కల్పించాలి

తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థలో 1999–2004 సంవత్సరాల మధ్య నియమితులైన ఉద్యోగులకు జీపీఎఫ్ పెన్షన్ సదుపాయం కల్పించాలని తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సంఘం రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.నెహ్రూ, ఎం.భాస్కర్ ఒక వినతిపత్రం సమర్పించారు. పాల్వంచలోని కాలం చెల్లిన కేటీపీఎస్ (ఓ అండ్ ఎం) థర్మల్ ప్లాంట్ స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను జెన్ కో ఆధ్వర్యంలో నిర్మించాలని కోరారు. రామగుండం ఆర్టీబీఎస్ స్థానంలో మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్ కో ఆధ్వర్యంలో నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ డాక్టర్ల సమస్యలు పరిష్కరించండి

ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూకు టీజీజీడీఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలందిస్తున్న ప్రభుత్వ వైద్యుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూప్రసాద్ రాథోడ్, కోశాధికారి రఫూపుద్దీన్ బుధవారం ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూను కలిసి వినతిపత్రం అందించారు. జీవో నెంబర్ 142ను రద్దు చేయాలని, జనరల్ లైన్ సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలని చాలా కాలంగా ఉన్న డిమాండ్‌ను మరోసారి కార్యదర్శి ముందుకు తెచ్చారు. పదోన్నతుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించి, నిబంధనలను అమలుచేయాలని కోరారు.

సూర్య ఘర్ అమలుకు కమిటీలు

సాక్షి, హైదరాబాద్: గృహాలపై సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్స్ ఏర్పాటును ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (పీఎంఎస్ఎంబీవై) పథకం అమలు కోసం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ ఇళ్లకు ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుబాటులోకి రానుంది. రాష్ట్ర స్థాయి కమిటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, ఇంధన, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్ శాఖల ముఖ్యకార్యదర్శులు, ఉత్తర, దక్షిణ డిస్కంల సీఎండీలు, బ్యాంకర్ల కమిటీ చైర్మన్ సభ్యులుగా, రెడ్కో వీసీ, ఎండీ మెంబర్ కన్వీనర్‌గా ఉండనున్నారు.

రవితేజ మృతదేహాన్ని తరలించేందుకు

చర్యలు తీసుకోండి: సీఎస్

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో మరణించిన హైదరాబాద్ యువకుడు కొయ్యడ రవితేజ (26) మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం కేంద్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ అధికారులకు లేఖరాశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎస్ లేఖను రాశారు.

ఫిజిక్స్ సులభం.. మ్యాథ్స్ కొంత క్లిష్టత

- జేఈఈ–మెయిన్ తొలిరోజు పరీక్షలపై నిపుణుల విశ్లేషణ
- సుదీర్ఘంగా మ్యాథ్స్ ప్రశ్నలు..రెండు సెషన్లలో ఇదే తీరు
- కెమిస్ట్రీలో కొన్ని సులభం.. కొన్ని ఓ మోస్తరు క్లిష్టత
- గత ప్రశ్నపత్రాల నుంచే ఎక్కువగా ప్రశ్నలు

సాక్షి, ఎడ్యుకేషన్: జేఈఈ–మెయిన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రతిష్టాత్మక ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్లలో బీటెక్ చేసేందుకు, అదే విధంగా ఐఐటీల్లో బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ–అడ్వాన్స్‌డ్‌కు అర్హత పరీక్షగా ఎన్‌టీఏ ఏటా రెండుసార్లు దీనిని నిర్వహిస్తోంది. మొదటి దఫా పరీక్షకు జాతీయ స్థాయిలో 13.8 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో దాదాపు 2 లక్షల మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉంటారని అంచనా. 23, 24, 28, 29, 30 తేదీల్లో కూడా రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించనున్నారు.

300 మార్కులకు పరీక్ష

మూడు సబ్జెక్టులలో 300 మార్కులకు పరీక్ష నిర్వహించారు. మ్యాథమెటిక్స్ నుంచి 25, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం 75 ప్రశ్నలతో ఒక్కో ప్రశ్నకు 4 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహించారు. కాగా ప్రశ్నల క్లిష్టత స్థాయి ఓ మోస్తరుగా ఉందని, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, గత ప్రశ్న పత్రాలు సాధన చేసిన వారికి కొంత మేలు కలిగించేదిగా ఉందని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు. రెండు సెషన్లలోనూ మ్యాథమెటిక్స్ విభాగం ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నప్పటికీ.. ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండడంతో కొందరు విద్యార్థులకు జవాబులిచ్చేందుకు సమయం సరిపోలేదు.



ఫిజిక్స్ విభాగం ప్రశ్నలు సులభంగా, కెమిస్ట్రీలో కొన్ని సులభంగా, కొన్ని ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 50 శాతం ప్రశ్నలు చాలా సులభంగా ఉండడం విద్యార్థులకు ఉపశమనం కలిగించింది. ఈ రెండు విభాగాల ప్రశ్నలకు అభ్యర్థులు 45 నిమిషాల చొప్పున సమయంలో జవాబులు ఇవ్వగలిగారు. అయితే మిగతా గంటన్నర సమయంలో మ్యాథమెటిక్స్‌లో 15 నుంచి 20 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వగలిగినట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. ప్రశ్నలు చాలా సుదీర్ఘంగా ఉండడమే ఇందుకు కారణంగా సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే కెమిస్ట్రీ ప్రశ్నలు..

తొలిరోజు రెండు సెషన్లలోనూ ప్రశ్నలు జేఈఈ–మెయిన్ గత ప్రశ్నపత్రాల నుంచే ఎక్కువగా అడిగారు. ముఖ్యంగా 2021, 2022 ప్రశ్నలకు సరిపోలే విధంగా చాలా ప్రశ్నలు ఉన్నట్లు నిపుణులు తెలిపారు. ఇక కెమిస్ట్రీలో అధిక శాతం ప్రశ్నలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే.. డైరెక్ట్ కొశ్చన్స్‌గా అడగడంతో ప్రాక్టీస్ చేసిన వారికి ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంది. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి 35 శాతం, ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 35 శాతం, ఇన్–ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 30 శాతం ప్రశ్నలున్నాయి. కెమికల్ బాండింగ్, బయో మాలిక్యూల్స్, మోల్ కాన్సెప్ట్, కాటలిస్ట్స్, వేవ్ లెంగ్త్, ఎస్ఎంఆర్, పొటెన్షియల్ మీటర్, కెమికల్ ఈక్వేషన్ ఎనర్జీ, రేడియో యాక్టివ్ డికే, ఆర్గానిక్ కెమిస్ట్రీ (3 ప్రశ్నలు), కో ఆర్డినేట్ కాంపౌండ్, ఆక్సిడేషన్ స్టేట్‌ల నుంచి ప్రశ్నలు వచ్చాయి.

ఫిజిక్స్, మ్యాథ్స్‌లో ఇలా..

ఫిజిక్స్‌లో థర్మోడైనమిక్స్, ప్రొజెక్టైల్ మోషన్, ఎలక్ట్రిక్ సర్క్యూట్, డయోడ్స్, ఈఎం వేవ్స్, మోడ్రన్ ఫిజిక్స్, రే ఆప్టిక్స్, సెమీ కండక్టర్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఏసీ సర్క్యూట్, డైమెన్షనల్ ఫార్ములా, ఫోర్స్, మూమెంట్ ఆఫ్ ఇనెర్షియా ఆఫ్ స్ఫియర్ నుంచి ప్రశ్నలు అడిగారు. మ్యాథ్స్‌లో స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, సింపుల్ ప్రాబ్లమ్, వెక్టార్, 3డి జామెట్రీ, షార్టెస్ట్ డిస్టెన్స్ ప్రాబ్లమ్, మాట్రిసెస్, డిటర్మినెంట్స్, బయనామియల్ థీమర్, ట్రిగ్నోమెట్రీ, క్వాడ్రాట్రిక్ ప్రొడక్ట్ ఆఫ్ ఆల్ సొల్యూషన్స్, సిరీస్, పారాబోలా, ఏరియా ఆఫ్ సర్కిల్, పెర్ముటేషన్, హైపర్ బోలా, డిఫరెన్షియల్ ఈక్వేషన్, సర్కిల్ ఇంటర్‌సెక్టింగ్ ప్రాబ్లమ్స్ అడిగారు.

కాన్సెప్ట్స్, అప్లికేషన్ నైపుణ్యాలే కీలకం

జేఈఈ–మెయిన్ పరీక్షలో రెండు సెషన్లలోనూ కాన్సెప్ట్స్, అప్లికేషన్స్ ఆధారిత ప్రశ్నలు అడిగారు. వీటిపై పట్టు ఉన్న వారు సులభంగా సమాధానాలు ఇచ్చే విధంగా ప్రశ్నలు ఉన్నాయి. అదే విధంగా ఇంటర్మీడియెట్ స్థాయిలో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు సాధన చేసిన వారు కూడా సులభంగానే సమాధానాలు గుర్తించే విధంగా ప్రశ్నలు అడిగారు. పూర్తి స్థాయిలో ప్రిపేర్ అయిన అభ్యర్థులు 280కు పైగా మార్కులు సాధించే అవకాశం ఉంది.

– ఎం.ఎన్.రావు (జేఈఈ శిక్షణ నిపుణులు)

అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ అంచనా ఇలా..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే.. జనరల్ కేటగిరీలో 91–92 మార్కులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 79–80, ఓబీసీ కేటగిరీలో 77–78, ఎస్సీ కేటగిరీలో 56–58, ఎస్టీ కేటగిరీలో 42–44 మార్కులు కటాఫ్‌గా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

రాష్ట్రం రూపు రేఖలు మార్చేలా హైదరాబాద్ అభివృద్ధి

దావోస్‌లో సీఐఐ రౌండ్ టేబుల్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

- హైదరాబాద్‌లో ప్రపంచ అత్యుత్తమ రవాణా మొబిలిటీని కల్పిస్తాం
- ప్రజా రవాణాను పర్యావరణ హితంగా మారుస్తాం
- కొత్తగా 100 కిలోమీటర్ల పొడవైన మెట్రోలైన్ నిర్మిస్తామన్న ముఖ్యమంత్రి
- ఫడ్నవిస్, చంద్రబాబులతో వేదిక పంచుకున్న రేవంత్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రూపురేఖలు మార్చేలా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరాన్ని నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దడంతో పాటు తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని తెలిపారు. ప్రజలు తక్కువ ఖర్చుతో వేగంగా ప్రయాణించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూరుస్తామని చెప్పారు. ట్రాఫిక్ రద్దీ లేని నగరాల్లోనే వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశాల్లో భాగంగా భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), హీరో మోటార్ కార్ప్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

నగరాల అభివృద్ధికి అర్బన్ మొబిలిటీయే పునాది

'నగరాల అభివృద్ధి, వాటి భవిష్యత్తులో అర్బన్ మొబిలిటీ పునాదిగా పనిచేస్తుంది. ప్రజలు తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో వేగంగా గమ్యాన్ని చేరుకునేలా రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనుగడ సాగిస్తాయి. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ కోసం ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి పెట్టి రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశాం. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు ఎక్కువగా తెలంగాణలోనే అమ్ముడవుతున్నాయి..'అని సీఎం చెప్పారు.

మచిలీపట్నం పోర్టుతో అనుసంధానిస్తాం

'ప్రజా రవాణాను పర్యావరణ హితంగా మార్చేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశ పెడుతున్నాం. డ్రైపోర్టు నిర్మాణంతో తెలంగాణను వేర్‌హౌస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తాం. 1.2 కోట్ల జనాభా ఉన్న హైదరాబాద్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న మెట్రోతో పోలిస్తే రెండింతలుగా వంద కిలోమీటర్ల పొడవైన మెట్రో లైన్ నిర్మిస్తాం. హైదరాబాద్ నగరం చుట్టూ 160 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగు రోడ్డు ఉండగా, కొత్తగా ఓఆర్ఆర్ వెలుపల 360 కిలోమీటర్ల పొడవైన ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మిస్తాం. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్‌ను అనుసంధానం చేసేలా రేడియల్ రింగు రోడ్లు నిర్మిస్తాం. రింగు రోడ్లకు అనుబంధంగా రైల్వే లైన్లు నిర్మించే ఆలోచన ఉంది..'అని రేవంత్ తెలిపారు.

పొరుగు రాష్ట్రాలతో స్నేహపూర్వకంగా ఉంటాం

పొరుగు రాష్ట్రాలతో స్నేహ పూర్వకంగా కొనసాగుతూ అభివృద్ధి విషయంలో ప్రపంచంతో పోటీ పడాలన్నదే తెలంగాణ ఆకాంక్ష అని సీఎం రేవంత్ చెప్పారు. దావోస్‌లో 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్'రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులతో కలిసి రేవంత్ ఒకే వేదిక పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'మేము సరిహద్దులతో పాటు కృష్ణా, గోదావరి నదుల నీటిని కూడా పంచుకుంటున్నాం. ఈ నదులు మహారాష్ట్ర నుండి ప్రారంభమై, తెలంగాణలోకి ప్రవేశించి, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహిస్తాయి. అందువల్ల మేం అభివృద్ధి సాధించడమే మా మొదటి ప్రాధాన్యత. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన తీరు అసాధారణం. ఇప్పుడు, తెలంగాణ ప్రపంచ స్థాయి నగరాలతో, టోక్యో, సింగపూర్ వంటి నగరాలతో పోటీ పడుతోంది. మా అత్యంత పెద్ద బలం హైదరాబాద్, అలాగే యువత. మా ప్రభుత్వ విధానాలు పారదర్శకంగా ఉంటాయి. మాపై నమ్మకం ఉంచండి. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి..'అని పారిశ్రామిక వేత్తలను ముఖ్యమంత్రి కోరారు. భారతదేశం–రాష్ట్రాల అభివృద్ధి దృక్పథం సంక్షేమం, సాంకేతికత, ఉద్యోగాల కల్పన – భవిష్యత్తు.. వంటి పలు అంశాలపై ముగ్గురు సీఎంలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'లక్ష కోట్ల మొక్కల్లో.. 'భాగస్వాములమవుతాం

భూమండలంపై లక్ష కోట్ల మొక్కలు నాటే సంకల్పంలో తాము భాగస్వాములు అవుతామని డబ్ల్యూఈఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నికోల్ శ్వాబ్ సమక్షంలో రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబులు ప్రమాణం చేశారు. రాష్ట్రంలో భారీ ఎత్తున మొక్కల పెంపకానికి చేపడుతున్న కార్యక్రమాలను తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించింది.

ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా హరిహరనాథ శర్మ, లక్ష్మణరావు




హరిహరనాథ శర్మ లక్ష్మణరావు

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు నియమితులయ్యారు. వీరి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ ఇద్దరి నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి జగన్నాథ్ శ్రీనివాసన్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఇద్దరూ శుక్రవారం అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేసే అవకాశం ఉంది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు వీరు అదనపు న్యాయమూర్తులుగా కొనసాగుతారు. తరువాత శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులవుతారు. రాష్ట్ర హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 37. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కలిపి 28 మంది న్యాయమూర్తులున్నారు. వీరిద్దరి నియామకంతో ఆ సంఖ్య 30కి చేరింది. మరో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో మూడు, నాలుగు పోస్టులు భర్తీ చేసేందుకు హైకోర్టు త్వరలో చర్యలు చేపట్టనుంది. న్యాయాధి కారుల కోటా నుంచి హరిహరనాథ శర్మ, లక్ష్మణరావుల పేర్లను హైకోర్టు న్యాయమూ ర్తుల పోస్టులకు సిఫారస్ చేస్తూ సుప్రీంకోర్టు సీజే నేతృత్వంలోని కొలీజియం ఈ నెల 11న తీర్మానం చేసిన విషయం తెలిసిందే.

పేదలపై దౌర్జన్యం చేస్తే భరతం పడతాం: ఈటల



సాక్షి, హైదరాబాద్: పేద ప్రజలపై దౌర్జన్యం చేస్తే గూండాలు, భూ ఆక్రమార్కుల భరతం పడతామని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. పేదల నివాస స్థలాలు కబ్జా చేసి పహిల్వాన్లను పెట్టి స్థానికులు, మహిళలను బెదిరించడంతో తాను చేయి చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. రియల్టర్ల పేరుతో దౌర్జన్యానికి దిగుతున్నారని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు సమస్య వివరించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ ఏకశిలానగర్‌లో జరిగిన ఘటన వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తున్నామని చెప్పారు. ఈటల బుధవారం బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎవరినీ కొట్టాలనుకోలేదు. కానీ రాష్ట్రంలో వ్యవస్థ విఫలమైంది. పేదల బాధ చూసి ఆవేశం వచ్చింది. పేదల జోలికి వచ్చినా, మహిళలను ఇబ్బంది పెట్టినా విడిచిపెట్టబోం'అని అన్నారు. భూ అక్రమాలు, కబ్జాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులు పరిష్కరించి ఉంటే బాధితుల పక్షాన తాను చెయ్యెత్తే పరిస్థితి వచ్చేది కాదన్నారు. భూఅక్రమాల దందాల వెనుక ఉన్న దుర్మార్గులెవరో చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. 'సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరు తమ్ముళ్లు హైదరాబాద్ చుట్టుపక్కల భూములను పంచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఎంక్వైరీ చేస్తే ఈ ఘటనల వెనుక ఎవరున్నారో బయటకు వస్తుంది'అని చెప్పారు. భూ అక్రమాలపై సీఎంతోపాటు, మానవ హక్కుల కమిషన్‌కు, లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రూ. 45,500 కోట్ల పెట్టుబడి



జేఎస్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు, జయేష్ రంజన్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల ఉద్యోగాలు లభిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈఓ శ్రీధర్ పిన్నపురెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ ఏర్పాటు మరో మైలు రాయిగా నిలుస్తుందని మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు.

రూ.800 కోట్లతో ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్

రాష్ట్రంలో అధునాతన మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్‌ను రూ.800 కోట్లతో ఏర్పాటు చేసేందుకు జేఎస్‌డబ్ల్యూ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు జేఎస్‌డబ్ల్యూ డిఫెన్స్ అనుబంధ సంస్థ 'జేఎస్‌డబ్ల్యూ యూఏవీ'తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా డ్రోన్ టెక్నాలజీకి తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారే అవకాశముంది.

జీసీసీల హబ్‌గా హైదరాబాద్

మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు హైదరాబాద్ నగరం హబ్‌గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో భాగంగా బుధవారం సీఐఐ, పీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో జరిగిన బ్రేక్‌ఫాస్ట్ ఇంటరాక్షన్‌లో 'డ్రైవింగ్ ఇన్నోవేషన్ అండ్ టాలెంట్: ఇండియాస్ స్ట్రాటజిక్ అడ్వాంటేజెస్ ఇన్ జీసీసీ'అనే అంశంపై శ్రీధర్‌బాబు కీలకోపన్యాసం చేశారు. 'హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యంగల మానవ వనరులు, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం అందుబాటులో ఉంది. జీసీసీలను మరింత వృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ఏఐ, బ్లాక్ చెయిన్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ హెల్త్ తదితర అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి సారించాం. జీసీసీలను ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య ఏర్పడిన అంతరాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నాం'అని శ్రీధర్‌బాబు వివరించారు. ప్రపంచ ఆర్థిక వేదిక వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ క్లాస్ శ్వాబ్‌తో కూడా శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. భవిష్యత్ ఆర్థిక విధానాలను ప్రభా వితం చేసే శక్తిగా తెలంగాణ రాష్ట్రం ఎదుగుతోందని ప్రొఫెసర్ క్లాస్ శ్వాబ్ ప్రశంసించారు.

బాబు కక్ష ఖరీదు.. రూ.3 లక్షల కోట్లు!

భారీగా పెట్టుబడుల అవకాశాన్ని కోల్పోయిన ఏపీ

రెడ్‌బుక్ రాజ్యాంగం, ప్రముఖ పారిశ్రామికవేత్తపై వేధింపులకు చెల్లించిన మూల్యం



- వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గండి
- ఏపీలో పెట్టుబడులకు జేఎస్‌డబ్లూ గ్రూపు విముఖత
- మహారాష్ట్రలో జిందాల్ రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు
- గడ్చిరోలి, నాగ్‌పూర్‌లో ఉక్కు, సోలార్, ఆటోమొబైల్, సిమెంట్ పరిశ్రమలు
- చైనా సంస్థతో కలసి ఈవీలు, బ్యాటరీ తయారీ పరిశ్రమలు
- తెలంగాణలో రూ.800 కోట్లతో జిందాల్ డ్రోన్ టెక్నాలజీ యూనిట్
- దావోస్ వేదికగా బహిర్గతమైన కూటమి సర్కారు నిర్వాకాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎంపీ ఈటల వాస్తవాలు తెలుసుకోవాలి

నిజాలు నిర్ధారించుకోకుండా దాడులు సరికాదు: శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్



పంజగుట్ట (హైదరాబాద్): మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నిజానిజాలు తెలుసుకోకుండా రియల్ ఎస్టేట్ బ్రోకర్లు చెప్పిన మాటలు విని తమ భూముల్లోకి ప్రవేశించి తమ సిబ్బందిపై దాడి చేశారని శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్ట్‌నర్స్ ఆలూరి వెంకటేశ్, విజయభాస్కర్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈటల రాజేందర్ అంటే తమకు ఎంతో గౌరవమని, ఆయన కోరితే స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఆయనకు చూపిస్తామని అన్నారు. స్థల యజమానులమైన తమను కబ్జాదారులుగా, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు అంటూ మాట్లాడటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు చెప్పిన మాటలను ఏకపక్షంగా ఎంపీ నమ్మొద్దని, వాస్తవాలు నిర్ధారించుకోవాలని సూచించారు. ఇప్పటికే దాడికి గురైన వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, తమ స్థలంలోకి ప్రవేశించి ఆక్రమణకు పాల్పడినట్లు, తాము కూడా కేసు పెట్టే యోచనలో ఉన్నామని చెప్పారు. ఘట్‌కేసర్ మండలం, కొర్రెముల గ్రామంలోని సర్వే నెంబర్ 739, 740, 741, 742లో ఉన్న 47.25 ఎకరాల భూమి తాము 2005లో కొనుగోలు చేశామని తెలిపారు.

కిడ్నీ రాకెట్ ఘటనపై త్రిసభ్య కమిటీ ఆరా

వివరాలు సేకరించిన కమిటీ ప్రతినిధులు



కిడ్నీ బాధితులను విచారించేందుకు వచ్చిన త్రిసభ్య కమిటీ ప్రతినిధులు

గాంధీ ఆస్పత్రి: నగరంలోని అలకానంద ఆస్పత్రిలో జరిగిన కిడ్నీ రాకెట్ ఘటనపై త్రిసభ్య కమిటీ ఆరా తీసింది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం కలిసి పలు అంశాలపై సుదీర్ఘ విచారణ చేపట్టింది. అనుమతి లేకుండా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తూ లక్షల్లో దోపిడీకి పాల్పడుతున్న సరూర్‌నగర్‌లోని అలకానంద ఆస్పత్రిని సీజ్ చేసి, అక్కడ చికిత్స పొందుతున్న ఇద్దరు డోనర్స్, మరో ఇద్దరు రిసీవర్లను గాంధీ ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా మాజీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నాగేందర్, ఉస్మానియా నెఫ్రాలజీ, యూరాలజీ హెచ్‌ఓడీలు ప్రొఫెసర్ కిరణ్మయి, ప్రొఫెసర్ మల్లికార్జున్‌లతో త్రిసభ్య కమిటీని నియమించింది. దీంతో కమిటీ సభ్యులు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అనంతరం యూరాలజీ ఆర్ఐసీయూ, నెఫ్రాలజీ విభాగాల్లో చికిత్స పొందుతున్న కర్ణాటక, తమిళనాడులకు చెందిన కిడ్నీ డోనర్స్ నస్రీన్‌బేగం (35), ఫిర్దోస్‌బేగం (40), రిసీవర్స్ రాజశేఖర్ (68), కృపాలత (45)లతో వేర్వేరుగా విచారణ చేపట్టారు. నివేదికను సీల్డ్ కవర్‌లో ప్రభుత్వానికి అందిస్తామన్నారు. గాంధీలో మెరుగైన వైద్యసేవలందించిన తర్వాత నలుగురు బాధితులు క్రమంగా కోలుకుంటున్నారని, ప్రాణాపాయం లేదని తెలిసింది.

హైకోర్టుకు కొత్తగా.. నలుగురు జడ్జీలు

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వుల్లో కేంద్రం పేర్కొంది. మిగతా ముగ్గురు రెండేళ్లు అదనపు న్యాయమూర్తులుగా విధులు నిర్వహిస్తారని.. ఆ తర్వాత శాశ్వత న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపడతారని స్పష్టం చేసింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ ఈ నెల 25న కొత్త న్యాయమూర్తులతో ప్రమాణం చేయించనున్నారు. హైకోర్టు మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా, ప్రస్తుతం 26 మంది ఉన్నారు. ఈ నలుగురితో కలిపి జడ్జిల సంఖ్య 30కి చేరింది. ఇంకా 12 ఖాళీలు ఉండగా, వీటి భర్తీ కోసం న్యాయవాదులు ఎదురుచూస్తున్నారు.

చార్మినార్ టు ఫ్యూచర్ సిటీ!

- హైదరాబాద్, తెలంగాణ ప్రత్యేకతలు చాటేలా పోస్టర్లు
- దావోస్‌లో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

సాక్షి, హైదరాబాద్: దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. 'తెలంగాణ మీన్స్ బిజినెస్'(తెలంగాణ అంటేనే వాణిజ్యం) అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన పెవిలియన్‌ను హైదరాబాద్ ప్రత్యేకతలు చాటేలా తీర్చిదిద్దారు. గతంలో వేర్వేరు రాష్ట్రాలకు వేర్వేరు చోట్ల పెవిలియన్ కేటాయించగా ఈసారి ఇండియన్ గ్యాలరీలోనే అన్ని రాష్ట్రాలు తమ పెవిలియన్లు ఏర్పాటు చేశాయి. హైదరాబాద్ నగర చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి అద్దం పట్టేలా పెవిలియన్‌ను రూపొందించారు. చార్మినార్‌తోపాటు సికింద్రాబాద్ క్లాక్ టవర్, హైటెక్ సిటీ వంటి చిహ్నాలతో రూపొందించిన పోస్టర్లను ప్రదర్శిస్తున్నారు. దేశంలోనే ఉన్నత జీవన ప్రమాణాలతో అత్యంత నివాస యోగ్యంగా హైదరాబాద్‌కు అనుబంధంగా 14 వేల ఎకరాల్లో నిర్మించే ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను వివరించేలా పెవిలియన్‌ను తీర్చిదిద్దారు. ఫ్యూచర్ సిటీలో 6వేల ఎకరాల్లో పర్యావరణ జోన్‌తోపాటు 'వర్క్, లివ్, లెర్న్, ప్లే'కాన్సెప్ట్‌తో ఉండే ఫ్యూచర్ సిటీ నమూనా ప్రదర్శిస్తున్నారు. మెట్రో, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డుతోపాటు మెట్రో విస్తరణ, రీజినల్ రింగు రోడ్డు తదితరాలను ప్రస్తావించారు. వీటితోపాటు నైపుణ్య శిక్షణ కోసం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, ప్రముఖ విద్యా సంస్థలు ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ, నల్సార్ ప్రత్యేకతలను చాటేలా పోస్టర్లు రూపొందించారు.



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 23-1-2025



● స్ఫూర్తి

తానే దిద్దుకున్న బతుకు చిత్రం

బాల్యం పేదరికాన్ని పరిచయం చేసింది. చదువుకు దూరం చేసింది. అనివార్యంగా పెళ్లికి తలవంచాల్సి వచ్చింది. భర్త పట్టించుకోని ఇంటి బాధ్యతను మోయడానికి భుజాలని వ్వాల్సి వచ్చింది. ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా ఐదుసార్లు వదిలి వెళ్లాడు భర్త. ఇద్దరు పిల్లలను పోషించుకోవాలి. తనకు దూరమైన చదువును వారికివ్వాలి. అందుకోసం తానెంతయినా కష్టపడాలి. ఇదీ ఆమెకు జీవితం నిర్దేశించిన దారి. ఆ దారి ఆమెను దేశం ఎల్లలు దాటించింది. పరాయి దేశంలో ఆ భాషలు నేర్చుకుంది. చదువుకుంది. ఆ దేశపు మంత్రిత్వ శాఖలో ఉద్యోగంలో చేరింది. ఆ విధుల్లో ఏకైక మహిళ **రషీదా బేగం షేక్** పరిచయం ఇది.

బతుకు బడి

రషీదా పుట్టింది తమిళనాడులో. ఆమె చిన్నప్పుడే తండ్రి ఆంధ్రప్రదేశ్, తిరుపతి జిల్లాలోని గూడూరుకి వచ్చి స్థిరపడ్డారు. రషీదా బాల్యం, చదువు గూడూరులోనే. ఆమె పాఠశాల చదువు పూర్తయ్యేలోపు తండ్రిపోవడంతో కష్టాలు మొదలయ్యాయి. క్లాసులో ఫస్ట్ ర్యాంకులో చదివిన రషీదకు టెన్త్ క్లాస్ హాల్ టికెట్ తెచ్చుకోవడానికి పాతిక రూపాయలు కష్టమయ్యాయి. చదువు విలువ తెలియని తల్లి కారణంగా రషీదా చదువాగిపోయింది. అడిగిన వారికిచ్చి పెళ్లి చేశారు. వ్యసనపరుడైన భర్త వదిలేసి పోవడంతో ఇద్దరు పిల్లలను పోషించుకోవడానికి వదిన సహాయంతో కువైట్‌కి వెళ్లింది. పిల్లలను అక్క దగ్గర వదిలి కువైట్‌లో ఉద్యోగంలో చేరిన రషీదా లక్ష్యం ఒక్కటే. బాగా డబ్బు సంపాదించాలి, పిల్లల్ని బాగా చదివించాలి. నెలకు నాలుగు వేల రూపాయల ఉద్యోగంతో మొదలైన ఆమె ప్రస్థానంలో ఆమె చేరిన మైలురాయి ఏమిటో తెలుసా? కువైట్ పబ్లిక్ రిలేషన్స్, ఫారిన్ అఫైర్స్ మినిస్ట్రీలో అఫిషియల్ ఫొటోగ్రాఫర్. ఇదేమీ సినిమా కథలా ఒక రీల్‌లో జరిగిపోలేదు. ఆమె ప్రయాణంలో ఒక్కొక్క అడుగూ చిట్టడవిలో దారి వెతుక్కుంటూ సాగింది. ఒక్కొక్క సంఘటన ఒక్కో పాఠం. భాష తెలియక యజమానురాలి ఆదేశం సరిగ్గా అర్థం కాకపోవడం, దాంతో ఆమెకు ఆగ్రహం కట్టలు తెంచుకోవడం, రషీద ఉన్న గది తలుపు వేసి రెండో రోజు వరకు తియ్యకపోవడం... ఇండియాకి వెళ్లిపోదామనిపించిన చేదు అనుభవం. పిల్లల్ని బాగా చదివించాలి... ఒక్కటే లక్ష్యం ఆమెను కువైట్‌లో కట్టిపడేసింది. ఇటాలియన్ వంటల పుస్తకంలోని బొమ్మల ఆధారంగా రకరకాల సలాడ్‌లు చేసి జీతం పెంచుకుంది.

కష్టాల పాఠాలు

రషీదా ఓ రోజు పైకి ఎక్కి కిటికీలను తుడుస్తూ కాలు జారి పడిపోయింది. కాలుకు కట్టు కట్టించారు. ఆ ఒక్కరోజే రెస్ట్. రెండో రోజు చేతి కర్ర ఇచ్చి పని చేయమన్నారు. కాలికి కట్టు, కర్ర సాయంతో నడుస్తూ ఇంటిపనంతా చేయాల్సి వచ్చింది. చిమ్మ చీకటిలోనూ ఒక వెలుగురేఖ ప్రకాశిస్తుందనడానికి నిదర్శనం ఆ ఇంటి అమ్మాయి బ్యూటీషియన్ కావడం. ఆమెకు సహాయం చేస్తూ కోర్సు మొత్తం నేర్చుకుంది రషీదా. బ్యూటీషియన్‌గా పని చేసింది. ఒకరోజు అరబ్ వార్తాపత్రికలో మహిళలకు ఫొటోగ్రఫీలో శిక్షణ, ఉద్యోగం ప్రకటన ఆమెను కొత్త దారి పట్టించింది. ఆ ప్రకటనలో ఆమెకు అర్థమైంది మహిళ ఫొటో, కెమెరా బొమ్మ, జీతం అంకె మాత్రమే. కోర్సులో చేరి ఫొటోగ్రఫీ నేర్చుకుంది. డిగ్రీ ఉంటే ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని చెప్పారెవరో. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ బీకామ్ చేసింది. ఇంగ్లిష్ మాట్లాడడంతో పాటు అరబ్బీ చదవడం, రాయడం కూడా నేర్చుకుంది. గవర్నమెంట్‌లో స్వీపర్ ఉద్యోగం అయినా చేస్తానని తెలిసిన వాళ్లందరినీ అడిగింది. కానీ ఆమె కోసం అఫిషియల్ ఫొటోగ్రాఫర్ ఉద్యోగం ఎదురు చూసింది. ఇప్పుడామె తన కంటూ మినిస్ట్రీలో ఒక అఫిషియల్ క్యాబిన్, పోలీస్ జాకెట్‌తో ఉన్నతస్థాయిలో ఉన్న విజేత. కొడుకులిద్దరూ ఆమె కోరుకున్నట్లే ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

ఇకిగాయ్ నేర్పించింది

ఫొటోగ్రఫీతోపాటు ఫొటోషాప్ కోర్సు నేర్చుకోవడానికి వెళ్లినప్పటికి నాకు కీబోర్డ్ కాదు కదా, మౌస్ కదపడం కూడా రాదు. బ్యూటీషియన్‌గా కొనసాగమని సూచించారు. అప్పుడు నాకెంత ఉక్రోషం వచ్చిందంటే... ఆ మాట అన్న వారి నంబర్ బ్లాక్ చేసేశాను. ఏడాది తర్వాత వారికి ఒక ప్రోగ్రామ్‌కి ఫొటోగ్రాఫర్ అవసరం ఏర్పడినప్పుడు ఎంక్వయిరీ చేస్తే ఎవరో నా పేరు చెప్పారట. వాళ్ల ఈవెంట్ కోసం నన్నే పిలిచారు. మరొక సందర్భంలో నా దుస్తుల కారణంగా చిన్నచూపుకు గురవుతున్నానని తెలిసింది. నేను నేర్చుకున్న మరో పాఠం అది. జపాన్ పుస్తకం ఇకిగాయ్ ద్వారా చాలా తెలుసుకున్నాను. ఉమెన్స్ డ్రైవ్ కోర్సులో ఈ పుస్తకంలోని అంశాలను చేర్చాను. నన్ను నేను మలుచుకున్నట్లే సాటి మహిళలను తీర్చిదిద్దాలనేది నా ఆకాంక్ష.

- రషీదా బేగం షేక్, ఫొటోగ్రాఫర్, మంత్రిత్వ శాఖ, కువైట్

విజేత లక్ష్యం

రషీదా ప్రస్థానం పర్వత శిఖరం చేరిన తర్వాత అక్కడే ఆగిపోలేదు. పరాయి దేశంలో ఒంటరి మహిళకు ఎదురయ్యే కష్టాలను స్వయంగా అనుభవించింది. ఉపాధి కోసం బయటి ప్రాంతాలకు వెళ్లే వారికి మంచి దారి చూపించాలనుకుంది. ఉమెన్స్ డ్రైవ్ ఏపీ పేరులో స్వచ్ఛంద సంస్థను స్థాపించి మహిళలను శిక్షణనిస్తోంది. టైలరింగ్, బ్యూటీషియన్, ఇంగ్లిష్ చదవడం– మాట్లాడడం, కేక్ తయారీ, పెళ్లి మండపాల అలంకరణ వంటి పనుల్లో శిక్షణనిస్తోంది. అలాగే ఉజ్వల భవిష్యత్తు పేరుతో పాఠశాల పిల్లలకు కెరీర్ ఆప్షన్స్ ఎన్ని ఉన్నాయోననే అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తోంది. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇండియాకి వచ్చి పూర్తి స్థాయిలో మహిళలు, పిల్లల కోసం పని చేయాలనేదే తన లక్ష్యం అంటోంది రషీదా బేగం షేక్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



స్వేచ్ఛ ఇక్కడ స్టాచ్యూ

అమెరికా అన్నిట్లో ముందుంటుంది! అభివృద్ధికి ప్రామాణికమని చెప్పుకుంటారు! ఏ మార్పైనా అక్కడే మొదలవుతుందని, దాన్ని ఏ దేశమైనా అనుసరించొచ్చనే నమ్మకం ఆ దేశానిది.. ప్రపంచానిది కూడా! స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ దేశం ప్రపంచానికేమని సెలవిస్తోంది.. కొత్త అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే? ముఖ్యంగా జెండర్ విషయంలో! సాధారణంగా థర్డ్ జెండర్ హక్కుల విషయంలో అమెరికా ప్రపంచానికి మార్గదర్శిగా ఉంది. భద్రమైన, గౌరవప్రదమైన గమ్యంగా ప్రపంచంలోని ఎందరో ట్రాన్స్‌జెండర్స్‌కి ఆశ్రయం ఇచ్చింది. ఆ స్ఫూర్తి మనతో సహా ఎన్నో దేశాలకు స్ఫూర్తినిచ్చింది. వాళ్ల హక్కుల కోసం మన దగ్గరా ఉద్యమాలు సాగాయి. ప్రభుత్వాలు వాళ్లకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వమైతే ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌గా నియమించింది. ట్రాన్స్‌మన్ ఐఆర్‌ఎస్ ఆఫీసర్ అయ్యాడు. గవర్నమెంట్ డాక్టర్ కొలువొచ్చింది. ఇది కొంత మనం అగ్రరాజ్యం నుంచి నేర్చుకున్నదే! అలాంటిది ఆ దేశాధ్యక్షుడు ఇప్పుడు తాము 'థర్డ్ జెండర్‌ను గుర్తించం' అంటూ పాలనా ఉత్తర్వుల మీద సంతకం చేశాడు. ప్రమాణ స్వీకారం అయిన వెంటనే ట్రంప్ చేసిన ముఖ్య సంతకాల్లో అదొకటి. ఇప్పుడిప్పుడే సమాన హక్కుల వైపు అడుగులు వేస్తున్న దేశాలకిది విస్మయమే! ఇప్పటికే మన ఐపీసీలోని 377 సెక్షన్‌కు కొత్త చట్టం బీఎన్నెస్(భారతీయ న్యాయ సంహిత) ప్రత్యామ్నాయం చూపక చాలా ఆందోళనలు తలెత్తాయి. దానికిప్పుడు అమెరికా నిర్ణయాన్ని వత్తాసుగా తీసుకునే ప్రమాదమూ ఉంది. ఈ నేపథ్యం, సందర్భంలో ట్రాన్స్ జెండర్స్, వాళ్ల హక్కుల కార్యకర్తలు ఏమంటున్నారో తెలుసుకునే ప్రయత్నం చేశాం ..

స్టిగ్మా, డిస్క్రిమినేషన్ ఎక్కువవుతాయి



అంతకుముందు అమెరికాలో మొదలైన మీ టూ, బ్లాక్ లైవ్స్ మ్యాటర్‌లాంటి మూవ్‌మెంట్స్ ప్రభావం మన దగ్గరా (దళిత్ లైవ్స్ మ్యాటర్) ఉండింది. కాబట్టి ఇప్పుడు ట్రంప్ డెసిషన్ వల్ల ఎల్‌జీబీటీక్యూని వెస్టర్న్ కాన్సెప్ట్ అని అభిప్రాయపడుతున్న వాళ్లంతా ఇక్కడ దాని రిలవెన్స్‌నే జీరో చేసే చాన్స్ ఉంది. ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీకి సంబంధించిన పాలసీలన్నీ కార్పొరేట్ కంపెనీల్లోనే కనిపిస్తాయి. వాళ్లకు ఉద్యోగాలుండేవీ వాటిల్లోనే! ఇవన్నీ చాలావరకు అమెరికా బేస్డ్‌గానే ఉంటాయి. మిగతా ఎక్కడైనా ఎల్‌జీబీటీక్యూ వాళ్ల ఐడెంటిటీని దాచుకునే ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే గ్లోబల్ బిజినెస్ కోసం ఇండియన్ బిజినెసెస్ కూడా వాళ్ల పాలసీలు కొన్నిటిని ఇంప్లిమెంట్ చేస్తున్నాయి. ఇప్పుడు వాళ్లే తీసేస్తే వీళ్లూ అనవసరమనుకుంటారు. ఉద్యోగాలుండవు. దానివల్ల వాళ్ల ఏజెన్సీలు కూడా పోతాయి. మళ్లీ మునుపటి స్థితికి వచ్చేస్తారు. స్టిగ్మా, డిస్క్రిమినేషన్ ఎక్కువవుతాయి. మన దగ్గర థర్డ్ జెండర్‌కి సంబంధించిన చట్టాలు కొంచెం భిన్నంగా, బలంగా ఉన్నాయి. వాటిని మార్చకపోతే పర్వాలేదు. ఇన్‌ఫ్లుయెన్స్ అయ్యి మారిస్తే మాత్రం ఇబ్బందే! ఇంకో విషయం.. రెండే జెండర్లని గుర్తించడం వల్ల ఆ రోల్స్ కూడా రిజిడైపోయి స్త్రీని ఇంటికే పరిమితం చేసే ప్రమాదం, స్త్రీ మీద హింస మరింత పెరిగే ప్రమాదమూ లేకపోలేదు.

- దీప్తి సిర్లా, జెండర్ యాక్టివిస్ట్

హింస పెట్రేగే ప్రమాదం



జెండర్ విషయంలో ట్రంప్ తీసుకున్న డెసిషన్ వల్ల ఎల్‌జీబీటీక్యూ, లైంగికత విషయంలో సందిగ్ధంలో ఉన్న పిల్లలు హింసకు లోనయ్యే ప్రమాదం ఉంది. పితృస్వామ్య వ్యవస్థ మరింత బలపడి స్త్రీల మీదా హింస పెట్రేగొచ్చు. ఇప్పుడిప్పుడే జెండర్ రైట్స్ మీద అవగాహన, చైతన్యం పెరుగుతున్న క్రమంలో అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ దేశాలపై చాలా ఇంపాక్ట్ చూపిస్తుంది. ట్రాన్స్ జెండర్ల జీవితాలకు రిస్క్ పొంచి ఉంది. ట్రంప్ నిర్ణయాన్ని నిలువరించడానికి అమెరికా ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీ న్యాయపోరాటానికి సిద్ధమైంది. అయితే అదొక్కటే సరిపోదు. ట్రంప్ నిర్ణయ పర్యవసానాలను తెలుపుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రగతిశీలవాదులందరూ సామాజిక పోరాటంతో మద్దతు తెలపాలి.

- రచన ముద్రబోయిన, ట్రాన్స్ రైట్స్, హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్

ఫండ్స్, ఉద్యోగాలు ప్రశ్నార్థకమే!



చాలా విషయాల్లో మాదిరి జెండర్ విషయంలోనూ ట్రంప్ ఆ దేశాన్ని వెనక్కి తీసుకెళ్తున్నాడు. ఎన్నో అమెరికన్ కంపెనీలు మన దగ్గర, ఇతర దేశాల్లో 'డైవర్సిటీ ఈక్విటీ ఇన్‌క్లుజన్' కింద ఎల్‌జీబీటీక్యూ వాళ్లకు ఫండ్స్, ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాయి. ఈ పాలసీల వల్ల అవి ప్రశ్నార్థకమవచ్చు! అంతే కాదు తమకు భద్రమైన ప్లేస్‌గా భావించి అమెరికా వెళ్లిన ఎల్‌జీబీటీక్యూల పరిస్థితేంటి? పాస్‌పోర్ట్‌లో కూడా ట్రాన్స్‌జెండర్ అనే పదం వాడకూడదని చెప్పాడు. ఆ నేపథ్యంలో వేరే దేశాల నుంచి చదువు కోసం, టూరిజం కోసం వెళ్లే ట్రాన్స్‌జెండర్ల సంగతేంటి? భయాందోళనలను కలిగించే విషయమే! ఇంకా చెప్పాలంటే హింసను ప్రేరేపించే నిర్ణయమిది!

- తాషి చోడుప్, బౌద్ధ సన్యాసిని, క్వీర్ ట్రాన్స్ వెల్‌నెస్ సెంటర్ ఫౌండర్, సోషల్ యాక్టివిస్ట్

– సరస్వతి రమ

● న్యూస్‌మేకర్

మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఖోఖో వరల్డ్ కప్ 2025ను మన పురుషుల జట్టు గెలిచింది. అంతకంటే ఘనంగా మహిళాజట్టు కూడా గెలిచింది. బరిలో ఎవరి సత్తా వారిదే అన్నట్టుగా సాగిన ఈ వరల్డ్‌కప్‌లో 23 దేశాలు పాల్గొంటే వారిపై గెలుపుకు మన మహిళాజట్టును ముందుండి నడిపించింది కెప్టెన్ ప్రియాంక ఇంగ్లే. పుణెకు చెందిన ఈ రైతుబిడ్డ ముంబైలో టాక్స్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఆమె పరిచయం.

ఖోఖో వరల్డ్‌కప్ గెలిచిన రైతుబిడ్డ



సరే. ముందు ఏం జరిగిందో చూద్దాం. గ్రూప్ స్టేజ్‌లో ఫస్ట్ మేచ్ పాకిస్తాన్‌తో పడింది. గెలిచారు. ఆ తర్వాత గట్టి జట్లయిన ఇరాన్, సౌత్ కొరియా, మలేసియా జట్లతో గెలిచారు. ఆ తర్వాత గెలుచుకుంటూ వచ్చి క్వార్టర్ ఫైనల్స్‌లో అత్యంత గట్టి జట్టు బంగ్లాదేశ్‌ను మట్టి కరిపించారు. సెమి ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికా పరిస్థితి కూడా అంతే అయ్యింది. ఇక జనవరి 19న ఫైనల్స్. ప్రత్యర్థి జట్టు నేపాల్. ఈ జట్టుకు ఖోఖో బాగా వచ్చు. పైగా యంగ్ ప్లేయర్లు చాలా మంది ఉన్నారు. కాని భారత జట్టులో యంగ్ ప్లేయర్లతో పాటు అనుభవజ్ఞులు కూడా ఉన్నారు. తోడు కెప్టెన్‌గా 15 ఏళ్ల అనుభవం ఉన్న ప్రియాంక ఉంది. ఖోఖోలో టచ్ పాయింట్లు ఉంటాయి. ఫైనల్స్‌లో భారత్ 78 టచ్ పాయింట్లతో నేపాల్‌ను 40 పాయింట్లతో కట్టడి చేసి ఘన విజయం సాధించింది. చరిత్రలో మొట్టమొదటిసారి ఖోఖో వరల్డ్ కప్ జరిగితే (జనవరి 13-19, న్యూఢిల్లీ) 23 దేశాలు పాల్గొంటే వాటన్నింటిని ఓడించి కప్‌ను సొంతం చేసుకుంది భారత మహిళా ఖోఖో జట్టు. అలా ప్రియాంక ఇంగ్లే తన జట్టుతో పాటు చరిత్రలో నిలిచిపోయింది.

ఇంతకాలం క్రికెట్‌కు క్రేజ్ ఉండేది. ఆ తర్వాత కబడ్డీ రంగం మీదకు వచ్చింది. ఇప్పుడు ఖోఖో. ఈ ఆటకు ఒలింపిక్స్‌లో చోటు దక్కితే ఒలింపిక్స్ మెడల్ సాధించడమే తమ లక్ష్యం అంటున్నారు ప్రియాంక ఇంగ్లే. చూడబోతే అదేం పెద్ద విషయం కానట్టుంది.

వీధి ఆట

పుణెలో రైతు కుటుంబంలో జన్మించిన ప్రియాంక తన స్కూల్లో ఐదో ఏట ఖోఖోలో చేరింది. అయితే తల్లిదండ్రులు పెద్దగా ఎంకరేజ్ చేయలేదు. 'ఇది వీధి ఆట. బస్తీల్లో ఆడే ఆట. ఈ ఆటతో ఏం ప్రయోజనం' అన్నారు. అయితే 8వ తరగతి వచ్చేసరికి నేషనల్స్‌కు ఆడటం మొదలుపెట్టింది. మెడల్స్ కూడా సాధించ సాగింది. అప్పుడు తల్లిదండ్రులు మనమ్మాయి బాగా ఆడుతోందని ప్రోత్సహించారు. ప్రియాంక ఇప్పటికి 23 నేషనల్ టైటిల్స్ గెలిచింది. నాల్గవ ఆసియన్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. అయినప్పటికీ ఆమె కెప్టెన్ అవుతానని ఊహించలేదు. వరల్డ్ కప్ 2025 పోటీలు జనవరి 13 నుంచి మొదలవనుండగా 11వ తేదీన, రెండురోజుల ముందు ఆమెను కెప్టెన్‌గా అనౌన్స్ చేశారు. 'మట్టి మీద ఆడే ఆట నుంచి మ్యాట్ మీద ఆడే ఆట వరకూ ఎదిగిన ఖోఖోలో నేనూ సభ్యురాలు కాగలిగినందుకు గర్వించాను' అంటుంది ప్రియాంక.



ట్రోఫీతో...

బరువైన ట్రోఫీ

వరల్డ్ కప్ ప్రారంభమైనప్పటి నుంచి వేదిక మీద ఉంచిన ట్రోఫీని మహిళాజట్టు సభ్యులందరూ తాకి చూశారు. 'అది చాలా బరువున్న ట్రోఫీ. దానిని పట్టుకుని ఫొటో దిగడం సాధ్యం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను' అంటుంది ప్రియాంక. వరల్డ్ కప్ కోసం నెల రోజుల పాటు సాగిన క్యాంప్‌లో కోచ్‌లు 15 మంది గట్టి ప్లేయర్లను తీర్చిదిద్దారు. డిఫెండర్స్, అటాకర్స్, వజీర్స్ అనే మూడు కేటగిరీల్లో ఆటగాళ్లు తర్ఫీదు అవుతారు. ప్రియాంక ఆల్‌రౌండర్. 'ఫైనల్స్‌లో నేపాల్ వస్తుందని మాకు తెలుసు. ఫస్ట్ హాఫ్‌లో వారిని తట్టుకోవడం కొంచెం కష్టమైంది. అయితే సెకండ్ హాఫ్‌లో మేము స్ట్రాటజీ మార్చి గెలిచాం. మా జట్టులో యంగ్ ప్లేయర్ల దూకుడు తగ్గిస్తూ అనుభవంతో ఆడుతూ ఈ గెలుపు సాధించాను' అంది ప్రియాంక.

ఎం.కామ్ చేసి గవర్నమెంట్ టాక్స్ విభాగంలో ఉద్యోగం చేస్తోంది ప్రియాంక. 'ఖోఖో ఆటగాళ్లకు ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తున్నాయి. సాయం కూడా అందుతోంది. రోజులు బాగున్నాయి. మా మహారాష్ట్రలో ఖోఖో బాగా ఆడతాం. మా రాష్ట్రానికి నేను సరైన ట్రోఫీనే అందించాను' అని పొంగిపోయింది ప్రియాంక.

● ఫస్ట్ టైమ్

రాగాల పల్లకిలో రాష్ట్రపతి చెంతకు...



ఝార్ఖండ్‌కు చెందిన ఈ పాతిక మందిలో ఎక్కువ మంది ఆదివాసీ అమ్మాయిలే. ఎవరూ ఎప్పుడూ దిల్లీకి వెళ్లలేదు. వీరికి దిల్లీకి వెళ్లే అవకాశం రావడమే కాదు రిపబ్లిక్ డే వేడుకలలో పాల్గొని, రాష్ట్రపతి ముందు పైపర్ బ్యాండ్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చే అపూర్వ అవకాశం వచ్చింది.

కర్తవ్యపథ్ దగ్గర ప్రదర్శన ఇవ్వడానికి దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన మూడు పాఠశాలల్లో ఝార్ఖండ్‌లోని సింగ్‌భమ్ జిల్లా 'కస్తుర్బాగాంధీ బాలికా విద్యాలయ' ఒకటి. ట్యూన్స్ వాయించడంలో కచ్చితత్వం, ఏకరూపత కారణంగా ఈ పైపర్ బ్యాండ్ ఎంపికైంది. రాష్ట్రపతి ముందు ప్రదర్శన ఇవ్వబోతున్న ఈ గర్ల్ బ్యాండ్ ఉత్సాహంగా ఉంది.

'ఇది చాలా గొప్ప అవకాశం. జీవితంలో ఎప్పుడూ మరచిపోలేని అవకాశం' అంటుంది బ్యాండ్ సభ్యులలో ఒకరైన పార్వతి మహతో.

● మన(సు)లో మాట

మా నాన్నని ఒరిజినల్ కాదు... అంటోంది మా అమ్మ!

మా అమ్మ వయస్సు 45 సంవత్సరాలు. గత రెండేళ్ళ నుంచి వింతగా ప్రవర్తిస్తోంది. మా నాన్నను పట్టుకొని నువ్వు అసలు భర్తవి కాదు, భర్త రూపంలో వచ్చిన డూప్లికేట్ అని సతాయిస్తోంది. మేమెంత నచ్చచెప్పినా, తన వాదన మార్చుకోవడం లేదు. తన భర్త కాదనే వాదనతో ఆయనతో సఖ్యంగా ఉండటం లేదు. వేరే గదిలో పడుకుంటోంది. ఈ ఒక్క విషయం తప్ప మిగతా ఆమె ప్రవర్తన అంతా మామూలుగానే ఉంటుంది. వంటపని, ఇంటిపని బాగానే చేస్తుంది. బంధువులు ఇంటికొచ్చినా వారిని బాగానే చూస్తుంది. కాని వారందరితో మా నాన్నను, తన భర్త కాదనే చెప్పడం వల్ల మా అందరికీ చాలా అవమానంగా ఉంది. మరి ఆమె కావాలనే అలా మాట్లాడుతోందా లేక మా నాన్న గారిపై ఇష్టం లేక అలా చెబుతుందో మాకర్థం కావడం లేదు. ఏం చేయాలో తెలియక, మీరేదైనా పరిష్కారం చూపిస్తారనే ఆశతో రాస్తున్నాను.

- రమ్య, ఆదోని

ఇది మీ అందరికీ క్లిష్ట సమస్యే! కుటుంబ పరువు ప్రతిష్ఠలకు కూడా సంబంధించిన విషయం. అయితే ఒక్క విషయం. మీ అమ్మగారు కావాలని మాత్రం అలా మాట్లాడటం లేదు. మీ నాన్నగారిపై అయిష్టతతోనో, ప్రేమ లేకపోవడం వల్లో కూడా కాదు. ఇది ఒక అరుదైన వింత మానసిక వ్యాధి. మానసిక వైద్య శాస్త్రంలో దీనిని 'కేప్ గ్రాస్ సిండ్రోమ్' అంటారు. దీనినే 'డిల్యూజన్ ఆఫ్ ది డబుల్స్' అని కూడా అంటారు. ఒరిజినల్ వ్యక్తి రూపంలో ఇంకొక వ్యక్తి మారువేషంలో వచ్చాడని భ్రమించి, అందుకు తగ్గట్లుగా ప్రవర్తించడమే ఈ వింత మానసిక వ్యాధి లక్షణం. విఠలాచార్య జానపద సినిమాల్లో లాగా అనిపించే ఈ వింత అనుభవం, మెదడులోని కొన్ని అసాధారణ రసాయనిక చర్యల వల్ల వచ్చే అవకాశముందని తెలిస్తే, చాలా మందికి ఆశ్చర్యంగా అనిపించొచ్చు. కొన్నాళ్ళు పోతే మీ నాన్ననే కాదు, మిమ్మల్ని కూడా డూప్లికేట్ అన్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. మీరన్నట్లు ఆ ఒక్క విషయంలో తప్ప, మిగతా అన్ని విషయాల్లో వారి ప్రవర్తన అంతా నార్మల్‌గానే ఉంటుంది. అందుచేత ఇది మానసిక వ్యాధి అన్న అనుమానం ఎవరికీ రాదు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మీ అమ్మగారిని వెంటనే దగ్గర్లోని సైకియాట్రిస్ట్‌కు చూపించి తగిన వైద్యం చేయిస్తే ఆమె భ్రమలు, భ్రాంతులు పూర్తిగా తొలగి మీ నాన్నను మునుపటిలాగే తన భర్తగా భావించి మునుపటి స్థితికి వస్తుంది. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బ్యూటిప్

అరకప్పు స్ట్రాబెర్రీ గుజ్జులో కోడిగుడ్డు తెల్లసొన రెండు చెంచాలు, ఒక చెంచాడు నిమ్మరసం, రెండు చెంచాల తేనె కలపాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా వేసి ఆరిన తర్వాత కడిగేసుకోవాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తుంటే జిడ్డు తగ్గిపోయి ముఖం మిలమిలలాడుతుంది.



● గార్డెనింగ్ టిప్



ఆవాలను నీళ్లతో కలిపి మెత్తగా నూరి గులాబీ మొక్కల మొదళ్లలో వేస్తే... మొక్కలకు పురుగు పట్టదు.



ఐసీసీ టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్... అగ్రస్థానంలోనే బుమ్రా

దుబాయ్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియాతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో అద్వితీయ ప్రదర్శన కనబర్చిన బుమ్రా తాజా ర్యాంకింగ్స్‌లో 908 పాయింట్లతో 'టాప్' ప్లేస్‌ను మరింత పదిలం చేసుకున్నాడు. భారత్ తరఫున ఒక బౌలర్ సాధించిన అత్యధిక రేటింగ్ పాయింట్లు ఇవే కావడం విశేషం. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (841 పాయింట్లు), దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబడ (837 పాయింట్లు) ఈ జాబితాలో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా (400 పాయింట్లు) కూడా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

ఆరంభం అదిరింది


వరుణ్ చక్రవర్తి

టి20 వరల్డ్ చాంపియన్ భారత్ మరోసారి తమ స్థాయికి తగ్గ ఆటతో అదరగొట్టింది. ఈడెన్ గార్డెన్స్ మైదానంలో కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ఏకపక్షంగా సాగిన పోరులో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. కట్టుదిట్టమైన పేస్, స్పిన్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన టీమిండియా... ఆపై దూకుడైన బ్యాటింగ్‌తో మరో 43 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. భారీ బ్యాటింగ్ బలగం ఉన్న ఇంగ్లండ్ కనీస స్థాయి ప్రదర్శన కూడా ఇవ్వలేక చేతులెత్తేసింది. అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌తో పాటు అభిషేక్ శర్మ మెరుపు ప్రదర్శన భారత జట్టును ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిపాయి. రెండో టి20 మ్యాచ్ శనివారం చెన్నైలో జరుగుతుంది.


వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో లివింగ్‌స్టోన్ క్లీన్ బౌల్డ్

కోల్‌కతా: ఇంగ్లండ్‌తో మొదలైన టి20 సిరీస్‌లో భారత్ 1–0తో ముందంజ వేసింది. బుధవారం జరిగిన తొలి పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. జోస్ బట్లర్ (44 బంతుల్లో 68; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతా వారంతా విఫలమయ్యారు. వరుణ్ చక్రవర్తికి 3 వికెట్లు దక్కగా...అర్ష్‌దీప్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 12.5 ఓవర్లలో 3 వికెట్లకు 133 పరుగులు సాధించి గెలిచింది. అభిషేక్ శర్మ (34 బంతుల్లో 79; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) సిక్సర్లతో చెలరేగి జట్టును గెలిపించాడు.

భారత బౌలర్ల జోరు...

లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ పదునైన బంతులతో ఆరంభంలోనే ఇంగ్లండ్‌ను దెబ్బ తీశాడు. తొలి ఓవర్లో ఫిల్ సాల్ట్ (0)ను అవుట్ చేసిన అతను, తన రెండో ఓవర్లో డకెట్ (4)ను వెనక్కి పంపించాడు. బట్లర్, బ్రూక్ (17) కలిసి కొద్దిసేపు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. పాండ్యా ఓవర్లో నాలుగు ఫోర్లతో బట్లర్ దూకుడు ప్రదర్శించాడు. అయితే ఆ తర్వాత వరుణ్ చక్రవర్తి స్పిన్‌కు ఇంగ్లండ్ కుదేలైంది. ఒకే ఓవర్లో అతను బ్రూక్, లివింగ్‌స్టోన్ (0)లను డగౌట్‌కు పంపించాడు. అనంతరం ఒక ఎండ్‌లో ఇంగ్లండ్ వరుసగా వికెట్లు కోల్పోగా... బట్లర్ ఒక్కడే పోరాడగలిగాడు. 34 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. ఆపై పాండ్యా, అక్షర్ మెరుగైన బౌలింగ్‌కు తోడు చక్కటి ఫీల్డింగ్ కారణంగా ఇంగ్లండ్ 26 పరుగుల వ్యవధిలో తర్వాతి 4 వికెట్లు చేజార్చుకుంది.

మెరుపు బ్యాటింగ్...

అట్కిన్సన్ వేసిన రెండో ఓవర్లో సంజు సామ్సన్ (20 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో వరుసగా 4, 4, 0, 6, 4, 4 బాదిన అతను 22 పరుగులు రాబట్టాడు. అయితే ఒకే ఓవర్లో సామ్సన్, సూర్యకుమార్ (0)లను అవుట్ చేసి ఆర్చర్ దెబ్బ తీశాడు. వుడ్ ఓవర్లో అభిషేక్ 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టడంతో పవర్‌ప్లేలో భారత్ 63 పరుగులు చేసింది. ఆ తర్వాత 29 పరుగుల వద్ద ఆదిల్ రషీద్ రిటర్న్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన అభిషేక్ తర్వాతి మూడు బంతుల్లో వరుసగా 4, 6, 6 బాదాడు. ఆపై మరో సిక్స్‌తో 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాతా దూకుడుగా ఆడిన అభిషేక్ భారత విజయానికి 8 పరుగుల దూరంలో అవుటయ్యాడు.

షమీకు నో చాన్స్!

ఫిట్‌నెస్ నిరూపించుకొని దాదాపు 14 నెలల విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన సీనియర్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీకి ఇంకా మ్యాచ్ ఆడే అవకాశం మాత్రం రాలేదు. ఇంగ్లండ్‌తో తొలి టి20 కోసం ప్రకటించిన టీమ్‌లో అనూహ్యంగా అతనికి చోటు దక్కలేదు. దీనికి మేనేజ్‌మెంట్ ఎలాంటి కారణం చెప్పలేదు. జట్టు కూర్పులో భాగంగా అతడిని పక్కన పెట్టారా లేక పూర్తిగా కోలుకోలేదా అనే విషయంపై స్పష్టత లేదు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 0; డకెట్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 4; బట్లర్ (సి) నితీశ్ రెడ్డి (బి) వరుణ్ 68; బ్రూక్ (బి) వరుణ్ 17; లివింగ్‌స్టోన్ (బి) వరుణ్ 0; బెతెల్ (సి) అభిషేక్ (బి) పాండ్యా 7; ఒవర్టన్ (సి) నితీశ్ రెడ్డి (బి) అక్షర్ 2; అట్కిన్సన్ (స్టంప్డ్) సామ్సన్ (బి) అక్షర్ 2; ఆర్చర్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 12; రషీద్ (నాటౌట్) 8; వుడ్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్)** 132. **వికెట్ల పతనం:** 1–0, 2–17, 3–65, 4–65, 5–83, 6–95, 7–103, 8–109, 9–130, 10–132. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4–0–17–2, హార్దిక్ పాండ్యా 4–0–42–2, వరుణ్ చక్రవర్తి 4–0–23–3, అక్షర్ పటేల్ 4–1–22–2, రవి బిష్ణోయ్ 4–0–22–0.

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) అట్కిన్సన్ (బి) ఆర్చర్ 26; అభిషేక్ శర్మ (సి) బ్రూక్ (బి) రషీద్ 79; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) ఆర్చర్ 0; తిలక్‌వర్మ (నాటౌట్) 19; పాండ్యా (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (12.5 ఓవర్లలో 3 వికెట్లకు) 133. **వికెట్ల పతనం:** 1–41, 2–41, 3–125. **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 4–0–21–2, అట్కిన్సన్ 2–0–38–0, మార్క్ వుడ్ 2.5–0–25–0, రషీద్ 2–0–27–1, ఒవర్టన్ 1–0–10–0, లివింగ్‌స్టోన్ 1–0–7–0.

తొలి టి20లో భారత్ ఘన విజయం

- 7 వికెట్లతో ఇంగ్లండ్ చిత్తు
- చెలరేగిన అభిషేక్ శర్మ
- 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి
- రాణించిన అర్ష్‌దీప్, అక్షర్, పాండ్యా
- శనివారం చెన్నైలో రెండో టి20

97 అంతర్జాతీయ టి20ల్లో అర్ష్‌దీప్ సింగ్ వికెట్ల సంఖ్య. భారత్ తరఫున అత్యధిక వికెట్లు సాధించిన ఆటగాడిగా అతను నిలిచాడు. ఇప్పటి వరకు అగ్రస్థానంలో ఉన్న యుజువేంద్ర చహల్ (96)ను అర్ష్‌దీప్ అధిగమించాడు.


అభిషేక్ శర్మ

సెమీస్‌లో స్వియాటెక్



మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో స్టార్ ప్లేయర్లు ఇగా స్వియాటెక్ (పోలాండ్), యానిక్ సినెర్ (ఇటలీ) తమ దూకుడు కొనసాగిస్తున్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ స్వియాటెక్ వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ వరుస సెట్‌లలో నెగ్గగా... పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సినెర్ కూడా వరుస సెట్‌లలో తన ప్రత్యర్థిని చిత్తు చేశాడు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 6–1, 6–2తో ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా)పై గెలిచింది. 89 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ కేవలం మూడు గేమ్‌లు మాత్రమే కోల్పోయింది. నవారో సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన స్వియాటెక్ 22 విన్నర్స్ కొట్టింది. మరో క్వార్టర్ ఫైనల్లో 19వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 3–6, 6–3, 6–4తో స్వితోలినా (ఉక్రెయిన్)ను ఓడించి మూడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో బదోసా (స్పెయిన్)తో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా (బెలారస్); కీస్‌తో స్వియాటెక్ తలపడతారు.

షెల్టన్ తొలిసారి...

పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ యానిక్ సినెర్ టైటిల్ నిలబెట్టుకునే దిశగా మరో అడుగు వేయగా... అమెరికా రైజింగ్ స్టార్ బెన్ షెల్టన్ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో సినెర్ 6–3, 6–2, 6–1తో ఎనిమిదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై... షెల్టన్ 6–4, 7–5, 4–6, 7–6 (7/4)తో లొరెంజో సొనెగో (ఇటలీ)పై గెలుపొందారు. డిమినార్‌తో 1 గంట 48 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో సినెర్‌కు ఏ దశలోనూ ఇబ్బంది ఎదురుకాలేదు. 27 విన్నర్స్ కొట్టిన సినెర్... ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



క్యూటీ... గెట్ వెల్ సూన్


వీల్ చైర్‌లో రష్మిక

"జిమ్‌లో కాలికి గాయమైంది. ఇంకొన్ని వారాలు షూటింగ్స్‌కి బ్రేక్ ఇచ్చాను. 'సికందర్, థామా, కుబేర' చిత్రదర్శకులకు సారీ" అని పది రోజుల క్రితం సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు రష్మికా మందన్నా. ఇంటి పట్టునే బెడ్ రెస్ట్‌లో ఉన్న ఆమె బుధవారం ముంబై వెళ్లడానికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. ముఖానికి మాస్క్ పెట్టుకున్న రష్మిక కారు దిగి, కుంటుకుంటూ నాలుగైదు అడుగులు వేసి, వీల్ చైర్‌లో ఎయిర్‌పోర్టు లోపలికి వెళ్లారు. ఇంత కష్టపడుతూ రష్మిక ఎందుకు ప్రయాణం చేశారంటే... తాను కథానాయికగా నటించిన హిందీ చిత్రం 'ఛావా' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వెళ్లడానికి. ఈ ఈవెంట్‌లోనూ ఆమె నడవడానికి ఇబ్బందిపడుతుంటే 'ఛావా' చిత్రకథానాయకుడు విక్కీ కౌశల్ సపోర్ట్ చేశారు. ఇక ఎయిర్‌పోర్టు వీడియో, ఈ వేడుక వీడియో రెండూ వైరల్‌గా మారాయి. దాంతో రష్మిక ఫ్యాన్స్ క్యూటీ... గెట్ వెల్ సూన్ అని, మిమ్మల్ని ఇలా చూడలేకపోతున్నామనీ... ఇలా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు.

కాళీ వస్తున్నాడు


విక్రమ్


విక్రమ్ హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'వీర ధీర సూరన్ పార్ట్ 2'. ఈ సినిమాలో ఆయన ఓ కిరాణా కొట్టు యజమాని. పేరు కాళీ. మంచి ఫ్యామిలీ మేన్. అయితే ఒక భయంకరమైన క్రైమ్ నెట్‌వర్క్‌తో ఈ కాళీకి సంబంధం ఉంటుంది. మరి... కాళీ సీక్రెట్ మిషన్ ఏంటి? అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందిందని సమాచారం. ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషారా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం మార్చి 27న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగులో ఎన్వీఆర్ సినిమాస్ విడుదల చేయనుంది. "పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం అందర్నీ అలరించేలా ఉంటుంది" అని మేకర్స్ పేర్కొన్నారు.

చలో కారైకుడి


ప్రభాస్

హీరో ప్రభాస్ తమిళనాడుకు వెళ్లారట. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' అనే పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ఇమాన్వీ ఎస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ వారంలో తమిళనాడులో ప్రారంభం కానుందని తెలిసింది. కారైకుడి, మధురై లొకేషన్స్‌లో ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట. ఇక ఈ సినిమాలో ఓ బ్రాహ్మణ యువకుడి పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని, సినిమాలో దేవీపురం అనే బ్యాక్‌డ్రాప్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది.

బ్యాడ్ బాయ్


నాగశౌర్య

నేను బ్యాడ్ బాయ్ అంటున్నారు నాగశౌర్య. వెండితెరపై బ్యాడ్ బాయ్ కార్తీక్‌గా కనిపించనున్నారు ఈ హీరో. నాగశౌర్య పుట్టినరోజు (జనవరి 22) సందర్భంగా ఈ తాజా చిత్రం టైటిల్‌ని ప్రకటించి, లుక్‌ని రిలీజ్ చేశారు. 'బ్యాడ్ బాయ్ కార్తీక్' టైటిల్‌తో రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వంలో శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. "ఇది యాక్షన్ ప్యాక్డ్ మూవీ. షూటింగ్ దాదాపు పూర్తి కావస్తోంది" అని చిత్రబృందం పేర్కొంది. నాగశౌర్య సరసన విధి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సముద్ర ఖని, వీకే నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్, శ్రీదేవీ విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమేరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జయరాజ్.

యాక్షన్... కామెడీ


విశాల్

విశాల్ హీరోగా సుందర్. సి దర్శకత్వంలో రూపొందిన 'మదగజరాజా' చిత్రం జనవరి 12న తమిళంలో రిలీజ్ అయింది. ఈ చిత్రానికి మంచి స్పందన లభించిందని యూనిట్ పేర్కొంది. కాగా ఈ నెల 31న సత్య కృష్ణన్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ సినిమా తెలుగులో విడుదల కానుంది. "విశాల్ పవర్‌ఫుల్ యాక్షన్, సంతానం కామెడీ ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్" అని యూనిట్ పేర్కొంది. ఇక 'మదగజరాజా' పన్నెండేళ్ల క్రితమే రూపొందింది. కానీ రిలీజ్ కాలేదు. చివరికి తమిళంలో ఈ పొంగల్‌కి రిలీజైంది.

ఆ విషయంలో నేను శ్రీమంతుడిని

- అనిల్ రావిపూడి



"దర్శకుడిగా బ్లాక్‌బస్టర్ మూవీ తీయాలనే నా కలని తొలి సినిమా 'పటాస్'తోనే నెరవేర్చుకోగలిగాను. నా బలం ఏంటో విశ్లేషించుకుంటూ, నా గత చిత్రాల ప్రభావం ప్రస్తుత మూవీస్‌పై పడకుండా జాగ్రత్త పడుతూ, ఆడియన్స్‌కు దగ్గరయ్యేలా కథ రాసుకోవడమే నా సక్సెస్ సీక్రెట్" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. 'పటాస్, ఎఫ్ 2, రాజా ది గ్రేట్, సరిలేరు నీకెవ్వరు, సంక్రాంతికి వస్తున్నాం' వంటి సినిమాలతో అగ్ర దర్శకుల్లో ఒకరిగా రాణిస్తున్నారు అనిల్ రావిపూడి. దర్శకుడిగా ఆయన జర్నీకి నేటి (జనవరి 23)తో పదేళ్లు. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో అనిల్ రావిపూడి చెప్పిన విశేషాలు.

- నా పదేళ్ల కెరీర్‌లో నేను చేసిన ప్రతి సినిమా ఓ డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. ప్రతి సినిమాకు ఒకొక్క మెట్టు ఎక్కించి, ఫైనల్‌గా ఈ పొంగల్‌కి 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో ఆడియన్స్ నాకు అద్భుతమైన విజయాన్ని అందించారు. ఆడియన్స్ నుంచి నాకు లభించిన ప్రేమే నా ఆస్తి. ఆ విషయంలో నేను శ్రీమంతుడిని. ఇక నా కెరీర్‌లోనే 'సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లో రూ. 100 కోట్ల షేర్, వన్ వీక్‌లో రూ. 200 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి హిస్టరీ క్రియేట్ చేసింది. ఫ్యామిలీ మూవీస్‌కి ఈ బలం ఉందని 'సంక్రాంతికి వస్తున్నాం'తో ఆడియన్స్ స్ట్రాంగ్‌గా స్టేట్మెంట్ ఇచ్చారనిపిస్తోంది.
- 'పటాస్'కు ముందు దర్శకుడ్ని కావడానికి నేను ఎక్కని కాంపౌండ్ లేదు. చాలామంది హీరోలను కలిశాను. నన్ను నమ్మి, కల్యాణ్ రామ్‌గారు చాన్స్ ఇచ్చారు. అందుకే నా సక్సెస్ క్రెడిట్ ఆయనకే దక్కుతుంది.
- దర్శకులు ఈవీవీగారితో కొందరు నన్ను పోల్చడాన్ని బిగ్గెస్ట్ కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను. గొప్ప బాధ్యత కూడా. జంధ్యాలగారి సినిమాలంటే చాలా ఇష్టం. ఆయన నాకో స్ఫూర్తి. వెంకటేశ్, బాలకృష్ణగార్లతో సినిమాలు చేశాను. చిరంజీవిగారితో నెక్ట్స్ మూవీ చేయబోతున్నాను. నాగార్జునగారితో 'హలో బ్రదర్' లాంటి మూవీ చేయాలని ఉంది.

బెదిరింపులకు భయపడలేదు

- గూడూరు నారాయణ రెడ్డి


నారాయణ రెడ్డి, ఇంద్రజ, సత్యనారాయణ, నాగ మహేశ్

బాబీ సింహా, వేదిక, అనిష్కా త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రజాకార్'. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది మార్చి 15న విడుదలైంది. ఈ నెల 24 నుంచి ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. బుధవారం విలేకరుల సమావేశంలో ఇంద్రజ మాట్లాడుతూ– "ఈ మూవీలో చాకలి ఐలమ్మ పాత్ర చేయడానికి ఆమె చరిత్ర తెలుసుకున్నాను" అన్నారు. "18 ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు అప్లై చేస్తే, 15 ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు మా మూవీ ఎంపికైంది. ఎన్నో అవార్డులు వచ్చాయి" అని చెప్పారు యాటా సత్యనారాయణ. "ఈ సినిమా నిర్మించే క్రమంలో నన్ను, నా కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించినా భయపడలేదు. డబ్బు, ఎంటర్‌టైన్మెంట్ కోసం సినిమాలు చేస్తుంటారు. కానీ మేం 'రజాకార్'ని ఓ బాధ్యతతో చేశాం" అని తెలిపారు గూడూరు నారాయణ రెడ్డి.

నా పదేళ్ల కెరీర్‌లో సుబ్బు నా ఫేవరెట్

- అనుపమా పరమేశ్వరన్


అనుపమ, దర్శన, సంగీత

అనుపమా పరమేశ్వరన్, సంగీత, దర్శనా రాజేంద్రన్ లీడ్ రోల్స్‌లో నటించిన తాజా చిత్రం 'పరదా'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను డిజిటల్‌గా రిలీజ్ చేశారు దుల్కర్ సల్మాన్. హైదరాబాద్‌లో జరిగిన 'పరదా' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ– "నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లు అవుతుంది. ఈ పదేళ్లలో నా మోస్ట్ ఫేవరెట్ మూవీ 'పరదా', ఫేవరెట్ క్యారెక్టర్ సుబ్బు" అన్నారు. "ఈ సినిమాలోని మ్యాజిక్ ఆడియన్స్‌కి నచ్చుతుందని ఆశిస్తున్నాను" అని చెప్పారు దర్శన. "ఇలాంటి గొప్ప కథ రాసిన డైరెక్టర్‌కు థ్యాంక్స్" అని పేర్కొన్నారు సంగీత. "ఉమెన్ ఒరియంటెడ్ సినిమాలకు బిగ్ ఓపెనింగ్స్ వచ్చేలా ఈ మూవీ ఉంటుంది" అని పేర్కొన్నారు ప్రవీణ్. "ఈ సినిమా మలయాళం రైట్స్‌ను దుల్కర్ సల్మాన్ తీసుకున్నారు" అన్నారు విజయ్ డొంకాడ. "ఉత్తరాంధ్ర నుంచి ఓ నిర్మాత వచ్చి ఈ మూవీ చేయడం చాలా సంతోషంగా ఉంది. మహిళా సాధికారత ఉన్న ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్. "ఈ సినిమా తీయడం మాకు 'బాహుబలి'లాంటి ప్రయత్నం" అని స్పష్టం చేశారు శ్రీధర్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
567	131
76,405	23,155

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

● నాస్‌డాక్	20,046	▲ 289
● డోజోన్స్	44,127	▲ 101
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,545	▼ 3
● డాక్స్	21,254	▲ 212
● షాంఘై	3,214	▼ 29
● నికాయ్	39,646	▲ 618

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	80,194	▲ 741
బంగారం (22 క్యారట్)	79,873	▲ 738
వెండి (కిలో)	91,248	▲ 715

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసబీఐ	85.90	86.92
£	బ్రిటన్ పౌండ్	ఎసబీఐ	104.90	107.76
€	యూరో	ఎసబీఐ	88.54	91.16
¥	జపాన్ ఎన్ (100)	ఎసబీఐ	55.11	56.49
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎసబీఐ	52.98	55.18
S$	సింగపూర్ డాలర్	ఎసబీఐ	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.19	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83

పసిడి రికార్డు @ రూ.82,730



న్యూఢిల్లీ: పసిడి ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో కొత్త రికార్డు సృష్టించింది. పూర్తి స్వచ్ఛత (99.9) 10 గ్రాముల ధర రూ.630 ఎగసి రూ.82,700కు ఎగసింది. ఇక 99.5 స్వచ్ఛత ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి రూ.82,330కి చేరింది. అంతర్జాతీయ పటిష్ట ట్రేడింగ్ ధోరణులకు తోడు దేశీయంగా ఆభరణాల వర్తకులు, రిటైలర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు, డాలర్ మారకంలో రూపాయి బలహీన ధోరణి పసిడికి కలిసి వస్తున్న అంశమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. వరుసగా ఆరు రోజుల నుంచి పసిడి ర్యాలీ కొనసాగుతోంది. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాల్లో ఇంకా అస్పష్టత కొనసాగుతుండడంతో ఇన్వెస్టర్లు అత్యుత్తమ పెట్టుబడి మార్గంగా తక్షణం పసిడివైపు చూస్తుండడం ఈ యెల్లో మెటల్ విలువ అంతర్జాతీయ పెరుగుదలకు కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకూ న్యూఢిల్లీలో 99.9, 99.5 స్వచ్ఛత రికార్డు ధరలు వరుసగా రూ.82,400, రూ.82,000గా (2024 అక్టోబర్ 31) ఉన్నాయి.

వేతన జీవులను కనికరించేనా?



- బడ్జెట్‌లో ఆదాయపన్ను తగ్గింపుపై ఆశలు
- పరిశ్రమ వర్గాలు, నిపుణుల సానుకూల సూచనలు


న్యూఢిల్లీ: బడ్జెట్ 2025పై మధ్య తరగతి, వేతన వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. ఆదాయపన్ను ఉపశమనం లభిస్తుందన్న అంచనాలతో ఉన్నాయి. పారిశ్రామిక, వాణిజ్య సంఘాలు, ఆర్థికవేత్తలు సైతం పన్ను తగ్గించడం ద్వారా ప్రజల చేతుల్లో ఆదాయం మిగిలించొచ్చని, ఇది మందగించిన వినియోగానికి ప్రేరణనిస్తుందని ఆర్థిక మంత్రికి సూచించడం గమనార్హం. దీంతో వ్యక్తిగత ఆదాయపన్ను పరంగా కొంత ఉపశమనం కల్పించొచ్చన్న అంచనాలు పెరిగాయి. ఇదే కనుక నిజమైతే అది వినియోగానికి ఊతమిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా బేసిక్ ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని పెంచొచ్చని, పన్ను శ్లాబుల్లో సర్దుబాట్లు చేయొచ్చని, స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. వీటికితోడు పన్ను నిబంధనల్లో మార్పుల ద్వారా పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గించొచ్చని భావిస్తున్నారు.

అంచనాలు ఇలా..

- నూతన పన్ను విధానంలో బేసిక్ పన్ను మినహాయింపు ఆదాయ పరిమితి రూ.3లక్షలు. రూ.3–7 లక్షల ఆదాయంపై 5 శాతం పన్ను అమల్లో ఉంది. రానున్న బడ్జెట్‌లో ఈ బేసిక్ మినహాయింపును రూ.5లక్షలకు పెంచొచ్చని తెలుస్తోంది. అప్పుడు రూ.3–7 లక్షల శ్లాబు కాస్తా రూ.5–7 లక్షలుగా మారుతుంది. దీంతో మొత్తం మీద రూ.10,000 మేర పన్ను ఆదా అవుతుంది.
- 7–10 లక్షల ఆదాయంపై 10% పన్ను ప్రస్తుతం అమల్లో ఉంది. అలాగే, రూ.10–12 లక్షల ఆదాయంపై 15 శాతం పన్ను అమలవుతోంది. వీటిల్లో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చు.
- రూ.12–15 లక్షల ఆదాయంపై 20 శాతం పన్ను ప్రస్తుతం అమలవుతోంది. బడ్జెట్‌లో దీన్ని రూ.12–18 లక్షలకు సవరించొచ్చని భావిస్తున్నారు. 30 శాతం పన్నును రూ.18లక్షలకుపైన ఆదాయం ఉన్న వారికి వర్తింపచేసే అవకాశం ఉంది. ఇది ఆచరణలోకి వస్తే రూ.18లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి రూ.3లక్షల ఆదాయంపై 30 శాతం రూపంలో సుమారు రూ.90వేల వరకు ఆదా అవుతుంది.
- రూ.18 లక్షలకు పైన ఆదాయం కలిగిన వారికి ఎలాంటి ఊరట ఉండకపోవచ్చు.
- నూతన పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.75,000గా ఉంది. దీన్ని రూ.1,00,000కు పెంచొచ్చని తెలుస్తోంది. నిజానికి రూ.50,000గా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను గత బడ్జెట్‌లో రూ.75,000కు పెంచారు. మొత్తం ఆదాయంలో దీన్ని నేరుగా మినహాయించుకోవచ్చు. పాత విధానంలో ఇది కేవలం రూ.50,000గానే కొనసాగుతోంది. 72 శాతం మంది కొత్త విధానంలోనే పన్ను రిటర్నులు సమర్పించారు. పెద్దగా పన్ను మినహాయింపుల్లేని, సరళతర నూతన పన్ను విధానంలోకి క్రమేణా అందరినీ తీసుకురావడం కేంద్రం లక్ష్యంగా ఉన్నట్టు కనిపిస్తోంది. కనుక మరిన్ని పన్ను ప్రయోజనాలు కొత్త విధానంలో కల్పించడానికే ఆర్థిక మంత్రి పరిమితం కావచ్చు.



ఆకర్షణీయంగా కొత్త పన్ను విధానం!



- మరింత మందిని ఇందులోకి తీసుకురావడంపై దృష్టి
- 5 % పన్ను శ్లాబులో మార్పు: రూ.10,000 వరకు ఆదా
- 30 శాతం పన్ను శ్లాబులోనూ మార్పు: రూ.90,000 వరకు ఆదా

- రూ.2.5 లక్షలు మించిన పీఎఫ్ వడ్డీపై టీడీఎస్‌ను, ఉపసంహరణ వరకు వాయిదా వేసే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇ–సాప్‌లను విక్రయించినప్పుడే పన్ను చెల్లించేలా అనుమతించాలని, ఎన్‌ఆర్‌ఐల ఇల్లు విక్రయంపై టీడీఎస్ నుంచి మినహాయింపులు కల్పించాలన్న డిమాండ్లు సైతం ఉన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం 16,736 కోట్లు



- క్యూ3లో 2 శాతం వృద్ధి
- స్వల్పంగా పెరిగిన మొండిబకాయిలు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో స్టాండెలోన్ నికర లాభం 2% నామమాత్ర వృద్ధితో రూ. 16,736 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 16,373 కోట్లు ఆర్జించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 17,258 కోట్ల నుంచి రూ. 17,657 కోట్లకు స్వల్పంగా బలపడింది. రుణ వృద్ధి నెమ్మదించడం ప్రభావం చూపింది. అయితే మొత్తం ఆదాయం రూ. 1,15,016 కోట్ల నుంచి రూ. 1,12,194 కోట్లకు క్షీణించింది.

వడ్డీ ఆదాయం ప్లస్...

ప్రస్తుత సమీక్షా కాలంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 8 శాతం పుంజుకుని రూ. 30,650 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం 3 శాతం వృద్ధితో రూ. 11,450 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 3.43 శాతం వద్ద నిలకడను చూపాయి. ఆస్తుల (రుణాల) నాణ్యత విషయానికివస్తే తాజా స్లిప్పేజీలు రూ. 6,400 కోట్లుగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 1.26 శాతం నుంచి 1.42 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.31 శాతం నుంచి 0.46 శాతానికి ఎగశాయి. అనుబంధ సంస్థలలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర లాభం రూ. 470 కోట్లను తాకగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ రూ. 410 కోట్లు, అసెట్ మేనేజ్‌మెంట్ రూ. 640 కోట్లు, సెక్యూరిటీస్ రూ. 270 కోట్లు చొప్పున లాభాలు ఆర్జించాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.4 శాతం లాభంతో రూ. 1,665 వద్ద ముగిసింది.

హైదరాబాద్‌లో మెల్ట్‌వాటర్ ఏఐ హబ్

Meltwater

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మీడియా ఇంటెలిజెన్స్ సేవల సంస్థ మెల్ట్‌వాటర్.. హైదరాబాద్‌లో తమ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా 50 ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీకి భారత్‌లో ఇది నాలుగో కార్యాలయం కాగా అంతర్జాతీయ స్థాయిలో రెండో ఆర్ అండ్‌డీ కేంద్రం. ఇది తమకు ఏఐ (కృత్రిమ మేధ) హబ్‌గా ఉంటుందని కంపెనీ వివరించింది. మూడు నెలల వ్యవధిలో 20 మంది పైగా సిబ్బందిని నియమించుకోగా, తొలి త్రైమాసికంలో దీన్ని రెట్టింపు చేసుకోనున్నామని సంస్థ సీటీవో ఆదిత్య జామి పేర్కొన్నారు.

హెచ్‌యూఎల్ లాభం అప్



- క్యూ3లో రూ. 2,989 కోట్లు
- ఐస్‌క్రీమ్ బిజినెస్ విడదీత
- మినిమలిస్ట్ బ్రాండ్ కొనుగోలు

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 19 శాతం పైగా ఎగసి రూ. 2,989 కోట్లకు చేరింది. ప్యూరిట్ బిజినెస్ విక్రయం ఇందుకు సహకరించింది. రూ. 507 కోట్ల అనూహ్య లబ్ధి లభించిదిది. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ. 2,508 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 15,781 కోట్ల నుంచి రూ. 16,050 కోట్లకు బలపడింది.

1:1 నిష్పత్తిలో క్వాలిటీ వాల్స్ షేర్లు

క్వాలిటీ వాల్స్(ఇండియా) పేరుతో ఐస్‌క్రీమ్ బిజినెస్‌ను విడదీసేందుకు బోర్డు అనుమతించింది. దీంతో హెచ్‌యూఎల్ వాటాదారులకు ప్రతి 1 షేరుకి 1 క్వాలిటీ వాల్స్ షేరు లభిస్తుంది. బ్యూటీ ప్రీమియం బ్రాండ్ మినిమలిస్ట్ సంస్థ అప్ రైజింగ్ సైన్స్‌లో 90.5% వాటా కొనుగోలు చేయనున్నట్లు హెచ్‌యూఎల్ పేర్కొంది. ఇందుకు రూ. 2,955 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో రూ.2,670 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపింది.

బీఎస్‌ఈలో హెచ్‌యూఎల్ షేరు నామమాత్ర లాభంతో రూ. 2,343 వద్ద ముగిసింది.

చివర్లో కొనుగోళ్లు

బ్యాంకులు, ఐటీ షేర్లకు డిమాండ్



ముంబై: ట్రేడింగ్ చివర్లో లభించిన కొనుగోళ్ల అండతో దేశీయ స్టాక్ సూచీలు బుధవారం పుంజుకున్నాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్ లభించింది. ఫలితంగా సెన్సెక్స్ 567 పాయింట్లు పెరిగి 76,405 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 131 పాయింట్లు బలపడి 23,155 వద్ద నిలిచింది. స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రథమార్థమంతా స్వల్ప శ్రేణిలో ట్రేడయ్యాయి. మిడ్ సెషన్‌లో తర్వాత లాభాలు కోల్పోయాయి. అయితే ఆఖరి గంటలో అనూహ్యంగా కీలక రంగ షేర్లకు దిగువ స్థాయిలో కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 625 పాయింట్లు ఎగసి 76,463 వద్ద, నిఫ్టీ 144 పాయింట్లు దూసుకెళ్లి 23,169 వద్ద గరిష్టాన్ని అందుకున్నాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 1.56%, 1.25 శాతం నష్టపోయాయి.

- రంగాల వారీగా ఐటీ ఇండెక్స్ అత్యధికంగా 2.19%, ప్రైవేటు బ్యాంకుల సూచీ 1.50% లాభపడ్డాయి. మరోవైపు రియల్టీ ఇండెక్స్ 4.53% క్షీణించింది.

23 పైసలు పెరిగిన రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 23 పైసలు బలపడి 86.35 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ పుంజుకోవడం, అమెరికా కరెన్సీ డాలర్ స్వల్పంగా బలహీనపడటం కలిసొచ్చాయి.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
అమెరికాతో వాణిజ్య బంధం పటిష్టం: కార్పొరేట్లు | 11 కోట్లకు ఎన్‌ఎస్‌ఈ ఇన్వెస్టర్లు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మే 25న సివిల్స్ ప్రిలిమ్స్

» 979 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్
» మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ఐఏఎస్(ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్), ఐఎఫ్ఎస్(ఇండియన్ ఫారిన్ సర్వీస్), ఐపీఎస్ (ఇండియన్ పోలీస్ సర్వీస్) తదితర 23 ఉన్నత స్థాయి సర్వీసుల్లో 979 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షకు జనవరి 22వ తేదీ నుంచి ఫిబ్రవరి 11వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రిలిమినరీ పరీక్షను మే 25న నిర్వహించనున్నారు. దీంతోపాటు యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీసులో 150 పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనికి కూడా దరఖాస్తులకు చివరి తేది ఫిబ్రవరి 11.

అర్హతలు

- సివిల్స్ ప్రిలిమ్స్‌కు దరఖాస్తులు చేసుకోవాలనుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అర్హత కోర్సు ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 2025, ఆగస్టు 1వ తేదీ నాటికి 21–32 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు మూడంచెల విధానంలో అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. తొలి దశలో ఆబ్జెక్టివ్ తరహాలో మొత్తం 400 మార్కులకు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో 200 మార్కులకు చొప్పున రెండు ఆబ్జెక్టివ్ పేపర్లు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో ప్రతిభ చూపిన వారిని మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామ్

రెండో దశ మెయిన్ పరీక్ష పూర్తిగా వ్యాపరూప విధానం (డిస్క్రిప్టివ్)లో నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్‌తోపాటు ఒక స్థానిక భాష పరీక్ష 300 మార్కులకు చొప్పున ఉంటాయి. ఇవి అర్హత పరీక్షలు మాత్రమే. వీటి మార్కులను తుది ర్యాంకింగ్‌లో పరిగణనలోకి తీసుకోరు. వీటితోపాటు ఒక ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు, ఒక ఆప్షనల్ సబ్జెక్టుపై రెండు పేపర్లు 250 మార్కులకు చొప్పున మొత్తం 1750 మార్కులకు నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో సత్తాచాటిన అభ్యర్థులను ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 275. ఇలా మొత్తం 2025 మార్కులకు అభ్యర్థులు సాధించిన మార్కులను, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి తుది విజేతలను ప్రకటిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 22.01.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 11.02.2025
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 25.05.2025
- వెబ్‌సైట్: https://upsconline.gov.in/upsc/OTRP/,https://www.upsc.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ-2025

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ)–2025 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహిస్తుంది.

» **అర్హత:** ఇంటర్, డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష
» **పరీక్ష తేదీ:** 27.04.2025.
» **పరీక్ష కేంద్రాలు:** దేశంలోని ప్రధాన నగరాల్లో పరీక్ష జరుగుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** 15.02.2025
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nta.ac.in

అడ్వాన్స్‌డ్.. సన్నద్ధత ఇలా!

జేఈఈ–అడ్వాన్స్‌డ్.. ఐఐటీల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్, బ్యాచిలర్–మాస్టర్స్ డ్యుయల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! నిర్వాహక ఇన్‌స్టిట్యూట్.. ఐఐటీ–కాన్పూర్ జేఈఈ–అడ్వాన్స్‌డ్ -2025 తేదీలను ఖరారు చేసింది. మే 18న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. దీంతోపాటు ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారంతో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్-2025కు దరఖాస్తుకు అర్హత నిబంధనలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు...

» మే 18న జేఈఈ–అడ్వాన్స్‌డ్
» మూడు అటెంప్ట్‌ల అవకాశం లేనట్లే
» 2024, 2025లో ఇంటర్ ఉత్తీర్ణులే అర్హులు
» రెండు పేపర్లుగా జేఈఈ–అడ్వాన్స్‌డ్
» 23 ఐఐటీ క్యాంపస్‌లలో మొత్తం 17,760 సీట్లు

జేఈఈ అడ్వాన్స్‌డ్ తేదీలు కూడా ఖరారయ్యాయి. అర్హత నిబంధనలు గతంలో మాదిరిగానే ఉన్నాయి. పరీక్ష విధానం సైతం గతంలో మాదిరిగానే ఉండొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచి పూర్తి అంకితభావంతో ప్రిపరేషన్ సాగిస్తే బెస్ట్ పర్సంటైల్ సాధించేందుకు అవకాశం ఉంటుంది.

మూడు అటెంప్ట్‌ల నిర్ణయం వెనక్కి

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎప్పటి మాదిరిగా రెండు అటెంప్ట్‌ల విధానాన్నే కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీంతో 2024లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన వారు, అదే విధంగా 2025లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మాత్రమే అడ్వాన్స్‌డ్‌కు అర్హత లభించనుంది.

2023లో ఇంటర్మీడియెట్ తత్సంబంధ కోర్సుల ఫలితాలు 2023 జూన్ 28 తర్వాత పొందిన వారికి మాత్రం జేఈఈ–అడ్వాన్స్‌డ్–2025కు అర్హత కల్పించారు.

అర్హతలు

- 2024, 2025లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులు అక్టోబర్ 1, 2000 సంవత్సరం తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు అక్టోబర్ 1, 1995 తర్వాత జన్మించి ఉండాలి.

మొత్తం 2.5 లక్షల మంది

జేఈఈ మెయిన్‌లో స్కోర్ ఆధారంగా మొత్తం 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఓపెన్ కేటగిరీలో 1,01,250 మందికి, జనరల్ –ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 25 వేల మందికి, ఓబీసీ (ఎన్‌సీఎల్) కేటగిరీలో 67,500 మందికి, ఎస్సీ కేటగిరీలో 37,500 మందికి, ఎస్టీ కేటగిరీలో 18,750 మందికి మెయిన్స్ నుంచి అడ్వాన్స్‌డ్‌కు అర్హత లభిస్తుంది.



జేఈఈ అడ్వాన్స్‌డ్-2025

పరీక్ష విధానం

- జేఈఈ–అడ్వాన్స్‌డ్–2025పరీక్ష గతేడాది మాదిరిగానే ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంటే.. రెండు పేపర్లుగా (పేపర్–1, పేపర్–2)గా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థుల కాంప్రహెన్షన్, రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీని పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. కొన్ని ప్రశ్నలకు సంబంధించి పొరపాటు సమాధానాలకు నెగెటివ్ మార్కుల నిబంధన ఉందని పేర్కొన్నారు.
- పేపర్–1ను 51 ప్రశ్నలతో 180 మార్కులకు, పేపర్–2ను కూడా 51 ప్రశ్నలతో 180 మార్కులకు నిర్వహించే అవకాశం ఉంది. వాస్తవానికి గత మూడేళ్లుగా ప్రశ్నల సంఖ్యలో మార్పులు జరగట్లేదు. దీంతో ఈసారి కూడా పరీక్ష విధానంలో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం:**2025, ఏప్రిల్23
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 2025, మే 2 వరకు
- **ఫీజు చెల్లింపు చివరి తేదీ:** 2025, మే 5
- **పరీక్ష తేదీ:** 2025, మే 18(పేపర్–1 ఉదయం 9 నుంచి 12 వరకు; పేపర్–2 మధ్యాహ్నం 2:30 నుంచి 5 వరకు)
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://jeeadv.ac.in

బెస్ట్ పర్సంటైల్‌కు.. బాట

సిలబస్‌పై పట్టు

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 అభ్యర్థులు.. ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్ అంశాలను పూర్తిగా చదవాల్సిన ఆవశ్యకత నెలకొంది. అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హతగా పేర్కొన్న జేఈఈ–మెయిన్‌లో పలు అంశాలను తొలగించారు. కానీ.. ఇవి జేఈఈ–అడ్వాన్స్‌డ్‌లో ఉంటాయి. విద్యార్థులు మెయిన్ సిలబస్‌తోపాటు అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిశీలించాలి. రెండింటిని అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

ప్రత్యేక సమయం

జేఈఈ–మెయిన్‌లో లేని.. అడ్వాన్స్‌డ్‌లో ఉన్న సిలబస్ అంశాలపై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత మెయిన్‌కు అదనంగా ఉన్న అంశాల రివిజన్‌కు ప్రత్యేక సమయం కేటాయించాలి. అడ్వాన్స్‌డ్‌కు సిలబస్‌ను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగిస్తే.. ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత పొందే అవకాశం ఉంటుంది.

మ్యాథమెటిక్స్

పరీక్షలో ఎంతో కీలకంగా భావించే మ్యాథ్స్‌లో రాణించడానికి కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్‌పై ఫోకస్ చేయాలి. వీటితోపాటు 3–డి జామెట్రీ, కో ఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్ అల్జీబ్రా, ఇంటిగ్రేషన్, కాంప్లెక్స్ నెంబర్స్, పారాబోలా, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. ఆయా టాపిక్స్‌ను ప్రాక్టీస్ చేస్తూ ప్రిపరేషన్ సాగించాలి.

ఫిజిక్స్

న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ కూడా ఉండే ఈ విభాగంలో రాణించేందుకు ఎలక్ట్రో డైనమిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మో డైనమిక్స్‌పై దృష్టిపెట్టాలి. ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్, సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌లో లోతైన అవగాహన పెంచుకోవాలి.

కెమిస్ట్రీ

అభ్యర్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఇందులో మంచి మార్కుల కోసం కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్, ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్,ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. ఆయా అంశాలపై కాన్సెప్ట్‌ల నుంచి వాస్తవ పరిస్థితుల్లో అన్వయం చేసే వరకు సాధన చేయాలి. ఫలితంగా పరీక్షలో అడిగే మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్, మ్యాచింగ్ టైప్ కొశ్చన్స్‌కు సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

బోర్డ్, మెయిన్‌తో సమన్వయం

- అభ్యర్థులు బోర్డ్ పరీక్షలు, జేఈఈ–మెయిన్ పరీక్షతో సమన్వయం చేసుకుంటూ అడ్వాన్స్‌డ్ దిశగా అడుగులు వేయాలి. మెయిన్ తొలి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా మెయిన్ ఎగ్జామ్ అంశాలపైనే పూర్తిగా దృష్టి పెట్టాలి. ఆ తర్వాత బోర్డ్ పరీక్షలకు సమయం కేటాయించాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత అడ్వాన్స్‌డ్‌కు పూర్తి స్థాయి సమయం కేటాయించాలి. ఒకవేళ జేఈఈ–మెయిన్ రెండో సెషన్‌కు కూడా హాజరవుతుంటే.. అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.
- అడ్వాన్స్‌డ్‌కు ప్రిపరేషన్‌లో భాగంగా రివిజన్‌కు అధిక సమయం కేటాయించాలి.
- అప్పటికే తాము పూర్తి చేసుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ వాటికి సంబంధించి ప్రాక్టీస్ కొశ్చన్స్, ప్రీవియస్ కొశ్చన్స్‌ను సాధన చేయాలి.
- ప్రతి వారం వీక్లీ టెస్ట్‌లు, గ్రాండ్ టెస్ట్‌లకు హాజరవుతూ లోటుపాట్లు సరిదిద్దుకోవాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- ఫిజికల్ సైన్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-కంప్యూటర్ అవేర్‌నెస్

క్లుప్తంగా...

ఆ భవనాలను వేగంగా సిద్ధం చేయాలి: సీఎస్



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం, హైకోర్టు, ఢిల్లీలో తెలంగాణ భవన్, ఇందిరా మహిళా శక్తి భవనాలు, రెసిడెన్షియల్ స్కూల్ భవనాలను వేగంగా సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె సచివాలయంలో సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆస్పత్రిని నిర్మించే ప్రాంతంలోని పెట్రోలు బంకులను తొలగించేందుకు రెవెన్యూ, పౌరసరఫరాలు, పోలీసు శాఖలు సంయుక్త కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి భవనాల్లో 16 పూర్తికాగా, మిగతావి సెప్టెంబరు చివరినాటికి పూర్తి చేయాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించి పరిపాలన, అకడమిక్ స్ట్రక్చర్ల విధివిధానాలు రూపొందించాలని విద్యాశాఖ కార్యదర్శిని సీఎస్ ఆదేశించారు.

ఒక టీచర్.. ముగ్గురు విద్యార్థులు



వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండల పరిధి కొత్తగుంపు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారు. అన్ని సబ్జెక్టులు ఆయనే బోధిస్తున్నారు. గతంలో ఈ పాఠశాలలో 20 మంది ఉండగా, డెప్యుటేషన్‌పై కేటాయించిన ఉపాధ్యాయునితో విద్యాబోధన సాగేది. ఆయన తరచూ రాకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపించారు. దీంతో పాఠశాల మొత్తానికి ఒక్కడే విద్యార్థి మిగిలాడు. ఇటీవల డీఎస్సీ పోస్టుల భర్తీలో పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించారు. ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి మరో ఇద్దరిని పాఠశాలలో చేర్పించి.. మొత్తం ముగ్గురికి బోధిస్తున్నారు.

ఆర్మూర్ పసుపుకి భౌగోళిక గుర్తింపు కోసం యత్నాలు

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో పండే పసుపు పంటకు సంబంధించి భౌగోళిక గుర్తింపుకోసం శాస్త్రవేత్తల బృందం ప్రయత్నాలు ప్రారంభించింది. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రధాన పరిశోధకుడు, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య నేతృత్వంలో కమ్మరపల్లి పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు బి.మహేందర్, పి.శ్రీనివాస్, నాబార్డ్ డీడీ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఇదే అంశంపై బుధవారం సమావేశమయ్యారు. భౌగోళిక గుర్తింపు కోసం దరఖాస్తు చేయడానికి కావలసిన వాతావరణ పరిస్థితులు, భూమి లక్షణాలు, ఆర్మూరు పసుపు రకంలో ఉండే ప్రత్యేకమైన లక్షణాలు, ఇక్కడి పసుపు సాగు చరిత్ర వంటి అంశాలపై చర్చించారు.

27న నిధి ఆప్‌కే నికత్

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) సంయుక్తంగా ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలోని 7 జిల్లాల్లో ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు జరగనుంది. ఉద్యోగులు, సంస్థల నుంచి వినతులు, అభ్యంతరాలు, అర్జీలను ఈ కార్యక్రమం ద్వారా స్వీకరిస్తారు. మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో, హైదరాబాద్ జిల్లాలోని రెండు చోట్ల ఈ కార్యక్రమం జరుగుతుందని అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ జి.రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.



పడమటి కొండల్లో వాలిన సూరీడా..

సూర్యోదయం, సూర్యాస్తమయం ఎప్పుడూ మనోహరమే.. పడమటి సంధ్యారాగం ఎప్పుడూ పరవశమే.. మోడువారిన చెట్టు మొదలులోకి.. విలీనమైపోతున్నట్లున్న పడమటి సూరీడు పంచిన ఈ అందాలు ఆదిలాబాద్‌లో కనువిందు చేశాయి.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్
ఆదిలాబాద్

అర్హుల జాబితాలపై అభ్యంతరాలు

- గ్రామసభలో రెండోరోజూ పలుచోట్ల గొడవలు
- మంత్రి ఉత్తమ్ ప్రసంగాన్ని అడ్డుకున్న గ్రామస్తులు
- సుడా మాజీ చైర్మన్‌కు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వటంపై ప్రజల ఆగ్రహం
- 60% సభలు విజయవంతం: ప్రభుత్వం



భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామసభలో లబ్ధిదారుల జాబితాలో తన పేరు రాకపోవడంతో అధికారులతో మహిళ వాగ్వాదం

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారుల ఎంపికకు చేపట్టిన గ్రామసభల్లో బుధవారం రెండోరోజు కూడా పలు చోట్ల గందరగోళం తలెత్తింది. మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు సభల్లో పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన సభకు హాజరయ్యారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పలు గ్రామసభల్లో పాల్గొన్నారు.

ముంపు నుంచి తేల్చండి

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్‌లో జరిగిన గ్రామసభలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రసంగాన్ని మహిళలు అడ్డుకున్నారు. నారాయణపూర్, మంగపేట, చెర్లపల్లిని నారాయణపూర్ ప్రాజెక్టులో ముంపు గ్రామాలుగా ప్రకటించి, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మహిళలు పట్టు వీడకపోవటంతో 3 గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం తెలుపటంతో గందరగోళం ఏర్పడింది.

సుడా మాజీ చైర్మన్‌కు ఇందిరమ్మ ఇల్లు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 41 డివిజన్‌లో జరిగిన వార్డు సభలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో మాజీ కార్పొరేటర్ విశాలిని రెడ్డి పేరు ఉండటంపై బీజేపీ నేతలు అభ్యంతరం తెలిపారు. విశాలిని రెడ్డి మాజీ కార్పొరేటర్ కాగా, ఆమె భర్త శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ (సుడా) మాజీ చైర్మన్. వారికి ఇందిరమ్మ ఇల్లు ఎలా ఇస్తారని ప్రజలు నిలదీశారు. మోర్తాడ్ మండలం ఓడ్యాడ్ గ్రామంలో అర్హుల జాబితాపై గ్రామస్తులు అభ్యంతరం తెలపటంతో అధికారులు సభను అర్ధాంతరంగా ముగించారు.

ఖమ్మంలో రసాభాస

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం గ్రామసభలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం లేదని ప్రజలు అధికారులను నిలదీశారు. కూసుమంచి గ్రామసభలో అనర్హులను జాబితాలో చేర్చారని ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. తిరుమలాయపాలెం మండలంలోని జల్లేపల్లి గ్రామంలో అర్హులకు పథకాలు అందడం లేదని గ్రామస్తులు అధికారులను నిలదీశారు.

మరికొన్ని జిల్లాల్లో..

- నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం ఉజ్జెలి గ్రామంలో ఆత్మీయ భరోసా అర్హుల జాబితాపై గ్రామస్తులు నిరసన తెలిపారు. భూమి లేని కూలీలు 95 మంది ఉంటే, 12 మందినే ఎంపిక చేస్తారా? అని అధికారులను నిలదీశారు. మంచిర్యాల జిల్లా భీమారం, తలమడుగు మండలం రుయ్యాడిలో అర్హుల పేర్లు జాబితాలో లేవని గ్రామస్తులు గొడవకు దిగారు.
- తమ గ్రామంలో ఉన్న డంప్‌యార్డును తొలగించాలని సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామస్తులు గ్రామసభను బహిష్కరించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామసభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.
- యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు ఎం మండలంలోని కూరెళ్లలో గ్రామసభలో గందరగోళం ఏర్పడింది. గ్రామంలో 520 మంది ఇళ్లకోసం దరఖాస్తు చేయగా, 25 మందికే మంజూరు కావడంపై గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం మల్లాపూర్‌లో గ్రామసభ జరుగుతుండగా జాబితాలో పేరు లేదన్న కోపంతో ఓ వ్యక్తి ఆ జాబితా ప్రతులను ఎత్తుకుపోయాడు.

విజయవంతంగా గ్రామసభలు: ప్రభుత్వం

నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపికచేసేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలు విజయవంతంగా కొనసాగుతున్నా యని ప్రభుత్వం ప్రకటించింది. 9,844 గ్రామాలు, వార్డులలో సభలు జరిగాయని, 60 శాతం సభలను విజయవంతంగా నిర్వహించినట్లు బుధవారం తెలిపింది. గ్రామసభల్లో నాలుగు పథకాలకు సంబంధించి ఇప్పటివరకు 10,09,131 దరఖాస్తులు అందినట్లు వెల్లడించింది. రెండో రోజు బుధవారం 3,608 గ్రామ సభలు, 1,055 వార్డు సభలు కలిపి మొత్తం 4,663 సభలను నిర్వహించినట్లు ప్రభుత్వం తెలిపింది. మొత్తం గ్రామీణ ప్రాంతాల్లో 12,914 గ్రామ సభలు, పట్టణ ప్రాంతాల్లో 3,484 వార్డు సభలు కలిపి 16,398 సభలు నిర్వహించాల్సి ఉంది.

విశ్వాసంలో ఒక మెట్టు కిందికి..



ప్రభుత్వం, వ్యాపారాలు, మీడియా, స్వచ్ఛంద సంస్థల పట్ల ప్రజల్లో నమ్మకంపై సర్వే

3వ స్థానానికి పడిపోయిన భారత్

మొదటి స్థానంలో చైనా

ఎడెల్‌మన్ ట్రస్ట్ బారోమీటర్ ర్యాంకింగ్స్ విడుదల

దావోస్: ప్రభుత్వం, వ్యాపారాలు, మీడియా, స్వచ్ఛంద సంస్థల పట్ల ప్రజల్లో విశ్వాసం విషయంలో భారత్ ఒక మెట్టు దిగి మూడో స్థానానికి వచ్చి చేరింది. భారత్‌ను వెనక్కినెట్టి మెరుగైన స్కోర్ కారణంగా ఇండోనేషియా రెండో స్థానాన్ని దక్కించుకుంది. తొలి స్థానం చైనా పరమైంది. ప్రజా సంబంధాల సేవల్లో ఉన్న ఎడెల్‌మన్ సంస్థ 25 ఏళ్లుగా ఏటా రూపొందిస్తున్న ట్రస్ట్ బారోమీటర్ ర్యాంకింగ్స్‌ను ఇటీవల విడుదల చేసింది. 2024 అక్టోబర్ 25 నుంచి నవంబర్ 16 మధ్య 28 దేశాల్లో సర్వే నిర్వహించి ఈ ర్యాంకింగ్స్‌ను రూపొందించారు. 33వేల మంది ఈ సర్వేలో పాలుపంచుకున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు మరింత విశ్వసనీయంగా మారాయని సర్వేలో వెల్లడైంది. ఆయా వ్యవస్థలపై చైనాలో 77 శాతం, ఇండోనేషియాలో 76, భారత్‌లో 75, యూఏఈలో 72 శాతం మంది నమ్మకం వ్యక్తం చేయడంతో విశ్వాస సూచీలో ఇవి మరోసారి అగ్రస్థానాల్లో ఉన్నాయి. అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం లేదని సర్వేలో వెల్లడికావడం గమనార్హం. టాప్–10 ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో ఐదు అతి తక్కువ విశ్వసనీయ దేశాలుగా చోటుసంపాదించాయి. జపాన్ 37 శాతం, జర్మనీ 41, యూకే 43, అమెరికా 47, ఫ్రాన్స్ 48 శాతం ఈ జాబితాలో నిలిచాయి.

ప్రజల్లో ఎవరిపై ఎక్కువ విశ్వాసం? (శాతంలో)

శాస్త్రవేత్తలపై	77
టీచర్లపై	75
తమ సంస్థ సీఈవోలపై	67
దేశ ప్రజలపై	64
పొరుగింటివారిపై	61
ఇతర సంస్థల సీఈవోలపై	53
జర్నలిస్టులపై	52
ప్రభుత్వ పెద్దలపై	47

వార్తలు, సమాచారం విషయంలో నమ్మకం ఇలా...

సెర్చ్ ఇంజన్లు	సంప్రదాయ మీడియా	సోషల్ మీడియా
63%	58%	42%

తాము పనిచేస్తున్న సంస్థల పట్ల విశ్వాసం ఏఏ దేశంలో ఎలా?

ఇండోనేషియాలో	భారత్‌లో	చైనాలో	థాయ్‌లాండ్‌లో	దక్షిణ కొరియాలో
93%	89%	84%	83%	48%

భారత్ ప్రధాన కేంద్రంగా ఇతర దేశాలు కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీల పట్ల ప్రజల విశ్వాసంలో మన దేశం 13వ స్థానానికి పరిమితమైంది. ఈ విషయంలో కెనడా టాప్‌లో నిలిచింది. జపాన్, జర్మనీ, యూకే, ఫ్రాన్స్, యూఎస్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రభుత్వం, వ్యాపార సంస్థలు, మీడియా, స్వచ్ఛంద సంస్థల పట్ల అధిక ఆదాయ దేశాల్లో సగటున 61 శాతం, అల్పాదాయ దేశాల్లో సగటున 48 శాతం మంది మాత్రమే విశ్వాసం వ్యక్తం చేశారు.

అధిక ఆదాయ దేశాల్లోనే..

ఇక అల్పాదాయ దేశాల్లో వ్యాపార సంస్థల పట్ల ప్రజలు తటస్థంగా ఉన్నారు. ఎన్జీవోలు, ప్రభుత్వం, మీడియా విషయంలో భరోసా లేదని చెప్పారు. తక్కువ ఆదాయం ఉన్న జనాభాలో భారతీయ సంస్థల పట్ల విశ్వాసం 65 శాతం ఉంటే, అధిక ఆదాయ వ్యక్తుల విషయంలో ఇది 80 శాతంగా ఉంది. చాలా దేశాల్లో ఎన్నికలు లేదా ప్రభుత్వ మార్పుల ప్రభావం తక్కువగా ఉందని సర్వే వెల్లడించింది. ఏదైనా వార్త విషయంలో విశ్వసనీయ సమాచారమా లేదా మోసగిస్తున్నారా అన్నది తేల్చుకోలేకపోతున్నట్టు 63 శాతం మంది చెప్పారు. ఈ అభిప్రాయాన్ని థాయ్‌లాండ్‌లో 75 శాతం మంది, భారత్‌లో 72 శాతం మంది వ్యక్తంచేశారు.

భార్యను చంపి, ముక్కలు చేసి..

▶ మొదటి పేజీ తరువాయి

చోటు చేసుకుంది.

హత్య చేసి.. ఇంట్లోంచి వెళ్లిపోయిందని...

స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..ప్రకాశం జిల్లా జేపీ చెరువుకు చెందిన విశ్రాంత ఆర్మీ జవాన్ గురుమూర్తి (39), వెంకట మాధవి (35) భార్యాభర్తలు. వారికి 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఐదేళ్ల క్రితం జిల్లెలగూడ న్యూ వేంకటేశ్వర కాలనీలోకి వచ్చి, అద్దె ఇంట్లో ఉంటున్నారు. గురుమూర్తి కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురుమూర్తి విపరీత ప్రవర్తన, అనుమానిస్తూ వేధిస్తుండటంతో భార్య మాధవి ఇబ్బందిపడుతూ ఉండేది. ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 16న గురుమూర్తి, మాధవి మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గురుమూర్తి ఆమెను పదునైన ఆయుధంతో పొడిచి హత్యచేశాడు. కానీ ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయిందని అందరికీ చెప్పాడు. మాధవి తల్లి ఉప్పాల సుబ్బమ్మ తన కూతురు కనిపించకుండా పోయిందని ఈ నెల 18న మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అదుపులోకి తీసుకుని విచారించడంతో..

ఇంట్లో గొడవ జరిగిన సమయంలోనే మాధవిని గురుమూర్తి హత్య చేశాడు. కానీ ఏమీ ఎరగనట్టుగా అత్తమామలతోపాటు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కానీ భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్టు తెలుసుకున్న పోలీసులు గురుమూర్తిపై నిఘా పెట్టారు. అతడి ప్రవర్తన, కదలికలపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకొని విచారించగా.. అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి లోతుగా దర్యాప్తు చేస్తున్నామని మీర్‌పేట్ సీఐ నాగరాజు తెలిపారు.

యూట్యూబ్‌లో చూసి.. కుక్కపై ప్రయోగం..

భార్యను హత్య చేసిన గురుమూర్తి పోలీసులకు ఎలాంటి ఆధారాలు, ఆనవాళ్లు చిక్కకుండా పక్కా ప్లాన్ చేశాడు. శరీరంలోని ఎముకలను పొడిగా ఎలా మార్చాలని యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో శోధించాడు. క్రైమ్, హారర్ సినిమాలు చూశాడు. ముందుగా వీధి కుక్క మీద ప్రయోగం చేశాడు. కుక్కను ఇంట్లోకి తీసుకొచ్చి చంపేశాడు. ముక్కలుగా నరికి, ఎముకలతో సహా కుక్కర్‌లో ఉడకబెట్టాడు. తర్వాత అదే తరహాలో భార్య శరీరాన్ని కూడా ముక్కలు చేసి, ఉడకబెట్టాడు. ఎండబెట్టి, కాల్చి పొడి చేశాడు.



గురుమూర్తి నివాసం ఉంటున్న ఇల్లు

ఆధారాల కోసం పోలీసుల ప్రయత్నాలు..

మాధవి మిస్సింగ్ కేసు నేపథ్యంలో.. జిల్లెలగూడ న్యూవేంకటేశ్వర కాలనీలో గురుమూర్తి, మాధవి నివాసమున్న ఇల్లు, పరిసర ప్రాంతాలను పోలీసులు మూడు రోజులుగా క్షుణ్నంగా పరిశీలించినట్టు తెలిసింది. ఆమె హత్యకు గురై ఉంటే ఏమైనా ఆధారాలు లభిస్తాయేమోనని డ్రైనేజీ మ్యాన్‌హోల్స్, నాలాలను కూడా తెరిచి పరిశీలించినట్టు స్థానికులు తెలిపారు. కానీ నిందితుడిని విచారించిన సమయంలో అసలు సంగతి బయటపడింది. దీనితో ఆయా అంశాలను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. నిందితుడు గురుమూర్తి పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. వారి పిల్లలు మేడ్చల్‌లోని అమ్మమ్మ వాళ్ల ఇంట్లో ఉన్నట్టు తెలిసింది.

ఇంటిపన్ను కింద పింఛన్ జమ

పంచాయతీ అధికారుల నిర్వాకం • ఆందోళనలో వృద్ధులు



కొడుకు పేరున బకాయి ఉందని..


నాకు డిసెంబర్ నెల పింఛన్ ఇయ్యలేదు. ఏందని అడిగితే నీ కొడుకు పేరున ఇంటి పన్ను బకాయి ఉందని, అందుకే పింఛన్ డబ్బులు పంచాయతీలో జమ చేశామని అన్నారు. పన్ను కట్టేందుకు ఇప్పుడు కొడుకు లేడు.. చనిపోయాడు. బాంచెన్ బిడ్డా అన్నా.. వినలే. ఒక్క రూ.500 ఇయ్యమన్నా ఇయ్యలేదు. చేసేది లేక ఇంటికి తిరిగొచ్చిన.

– దోకె చుక్కమ్మ, నంనూర్

మంచిర్యాల రూరల్ (హాజీపూర్): ఇంటి పన్ను బకాయి ఉందంటూ.. పంచాయతీ అధికారులు వృద్ధాప్య పింఛన్ డబ్బులను జమ చేసుకున్నారు. దీంతో పింఛన్ లేకుంటే గడిచేదెలా అంటూ వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 275 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ పొందుతున్నారు. వృద్ధాప్య పింఛన్ కింద రూ.2,016 అందుతుండగా.. కొందరి వేలిముద్రలు సరిగా లేకపోవడంతో పోస్ట్‌మాన్ ఆ డబ్బును కారోబార్, కార్యదర్శులకు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరు 15 మంది వృద్ధులకు డిసెంబర్ నెలకు సంబంధించి వృద్ధాప్య పింఛన్‌ను అందజేయలేదు. పింఛన్ డబ్బుల కోసం పంచాయతీ కార్యాలయానికి వెళ్లిన వృద్ధులు.. అధికారులు చెప్పిన సమాధానం, రసీదు లు చూసి అవాక్కయ్యారు. ఇంటి పన్ను బకాయి ఉన్నందున పింఛన్ డబ్బులు జమ చేసు కుని రసీదు ఇస్తున్నామని వారికి చెప్పారు. దీంతో వృద్ధులు.. పింఛన్ డబ్బులతోనే తాము నెలంతా గడిపేదని, డబ్బులు ఇవ్వాలని ప్రాధేయ పడినా కనికరించలేదు. కాగా, పింఛన్ డబ్బులను నేరుగా పింఛన్‌దారుడికి ఇవ్వాల్సిందేనని ఎంపీవో ఉమర్ షరీఫ్ స్పష్టం చేశారు. పింఛన్ ఆపే అధికారం ఎవరికీ లేదని, ఆ డబ్బులను తిరిగి అందేలా చూస్తామని తెలిపారు.

84 గంటలుగా కొనసాగుతున్న కూంబింగ్

- మూడోరోజు లభ్యమైన ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు
- మొత్తంగా 18 మంది మృతిచెందినట్టుగా ధ్రువీకరించిన పోలీసులు



సుదర్శన్ స్మారక స్తూపం(ఫైల్)

చర్ల/బెల్లంపల్లి: ఛత్తీస్‌గఢ్ – ఒడిశా సరిహద్దులో ఈనెల 19న ప్రారంభమైన పోలీసుల కూంబింగ్ బుధవారం అర్ధరాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో కూంబింగ్ చేపట్టి 84 గంటలు దాటింది. కాగా, ఈ ఎదురుకాల్పుల్లో మరణించిన మరో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. మొత్తంగా ఈ ఎన్‌కౌంటర్‌లో బుధవారం రాత్రి వరకు 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు. గరియాబంద్ జిల్లాలోని మణిపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కులారీఘాట్‌లో మరో రెండు రోజులపాటు ఈ కూంబింగ్ కొనసాగించనున్నట్లుగా తెలుస్తోంది. కాగా లభ్యమైన మృతదేహాలను ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు తరలించారు. కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్న జవాన్ల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న ఇరు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు, వారికి అవసరమైన తాగునీరు, ఆహారపదార్థాలు, మందులు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

మావోయిస్టు అగ్రనేత సుదర్శన్ స్మారక స్తూపం కూల్చివేత..

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన కటకం సుదర్శన్ అలియాస్ దూలా దాదా స్మారక స్తూపం నేలమట్టమైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బట్టిగూడ అటవీ ప్రాంతంలో ఆయన పేరిట నిర్మించిన స్తూపాన్ని బుధవారం భద్రతా బలగాలు కూల్చివేశాయి. 2023 మే 31న తీవ్ర అనారోగ్యంతో దండకారణ్యంలో సుదర్శన్ మృతిచెందారు. దీంతో ఆయన స్మారకార్థం అదే ఏడాది జూన్ రెండో వారంలో ఆదివాసీలు స్తూపం నిర్మించారు. కాగా, స్తూపాన్ని భద్రతా బలగాలు ధ్వంసం చేసిన ఘటన బెల్లంపల్లిలో కలకలం రేపింది.

ఆ ఒక్క సెల్ఫీ.. 'ఎన్‌కౌంటర్' చేసింది!



- భార్యతో దిగిన సెల్ఫీ బయటపడటంతోనే మావోయిస్టు అగ్రనేత చలపతిపై భద్రతా బలగాల ఫోకస్
- ఆయనపై నిఘాకు, రూ.కోటి రివార్డు ప్రకటించేందుకు కారణం
- తాజాగా ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి

భువనేశ్వర్: మావోయిస్టు పార్టీ ఏడుగురు అగ్రనేతల్లో ఒకరు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి. ఎప్పుడో 1990 సమయంలో పీపుల్స్‌వార్‌లో చేరిన ఆయన.. క్రమంగా మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఏవోబీ మిలటరీ ఆపరేషన్స్ చీఫ్‌గా ఎదిగారు. ఈ క్రమంలో సుమారు 35 ఏళ్ల పాటు చలపతి ఎలా ఉంటారన్నది పోలీసులకు చూచాయగా కూడా తెలియదు. అంత అప్రమత్తంగా వ్యవహరించారు. ఒకరకంగా చెప్పాలంటే ధైర్యంగానే సంచరించగలిగారు. కానీ ఒకే ఒక్క సెల్ఫీ పరిస్థితిని మార్చేసింది. చలపతి అజ్ఞాతంలో ఉన్న సమయంలోనే ఏవోబీ (ఆంధ్రా–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ) డిప్యూటీ కమాండర్ అరుణ అలియాస్ చైతన్యను ఇష్టపడి వివాహం చేసుకున్నారు. ఓ సమయంలో భార్యతో కలసి సెల్ఫీ దిగారు. ఆ ఫొటో ఉన్న ఒక స్మార్ట్‌ఫోన్ 2016లో ఏపీలో ఓ ఎదురుకాల్పుల ఘటన జరిగిన ప్రాంతంలో పోలీసులకు దొరికింది. చలపతి ఎవరో, ఎలా ఉంటారో అన్నది తెలిసిపోయింది. దీనితో పోలీసులు ఆయనపై తీవ్రంగా నిఘా పెట్టారు. కోటి రూపాయలు రివార్డు కూడా ప్రకటించారు. దీనితో చలపతి కదలికలు కష్టమైపోయాయి. ఎక్కడికి వెళ్లినా కనీసం 10, 12 మంది సాయుధ మావోయిస్టుల రక్షణ మధ్యే వెళ్లేవారు. తాజాగా ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చలపతి మృతి చెందారు.

తెలంగాణ శకటానికి దక్కని చోటు

రిపబ్లిక్ డే పరేడ్‌లో భారత్ పర్వ్‌లో ప్రదర్శనకు మాత్రమే అనుమతి



సాక్షి, న్యూఢిల్లీ: దేశరాజధానిలో కర్తవ్యపథ్ వేదికగా జరగనున్న గణతంత్ర దిన వేడుకల్లో ఈసారి తెలంగాణ శకటానికి చోటు దక్కలేదు. అయితే, పరేడ్ అనంతరం ఎర్రకోట వద్ద భారత్ పర్వ్ పేరుతో జరిగే శకటాల ప్రదర్శనలో మాత్రం తెలంగాణ శకటాన్ని ప్రదర్శించేందుకు కేంద్రం అనుమతించింది. ఈ శకటం ముందు భాగంలో ఓరుగల్లును పాలించిన రాణీ రుద్రమదేవి, వెనుక భాగంలో రామప్ప దేవాలయం నమూనాను రాష్ట్ర ప్రభుత్వం పొందుపరిచింది. శకటం చుట్టూ రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాల వివరాలను తెలియజేసే చిత్రాలున్నాయి. వాటిలో శామీర్‌పేట్‌లోని జింకల పార్కు, ఆదిలాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, బొగత జలపాతం తదితర పర్యాటక కేంద్రాలున్నాయి. 'స్వర్ణ భారత్ విరాసత్–వికాస్'థీమ్‌తో కేంద్ర ప్రభుత్వం ఈసారి శకటాలను ప్రదర్శిస్తోంది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన 15 శకటాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాలకు చెందిన మొత్తం 31 శకటాలు రిపబ్లిక్ డే రోజు కర్తవ్యపథ్‌పై సందడి చేయనున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఏ న్యాయమూర్తికి..
ఏయే కేసులు

సాక్షి, హైదరాబాద్: యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్‌పాల్ విధుల నిర్వహణ ప్రారంభించారు. ఇందులో భాగంగా న్యాయమూర్తులకు రోస్టర్ (ఏయే కేసులు ఎవరికి) కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైడ్రాకు పిటిషన్లు పెద్ద ఎత్తున వస్తున్న నేపథ్యంలో.. మున్సిపాలిటీస్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం.. గతంలో జస్టిస్ కె.లక్ష్మణ్ వద్ద ఉండగా, దాన్ని మళ్లీ ఆయన వద్దే ఉంచారు. హోం శాఖ పిటిషన్లను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డికి, రెవెన్యూ విచారణను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డికి అప్పగించారు. ఎప్పటిలాగే ప్రజాప్రయోజన వ్యాజ్యాల (పిల్) విచారణను.. సీజే ధర్మాసనం వద్దే ఉంచారు. బుధవారం నుంచి ఈ నూతన రోస్టర్ అమల్లోకి వచ్చింది.



హైకోర్టు న్యాయమూర్తులకు కొత్త రోస్టర్

ప్రజాప్రయోజన వ్యాజ్యాలు.. ప్రధాన న్యాయమూర్తి

'మున్సిపల్'.. జస్టిస్ కె.లక్ష్మణ్..
హోం.. జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి

రెవెన్యూ.. జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి

బుధవారం నుంచి అమల్లోకి..

యాక్టింగ్ సీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం (డివిజన్ బెంచ్-1)

2025 నుంచి ఆల్ రిట్ అప్పీళ్లు (సర్వీస్ అండ్ నాన్ సర్వీస్), మెడికల్ అడ్మిషన్ రిట్ పిటిషన్లు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్), సుమోటో రిట్ పిటిషన్లు, ధిక్కరణ అప్పీళ్లు, క్రిమినల్ ధిక్కరణ కేసులు, ఆదాయపు పన్ను, వాణిజ్య పన్ను, జీఎస్టీ, రుణాల రికవరీ ట్రిబ్యునల్, సెక్యూరిటైజేషన్ చట్టాలు, సర్వీస్ నిబంధనలకు సంబంధించిన చట్టాలు, నియమాలు, చట్టబద్ధమైన నిబంధనలను సవాలు చేసే అన్ని రిట్ పిటిషన్లు, పర్యావరణ, కాలుష్య నియంత్రణ చట్టం మ్యాటర్స్, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టానికి సంబంధించినవి, వాటినుంచి ఉత్పన్నమయ్యే రిట్ పిటిషన్లు, ఇరు రాష్ట్రాలకు ప్రాజెక్టుల కేసులు, ఇతర బెంచ్‌ల్లో పేర్కొనని రిట్ పిటిషన్లు, తెలంగాణ లోకాయుక్త, ఉప లోకాయుక్త చట్టం కింద రిట్ పిటిషన్లు, పేటెంట్ అప్పీళ్లకు లేఖలు.

- అడ్మిషన్లు, మధ్యంతర, తుది విచారణ సోమవారం నుంచి గురువారం వరకు ఉదయం 10:30 గంటల నుంచి ప్రారంభం. శుక్రవారం మధ్యాహ్నం 1:30 వరకు..

యాక్టింగ్ సీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ ధర్మాసనం (స్పెషల్ బెంచ్)

సీఎస్ 13/1958, సీఎస్ 14/1958.. అడ్మిషన్లు, మధ్యంతర, తుది విచారణ శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటల నుంచి...

యాక్టింగ్ సీజే జస్టిస్ సుజోయ్‌పాల్

ఆర్బిట్రేషన్, రాజీ చట్టం, 1996లోని సెక్షన్ 11 కింద దాఖలు చేసే దరఖాస్తులు

జస్టిస్ పి.శామ్ కోషి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు (డివిజన్ బెంచ్-2)

2024 సంవత్సరం వరకు రిట్ అప్పీళ్లు (నాన్-సర్వీస్) (ఏదైనా ఉంటే.. తుది విచారణ, వదిలివేసిన అడ్మిషన్లు, ఇంటర్లోక్యుటరీ)

ఆదాయపు పన్ను ట్రిబ్యునల్ అప్పీళ్లు, ఆదాయపు పన్ను కేసులు, గిఫ్ట్ ట్యాక్స్ కేసులు, సెంట్రల్ ఎక్సైజ్ అప్పీళ్లు, వెల్త్ ట్యాక్స్ కేసులు, వెల్త్ ట్యాక్స్ అప్పీళ్లు, ఆర్బిట్రేషన్ అండ్ కాన్సిలేషన్ చట్టం 1996 రిట్ పిటిషన్లు, వాణిజ్య అప్పీలేట్ విభాగ కేసులు, కమర్షియల్ కోర్ట్సు యాక్ట్-2015కు సంబంధించిన సివిల్ మిసిలేనియస్ అప్పీళ్లు, సివిల్ రివిజన్ పిటిషన్లు, డెట్ రికవరీ ట్రిబ్యునల్ అండ్ సెక్యూరిటైజేషన్ కింద దాఖలు చేసే దరఖాస్తులు, పిటిషన్లు, సీఆర్‌పీలు, ఇన్‌కమ్ ట్యాక్స్, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్ అండ్ జీఎస్టీ రిట్ పిటిషన్లు, రిఫర్ చేసిన కేసులు, పన్ను సవరణ కేసులు (టీఆర్‌సీలు అండ్ టీఆర్‌ఈవీసీలు), సుప్రీంకోర్టు లీవ్ పిటిషన్లు, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సర్వీస్, నాన్-సర్వీస్ అంశాలు, హైకోర్టు, జ్యుడిషియల్ సర్వీస్, జిల్లా కోర్టుల రిట్ పిటిషన్లు, మనీలాండరింగ్ నిరోధక చట్టం-2002 కింద ఉత్పన్నమయ్యే సివిల్ మిసిలేనియస్ సెకండ్ అప్పీళ్లు, వినియోగదారుల రక్షణ చట్టం-1986 రిట్ పిటిషన్లు, మోటార్ ప్రమాద సివిల్ ఇతర అప్పీళ్లు

- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి (డివిజన్ బెంచ్-3)

- 2024 సంవత్సరం వరకు రిట్ అప్పీళ్లు (సర్వీస్),
- తుది విచారణ, వదిలేసిన అడ్మిషన్లు, ఇంటర్లోక్యుటరీ..
- రిట్ పిటిషన్లు (సర్వీస్, క్యాట్, శ్యాట్), ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) చట్టం-1982 రిట్ పిటిషన్లు, సిటీ సివిల్ కోర్టు అప్పీళ్లు, సివిల్ రివిజన్ పిటిషన్లు, భూ సేకరణ అప్పీల్ సూట్లు, భూ కబ్జా అప్పీళ్లు, స్పెషల్ అప్పీళ్లు, ఒరిజినల్ సైడ్ అప్పీళ్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ పి.శ్రీసుధ (డివిజన్ బెంచ్-4)

2019 సంవత్సరం నుంచి క్రిమినల్ అప్పీళ్లు, హెబియస్ కార్పస్ మ్యాటర్స్, ఫ్యామిలీ కోర్టు అప్పీళ్లు, ఫస్ట్ అప్పీళ్లు, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987 రిట్ పిటిషన్లు, ఆల్ సీఎంఏలు (కమర్షియల్ కోర్టుల యాక్ట్ కాకుండా..)

- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ టి.వినోద్‌కుమార్

కంపెనీ అప్లికేషన్లు, కంపెనీ పిటిషన్లు, కంపెనీ అప్పీళ్లు, రిఫర్డ్ కంపెనీ కేసులు, కమర్షియల్ డివిజన్ కేసులు, ఎగ్జిక్యూటివ్ పిటిషన్లు..

- **రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్):** సెంట్రల్ గవర్నమెంట్, సెంట్రల్ గవర్నమెంట్ అండర్ టేకింగ్స్, సెంట్రల్ గవర్నమెంట్ కార్పొరేషన్స్, మైన్స్, ఇండస్ట్రీస్, కామర్స్, విద్య, భూ సేకరణ, హౌసింగ్ శాఖ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ కె.లక్ష్మణ్

- **రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్):** మున్సిపాలిటీస్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, యూనివర్సిటీలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు, 2023, జనవరి 1 నుంచి 2024, జూలై 30 వరకు ఎఫ్ఐఆర్/చార్జిషీట్ల రద్దు రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్), క్రిమినల్ పిటిషన్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి

- **రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్):** హోం, ఎక్సైజ్, లా అండ్ లెజిస్లేషన్ డిపార్ట్‌మెంట్, వక్ఫ్ బోర్డు, ల్యాండ్ రిఫామ్స్ కేసులు, తిరుమల తిరుపతి దేవస్థానం, ఎక్కడా పేర్కొనని రిట్ పిటిషన్లు, 2022 వరకు ఎఫ్ఐఆర్/చార్జిషీట్ల రద్దు రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్), క్రిమినల్ పిటిషన్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ పి.శ్రీసుధ

- 2014 మోటార్ యాక్సిడెంట్ సీఎంఏలు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ (సింగిల్‌గా ఉన్నప్పుడు విచారణ)

జస్టిస్ జి.రాధారాణి

- 2009 వరకు రిట్ పిటిషన్లు (సర్వీస్)
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ (సింగిల్‌గా ఉన్నప్పుడు విచారణ)

జస్టిస్ తుకారాంజీ

- **సెకండ్ అప్పీళ్లు:** అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ
- 2013 వరకు మోటార్ యాక్సిడెంట్ సీఎంఏలు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ టి.మాధవీదేవి

- **రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్):** పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, సివిల్ సప్లై అండ్ ఎసెన్షియల్ కమొడిటీస్, కో-ఆపరేటివ్ సొసైటీలు, ఫుడ్, అగ్రికల్చర్, మార్కెట్ కమిటీలు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ
- అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ నుంచి బదిలీ చేసిన రిట్ పిటిషన్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ కె.సురేందర్

- **క్రిమినల్ అప్పీళ్లు:** అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ
- (సోమ, బుధ, శుక్రవారం.. ఉదయం 10.30 గంటల నుంచి)

జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.అనిల్‌కుమార్ (స్పెషల్ డివిజన్ బెంచ్)

- 2018 వరకు క్రిమినల్ అప్పీళ్లు, క్రిమినల్ కన్ఫర్మేషన్
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ సూరేపల్లి నందా

- **రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్):** సాంఘిక, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, స్టేట్ కార్పొరేషన్లు, అండర్ టేకింగ్స్
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ జువ్వాడి శ్రీదేవి

- 2024, జూలై 1 నుంచి ఎఫ్ఐఆర్/చార్జిషీట్ల రద్దు రిట్ పిటిషన్లు(నాన్ సర్వీస్), క్రిమినల్ పిటిషన్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్

రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ఎనర్జీ, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, మత్స్య పరిశ్రమ, పశు సంవర్ధకం, ఎండోమెంట్

- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ సోమవారం నుంచి గురువారం వరకు ఉదయం 10.30 గంటల నుంచి..
- శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. ఆ తర్వాత స్పెషల్ బెంచ్ విధులు

జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని

- 2016 నుంచి మోటార్ యాక్సిడెంట్ సీఎంఏలు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి

- రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్): 2019 నుంచి రెవెన్యూ పిటిషన్లు, అర్బన్ ల్యాండ్ సీలింగ్, ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్..
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ ఈవీ వేణుగోపాల్

- క్రిమినల్ రివిజన్ కేసులు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ నగేశ్ భీమపాక

- 2018 నుంచి 2021 వరకు రిట్ పిటిషన్లు (సర్వీస్)
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ
- **రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్):** ట్రాన్స్‌పోర్టు, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, ఫ్యాక్టరీలు, లేబర్ మ్యాటర్స్, ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, ట్రెనింగ్, యూత్ సర్వీస్, స్పోర్ట్స్, హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ సంక్షేమం, సమాచార హక్కు చట్టం 2005, ఆర్థికం, ప్రణాళిక
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ
- సివిల్ మిసిలేనియస్ అప్పీళ్లు, సివిల్ మిసిలేనియస్ సెకండ్ అప్పీళ్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ పుల్ల కార్తీక్

- 2022 నుంచి రిట్ పిటిషన్లు (సర్వీస్)
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ కె.శరత్

- 2018 వరకు రెవెన్యూ రిట్ పిటిషన్లు (నాన్ సర్వీస్)
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు

- ఫస్ట్ అప్పీళ్లు, సిటీ సివిల్ కోర్టు అప్పీళ్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ

జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు

- 2010 నుంచి 2012 వరకు రిట్ పిటిషన్లు (సర్వీస్)
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ (సింగిల్‌గా ఉన్నప్పుడు విచారణ)

జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి

- 2015.. మోటార్ యాక్సిడెంట్ సీఎంఏలు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ (సింగిల్‌గా ఉన్నప్పుడు విచారణ)

జస్టిస్ జె.అనిల్‌కుమార్

- 2013 నుంచి 2017 వరకు రిట్ పిటిషన్లు (సర్వీస్)
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ (సోమవారం, బుధవారం, శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి..)

జస్టిస్ కె.సుజన

- బెయిల్స్, ట్రాన్స్‌ఫర్ క్రిమినల్ పిటిషన్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ
- **సివిల్ అడ్మిషన్లు:** 2024, సెప్టెంబర్ 21 నుంచి సివిల్ రివిజన్ పిటిషన్లు, ఒరిజినల్ సివిల్ సూట్స్, ఒరిజినల్ పిటిషన్లు, ట్రాన్స్‌ఫర్ సివిల్ మిసిలేనియస్ పిటిషన్లు
- అడ్మిషన్, ఇంటర్లోక్యుటరీ, తుది విచారణ



జస్టిస్ సుజోయ్‌పాల్ | జస్టిస్ పి.శామ్ కోషి | జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి | జస్టిస్ జి.రాధారాణి | జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ | జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు | జస్టిస్ మౌషుమి భట్టాచార్య | జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి | జస్టిస్ పి.శ్రీసుధ | జస్టిస్ టి.వినోద్‌కుమార్ | జస్టిస్ కె.లక్ష్మణ్ | జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి | జస్టిస్ తుకారాంజీ | జస్టిస్ టి.మాధవీదేవి | జస్టిస్ కె.సురేందర్ | జస్టిస్ జె.అనిల్‌కుమార్ | జస్టిస్ సూరేపల్లి నందా | జస్టిస్ జువ్వాడి శ్రీదేవి | జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని | జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి | జస్టిస్ ఈవీ వేణుగోపాల్ | జస్టిస్ నగేశ్ భీమపాక | జస్టిస్ పుల్ల కార్తీక్ | జస్టిస్ కె.శరత్ | జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు | జస్టిస్ కె.సుజన

ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వానిదే అని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం కేలండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఎంప్లాయి ఫ్రెండ్లీ అని, విడతల వారీగా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో గెజిటెడ్ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అక్కేశ్వరరావు, షబానా తదితరులు పాల్గొన్నారు.

సంకుచిత బుద్ధిని వీడి గొప్పగా ఆలోచించండి

కేటీఆర్ ట్వీట్‌పై ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంకుచిత బుద్ధిని వీడి, గొప్పగా ఆలోచించాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వేల మైళ్ల దూరం ప్రయాణించి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో.. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడం, పెట్టుబడులు వచ్చాయంటూ చెప్పడం ఏమిటని ఎక్స్ వేదికగా కేటీఆర్ చేసిన ట్వీట్‌పై ఎంపీ చామల కౌంటర్ ఇచ్చారు. ఒక పెద్ద కంపెనీ, తెలంగాణలో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తే మీకు సమస్య ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో తెలంగాణ బృందం విజయవంతంగా పెట్టుబడులను ఆకర్షిస్తోందన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రచారకర్త అని చెప్పుకుంటున్న కేటీఆర్.. రాష్ట్ర పురోగతిని అణగదొక్కడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చెడుగా ఆలోచించే మనిషికి ప్రతీ విషయంలోనూ చెడే కనిపిస్తుందని, మంచి కనిపించదని చామల విమర్శించారు.



జేఈఈ మెయిన్స్ పరీక్షల తొలిరోజున హైదరాబాద్‌లోని మౌలాలి ప్రాంతంలో ఉన్న ఓ పరీక్షా కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరిన అభ్యర్థులు



వివిధ పనుల కోసం బుధవారం సచివాలయానికి వచ్చిన దివ్యాంగులను బ్యాటరీ వాహనంలో లోపలికి తీసుకువెళుతున్న సిబ్బంది

దేవుళ్లనే మోసం చేసిన సీఎంకు ప్రజలు ఓ లెక్కా

ఎమ్మెల్యే కేపీ వివేకానంద



సాక్షి, హైదరాబాద్: దేవుళ్లనే మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు ఓ లెక్కా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత సతీశ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తులు అంటూ కాంగ్రెస్ నేతల చుట్టూ ప్రజలను తిప్పే కార్యక్రమం జరుగుతోందని, పథకాల్లో రాజకీయాలు జొప్పిస్తే ప్రజలు ప్రభుత్వంపై తిరగబడతారని హెచ్చరించారు. గ్రామ సభల్లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను, అధికారులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని, ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా వ్యతిరేక పాలన అని గ్రామ సభలు రుజువు చేస్తున్నాయని విమర్శించారు. జనవరి 26 నుంచి అమలయ్యే నాలుగు పథకాలకు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయని కొత్త లెక్కలు చెబుతున్నారని, రుణాల పేరుతో పథకాలను వాయిదాను వేసే కుట్ర జరుగుతోందని వివేకానంద ఆరోపించారు.

ఈటల.. బీఆర్ఎస్ కోవర్టు

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. బీఆర్ఎస్ కోవర్టు అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ఆరోపించారు. ఆయన బుధవారం సీఎల్పీలో విలేకరులతో మాట్లాడారు. కమీషన్లు ఎలా తీసుకోవాలో మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు బాగా తెలుసునని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమస్య ఉంటే చట్ట పరంగా పోవలసింది పోయి.. అసహనంతో రియల్టర్లపై వీధి రౌడీలా వ్యవహరించారన్నారు. పాలన చేతకాదని సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

- తీవ్రగాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- బాపట్ల జిల్లాలో ఘటన

అమర్తలూరు (వేమూరు): బాపట్ల జిల్లా ప్యాపర్రు గ్రామానికి చెందిన ఎస్సీ నాయకుడు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త మూట సురేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ప్యాపర్రు గ్రామంలో రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్‌లో సురేష్ ఉద్యోగం చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతడిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ విషయమై గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో టీడీపీ నాయకులు సురేష్‌పై దాడి చేసేందుకు కొందరు వ్యక్తులను సుపారీకి నియమించుకున్నారు. ప్లాంట్‌లో విధుల్లో ఉన్న సురేష్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని ఎస్ఐ అమర్‌వర్ధన్ బుధవారం తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై, సహకరించిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

జీఏడీ ముఖ్య కార్యదర్శిగా ముకేశ్ కుమార్ మీనా బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ), జీఏడీ ముఖ్య కార్యదర్శిగా ముకేశ్ కుమార్ మీనా బుధవారం రాష్ట్ర సచివాలయం మొదటి భవనంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న మీనాను జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేయడంతో ఆయన ఈమేరకు బాధ్యతలు స్వీకరించారు. ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగానూ ఆయన అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎస్.సురేశ్ కుమార్ బుధవారం రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఐ అండ్ ఐ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సురేశ్ కుమార్‌ను మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది.

వరికపూడిశెల నిర్మాణాన్ని మరచిన ప్రభుత్వం

సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు



వినుకొండ(నూజెండ్ల): ఎన్నికలకు ముందు వరికపూడిశెల అభివృద్ధి గురించి ఉపన్యాసాలు ఇచ్చిన టీడీపీ కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక మాట్లాడకపోవడం శోచనీయమని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు విమర్శించారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతుకు వ్యవసాయ సాగు కోసం పెట్టుబడిగా రూ.20వేలు ఇస్తానన్న హామీ నిలబెట్టుకోవాలని, అదానీతో జగన్ చేసుకున్న 25 ఏళ్ల సెకీ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

నేర నియంత్రణకు కృషి చేయాలి: డీజీపీ



మాట్లాడుతున్న డీజీపీ తిరుమలరావు

బొమ్మలసత్రం: సమష్టి కృషితో రాష్ట్రంలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు జిల్లా పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణాతో కలసి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీజీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలతో పాటు ముఖ్యమైన కేసుల దర్యాప్తులో పోలీస్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. నేరాల నియంత్రణ కోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు అందుబాటులో డ్రోన్, సీసీ కెమెరాలను వినియోగించాలన్నారు. నేరాలు జరిగే ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమరుస్తున్నామని దీని వల్ల నేరస్తులను గుర్తించటం సులువతుందని వివరించారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను అమర్చబోతున్నామన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా భంగం కలిగించాలని చూస్తే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

పంట భళా.. ధర డీలా

- వైఎస్సార్ జిల్లాలో ఆశాజనకంగా చామంతి
- మార్కెట్‌లో పడిపోయిన రేట్లు
- పెట్టుబడి రావడం కూడా కష్టమే
- తోటల్లోనే పూలు వదిలేస్తున్న వైనం



కడప అగ్రికల్చర్/వేముల: వైఎస్సార్ జిల్లాలో ఈ ఏడాది చామంతి పంట రైతులకు నష్టాలను మిగిల్చింది. దిగుబడులు బాగా ఉన్నప్పటికీ ధర లేక ఈ పరిస్థితి తలెత్తింది. సాగులో పెట్టుబడులు అధికమైనప్పటికీ ధరలు ఉంటాయనే ఆశతో సాగు చేశారు. దసరా సమయంలో ధరలు ఉన్నప్పటికీ చాలా చోట్ల దిగుబడులు రాలేదు. ఆ తరువాత కార్తీకమాసం, సంక్రాంతి సీజన్‌లో కూడా ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయని పలువురు రైతులు తెలిపారు.

వైఎస్సార్ జిల్లాలో 200 ఎకరాల్లో..

జిల్లాలోని వేముల, వేంపల్లి, పెండ్లిమర్రి, నందిమండలం, ఖాజీపేట, మైదుకూరు, దువ్వూరు మండలాలతోపాటు ఇంకొన్ని మండలాల్లో ఈ ఏడాది రబీలో 200 ఎకరాల్లో చామంతి సాగు చేశారు. ఇందులో వేముల, పెండ్లిమర్రి, వేంపల్లి, ఖాజీపేట మండలాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ఎక్కువగా మంది రైతులు చాందిని, పేపరు ఎల్లో, పేపరు వైట్, బుల్లెట్, సెంటిల్లా వంటి రకాలు వేశారు. చామంతి సాగు చేసిన మూడు నెలలకు దిగుబడి చేతికి వస్తుంది. తోటలలో దిగుబడులు ప్రారంభమైనప్పటి నుంచి ధరలు బాగా ఉంటే రైతులు ఆశించిన మేర ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. కానీ పండుగల సీజన్‌లో మాత్రమే ధరలు ఉండటం, తరువాత పడిపోవడంతో చామంతి రైతులకు నష్టాలు, కష్టాలే మిగులుతున్నాయి.

ధరలు తగ్గుముఖం

సంక్రాంతి పోగానే చామంతి ధరలు మార్కెట్‌లో పడిపోయాయి. సంక్రాంతి వరకు కిలో రూ.130 వరకు పలికింది. తరువాత ధరలు తగ్గుముఖం పట్టాయి. జూన్, జూలైలలో సాగు చేసిన తోటల్లో ముందుగానే పూలు కోతకు వచ్చాయి. అప్పట్లో మార్కెట్‌లో ధరలు ఒక రకంగా ఉండటంతో కొంత మంది రైతులకు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు రూ.30 ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడులు కూడా రావని వారు వాపోతున్నారు.

కొనుగోళ్లకు మొగ్గు చూపని వ్యాపారులు

చామంతికి మార్కెట్‌లో ధరలు తగ్గడంతో వ్యాపారులు కూడా కొనుగోళ్లకు మొగ్గు చూపడం లేదు. ధరలు ఉన్నప్పుడు వ్యాపారులు తోటల వద్దకు వచ్చి పూలు కొనుగోలు చేసి వాహనాలలో తరలించేవారు. ప్రస్తుతం ధరలు తగ్గడంతో వ్యాపారులు రాకపోవడంతో రైతులే బయటి ప్రాంతాల మార్కెట్‌కు తరలించుకుంటున్నారు. ప్రస్తుతం తోటలలో కోత కోసిన పూలను చెన్నై, బెంగళూరు మార్కెట్లకు తరలిస్తున్నారు. అక్కడ ధర ఒక రకంగా ఉంటే అంతో ఇంతే వస్తుందని, రేటు తగ్గితే మాత్రం ఖర్చులు కూడా రావని రైతులు పేర్కొంటున్నారు.

పూలు కోత కోయని రైతులు

ధరలు లేకపోవడంతో చాలా మంది రైతులు తోటల్లో పూలను కోసేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు. పూలు కోసేందుకు కూలి, రవాణా ఖర్చులు కూడా రావనే ఉద్దేశంతో కోత కోయడం లేదని పలువురు రైతులు అంటున్నారు. సాగు కోసం వేలకు వేలు పెట్టుబడులు పెట్టి దిగుబడులు వచ్చే సమయంలో ధరలు తగ్గడంతో రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ కష్టమంతా నేలపాలు అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేటు కోసం ఎదురుచూపులు

మార్కెట్‌లో ధరలు పెరుగుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు. వారం రోజులపాటు తోటలలో పూలు ఉంటాయని, అంతలోపు ధరలు రాకపోతే ఉన్న రేటుకే అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కిలో రూ.20 నుంచి రూ.30లు మాత్రమే ధరలు ఉన్నాయి. సాగుకు పెట్టిన పెట్టుబడులైన గిట్టుబాటు అయ్యే ధరల కోసం చూస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఇక మార్కెట్‌లో ధరలు ఇలాగే ఉంటే తీవ్రంగా నష్టపోతామని వారు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎకరాకు లక్షపైనే పెట్టుబడి



బయటి మార్కెట్‌కు తరలించేందుకు పూలను ట్రేలకు నింపుతున్న కూలీలు

చామంతి సాగులో రైతులకు పెట్టుబడులు భారంగా మారాయి. ఎకరా సాగుకు సేద్యాలు, నారు, ఎరువులు అన్నీ కలిపి లక్ష రూపాయలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయి. పంట దిగుబడి బాగా రావాలనే ఉద్దేశంతో చాలా మంది నారును బయట ప్రాంతాల్లోని నర్సరీల నుంచి తెచ్చి సాగు చేస్తున్నారు. ఒక మొక్క రూపాయి మొదలు రూ.2.50 వరకు పలుకుతుంది. ఎకరాకు 14 వేల మొక్కలు పడుతాయని, దీంతో 35 వేల దాకా నారుకే సరిపోతుందని రైతులు తెలి పారు. మిగతా ఎరువులు, సేద్యం, సాగు ఖర్చులు కలిపి లక్ష రూపాయల వరకు వస్తోంది. దీంతోపాటు పంటకు తెగుళ్ల సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటూ నెలకు మూడు, నాలుగుసార్లు పురుగు నివారణ మందులను పిచి కారి చేసుకోవాలి. ఈ పంటకు ఎక్కువగా చీడ, పీడలు సోకే ప్రమాదం ఉండటంతో ముందు జాగ్రత్తగా మందులు స్ప్రే చేసి కాపాడు కోవాలి. దీంతో ఖర్చు అధికమౌతుంది.

మూడు ఎకరాల్లో సాగు చేశా



నేను మూడు ఎకరాలలో చామంతి సాగు చేశా. ఇందుకు రూ.3 లక్షల పెట్టుబడి పెట్టా. దిగుబడులు వచ్చే సమయానికి ధరలు తగ్గిపోయాయి. తోటలో చామంతి పూలు కోతకు వచ్చినా ధరలు లేక పోవడంతో పూలు కోయడం లేదు. ధరలు వస్తాయనే ఆశతో ఎదురు చూస్తున్నా.

– కొండారెడ్డి, రైతు, కొత్తపల్లె, వేముల మండలం

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు



మార్కెట్‌లో ధరలు పూర్తిగా తగ్గాయి. పది రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ధరల కోసం వేచి చూస్తున్నాం. 2 ఎకరాల సాగు కోసం రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– రాజారెడ్డి, రైతు, గొందిపల్లె, వేముల మండలం

మనసును కట్టేస్తున్న జనుము

పచ్చని పైరులో పసుపు పూల సోయగంతో ఆకట్టుకునే కట్టె జనుము పంట రైతులకు సిరులు కురిపించడమే కాదు.. నేలను సారవంతం చేస్తోంది. దీని విత్తనాలతో తయారైన ఆయిల్‌తో ఆయుర్వేదంలో మోకాళ్ల నొప్పులకు వినియోగిస్తున్నారు. ఇన్ని ప్రయోజనాలున్న ఈ పంటపై అనకాపల్లి జిల్లా రైతులు ఆసక్తి చూపించడమే కాదు.. విస్తారంగా సాగు చేస్తున్నారు.

- ఎకరాకు రూ.40 వేల ఆదాయం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి
- సీడ్స్‌తో ఆయుర్వేద ఆయిల్
- జిల్లాలో సాగుపై రైతుల ఆసక్తి
- రబీలో 10 వేల ఎకరాల్లో పంట

సాక్షి, అనకాపల్లి: ఖరీఫ్ వరి పంటలో వరుసగా వస్తున్న నష్టాలు.. రబీ అపరాల పంటలకు చీడపురుగుల బెడద.. వెరసి తీవ్రనష్టాలను మూటగట్టుకుంటున్న జిల్లా రైతులకు కట్టె జనుము లాభదాయకంగా మారింది. పైసా పెట్టుబడి లేకుండా.. ఎటువంటి ఎరువులు వాడకుండా, రూ.వేల లాభాన్ని ఆర్జించి పెడుతుంది. గ్రామాల్లో ఎటు చూసినా పసుపు పచ్చగా.. ఆకర్షణీయంగా కనిపించే జనుము పంట జిల్లాలో వివిధ మండలాల్లో 10 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రబీ సీజన్‌లో నువ్వులు, అపరాలతోపాటు ఈ పంట వేస్తుంటారు. కట్టె జనుము ప్యాబేసీ కుటుంబానికి చెందిన ఈ మొక్క పంట వల్ల భూసారం పెరుగుతుంది. రబీలో వేసిన ఈ పంట ఖరీఫ్ సీజన్ నాటికి భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు అందిస్తుంది. ఈ పంటను ప్రస్తుతం ఓ వైపు విత్తనాభివృద్ధికి, మరోవైపు ఆయుర్వేదంలో ఉపయోగపడే హెంప్ ఆయిల్ కింద వినియోగిస్తున్నారు.

భూసారం పెంచుకోవచ్చు

మార్కెట్‌లో ధర బాగుండటంతో, ఎలాంటి పెట్టుబడి లేకుండానే లాభాలను పొందే ఆస్కారం ఉంది. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయి చౌడు శాతం పెరిగిపోతోంది. పంటల సాగుకు పనికి రాకుండా పోతోంది. ఎంత పెట్టుబడి పెట్టినా, దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పచ్చిరొట్ట పంటలను పెంచి నేలలో కలియదున్నడం ద్వారా భూసారం పెంచుకోవచ్చు.

కిలో విత్తనాల ధర రూ.80

ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి రావడం, కిలో రూ.80 ధర పలుకుతుంది. ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే కట్టె జనుము సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మోకాలు నొప్పి తగ్గేందుకు..

కట్టెజనుము గింజలు పచ్చిరొట్ట ఎరువుకు ఎంత ఉపయోగమో ఆయుర్వేదంలో మోకాలు నొప్పి తగ్గేందుకు కూడా హెంప్ ఆయిల్‌గా తయారు చేసి వినియోగిస్తున్నారు. అందువల్లే ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో కట్టె జనుము సాగుకకు గ్లోబల్ ఇండికేషన్‌గా గుర్తింపు పొందే పరిస్థితి తీసుకువచ్చింది. ఇక్కడ నుంచి ఒడిశాకు ఎగుమతి అవుతున్నాయి.

ఒడిశాకు ఎగుమతి..

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం జిల్లాలో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా తర్వాత అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా పండిస్తున్నారు. ఈ విత్తనాలను ఇక్కడ నుంచి ఒడిశా రాష్ట్రానికి ఎగుమతి చేస్తున్నారు.

చీడపీడల ప్రభావంతో కట్టె జనుము సాగుపై ఆసక్తి..

రబీ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా నువ్వులు, అపరాల పంటలు వేస్తుంటారు. వీటికి చీడపీడలు బెడద ఎక్కువ కావడం, పెట్టుబడి అధికం కావడంతో కట్టె జనుము సాగుపై వైపు రైతులు మళ్లుతున్నారు. పొలం గట్లపైనా సాగు చేస్తుంటారు.

సాగు లాభదాయకం..

కట్టెజనుము సాగు రైతుకు లాభదాయకంగా ఉంది. రబీ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా నువ్వులు పంట వేస్తున్నారు. వాటి తర్వాత పెసర, మినుప, పిల్లి పెసర, బొబ్బరి వంటి అపరాల పంట వేస్తున్నారు. ఈ పంటల కంటే ఎక్కువ ఆదాయం వస్తోండటంతో రైతులు కట్టెజనుము సాగువైపు దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో పాటు అధిక ఆదాయం ఆర్జించే అవకాశాలున్నాయి. అంతేకాకుండా ఈ పంటతో భూసారవంతం పెరుగుతోంది.

– డాక్టర్ మోహన్‌రావు, అగ్రికల్చర్ జేడీ



జనుము విత్తనాలు

బుచ్చెయ్యపేటలో కట్టె జనుము పంట..

కాల్ చేసి.. ఖాళీ చేసి..



నిమిషాల్లో రెండు లక్షలు మాయం



ఇతని పేరు ఎస్ బీ సంతోష్. చిట్వేలిలో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. రెండు నెలల క్రితం ఓ ఫోన్ కాల్ వచ్చింది. 'కంగ్రాట్యులేషన్.. స్టేట్‌బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీరు యాభైవేల రూపాయలు గెలుచుకొన్నారు' అని చెప్పారు. మీ బ్యాంకు వివరాలు చెబితే డబ్బు పంపిస్తామని చెప్పారు. సంతోష్.. తన ఏటీఎం సీవీవీతో పాటు ఎక్స్‌పైర్ నెల, సంవత్సరం వంటి వివరాలు చెప్పాడు. అంతే నిమిషాల్లోనే సెల్లుకు మెసేజ్ వచ్చింది.. డబ్బులు క్రెడిట్ అయినట్లు కాదు.... అకౌంట్‌లో ఉన్న 2 లక్షల రూపాయలు ఖాళీ అయినట్లు. వెంటనే స్థానిక బ్యాంక్‌కెళ్లి విచారించాడు. వారు తమకు తెలియదన్నారు. చేసేదిలేక ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

ఓబులవారిపల్లె: సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. రోజుకో ఆలోచనతో ప్రజల్ని బురిడీ కొట్టిస్తున్నారు. ఓ సారి పోలీసులమని, మరోసారి అధికారులమని కొత్త కొత్త దారుల్లో వచ్చి ఖాతాలను లూటీ చేస్తున్నారు. ఈకేవైసీల పేరున లింకులు పంపి .. నయానో భయానో బెదిరింపులకు పాల్పడి మోసాలు చేస్తున్నారు.

కొత్త తరహాలో మోసాలు

- ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌ను అత్యధికంగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా గతంలో మైదానంలో ఆటలు ఆడే యువత నేడు సెల్‌ఫోన్‌లోనే కాలాన్ని గడిపే స్తున్నారు. సైబర్ చోరుల కు ఇప్పుడిదే ఆయుధమైంది. వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి వాటిని హ్యాక్ చేస్తున్నారు. ఏదో ఒక గేమ్ లింక్ పంపి ..సదరు లింకులను నొక్కేలా చేస్తున్నారు. అంతేనా.. సదరు వ్యక్తి సమాచారం తన వద్ద ఉందని, తాము పోలీసు ఉన్నతాధికారులమని డబ్బులు చెల్లించాలని.. లేకుంటే కేసులు పెడతామని బెదిరిస్తున్నారు.
- ప్రజలు ఆన్‌లైన్‌లో వివిధ వెబ్‌సైట్‌లలో తమ ఫొటోలతో సహా బయోడేటాను నమోదు చేసుకుంటుంటారు. మోసగాళ్లు ఈ వివరాలను సేకరించి.. వివాహాలకు సంబంధించిన వెబ్‌సైట్‌లలో వధువు తల్లిదండ్రులమని చెప్పి పరిచయాలు పెంచుకుంటున్నారు. ఏదో ఒక అవసరమని చెప్పి అందినకాడికి దోచుకుంటున్నారు.
- టెక్నాలజీ అభివృద్ధి చెందిన ప్రస్తుత రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా ప్రస్తుతం ఆన్‌లైన్‌ల ద్వారా నిత్యావసర సరుకులు, దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. మాధ్యమాల్లో వారు చూపిస్తున్న వివిధ రకాల ఆఫర్లలో కొనుగోలు చేసేందుకు క్రెడిట్, డెబిట్ కార్డులు ద్వారా నగదును చెలిస్తున్నారు. దీన్నే సైబర్ నేరగాళ్లు అవకాశంగా, అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిమిషాల్లో పాస్‌వర్డ్‌లు హ్యాక్ చేస్తూ బ్యాంక్ అకౌంట్ నుంచి నగదును దర్జాగా దోచుకొంటున్నారు.

ఎక్కడి నుంచి అయినా ఫిర్యాదు చేయవచ్చు

గతంలో సైబర్ నేరస్తుల వలలో చిక్కిన వారు ఫిర్యాదు చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నేరాలు ఎక్కువ అవుతుండటంతో బాధితులు ఫిర్యాదు చేసే మార్గాన్ని ప్రభుత్వం సులభతరం చేసింది. హెల్ప్‌లైన్ నెంబర్ కేటాయించి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. బాధితులు సాధ్యమైన త్వరగా స్పందించి ఫిర్యాదు చేసినట్లయితే పోగొట్టుకొన్న సొమ్ము తిరిగి తెప్పించే అవకాశం ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు.

ఫిర్యాదు చేసేందుకు...
సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్
ఫోన్ నంబర్: 1930
ఆర్థిక నేరాలకు సంబంధించి: 155260
వెబ్‌సైట్: సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్

ఆక్రమణల నుంచి ఎలా కాపాడుతున్నారో చెప్పండి

- 150 ఎకరాల అటవీ భూమి విషయంలో నివేదిక ఇవ్వండి
- అటవీ శాఖ ముఖ్య సంరక్షణాధికారి, నెల్లూరు కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లపల్లి గ్రామ పరిధిలో ఉన్న అటవీ భూమిలో 150 ఎకరాల మేర ఆక్రమణలకు గురైనట్లు విచారణలో తేలిన నేపథ్యంలో ఆక్రమణదారుల నుంచి ఆ భూమిని కాపాడేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని హైకోర్టు బుధవారం అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారిని, జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఆక్రమణల తొలగింపునకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ తమ ముందు నివేదిక ఉంచాలని వారిని ఆదేశిస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. రాపూరు, నెల్లూరు రేంజ్ పరిధిలో ఉన్న పోతుకొండ రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందిన 150 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైందని, అయినప్పటికీ ఆక్రమణలను తొలగించడం లేదంటూ వెలుగోను గ్రామానికి చెందిన రైతు అందెన వెంకటరమణయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది శివకల్పన రెడ్డి వాదనలు వినిపించారు.

విశాఖ చేరుకున్న షార్జా బాధితులు

గోపాలపట్నం: ఉద్యోగాల కోసం షార్జా వెళ్లి, అక్కడ ఉద్యోగం రాకపోవడంతో ఇబ్బందుల్లో పడిన బాధితులు, విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో సురక్షితంగా నగరానికి చేరుకున్నారు. బుధవారం విశాఖ విమానాశ్రయంలో సీపీతో కలిసి బాధితులు మీడియాకు తెలిపిన వివరాలు..గాజువాక ఆటోనగర్లోని మణికంఠ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వెల్డింగ్ శిక్షణ ఇచ్చి, దుబాయ్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న ప్రకటన చూసి లక్ష్మీనారాయణ, రాజేష్, రామస్వామి, వెంకటరావు, లోకేషులు ఆ సంస్థను సంప్రదించారు. ఏజెంట్లు దుర్గాప్రసాద్ అలియాస్ ప్రసాద్, చందులు మణికంఠ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోనే ఇంటర్వ్యూలు, మెడికల్ పరీక్షలు నిర్వహించి షార్జాలో ఉన్న క్వాలిటీ ఇంటర్నేషనల్ కంపెనీలో వెల్డర్ ఉద్యోగాలకు పంపారు. అక్కడ వీరికి 6జీ వెల్డింగ్ కాకుండా 3జీ వెల్డింగ్ ఇచ్చి పరీక్షించారు. అందులో అర్హత పొందకపోవడంతో ఇక్కడి ఏజెంట్లు చెప్పినట్లుగా వారికి వెల్డర్లుగా కాకుండా.. లేబర్ ఉద్యోగాలిచ్చారు. వీరు టూరిస్ట్ వీసాతో వెళ్లడం వల్ల, కాలపరిమితి ముగిస్తే ఇబ్బందుల్లో పడతారనే ఆందోళనతో ఏజెంట్లను సంప్రదించారు. ఏజెంట్లు స్పందించకపోవడంతో, విశాఖ నగర పోలీస్ కమిషనర్ నంబర్‌కు సంప్రదించాగా..సీపీ ఇమిగ్రేషన్ అధికారులతో చర్చించి, వెస్ట్, గాజువాక పోలీసుల సహకారంతో ఏజెంట్ల ద్వారా ఈ ఐదుగురిని విశాఖకు తీసుకువచ్చారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 60,581 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.04 కోట్లు వేశారు. టికెట్లు లేని భక్తులకు 7 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనమవుతోంది.

ఘనంగా శ్రీసీతారాముల కళ్యాణం



తెనాలి: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రూరల్ మండలం అంగలకుదురులో గల వాసుదాసస్వామి పరంపర పీఠం (దాసకుటి) ఆశ్రమంలో బుధవారం శ్రీసీతారామస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు తమ స్వగృహాల నుంచి తలంబ్రాలను ఆశ్రమానికి తీసుకువచ్చారు. అక్కడ రాములు వారి కళ్యాణ వేడుకను ఘనంగా జరిపించారు. చిన్నారులు దేవతామూర్తుల వేషధారణలో ఆకట్టుకున్నారు.

వైభవంగా మల్లాది వెంకటేశ్వరుని కళ్యాణం

అమరావతి: భక్తుల పాలిట కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే కలియుగవరదుడైన వేంకటేశ్వరుడే మల్లాది గ్రామంలో స్వయంభూగా వెలసిన వటవృక్షాంతర్గత వెంకటేశ్వరునికి బుధవారం 48వ వార్షిక కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజామున ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి అభిషేకానికి బిందెతీర్థంతో కార్యక్రమాలు మొదలయ్యాయి సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రాతఃకాల అర్చన నిర్వహించారు. స్వామి వారికి పంచసూక్తాలతో పంచామృత స్నపనను సశాస్త్రీయంగా చేశారు.తులసీదళాలతో స్వామి వారికి సహస్రనామ తులసీ దళసేవ జరిగింది.

విద్యా సమాచారం

25న మెగా జాబ్‌మేళా

కార్వేటినగరం: చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 25న శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ గణేష్ తెలిపారు. ఈ మేళాలో లోటస్ ఎంటర్ ప్రైజెస్, శ్రీరాం చిట్స్ లిమిటెడ్ ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్, డిగ్రీ పాస్ అయి 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించరూ!

– జేసీకి యూటీఎఫ్ వినతి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతి పత్రం అందజేసి యూటీఎఫ్ నాయకులు మాట్లాడారు. 12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణం నియమించాలని, పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ, సీపీఎస్ తదితర ఆర్థిక బకాయిలన్నీ చెల్లించేందుకు రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని కోరారు. 2003 ఉద్యోగ నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు.

పరిశోధనలతో అద్భుత ఫలితాలు

చంద్రగిరి : పరిశోధనలను మహాయజ్ఞంలా భావించి చేపడితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని సింగపూర్ నన్యాంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ సుందరరాజన్ తెలిపారు. తిరుపతి జిల్లా రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో 2024–25 ఐదో బ్యాచ్ పరిశోధక విద్యార్థులకు రీసెర్చ్ మెథడాలజీ, పబ్లికేషన్ ఎథిక్స్ అనే అంశాలపై మూడురోజుల వర్క్‌షాప్‌ను బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సుందరరాజన్‌తోపాటు మైసూర్ జేఎస్ఎస్ సైన్స్, టెక్నాలజీ ప్రొఫెసర్ మహానంద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎంబీయూ లైబ్రరీలో విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవడానికి అవసరమైన విజ్ఞానం ఉందన్నారు.



దురలవాట్లను దూరం చేసే
కొల్లూరు మూకాంబికాలయం

ఆ ఆలయంలో అడుగు పెడితే దురలవాట్లు దూరం అవుతాయని, ఆమె సన్నిధిలో అక్షరాభ్యాసం చేస్తే... చక్కటి విద్యాబుద్ధులు అలవడతాయని భక్తుల నమ్మకం. ఆ తల్లికి నివేదన చేసిన ప్రసాదం స్వీకరిస్తే చాలు మహాపండితులవుతారనీ, అనారోగ్యాలు తొలగిపోతాయనీ, సకల సౌభాగ్యాలూ సిద్ధిస్తాయనీ అందరూ అనుకుంటారు. జగద్గురువు ఆదిశంకరులవారే స్వయంగా ప్రతిష్ఠించిన ఆ అమ్మవారే మూకాంబికాదేవి. కొల్లూరులో కొలువైన ఆ అమ్మ సన్నిధి సకల సంపదలకూ పెన్నిధి.







కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరుకు సుమారు 130 కిలో మీటర్ల దూరంలో... దట్టమైన అడవుల మధ్యన నెలకొని ఉంది మూకాంబికాలయం. ఆ రాష్ట్రంలోని ఏడు మోక్షపురాల్లో కొల్లూరు మూకాంబిక గుడి ఒకటి. ఆలయం ఉన్నది కర్ణాటక రాష్ట్రంలో అయినా, ఆమెను ఎక్కువగా సందర్శించుకునేది కేరళీయులే కావడం విశేషం.

క్షేత్రపురాణం: జగద్గురు ఆదిశంకరులు కుడజాద్రి పర్వతంపై ఉండి అమ్మవారి కోసం తపస్సు చేశారు. ఆయన తపస్సుకు మెచ్చి, అమ్మవారు ప్రత్యక్షమైంది. ఆమెను తనతోబాటు తన జన్మస్థలమైన కేరళకు రావలసిందిగా శంకరులు చేసిన ప్రార్థనకు అంగీకరించిన దేవి, అందుకు ఒక షరతు విధిస్తుంది. అదేమంటే, తాను వచ్చేటప్పుడు శంకరులు వెనక్కు తిరిగి చూడకూడదని, ఒకవేళ వెనక్కి తిరిగి చూస్తే అక్కడే తాను శిలలా మారిపోతానంటుంది. అందుకు అంగీకరిస్తాడు శంకరులు. ముందుగా శంకరులు, వెనుక అమ్మవారు వెళ్తా ఉంటారు. కొల్లూరు ప్రాంతానికి రాగానే అమ్మవారి కాలి అందెల రవళి వినిపించకపోవడంతో, వెనక్కు తిరిగి చూస్తాడు శంకరులు. ఇచ్చిన మాట తప్పి వెనక్కు తిరిగి చూడడంతో అమ్మవారు అక్కడే శిలలా మారిపోతుంది. తన తప్పిదాన్ని మన్నించమని ప్రార్థించిన శంకరులతో తనను అక్కడే ప్రతిష్ఠించమని చెబుతుంది. దీంతో ఆదిశంకరులు శ్రీ చక్రంతోపాటు మూకాంబిక పంచలోహ విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు.

శంకరుల వెంట వచ్చేటప్పుడు అమ్మవారు మాట్లాడనందువల్ల ఆమెకు మూకాంబిక అనే పేరు వచ్చింది. నాటినుంచి అమ్మవారికి ఆదిశంకరులు సూచించిన విధానంలోనే పూజాదికాలు జరుగుతున్నాయి. మూకాంబిక ఆలయాన్ని సందర్శించుకున్నవారు ఒక్కసారైనా హారతి సమయంలో అమ్మవారి దివ్య మంగళరూపాన్ని సందర్శించుకోవాలని తహతహలాడుతుంటారు. అమ్మవారికి ప్రదోష కాలంలో ఇచ్చే హారతి ప్రత్యేకమైనది.

సౌపర్ణికానది: ఆలయానికి సమీపంలో సౌపర్ణికా నది ప్రవహిస్తుంటుంది. ఈ నది లోతు తక్కువ. కుటజాద్రి పర్వతం నుంచి ఉద్భవించే ఈ నదిలో ఇతర నదీపాయలు కూడా కలుస్తాయి. ఈ నది ఒడ్డున సుపర్ణుడు అంటే గరుత్మంతుడు తన తల్లి దుఃఖాన్ని పోగొట్టమని కోరుతూ అమ్మవారిని గురించి ఘోర తపస్సు చేసి వరం పొందాడట. ఆ నాటినుంచి ఈ నదికి సౌపర్ణికానది అని పేరు వచ్చింది. ఈ నదిలో అనేక వన మూలికలు ఉంటాయని, అందువల్ల ఈ నదిలో స్నానం చేస్తే చర్మరోగాలు నయం అవుతాయని చెబుతారు.

ఇతర సందర్శనీయ స్థలాలు


ఆలయ బయటి ప్రాకారంలో విఘ్నేశ్వరుడు, కుమారస్వామి తదితర దేవతల సన్నిధులున్నాయి. కొల్లూరు చుట్టుపక్కల మంగుళూరు మంగళాదేవి, ఉడిపి కృష్ణుడు, కుందాపూర్, భత్కల్, షిమోగా, ధర్మస్థల, శృంగేరీ శారదా పీఠాలు సందర్శనీయ స్థలాలు. ఇక్కడ గల కుటజాద్రి పర్వత శ్రేణి అందమైన అటవీ సంపదతో ఆకట్టుకుంటుంది. ఈ పర్వత శ్రేణి ట్రెక్కింగ్‌కు అనుకూలంగా ఉంటుంది.

– డి.వి.ఆర్. భాస్కర్

ఎలా వెళ్లాలి?

మంగుళూరు నుంచి ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు కొల్లూరుకు వెళుతుంటుంది. ప్రైవేటు వాహనాలు కూడా ఉన్నాయి. మంగుళూరుకు నేరుగా అన్ని ప్రధాన నగరాల నుంచి బస్సులు, రైళ్లు ఉన్నాయి. మంగుళూరులో విమానాశ్రయం కూడా ఉంది.

ఆత్మ... పరమాత్మ



మనిషి తన లోపల అంతర్గతంగా కలిగి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆత్మ. అందుకే ఆత్మ శాశ్వతమైనది, అనంతమైనది, విలువ కట్టలేనిది అని అంటారు. భగవంతుడిని సచ్చిదానంద స్వరూపుడంటాము, సత్ అంటే సత్యం. ఇది పరిపూర్ణమైన సత్యం. అదెలాగంటే భూమిపై నదులు, సముద్రాలు, మరెన్నో జలాశయాలు ఉన్నాయి. వీటన్నిటిని భూమి తనలో ఇముడ్చుకుని ఉంది. ఆమె పర్వతాలలోనూ ఉంది, పరమాణువులోను ఉంది. ఎందుకంటే మూలకాలన్నీ భూతత్వంలోని అంతర్భాగాలే. అదేవిధంగా పరమాత్ముడు కూడా అంతే. ఇది సత్యం. సృష్టింపబడిన, సృష్టింపబడని అన్నిటికీ కూడా ఆయనే ఆధారం. ఆయన స్వయంగా సృష్టికార్యం నిర్వహించడు. అయితే అందుకు దోహదకారి మాత్రం స్వయంగా ఆయనే. ఇక రెండవది ఆయన చిత్తం. ఆ చిత్తం ద్వారానే ఆయన సృష్టి కార్యం మొదలు పెట్టాడు.

పరమాత్మ మూడవ గుణం ఆనందం. భగవంతుడు తన సంకల్పానికి, సృష్టి రచనకు తాను పొందే సంతోష భావన 'ఆనందం'. 'సత్యం','చిత్తం','ఆనంద ం'ఈ మూడు ఒక శూన్య స్థానం వద్ద కలిస్తే'బ్రహ్మతత్వం' అవుతాయి. ఈ మూడు ఏకమైనప్పుడు సృష్టి కానీ, అనుభూతి చెందుట గానీ జరిగి కేవలం నిశ్శబ్దం ఉంటుంది. ఈ అనుభూతి ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత అవగతమవుతుంది. మానవులలో మాత్రమే కాదు. జంతువులలో కూడా ఆత్మ ఉంటుంది. అయితే మానవులలోని ఆత్మలో మాత్రమే కాంతి ప్రకాశిస్తుంది. ఆ కాంతి వల్లే మనం ధర్మం గురించి, భగవంతుని గురించి, శాశ్వతమైన దాని గురించి తెలుసుకుంటాం.

మనిషి తన ఆత్మ గురించి తెలుసుకోకుండా పరమాత్మను చేరలేడు. కళ్ళులేకపోతే రంగులను ఏ విధంగా గుర్తించలేమో అదేవిధంగా మనం మనల్ని ఆత్మగా వ్యక్తీకరించుకోకపోతే పరమాత్మను చేరలేం. మీరు పరమాత్మను మీ మేధస్సుతో అవగాహన చేసుకోలేరు. కేవలం ఆత్మ ద్వారా మాత్రమే పరమాత్మను అర్థం చేసుకోగలరు. ఇంతకుముందు మహర్షులందరూ 'మీ ధర్మ నిర్వర్తనలో జాగరూకులై మీలో నివసిస్తున్న మీ ఆత్మను అనుభూతి చెంది, దానిని అర్థం చేసుకోండి' అని చెప్పారు. ఆత్మ అనేది మన హృదయంలో ఉన్న పరమాత్మ ప్రతిబింబం. ఈ ప్రతిబింబం ఏ విధంగా ఉంటుంది అంటే నిశ్చలంగా ఉన్న నీటిలో సూర్యుని ప్రతిబింబంలా. నీటిలో మనం సూర్యుణ్ణి ప్రతిబింబం రూపంలో చూస్తున్నప్పటికీ, ఆయన నీటిలో కాకుండా ఎక్కడో ఆకాశంలో ఉంటాడు. అదేవిధంగా ఆత్మ కూడా అంత చిన్నదైనప్పటికీ, దాని మూలం అతీతమైనది, అపరిమితమైనది. ఏ ప్రతిబింబాన్నయినా స్పష్టంగా చూడగలగడానికి కారణమైన అద్దం పరిశుభ్రంగా లేకపోతే ప్రతిబింబం స్పష్టంగా కనపడదు. తనలోని పరమాత్మ ప్రతిబింబాన్ని చూడలేడు. సూర్యుడు ప్రవహిస్తున్న నీటి అలలమీద రకరకాల ఆకారాలలో కనిపిస్తున్నప్పటికీ, తాను మాత్రం తన స్థానంలో నిలకడగానే ఉంటాడు. కేవలం అతని ప్రతిబింబం ఆకారంలో మాత్రమే మార్పు కనిపిస్తుంది. అంటే మన శరీరం, మనస్సు, బుద్ధి, అహంకారం అన్నీ ఒక అద్దం (పరిశుభ్రమైన ఆత్మ)లాగ మారాలి. ఇవన్నీ అద్దంలాగా పరివర్తన చెందాలి. అది ఎలా సాధ్యమవుతుంది? అందుకు భగవంతుడు మనలో అంతర్గతం గా ఆ ఏర్పాటును చేశాడు.



పరమపూజ్య మాతాజీ నిర్మలాదేవి

– డా.పి. రాకేష్ (మాతాజీ నిర్మలాదేవి ప్రసంగాల ఆధారంగా)

● పరిహారం

దురదృష్టం వెంటాడుతోందా?

స్థిరమైన ఆదాయం వచ్చే ఉద్యోగాల్లో కాకుండా వృత్తుల్లో, వ్యాపారాల్లో కొనసాగే వారికి ఒక్కొక్కసారి ఆదాయం మందగిస్తూ ఉంటుంది. అవకాశాలు అందినట్లే అంది చేజారిపోతుంటాయి. అవకాశాలు అందినా, ఆదాయం అందకుండా పోతుంటుంది. విధి వెక్కిరిస్తోందా? దురదృష్టం వెంటాడుతోందా? అనిపిస్తుంటుంది. అలాంటి గడ్డు పరిస్థితులను గట్టెక్కడానికి...

- దినచర్యను ధ్యానంతో ప్రారంభించండి. ఇష్ట దైవానికి ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధూప దీపాలను సమర్పించండి.
- ప్రతి అమావాస్య రోజున పితృదేవతలకు తర్పణాలు విడిచిపెట్టండి. పితృదేవతల సంతృప్తి కోసం ఆ రోజున కనీసం ఇద్దరు నిరుపేదలకు భోజనం పెట్టండి.
- మరీ ప్రాణాల మీదకు వస్తే తప్ప మంగళవారం రోజున ఎవరి వద్దనైనా అప్పుగా డబ్బు తీసుకోవద్దు. అలాగే, బుధవారం రోజున ఎవరికీ అప్పు ఇవ్వవద్దు.
- ఇంటి ప్రవేశ ద్వారం పక్కన తులసి మొక్కను పెంచండి. తులసి మొక్కకు పక్కనే పక్షులకు ఆహారంగా తిండి గింజలు వేయండి.
- చిన్న చందనపు చెక్కను, పసుపు కొమ్మును పసుపురంగు వస్త్రంలో కట్టి, దానిని డబ్బు దాచుకునే పెట్టెలో లేదా అల్మారాలో భద్రపరచండి.

– సాంఖ్యాయన



● ఇస్లాం వెలుగు

దైవ మార్గంలో మహిళల దానధర్మాలు

దైవ ప్రవక్త సల్లం హజ్రత్ బిలాల్ రజిఅన్ గారి వెంట మసీదు నుండి బయటకు వచ్చినప్పుడు స్త్రీలు తన బోధనలను గ్రహించలేదని ఆయన భావించారు. (తరువాత ఆయన వారిని సమావేశపరిచి) ఉద్బోధించారు. సద్ ఖా (దానం) చేయమని ఆదేశించారు. ఆ మహిళలు తమ తమ చెవిపోగుల్ని, ఉంగరాలను (ఆభరణాలను) తీసి హజ్రత్ బిలాల్‌కు అప్పజెప్పారు. ఆయన వాటిని తన అంగ వస్త్రం చెరుగులో పోగు చేసుకున్నారు.

వివరణ: దైవ ప్రవక్త ఈద్ (పండుగ) ప్రసంగం ముగించి బయటకు రాగా ప్రసంగం చేసేటప్పుడు మహిళలు దూరంగా కూర్చుని ఉండటం వల్ల ప్రయోజనం పొందలేకపోయారని ఆయన గ్రహించారు. వారి దగ్గరకు వెళ్లి నరక కూపంలో పడవేసే పాపాలకు దూరంగా ఉండమని వారికి హితవు చెబుతూ దైవ మార్గం లో (సదఖా) దానం చేయమని ఆదేశించారు.ధర్మసమ్మతమైన సంపాదన నుండి దైవమార్గంలో వెచ్చించడం వల్ల నరకంలో పడవేసే తీవ్రమైన పాపాలు సైతం సమసిపోతాయని, ప్రమాద సంఘటనల్లో కష్టాల్లో చిక్కుకోకుండా తమను కాపాడుకోవచ్చని ఉద్బవించారు దైవ కారుణ్యాన్ని కరుణ కటాక్షాలను ఈ సదఖా ఆహ్వానిస్తుంది అనడంలో సందేహం లేదు. కాబట్టి స్త్రీలు తమ సొత్తు నుండి వీలైనంత అధిక మొత్తంలో అల్లాహ్ మార్గంలో సదఖా చేసి దేవుని ప్రసన్నత పొందే ప్రయత్నం చేయాలి.

ఆధునిక కాలంలో స్త్రీ స్వతహాగా సంపాదిస్తోంది. కానీ 1500 శతాబ్దాల క్రితం స్త్రీల సంపాదన గురించి ఆలోచించలేము. అయితే వారు కూడా దానధర్మాలు చేయడంలో పురుషులతో సమానంగా ఉండేవారు. ఆ కాలం నుండి ఈ కాలం వరకు దైవ మార్గంలో ధనం అవసరం ఏర్పడినప్పుడల్లా స్త్రీలు తమ శరీరంపై ఉన్న నగానట్రా తీసి అన్ని దైవ మార్గంలో విరాళంగా వేస్తూ వస్తున్నారు.

తప్పులు ప్రతి ఒక్కరితో జరుగుతాయి. ఆడవారు గానీ మగవారు గానీ ఆ తప్పులకు, ఆ నేరాలకు, ఆ చెడు పనులకు పరిహారంగా దైవ మార్గంలో ఖర్చుపెట్టినట్లయితే పరలోకంలో ఈ ఖర్చు నరకంలోకి వెళ్లకుండా అడ్డుకుంటుంది. అందువల్ల దానధర్మాలు చేస్తూ ఉండాలి. దివ్య ఖురాన్ చెబుతోంది: పురుషులు చేసుకున్నది పురుషుల కోసమే, స్త్రీలు చేసుకున్నది స్త్రీల కోసమే. కాబట్టి దానధర్మాలు చేయడంలో ఒకరి కంటే ఒకరు మించి చేయాలి. ఇవే ప్రపంచంలో ఆపదలనుండి గట్టిస్తాయి, పరలోకంలో నరకాగ్ని నుండి రక్షిస్తాయి. దేవుడు మనందరినీ దానధర్మాలు చేసే వారిలో చేర్చుగాక

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్



సువార్త

దేవుని ప్రత్యక్షత

పరిశుద్ధ గ్రంథం సమాచారం మేరకు దేవుడు అనేకసార్లు ప్రత్యక్షపరచుకొన్నట్లు మనం చూస్తాం. అవి కేవలం ఇశ్రాయేలీయ ప్రజల రక్షణార్థమే కాదు మన రక్షణార్థం కూడా ప్రత్యక్షపరచుకుంటాడని గ్రహించగలం.

మోషే (ప్ర) మిద్యాను యాజకుడైన యిత్రో అను తన మామ మందను మేపుతూ, ఆ మందను అరణ్యం అవతలకు తోలుకొని దేవుని పర్వతమైన హోరేబుకు వచ్చాడు. ఒక పొద నడిమిన అగ్నిజ్వాలలో యెహోవా దూత అతనికి ప్రత్యక్షమయ్యాడు. అతడు చూస్తున్నప్పుడు అగ్నివల్ల ఆ పొద మండుతోంది. కానీ పొద కాలిపోలేదు. అప్పుడు మోషే (ప్ర)–ఆ పొద ఎందుకు కాలిపోలేదో నేను ఆ తట్టు కెళ్ళి ఆ గొప్ప వింత చూసెదనని అనుకొనెను. దానిని చూడటానికి అతడు ఆ తట్టుకు రావడం యెహోవా చూశాదని దేవుడు ఆ పొద నుండి –మోషే మోషే అని అతనిని పిలిచాడు. అందుకు అతడు చిత్తము ప్రభువా అన్నాడు. అందుకు ఆయన దగ్గరకు రావద్దు... నీ పాదాల నుండి నీ చెప్పులు విడువుము, నీవు నిలిచి వున్న స్థలము పరిశుద్ధ ప్రదేశమని అన్నాడని గ్రంథరాజ సుగంధంలో లిఖితమై ఉండటాన్ని మనం చూస్తాం. దేవుడు మోషే (ప్ర)తో ఇలా అన్నాడు నేను ఐగుప్తులో వున్న నా ప్రజల బాధను నిశ్చయంగా చూశాను. పనులలో కష్టపెట్టువారిని బట్టి వారు పెట్టిన మొరను వింటిని. వారి దుఃఖము తెలిసి



వున్నది. కాబట్టి ఐగుప్తీయుల చేతిలో నుండి వారిని విడిపించుటకును, పాలు తేనెలు ప్రవహించు దేశానికి నడిపించడానికి దిగి వచ్చానన్న ప్రత్యక్షత పరిశుద్ధగ్రంథంలో చూస్తాము.

దేవుడు మోషే(ప్ర)తో రమ్ము నిన్ను ఫరో వద్దకు పంపెదనన్నాడు. అందుకు మోషే ఇశ్రాయేలీయులను తోడ్కొని పోవుటకు నేనెంతవాడనని ఇశ్రాయేలీయులతో మీ పితరుల దేవుడు మీ వద్దకు పంపెనని చెప్పగా వారు–ఆయన పేరేమిటి? అని అడిగితే వారితో నేనేమి చెప్పవలెనని అన్నాడు. అందుకు దేవుడు– ''నేను ఉన్నవాడను అనువాడనై ఉన్నానని'' చెప్పవలెనని చెప్పాడు. (నిర్గ 3:1–14)

ఆ విధంగా దేవుడు నిరంతరం నా నామం ఇదేనని, మనతో కూడా తోడై ఉంటానని సెలవిస్తున్నాడు (నిర్గమ 3:15). ఇది పరిశుద్ధ స్థలం. కావున నీ చెప్పులు విడువుమని మోషేతో చెప్పాడు. చెప్పులు లోకానికి సాదృశ్యం. కాబట్టి ఈ లోక సంబంధులం కాకుండా ఆయన సన్నిధిలో పరమ పవిత్రంగా వుండాలని సూచిస్తున్నది. అంతేకాకుండా సర్వమానవాళికి దేవుడను నేనేనని సూచిస్తున్నది.

క్రీస్తుప్రభువు చేసిన అనేక అద్భుత కార్యాలలో ఇది ఒక అద్భుతం. ఒక స్త్రీ పన్నెండేళ్ళ నుండి రక్తస్రావ రోగంతో బాధపడుతూ యెవని చేతను స్వస్థత నొందనిదై క్రీస్తు ప్రభువుల వారి వెనకకు వచ్చి ఆయన వస్త్రపు చెంగు ముట్టగా, స్వస్థత పొందానని ప్రజలందరికీ తెలిపింది. అప్పుడు ప్రభువు – ఆ స్త్రీతో కుమారీ! నీ విశ్వాసం నిన్ను స్వస్థపరిచింది. కావున సమాధానం గలదానివై వెళ్ళమని చెప్పాడు. ఇది విశ్వాసానికి ప్రతీక. దేవుని కుమారుడైన యేసుప్రభువులు వారి ద్వారా దేవునిప్రేమ ప్రత్యక్షబడిందని వాక్యం స్పష్టీకరిస్తున్నది (లూకా 8:43 – 48). మొదటి వాక్యం ద్వారా దేవుని ప్రత్యక్షత చూస్తాము. రెండోది విశ్వాసం కలిగి ఉండాలని సూచిస్తున్నది. అటువంటి విశ్వాసం కలిగి దేవుని దర్శనం పొందుదముగాక.

– కోట బిపిన్ చంద్రపాల్

● జెన్ పథం

లక్ష్యసాధన

ఓ మారు మూడు మేకలు ఓ ఎత్తయిన పర్వతాన్ని ఎక్కడానికి పూనుకున్నాయి. అనుకున్నదే తడవుగా అవి ఎక్కడం మొదలుపెట్టాయి. అవి కొంతదూరం వెళ్ళేసరికి ఒకడు వాటిని ఆపి'ఎక్కడికి కట్టకట్టుకుని బయలుదేరారు?' అని అడిగాడు. మేకలు ఒక్క మాటగా చెప్పాయి తమ మనసులోని మాటను. 'ఓహో. అలాగా.. బాగానే ఉంది కానీ మీరేసే కాలుతో పొరపాటున ఓ రాయిగానీ దొర్లి పడితే మీ ప్రాణాలు పోతాయి' అని అనగానే మూడింట్లో ఓ మేక అక్కడితో తన సాహసం ముగించుకుని కిందకు దిగేసింది.



మిగిలిన రెండు మేకలూ ముందుకు సాగాయి. అవి ఇంకాస్త పైకి చేరుకోగానే అక్కడొకడు ఆ రెండింటినీ ఆపి 'ఏంటీ ఎటు పోతున్నారు?' అని అడిగాడు. ఆ రెండూ తమ ఆశయాన్ని చెప్పాయి. అతను 'వద్దు వద్దు ముందుకు వెళ్ళకండి. అక్కడ ఓ కొండచిలువ ఉంది. అది మిమ్మల్ని మింగేయడం ఖాయం' అనడంతో మరొక మేక కూడా అక్కడితో తన ఆశయాన్ని మానుకుని కొండ దిగేసింది. కానీ మూడోమేక మాత్రం ఎవరేం చెప్పినా వినిపించుకోకుండా కొండ శిఖరాగ్రాన్ని చేరి అక్కడ కొంచెంసేపు ఉండి కిందకు దిగింది.

అక్కడొకడు 'నువ్వెలా విజయవంతంగా నీ లక్ష్యాన్నిన్ని పూర్తి చేశావు' అని అడిగాడు. అప్పుడా మేక 'నాకు వినిపించదు. పేరుకే నాకు చెవులున్నాయి. అవి పని చేయవు' అని చెప్పింది.

ఈ మూడో మేకలాగానే మనమూ కొన్నిసార్లు లక్ష్యసాధనలో కొందరి మాటలకు భయపడి మన లక్ష్యం నుంచి తప్పుకోవడం సరికాదు. అనుకున్నది సాధించాలంటే ఆత్మవిశ్వాసం, పట్టుదల ముఖ్యమైనవి.

– జగద్రేణు

బిజినెస్ రీల్

పీఎన్‌సీ-కేకేఆర్ రూ. 9,000 కోట్ల డీల్

మరో రెండు అసెట్స్‌కి అనుమతులు

న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల సంస్థ పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్, కేకేఆర్‌కి మధ్య రూ. 9,000 కోట్ల డీల్ సాకారం దిశగా మరో అడుగు ముందుకుపడింది. ఇంకో రెండు అసెట్స్‌లో వాటాలను కేకేఆర్‌కి చెందిన హైవేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్‌కి బదిలీ చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎన్‌హెచ్‌ఏఐ సూత్రప్రాయ అనుమతులు మంజూరు చేసింది. వీటిలో బుందేల్‌ఖండ్, ఖజురహో రోడ్డు ప్రాజెక్టులు ఉన్నాయి. ఇప్పటిదాకా మొత్తం 8 అసెట్స్‌కి అనుమతి లభించగా జనవరి ఆఖరు నాటికి మరో రెండింటికి గ్రీన్ సిగ్నల్ లభించవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. మొత్తం 12 అసెట్స్‌ను విక్రయిస్తుండగా ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి పది అసెట్స్‌కి సంబంధించి డీల్ పూర్తి కావచ్చని పేర్కొన్నాయి. మిగతా రెండింటికి వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో అనుమతి లభించగలదని వివరించాయి.

దేశీ కార్యకలాపాల విస్తరణలో క్రెడెరా..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంపెనీలకు డిజిటల్ పరివర్తన సేవలు అందించే క్రెడెరా భారత్‌లో కార్యకలాపాలను విస్తరించడంపై మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం దేశీయంగా ఆరు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 1,300 మంది సిబ్బంది ఉండగా అతి పెద్దదైన హైదరాబాద్ సెంటర్‌లో 1,000 మంది పైగా ఉద్యోగులు ఉన్నట్లు క్రెడెరా ఇండియా సీఈవో గౌరవ్ మాథుర్ తెలిపారు. మరింత మంది మార్కెటింగ్, టెక్నికల్ నిపుణులను నియమించుకోనున్నట్లు చెప్పారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణనిచ్చేందుకు పలు కళాశాలలతో కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు. క్రెడెరాకు అంతర్జాతీయంగా 3,000 మంది సిబ్బంది ఉన్నారు.

బోర్డు సమావేశాలు

అదానీ గ్రీన్ ఎనర్జీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సైయంట్, యునైటెడ్ స్పిరిట్స్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, హెచ్‌పీసీఎల్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, గ్లెన్‌మార్క్ లైఫ్, గ్రీవ్స్ కాటన్, ఎల్‌కేపీ సెక్యూరిటీస్, ఎంఫసిస్, నిప్పన్ లైఫ్ ఇండస్ట్రీస్, పాలీక్యాబ్ టెక్, స్పందన స్ఫూర్తి, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, తేజాస్ నెట్‌వర్క్స్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్స్, జీ ఎంటర్‌టైన్‌మెంట్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-1-2025

విశాఖ	505-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480-00
వరంగల్	482-00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	309.9	3.87
INFY	1,855.00	3.02
TCS	4,152.00	2.88
TECHM	1,679.20	2.36
HDFCBANK	1,671.90	1.8

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	270.6	-3.01
TATAMOTORS	744.35	-2.16
TRENT	5,624.80	-1.95
POWERGRID	298.4	-1.31
AXISBANK	959.6	-1.09

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,503
ఎన్ఎస్ఈ	96,644
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,04,583
ఎఫ్ఐఐ	- 4,026
డీఐఐ	+ 3,640

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	76.52 (రాత్రి 11.30కు)	$ 75.83 (క్రితం ముగింపు)
బ్రెంట్	79.08 (రాత్రి 11.30కు)	$ 79.29 (క్రితం ముగింపు)



ఎంజీ పెవిలియన్‌లో ప్రధాని..

భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ పెవిలియన్‌ను సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో కంపెనీ డైరెక్టర్ పార్థ్ జిందాల్, గౌరవ సీఈవో రాజీవ్ చాబా. న్యూఢిల్లీలో జనవరి 17న ప్రారంభమైన ఈ ప్రదర్శన 22న ముగిసింది.

ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు పటిష్టం

ట్రంప్ హయాంపై ఆశావహంగా కార్పొరేట్లు



న్యూఢిల్లీ: డొనాల్డ్ ట్రంప్ రెండో విడత అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలు పటిష్టం కాగలవని దేశీ పరిశ్రమ దిగ్గజాలు ఆశాభావం వ్యక్తం చేశారు. హెల్త్‌కేర్, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు అవకాశాలు లభించగలవని పేర్కొన్నారు. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకు మరిన్ని అమెరికా ఉత్పత్తులను దేశీ మార్కెట్‌లో అనుమతించడం, స్టార్‌లింక్.. టెస్లాకు స్వాగతం పలకడం, అమెజాన్ విషయంలో ఉదారంగా వ్యవహరించడం మొదలైనవి భారత్ చేయాల్సి రావచ్చని .. ట్రంప్ ప్రమాణానికి కొద్ది గంటల ముందు ఎక్స్‌లో ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ హర్ష్ గోయెంకా పోస్ట్ చేశారు. దీనికి ప్రతిగా ఏరోస్పేస్ .. డిఫెన్స్ ఉత్పత్తుల తయారీలో భారత్‌కు సహకరించడం, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ సభ్యత్వానికి మద్దతునివ్వడం, భారతీయులకు వీసా నిబంధనలను సడలించడం మొదలైనవి ట్రంప్ చేయొచ్చని పేర్కొన్నారు. మరోవైపు, ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపరంగా ట్రంప్ తొలి విడత పాలన సానుకూలంగానే ఉండేదని, ఆయన తిరిగి అధికారం చేపట్టడంతో ఇవి మరింత బలోపేతం కాగలవని పీహెచ్‌డీసీసీఐ డిప్యుటీ సెక్రటరీ జనరల్ ఎస్‌పీ శర్మ తెలిపారు. ఫార్మా పరిశోధనలు, తయారీ మొదలైన అంశాల్లో పరస్పర సహకారానికి అవకాశాలను పరిశీలించవచ్చని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తారని, స్మార్ట్‌ఫోన్లు .. ఎలక్ట్రానిక్స్ మొదలైన ఉత్పత్తులకు సంబంధించి వాణిజ్యం గణనీయంగా పెరగవచ్చని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ చైర్మన్ పంకజ్ మహీంద్రూ తెలిపారు. అమెరికా డాలరును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ కరెన్సీ కోసం ప్రయత్నిస్తే భారత్ కూడా భాగంగా ఉన్న బ్రిక్స్ కూటమిపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తానంటూ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో దేశీ కార్పొరేట్ల ఆశాభావం ప్రాధాన్యం సంతరించుకుంది.

11 కోట్లకు ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్లు

ఐదు నెలల్లోనే కోటి మంది చేరిక



న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఇన్వెస్టర్ల సంఖ్య 11 కోట్ల మార్క్‌ను (2024 ఆగస్ట్ నాటికి) అధిగమించింది. చివరి కోటి మంది ఇన్వెస్టర్లు కేవలం ఐదు నెలల్లోనే చేరినట్లు ఎన్ఎస్ఈ ప్రకటించింది. ఇటీవలి కాలంలో ఎన్ఎస్ఈ వద్ద ఇన్వెస్టర్ల రిజిస్ట్రేషన్లు వేగాన్ని అందుకున్నాయని, గత ఐదేళ్లలో 3.6 రెట్లు పెరిగినట్లు తెలిపింది. ఎన్ఎస్ఈ 1994లో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత మొదటి కోటి ఇన్వెస్టర్ల చేరికకు 14 ఏళ్లు పట్టగా, తదుపరి కోటి మందికి ఏడేళ్లు పట్టింది. ఆ తర్వాత కోటి మంది ఇన్వెస్టర్లు కేవలం 3.5 ఏళ్లలోనే చేరారు. ఆ తర్వాత కోటి మంది చేరికకు కేవలం ఏడాది సమయం తీసుకుంది. నేరుగా స్టాక్ మార్కెట్లో పాల్గొనేందుకు ఇన్వెస్టర్లలో నెలకొన్న ఆసక్తికి ఇది నిదర్శనమని ఎన్ఎస్ఈ పేర్కొంది. ''గత ఐదు నెలల నుంచి రోజువారీ యూనిక్ ఇన్వెస్టర్ల రిజిస్ట్రేషన్లు 47,000 నుంచి 73,000 మధ్య ఉంటున్నాయి. డిజిటైజేషన్ వేగాన్ని పుంజుకోవడం, ఇన్వెస్టర్లలో అవగాహన, అందరికీ ఆర్థిక సేవల చేరువ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, మార్కెట్ పనితీరు బలంగా ఉండడం వంటివి దోహదం చేశాయి''అని ఎన్ఎస్ఈ వివరించింది.

అమెరికా వృద్ధిలో కీలకంగా భారతీయులు

- దేశీ ఐటీ వృద్ధిపై నిస్పృహ చెందనక్కర్లేదు
- నాస్కామ్ వైస్ ప్రెసిడెంట్ శివేంద్ర సింగ్



న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా వర్కర్లంటే అమెరికా ఉద్యోగుల స్థానాన్ని ఆక్రమించే చౌక కార్మికులని, అక్కడి వేతనాల స్థాయిని కుదించేస్తారనేది అపోహ మాత్రమేనని ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ వైస్ ప్రెసిడెంట్ శివేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. అమెరికా ఎకానమీ వృద్ధిలో భారతదేశం, భారతీయ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో దేశీ ఐటీ వృద్ధిపై నిస్పృహకు లోను కావాల్సిన అవసరమేమీ లేదని ఆయన పేర్కొన్నారు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ విధానాలపైన, 250 బిలియన్ డాలర్ల భారతీయ ఐటీ పరిశ్రమ మీద వాటి ప్రభావాలపైన అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికాలో పరిణామాలేమీ భారత ఐటీ పరిశ్రమ అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపబోవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్-1బీ వీసాలనేవి నాన్-ఇమిగ్రెంట్ వీసాలే కావడం వల్ల వివాదాస్పద వలసల సమస్యకు, వాటికి సంబంధమేమీ లేదని పేర్కొన్నారు. హెచ్-1బీ వీసాల్లో 70 శాతం వీసాలు భారతీయులకే లభిస్తుండటమనేది మన నైపుణ్యాలకు నెలకొన్న డిమాండ్‌కి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అమెరికాలో కొత్త ప్రభుత్వం వృద్ధి సాధనపై దృష్టి పెట్టడమనేది ఇరు దేశాలు కలిసి పని చేసేందుకు మరింతగా అవకాశాలను కల్పించగలదని సింగ్ చెప్పారు. భారతీయ కంపెనీలు అమెరికాలో అక్కడివారికి నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు 1.1 బిలియన్ డాలర్ల పైగా ఇన్వెస్ట్ చేశాయని సింగ్ చెప్పారు.

స్టార్టప్స్‌కు సగటున ఏటా 15 బిలియన్ డాలర్లు

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: స్టార్టప్‌లకు ప్రభుత్వం అద్భుత మద్దతు ఇస్తోందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. పెట్టుబడుల విషయంలో ఈ సంస్థల సామర్థ్యాలను, విలువను దేశీయ ఇన్వెస్టర్లు గుర్తించారని అన్నారు. తొమ్మిదేళ్లలో భారతీయ స్టార్టప్స్ సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయని వెల్లడించారు. 'సగటున ఏటా 15 బిలియన్ డాలర్ల నిధులు వెల్లువెత్తుతున్నాయి. గరిష్ఠంగా ఇది 22-25 బిలియన్ డాలర్లను తాకుతోంది. ప్రభుత్వ ఆర్థిక సాయంతో సిడ్బీ నిర్వహిస్తున్న ఫండ్ ఆఫ్ ఫండ్స్ స్కీమ్ (ఎఫ్ఎఫ్ఎస్) వంటి నిధుల సాధనాలు ప్రైవేట్ మూలధనాన్ని సమీకరించడానికి ముఖ్యంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి పరివర్తన సాధనంగా పనిచేస్తున్నాయి. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ కూడా స్టార్టప్‌లను ఆలోచన నుండి కార్యరూపం దశ వరకు ప్రోత్సహించడానికి పని చేస్తున్నాయి. 2024లో 76 కంపెనీలు ఐపీవోకు వచ్చాయి. జనవరి 15 నాటికి 1,59,157 నమోదిత స్టార్టప్‌లతో భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా అవతరించింది. 2016లో దాదాపు ఈ సంఖ్య 500 మాత్రమే. పరిశ్రమ 17.2 లక్షల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించింది' అని మంత్రి వివరించారు. కాగా, భారత్ స్టార్టప్ చాలెంజ్‌ను మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.

మెషీన్లు దేశీయంగా తయారు చేయండి

ఆటో విడిభాగాల పరిశ్రమలు తయారీ మెషీనరీలను దేశీయంగా తయారు చేసుకోవాలని వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. ఆటో పరికరాల తయారీలో వినియోగిస్తున్న మెషీన్లను దేశీయంగా రూపొందించుకోవాలని తద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సలహా ఇచ్చారు. కొన్ని కంపెనీలు విడిభాగాలను దిగుమతి చేసుకుంటున్నాయని, ఇవి తదుపరి దశలో పోటీ నుంచి తప్పుకోవలసి వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశీ ప్రాడక్టులు దిగుమతులకు పోటీగా రూపొందుతాయని అంచనా వేశారు. ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నప్పటికీ కొన్ని కంపెనీలు ఇప్పటికే దిగుమతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దిగుమతులపై ఆధారపడుతున్నాయన్నారు. దేశీయంగా అందుబాటు ధరలలో అధిక నాణ్యతగల ప్రెసిషన్ ఇంజినీరింగ్‌తో విడిభాగాలను తయారు చేయగలవని, దీంతో దిగుమతులపై ఆధారపడే సంస్థలకు మనుగడ కష్టంకాగలదని ఆటో విడిభాగాల ఎక్స్‌పో 2025 సందర్భంగా గోయల్ స్పష్టం చేశారు.

ప్యాసింజర్ వెహికిల్స్‌కు నెలవారీ టోల్ పాస్!

పరిశీలిస్తున్నామన్న నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై ప్రైవేట్ వాహనాల టోల్ వసూలు కోసం నెలవారీ, వార్షిక పాస్‌లను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం తెలిపారు. బ్యారియర్ లెస్ టోలింగ్ అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'గ్రామాలకు వెలుపల టోల్ కలెక్షన్ బూత్‌లను ఏర్పాటు చేస్తాం. తద్వారా గ్రామస్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. టోల్ వసూళ్లలో వాణిజ్య వాహనాల వాటా ఏకంగా 76% కైవసం చేసుకుంది. ప్యాసింజర్ వెహికిల్స్ వాటా కేవలం 24 శాతమే. రోడ్డు రవాణా, హైవేస్ మంత్రిత్వ శాఖ జాతీయ రహదారులపై ఫాస్టాగ్‌తో పాటు అదనంగా బ్యారియర్ లెస్ గ్లోబల్ నావిగేషన్ సాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) ఆధారిత టోల్ కలెక్షన్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ప్రస్తుత టోల్ కలెక్షన్ వ్యవస్థ కంటే జీఎన్ఎస్ఎస్ ఆధారిత టోల్ వసూలు విధానం మెరుగైనది. బ్యారియర్‌లెస్ టోల్ ప్రాజెక్టుకు 15-20 రోజుల్లో టెండర్లను ఆహ్వానిస్తాం. భారతీయ సాంకేతికతనే వినియోగిస్తాం' అని మంత్రి వివరించారు.

ట్రాఫిక్ రద్దీని తగ్గించడం: 2024 జూలైలో కర్ణాటకలోని ఎన్‌హెచ్-275లోని బెంగళూరు-మైసూర్ సెక్షన్, అలాగే హర్యానాలోని ఎన్‌హెచ్- 709లోని పానిపట్-హిసార్ మార్గంలో జీఎన్ఎస్ఎస్-ఆధారిత యూజర్ ఫీ కలెక్షన్ సిస్టమ్‌పై పైలట్ అధ్యయనం జరిగింది. టోల్ కేంద్రాల వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, హైవేలపై ప్రయాణించే ఖచ్చితమైన దూరానికి వాహనదారుల నుండి ఛార్జీలు వసూలు చేయడం ఈ విధానం లక్ష్యం. టోల్ ప్లాజా వద్ద ఒక్కో వాహనం సగటు నిరీక్షణ సమయం 2018-19లో 8 నిమిషాలు. ఫాస్టాగ్‌లను ప్రవేశపెట్టడంతో 2020-21, 2021-22లో ఈ సమయం 47 సెకన్లకు తగ్గిందని గడ్కరీ తెలిపారు.

క్యూ3 ఫలితాలు

టాటా కమ్యూనికేషన్స్ లాభం హైజంప్

రూ. 257 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ టాటా కమ్యూనికేషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం భారీగా ఎగసి రూ. 257 కోట్లకు చేరింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 45 కోట్లు ఆర్జించింది. అయితే పన్ను సంబంధిత రూ. 185 కోట్ల వన్‌టైమ్ ప్రొవిజన్ ఇందుకు కారణం. కాగా.. మొత్తం ఆదాయం 3% బలపడి రూ. 5,798 కోట్లను తాకింది.

బీఎస్ఈలో టాటా కమ్యూనికేషన్స్ షేరు 1.4 శాతం నష్టంతో రూ. 1,673 వద్ద ముగిసింది.

రాణించిన హడ్కో

డిసెంబర్ క్వార్టర్‌లో రూ.735 కోట్ల లాభం



న్యూఢిల్లీ: పట్టణ గృహ, మౌలిక వసతుల ప్రాజెక్టులకు రుణాలు అందించే ప్రభుత్వరంగ హడ్కో డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పనితీరు పరంగా రాణించింది. సంస్థ కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 42 శాతం వృద్ధితో రూ.735 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.519 కోట్లుగా ఉండడం గమనార్హం. మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.2,023 కోట్ల నుంచి రూ.2,770 కోట్లకు వృద్ధి చెందింది. వాద్వాన్ పోర్ట్ ప్రాజెక్ట్ లిమిటెడ్ (వీపీపీఎల్)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకున్నట్టు కంపెనీ తెలిపింది. రూ.25,000 కోట్ల వరకు రుణాన్ని సమకూర్చే అవకాశాలను ఈ ఒప్పందం కింద పరిశీలిస్తున్నట్టు వెల్లడించింది. వీపీపీఎల్ అన్నది జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్, మహారాష్ట్ర మారిటైమ్ బోర్డ్ ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్.

రెండేళ్లలో 1,000 ఐపీవోలు

2026లో రూ. 3 లక్షల కోట్ల సమీకరణ ● ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్ తాజా అంచనాలు



న్యూఢిల్లీ: రానున్న రెండేళ్లలో మొత్తం 1,000 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు చేపట్టే వీలున్నట్లు దేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అసోసియేషన్(ఏఐబీఐ) తాజాగా అంచనా వేసింది. ఇందుకు ప్రధానంగా ఆర్థిక వృద్ధి, సానుకూల స్టాక్ మార్కెట్లు, మెరుగుపడనున్న నియంత్రణా సంబంధ నిబంధనలు తోడ్పాటు నివ్వగలవని పేర్కొంది. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం(2025-26)లో అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా కంపెనీల నిధుల సమీకరణ రూ. 3 లక్షల కోట్లను అధిగమించవచ్చునని అభిప్రాయపడింది. రానున్న రెండేళ్ల(2026, 2027)లో దేశీ క్యాపిటల్ మార్కెట్లు భారీ ప్రగతిని సాధించనున్నట్లు ఏఐబీఐ తెలియజేసింది. గత ఆరేళ్లలో 851 కంపెనీలు ఐపీవోలు చేపట్టడం ద్వారా మొత్తం రూ. 4.58 లక్షల కోట్లు సమీకరించినట్లు వెల్లడించింది. వీటిలో 281 కంపెనీలు మెయిన్ బోర్డు నుంచి లిస్ట్‌కాగా.. 570 సంస్థలు ఎస్ఎంఈ విభాగానికి చెందినవిగా తెలియజేసింది.

గతేడాదిలో

గత ఆర్థిక సంవత్సరం(2023-24) స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ ద్వారా దేశీ కంపెనీలు ఉమ్మడిగా రూ. 67,955 కోట్లు సమకూర్చుకున్నట్లు ఏఐబీఐ పేర్కొంది. వీటిలో ప్రధాన కంపెనీలు రూ. 61,860 కోట్లు అందుకోగా.. ఎస్ఎంఈలు రూ. 6,095 కోట్ల పెట్టుబడులు సమీకరించాయి. మరోవైపు క్విప్ ద్వారా 61 కంపెనీలు రూ. 68,972 కోట్ల నిధులను సమీకరించాయి. ఐపీవోల పరిమాణంరీత్యా గతేడాది భారత్ ప్రపంచవ్యాప్తంగా తొలి స్థానంలో నిలిచినట్లు ఏఐబీఐ చైర్మన్ మహావీర్ లునావత్ తెలియజేశారు. మొత్తం 335 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వచ్చినట్లు వెల్లడించారు. తద్వారా యూఎస్, యూరప్‌లను భారత్ అధిగమించినట్లు పేర్కొన్నారు. గత రెండేళ్ల బాటలో వచ్చే ఏడాదిలోనూ ఐపీవోలు రికార్డ్ సృష్టించనున్నట్లు అంచనా వేశారు. వెరసి క్విప్‌లు, ఐపీవోల ద్వారా రూ. 3 లక్షల కోట్లను మించి పెట్టుబడుల సమీకరణకు వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

ల్యూమినో ఇండస్ట్రీస్ లిస్టింగ్ బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



కండక్టర్స్, పవర్ కేబుళ్ల తయారీ కంపెనీ ల్యూమినో ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుమతించమంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 420 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 15 కోట్లు పరికరాల కొనుగోలుకి వెచ్చించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా ప్రాడక్ట్ ఆధారిత ఈపీసీ సేవలు అందిస్తోంది. కండక్టర్స్, పవర్ కేబుళ్లు, ఎలక్ట్రికల్ వైర్లతోపాటు విద్యుత్ ప్రసారం, పంపిణీకి చెందిన ఇతర ప్రత్యేక విడిభాగాలను సైతం రూపొందిస్తోంది. కంపెనీ క్లయింట్లలో కల్పతరు ప్రాజెక్ట్స్, మాంటె కార్లో, జాక్సన్ లిమిటెడ్, వరోరా కర్నూల్ ట్రాన్స్‌మిషన్ తదితరాలున్నాయి. అంతేకాకుండా దేశ, విదేశీ ప్రభుత్వ విద్యుత్ బోర్డులు సైతం కస్టమర్ల జాబితాలో ఉన్నాయి. 2024 సెప్టెంబర్ కల్లా కంపెనీ ఆర్డర్ బుక్ విలువ రూ. 1,804 కోట్లకు చేరింది. గతేడాది(2023-24) ఆదాయం 85% జంప్‌చేసి రూ. 1,407 కోట్లను తాకగా.. నికర లాభం రూ. 19 కోట్ల నుంచి రూ. 87 కోట్లకు ఎగసింది.

ఐపీవో గ్రే మార్కెట్‌పై సెబీ కన్ను

ప్రీలిస్టింగ్ ట్రేడింగ్‌ను అనుమతించే యోచన



పబ్లిక్ ఇష్యూల అనధికార క్రయవిక్రయాల(గ్రే మార్కెట్)కు చెక్ పెట్టే యోచనలో ఉన్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పేర్కొంది. ఇందుకు ఒక వ్యవస్థను ప్రవేశపెట్టే ప్రణాళికల్లో ఉన్నట్లు సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్ పేర్కొన్నారు. తద్వారా ఐపీవోలో షేర్లను పొందగల ఇన్వెస్టర్లు ముందుగానే వీటిని విక్రయించేందుకు వీలు కల్పించనున్నట్లు తెలియజేశారు. ఇటీవల కాలంలో పలు ఐపీవోలకు భారీస్థాయిలో స్పందన లభించడంతోపాటు.. అధిక లాభాలతో లిస్టవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత కొద్దికాలంగా గ్రే మార్కెట్ లావాదేవీలు పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు. ఇన్వెస్టర్లు ఇలాంటి లావాదేవీలను కోరుకుంటుంటే నియంత్రణల పరిధిలో వీటిని ఎందుకు అనుమతించకూడదంటూ వ్యాఖ్యానించారు. దేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అసోసియేషన్ ఇక్కడ నిర్వహించిన ఒక కార్యక్రమంలో బచ్ ఇంకా పలు అంశాలపై స్పందించారు. నిజానికి గ్రే మార్కెట్ లావాదేవీలు సరికాదని, ఆర్గనైజ్‌డ్ మార్కెట్ ద్వారానే క్రయవిక్రయాలు చేపట్టడం శ్రేయస్కరమని బచ్ తెలియజేశారు. ఇందుకు రెండు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు చర్చలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్గదర్శకాలు సిద్ధమయ్యాక ఐపీవో షేర్లకు లిస్టింగ్‌కంటే మూడు రోజులు ముందుగా లావా దేవీలకు తెర తీయనున్నట్లు వివరించారు. షేర్ల కేటాయింపులు, లిస్టింగ్ మధ్యలో ఇందుకు వీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

నిధుల దుర్వినియోగం

కొన్ని కంపెనీలు ఐపీవోల ద్వారా సమీకరించిన నిధులను దుర్వినియోగపరుస్తున్నట్లు గుర్తించామని బచ్ తెలియజేశారు. క్యాపిటల్ మార్కెట్లలో ఇలాంటి సంస్థలు కార్యకలాపాలు నిర్వహించకుండా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు అడ్డుకోవాలని సూచించారు. ఐపీవో డాక్యుమెంట్లను వేగంగా పరిశీలించి అనుమతులిచ్చేందుకు వీలుగా ఒక సాధనాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఐబ్యాంకర్లకు ఇలాంటి కంపెనీలగురించి తెలుస్తుందని, ఇలాంటి వాటికి సహకరించవద్దని సలహా ఇచ్చారు. ఎస్ఎంఈ విభాగంలో ఇలాంటి ఐపీవోలు వెలువడితే అధిక సబ్‌స్క్రిప్షన్ నమోదవుతున్నదని చెప్పారు. ఆపై షేరు ధర భారీగా పెరుగుతూపోవడం ద్వారా ప్రమోటర్లు త్వరితగతిన లాభపడుతున్నట్లు వివరించారు. సంబంధిత పార్టీ లావాదేవీల ద్వారా ఐపీవో నిధులను కొన్ని కంపెనీలు ప్రమోటర్ సంబంధ సంస్థలలోకి చేర్చడం లేదా రక్షణాత్మక ప్రాంతాలకు మళ్లించడం చేస్తున్నట్లు బచ్ తెలియజేశారు. ఈ నిధులను విదేశీ మార్కెట్లలో ఇతర సంస్థలు లేదా సాఫ్ట్‌వేర్ వంటి ప్రాడక్టుల కొనుగోలుకి వినియోగిస్తున్నాయని వివరించారు.

దేశవాళీ టోర్నీకి దిగ్గజాల కళ


రోహిత్ శర్మ

- నేటి నుంచి రంజీ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లు
- బరిలో టీమిండియా స్టార్లు
- ముంబై తరఫున రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్
- ఢిల్లీకి పంత్ ప్రాతినిధ్యం
- గిల్, జడేజా కూడా సిద్ధం
- హిమాచల్‌ప్రదేశ్‌తో హైదరాబాద్ పోరు
- పుదుచ్చేరితో తలపడనున్న ఆంధ్ర జట్టు

ముంబై: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో చాలా కాలం తర్వాత భారత స్టార్ ఆటగాళ్లు పాల్గొంటున్నారు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలంటే... అందుబాటులో ఉన్న సమయంలో దేశవాళీ మ్యాచ్‌లు ఆడాల్సిందేనని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్పష్టం చేసిన నేపథ్యంలో స్టార్ ఆటగాళ్లు రంజీ బాట పట్టారు. నేటి నుంచి దేశవ్యాప్తంగా రంజీ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లు ప్రారంభం కానుండగా... భారత టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ, వికెట్ కీపర్ రిషభ్ పంత్, శుబ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, యశస్వి జైస్వాల్ వంటి స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు విరాట్ కోహ్లి అందుబాటులో ఉండనని ముందే వెల్లడించగా... ఢిల్లీ జట్టు ఆడే తదుపరి మ్యాచ్‌లో అతడు కూడా పాల్గొననున్నాడు. రోహిత్ శర్మ 12 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీ బరిలో దిగనున్నాడు. ఇప్పటికే స్టార్‌లతో నిండి ఉన్న డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ రాకతో మరింత పటిష్టంగా మారింది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా జమ్మూ కశ్మీర్‌తో అజింక్య రహానే సారథ్యంలోని ముంబై జట్టు తలపడుతుంది. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 42 సార్లు రంజీ ట్రోఫీ కైవసం చేసుకున్న ముంబై జట్టు తాజా సీజన్‌లో 5 మ్యాచ్‌లాడి 3 విజయాలు, ఒక పరాజయం, ఒక 'డ్రా'తో 22 పాయింట్లు ఖాతాలో వేసుకొని గ్రూప్‌లో మూడో స్థానంలో ఉంది. బరోడా (27 పాయింట్లు), జమ్మూ కశ్మీర్ (23 పాయింట్లు) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. లీగ్ దశలో మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో ముంబై జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చాలని చూస్తోంది. రోహిత్ రాకతో జట్టు మరింత బలోపేతమైందని ముంబై కెప్టెన్ రహానే పేర్కొన్నాడు. 'రోహిత్ అంటే రోహితే. అతడికి ఒకరు చెప్పాల్సిన అవసరం లేదు. అతడితో కలిసి ముంబై డ్రెస్సింగ్ రూమ్‌ను మరోసారి పంచుకోనుండటం ఆనందంగా ఉంది. రోహిత్ చాలా ప్రశాంతంగా ఉంటాడు. అంతర్జాతీయ స్థాయిలో అది ఎన్నోసార్లు చూశాం. ఎప్పుడు ఎలా ఆడాలో అతడికి బాగా తెలుసు. ఒక్కసారి లయ అందుకుంటే అతడిని ఆపడం కష్టం. ప్రతి ఆటగాడికి క్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయి. వాటిని అధిగమించి పరుగుల కోసం తపించడం ముఖ్యం. యశస్వి జైస్వాల్ గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్నాడు. జాతీయ జట్టు తరఫునే కాకుండా ముంబై తరఫున కూడా అతడు మెరుగైన ప్రదర్శన చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో అనుభవం ఉన్న వారి సాన్నిహిత్యంలో ముంబై ఆటగాళ్లు ఎంతో నేర్చుకుంటారు' అని రహానే అన్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో పేలవ ఫామ్‌తో నిరాశ పరిచిన రోహిత్ శర్మ... ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు రంజీ ట్రోఫీ ద్వారా తిరిగి లయ అందుకుంటాడా చూడాలి.


యశస్వి జైస్వాల్
తనుశ్

పంత్ X జడేజా

రాజ్‌కోట్ వేదికగా జరగనున్న గ్రూప్ 'డి' మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టుతో ఢిల్లీ టీమ్ ఆడుతుంది. సౌరాష్ట్ర తరఫున టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బరిలోకి దిగుతుండగా... రిషభ్ పంత్ ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. చతేశ్వర్ పుజారా, జైదేవ్ ఉనాద్కట్‌లతో సౌరాష్ట్ర జట్టు బలంగా కనిపిస్తోంది. ఢిల్లీ జట్టులో ఆయుశ్ బదోనీ, యశ్ ధుల్ వంటి యువ ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. క్వార్టర్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఇరు జట్లకు ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి కావడంతో హోరాహోరీ పోరు సాగడం ఖాయమే. చాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన భారత జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ పంజాబ్ జట్టు తరఫున రంజీ ట్రోఫీ ఆడనుండగా... కర్ణాటక జట్టుకు దేవదత్ పడిక్కల్, ప్రసిధ్ కృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల విజయ్ హజారే వన్డే టోర్నీలో సెంచరీల మీద సెంచరీలు బాదిన విదర్భ ప్లేయర్ కరుణ్ నాయర్‌పై అందరి దృష్టి నిలవనుంది.

హిమాచల్‌తో హైదరాబాద్ పోరు

ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా హైదరాబాద్ వేదికగా గురువారం నుంచి ప్రారంభం కానున్న మ్యాచ్‌లో హిమాచల్ ప్రదేశ్‌తో హైదరాబాద్ రంజీ జట్టు తలపడనుంది. మరోవైపు పుదుచ్చేరితో ఆంధ్ర జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ జాతీయ విధుల్లో ఉండగా... స్టార్ పేసర్ సిరాజ్ పనిభారం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన హైదరాబాద్ జట్టు ఒక విజయం, 2 పరాజయాలు, 2 'డ్రా'లతో 9 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో ఉండగా... ఆంధ్ర జట్టు ఐదు మ్యాచ్‌ల్లో 3 పరాజయాలు, 2 'డ్రా'లతో 4 పాయింట్లు సాధించి ఏడో స్థానంలో కొనసాగుతోంది.

గ్రూప్ దశలో అజేయంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా



కౌలాలంపూర్: మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు అజేయంగా లీగ్ దశను ముగించాయి. గ్రూప్ 'డి'లో భాగంగా బుధవారం జరిగిన తమ చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 83 పరుగుల తేడాతో నేపాల్ జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. బ్రయ్ (34 బంతుల్లో 45; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), లారోసా (31), హస్రత్ గిల్ (30) రాణించారు. అనంతరం ఛేదనలో నేపాల్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 56 పరుగులకే పరిమితమైంది. ఆడిన 3 మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ఆస్ట్రేలియా 6 పాయింట్లతో గ్రూప్ 'డి' టాపర్‌గా నిలిచింది. గ్రూప్ 'సి'లో భాగంగా నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 41 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆడిన అన్నీ మ్యాచ్‌ల్లో గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు 6 పాయింట్లతో గ్రూప్ 'సి' టాపర్‌గా నిలిచింది. బుధవారం జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్ జట్టు 17 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌పై... ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో అమెరికా జట్టుపై... న్యూజిలాండ్ జట్టు 67 పరుగుల తేడాతో సమోవాపై... ఐర్లాండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 13 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై గెలిచాయి. నేడు జరిగే గ్రూప్ 'ఎ' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో ఆతిథ్య మలేసియాతో వెస్టిండీస్; శ్రీలంకతో భారత్ తలపడతాయి.

గ్రూప్ 'ఎ' నుంచి భారత్, శ్రీలంక... గ్రూప్ 'బి' నుంచి ఇంగ్లండ్, అమెరికా, ఐర్లాండ్... గ్రూప్ 'సి' నుంచి దక్షిణాఫ్రికా, నైజీరియా, న్యూజిలాండ్... గ్రూప్ 'డి' నుంచి ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ జట్లు 'సూపర్ సిక్స్' దశకు చేరుకున్నాయి. మలేసియా, వెస్టిండీస్ జట్ల మధ్య మ్యాచ్ విజేత గ్రూప్ 'ఎ' నుంచి చివరిదైన సూపర్ సిక్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది.

సహజ ముందంజ



బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ100 మహిళల టోర్నీలో భారత రెండో ర్యాంకర్, తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 315వ ర్యాంకర్ సహజ 6–3, 3–6, 6–0తో ప్రపంచ 182వ ర్యాంకర్ యురికో మియజకి (జపాన్)పై సంచలన విజయం సాధించింది. 2 గంటల 14 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. హైదరాబాద్‌కే చెందిన మరో క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక 0–6, 0–6తో ప్రపంచ 155వ ర్యాంకర్ సారా బెజ్లెక్ (చెక్ రిపబ్లిక్) చేతిలో 45 నిమిషాల్లో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా 7–6 (7/2), 7–6 (7/4)తో దరియా కుదషోవా (రష్యా)పై గెలిచింది.

ఐసీసీ 'డ్రెస్ కోడ్'ను పాటిస్తాం!

బీసీసీఐ కార్యదర్శి స్పష్టీకరణ

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో టీమ్ జెర్సీని వేసుకునే విషయంలో భారత జట్టు అన్ని నిబంధనలు పాటిస్తుందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. సాధారణంగా ఐసీసీ టోర్నీల్లో అన్ని జట్ల జెర్సీలపై టోర్నీ పేరు, లోగో, సంవత్సరం, వేదిక వివరాలు ఉంటాయి. ఈసారి చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్తాన్ ఆతిథ్యం ఇస్తోంది. అయితే ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు సరిగా లేని కారణంగా పాక్‌కు వెళ్లేందుకు నిరాకరించిన భారత జట్టు 'హైబ్రిడ్ మోడల్' ప్రకారం తమ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే ఆడనుంది. ఈ నేపథ్యంలో టీమ్ జెర్సీపై కూడా పాకిస్తాన్ పేరును ఉంచేందుకు భారత్ ఇష్టపడటం లేదని మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపైనే సైకియా స్పందించారు. 'చాంపియన్స్ ట్రోఫీలో యూనిఫామ్‌కు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విధించే ప్రతీ నిబంధనను భారత్ పాటిస్తుంది. లోగో, డ్రెస్ కోడ్‌కు సంబంధించి ఇతర టీమ్‌లు ఏం చేస్తాయో పూర్తి స్ఫూర్తితో మేం కూడా అదే చేస్తాం' అని ఆయన వివరించారు.


దేవజిత్ సైకియా

రోహిత్ వెళతాడా!

మరోవైపు చాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందు అన్ని జట్ల కెప్టెన్లతో ఐసీసీ అధికారికంగా నిర్వహించే ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమానికి భారత సారథి రోహిత్ శర్మ హాజరవుతాడా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ ప్రి ఈవెంట్ ఫొటోషూట్ కార్యక్రమం ఫిబ్రవరి 16 లేదా 17న కరాచీలో జరిగే అవకాశం ఉంది. టీమిండియా పాక్ గడ్డపై ఆడటం లేదు కాబట్టి రోహిత్ వెళ్లకపోవచ్చని వినిపిస్తుండగా... ఒక్క కెప్టెన్ మాత్రం వెళ్లి రావచ్చనే వాదన కూడా ఉంది. అయితే దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని మాత్రం సైకియా వెల్లడించారు. రోహిత్ హాజరయ్యే అంశంపై ఇంకా తాము చర్చించలేదని, దానికి తగినంత సమయం ఉందని ఆయన చెప్పారు. ఆటగాళ్లు వెళ్ళకపోయినా... 2023లో ఆసియా కప్‌కు ముందు పాక్ బోర్డు నిర్వహించిన ప్రత్యేక డిన్నర్‌లో బీసీసీఐ తరఫున రోజర్ బిన్నీ, రాజీవ్ శుక్లా హాజరయ్యారు. మరోవైపు 2024 టి20 వరల్డ్ కప్ సమయంలో వివిధ జట్ల కెప్టెన్లంతా వేర్వేరు చోట్ల ప్రాక్టీస్ మ్యాచ్‌లలో ఉండటంతో ఐసీసీ కెప్టెన్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహించకపోవడం గమనార్హం.

సింధుకు షాక్



- వియత్నాం ప్లేయర్ నుయెన్ సంచలన విజయం
- తొలి గేమ్‌లో వరుసగా 8 పాయింట్లు కోల్పోయిన భారత స్టార్

జకార్తా: ఈ ఏడాది బరిలోకి దిగిన రెండో టోర్నమెంట్‌లోనూ భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. ఇండియా ఓపెన్–750 టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించిన సింధు... ఇండోనేసియా మాస్టర్స్–500 టోర్నమెంట్‌లో తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 32వ ర్యాంకర్ థుయి లిన్ నుయెన్ (వియత్నాం) 22–20, 21–12తో సింధుపై సంచలన విజయం సాధించింది. గతంలో సింధుతో ఆడిన రెండుసార్లూ (2022 సింగపూర్ ఓపెన్, 2023 ఆర్కిటిక్ ఓపెన్) ఓడిపోయిన నుయెన్ మూడో ప్రయత్నంలో గెలుపు రుచి చూసింది. 37 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో స్కోరు 14–20 వద్ద నుయెన్ ఒక్కసారిగా చెలరేగిపోయింది. వరుసగా 8 పాయింట్లు గెలిచి గేమ్‌ను సొంతం చేసుకుంది. చేజేతులా తొలి గేమ్‌ను చేజార్చుకున్న సింధు రెండో గేమ్‌లో తడబడింది. ఆరంభంలోనే 1–6తో వెనుకబడిన సింధు ఆ తర్వాత కోలుకోలేకపోయింది. మహిళల సింగిల్స్‌లో పోటీపడ్డ ఇతర భారత క్రీడాకారిణులు ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ్, రక్షిత శ్రీ, తాన్యా హేమంత్ కూడా తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. ఆకర్షి 10–21, 13–21తో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్) చేతిలో, అనుపమ 12–21, 5–21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా) చేతిలో, తాన్యా 14–21, 11–21తో ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో, రక్షిత శ్రీ 17–21, 19–21తో టొమోక మియకాజి (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యారు.

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో తనీషా క్రాస్టో–అశ్విని పొన్నప్ప (భారత్) ద్వయం 21–6, 21–14తో ఒర్నిచా–సుకిత్త (థాయ్‌లాండ్) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జోడీ 9–21, 13–21తో గ్రెగొరీ మేర్స్–జెన్నీ మేర్స్ (ఇంగ్లండ్) జంట చేతిలో ఓడిపోగా... ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో (భారత్) ద్వయం 21–18, 21–14తో అద్నాన్ మౌలానా–ఇందా చాయసారి (ఇండోనేసియా) జోడీపై గెలిచింది.

లక్ష్య సేన్ ముందంజ

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ 21–9, 21–14తో ఒబయాషి (జపాన్)పై నెగ్గాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కిరణ్ జార్జి (భారత్) 12–21, 10–21తో హైక్ జిన్ జియోన్ (కొరియా) చేతిలో, ఆయుశ్ శెట్టి (భారత్) 19–21, 19–21తో షి యుకి (చైనా), ప్రియాన్షు (భారత్) 14–21, 21–13, 18–21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యారు.



'ఫెరారీ' కారులో జోరుగా...

అభిమానులకు హామిల్టన్ అభివాదం



ఫియోరానో మోడినీస్ (ఇటలీ): ఫార్ములావన్ దిగ్గజాలలో ఒకరిగా గుర్తింపు పొందిన లూయిస్ హామిల్టన్ 40 ఏళ్ల వయసులో కొత్త జట్టు 'ఫెరారీ' తరఫున తన సత్తాను పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. 2025 సీజన్ కోసం ఫెరారీ జట్టుతో చేరిన హామిల్టన్ బుధవారం తొలిసారి ఆ టీమ్ ఎఫ్1 కారుతో డ్రైవింగ్ చేశాడు. టీమ్ ట్రాక్ ఫియోరానో వద్ద ఫెరారీ లోగో ఉన్న హెల్మెట్ ధరించి ఎస్ఎఫ్–23 కారుతో దూసుకెళ్లిన అతను పెద్ద సంఖ్యలో హాజరైన అభిమానులకు అభివాదం చేశాడు. హామిల్టన్ కోసమే ఇటాలియన్ ఫ్యాన్స్ సమీపంలోనే బ్రిడ్జ్ వద్ద ఎదురు చూస్తూ కనిపించారు. ఎఫ్1లో 12 ఏళ్లపాటు మెర్సిడెస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హామిల్టన్ ఆ జట్టు తరఫున ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. అంతకుముందు మెక్‌లారెన్ టీమ్ తరఫున కూడా మరో ప్రపంచ టైటిల్ నెగ్గిన అతను మొత్తం ఏడుసార్లు విశ్వవిజేతగా నిలిచి మైకేల్ షుమాకర్‌తో సమంగా నిలిచాడు. 'ఫెరారీ తరఫున బరిలో దిగేందుకు నేను ఎప్పటి నుంచో కోరుకున్నాను. అలాంటి అవకాశం వస్తుందని కొంత కాలం వరకు కూడా ఊహించలేదు. కానీ ఇప్పుడు నా కల నిజమైంది. నా కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాను. ఇప్పుడు ఈ టీమ్ తరఫున ఆడటం మరింత ఆనందాన్నిస్తోంది' అని హామిల్టన్ వ్యాఖ్యానించాడు. 2025 ఫార్ములావన్ సీజన్ మార్చి 16న మెల్‌బోర్న్‌లో జరిగే ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో మొదలవుతుంది.

'నాడా' జాబితాలో కొత్తగా 14 మంది క్రికెటర్లు

డోపింగ్ పరీక్షలకు సిద్ధంగా ఉండాలనే నిబంధన

న్యూఢిల్లీ: జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా)లో కొత్తగా 14 మంది క్రికెటర్ల పేర్లు చేరాయి. 'నాడా' పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా తయారు చేసే రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్ (ఆర్‌టీపీ)– 2025 జాబితాలో భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఉన్నారు. వీరితో పాటు బీసీసీఐ కాంట్రాక్ట్ క్రికెటర్లు శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, అర్ష్‌దీప్ సింగ్, సంజు సామ్సన్, తిలక్ వర్మ పేర్లు కూడా జత చేరాయి. ముగ్గురు మహిళా క్రికెటర్లు షఫాలీ వర్మ, దీప్తి శర్మ, రేణుకా సింగ్ పేర్లను కూడా 'ఆర్‌టీపీ'లో చేర్చారు. 'నాడా' నిబంధనల ప్రకారం ఈ ఏడాదిలో ఏ సమయంలోనైనా వీరి శాంపిల్స్‌ను అధికారులు సేకరిస్తారు. తాము 'ఎప్పుడు, ఎక్కడ' ఉంటామో చెబుతూ అధికారుల కోసం ఆటగాళ్లు అందుబాటులో ఉండాలి. తమ చిరునామా, ప్రాక్టీస్, ప్రయాణాలు, మ్యాచ్‌ల షెడ్యూల్‌వంటి వివరాలు కూడా వారు అందజేయాల్సి ఉంటుంది. డోపింగ్ పరీక్షలకు హాజరు కాకపోతే దానికి సదరు ఆటగాడే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏడాది కాలంలో ఏదైనా కారణంతో మూడుసార్లు ఇలాగే జరిగితే డోపింగ్ నిబంధనల ఉల్లంఘన కింద 'నాడా' చర్యలు తీసుకుంటుంది. 2019 నుంచే 'నాడా' పరిధిలోకి క్రికెటర్లు రాగా... ఓవరాల్‌గా అన్ని క్రీడాంశాల్లో కలిపి ప్రస్తుతం 227 మంది భారత ప్లేయర్లు ఈ జాబితాలో ఉన్నారు.


శ్రేయస్

ఆసియా మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ టోర్నీకి భారత జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: ఆసియా బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. ఫిబ్రవరి 11 నుంచి 16 వరకు చైనాలో జరగనున్న ఈ టోర్నీలో భారత్ నుంచి 14 మంది షట్లర్లు పాల్గొంటారు. రెండు ఒలింపిక్ పతకాలు నెగ్గిన స్టార్ పీవీ సింధుతోపాటు పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడ్డ లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్ ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఆడతారు. 2023లో దుబాయ్ వేదికగా జరిగిన ఈ టోర్నీలో భారత జట్టు కాంస్య పతకం నెగ్గింది. ఈసారి అంతకంటే మెరుగైన ప్రదర్శన చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) కార్యదర్శి సంజయ్ మిశ్రా తెలిపారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, హెచ్ఎస్ ప్రణయ్, మహిళల సింగిల్స్‌లో సింధు, మాళవిక బరిలోకి దిగుతారు' అని వెల్లడించారు.

పురుషుల జట్టు: లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల, ఎంఆర్ అర్జున్, సతీశ్ కుమార్. **మహిళల జట్టు:** సింధు, మాళవిక బన్సోద్, గాయత్రి గోపీచంద్, ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో, ఆద్య.

చైనా విస్తరణ కాంక్షకు 'పనామా'తో

ట్రంప్ ఆజ్యం పోస్తున్నారా?

అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన డొనాల్డ్ ట్రంప్ ప్రారంభోపన్యాసంలో పనామా కాలువ గురించి చేసిన వ్యాఖ్యలపై విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనామా కాలువను బల ప్రయోగంతోనైనా స్వాధీనం చేసుకుంటామంటూ ట్రంప్ చేసిన ప్రకటన ముందుముందు ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తుందంటున్నారు. ప్రారంభ ప్రసంగంలో ట్రంప్ పనామా కాలువ చైనా నియంత్రణలోకి వెళ్లిపోయిందని, 1977 నాటి ఒప్పందాన్ని పనామా ఉల్లంఘించిందని ఆరోపించారు. అప్పట్లో కాలువను అమెరికా మూర్ఖంగా పనామాకు ఇచ్చివేసిందని వ్యాఖ్యానించారు. అమెరికా నౌకల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తోందని, అందుకే స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. చైనా దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకే ట్రంప్ ఈ ప్రకటన చేసినట్లుగా భావించినప్పటికీ డ్రాగన్ దేశ విస్తరణ కాంక్షకు బలమిస్తున్నట్లు అవుతుందని అంటున్నారు. తైవాన్‌ను, ఇతర ప్రాంతాలను కలిపేసుకునేందుకు ఇదో సాకుగా చూపే ప్రమాదముందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో, తైవాన్ పట్ల చైనాను సంయమనంగా వ్యవహరించేలా చేయడమన్న దశాబ్దాల అమెరికా విధానానికి వీడ్కోలు పలుకుతూ ట్రంప్ చేసిన అనూహ్య ప్రకటన తన విస్తరణ కాంక్షకు చట్టబద్ధతగా ఆ దేశం భావించే ప్రమాదముందని చెబుతున్నారు.



రష్యా, చైనాల సరసన అమెరికా?

అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకమునుపే ట్రంప్ పనామా కాలువ అమెరికాకే చెందుతుందంటూ చేసిన వ్యాఖ్యలపై నిపుణులు పెదవి విరిచారు. అలాంటప్పుడు, చైనా, రష్యాల చర్యల కంటే అమెరికా ఏవిధంగా మెరుగనే ప్రశ్న ఉత్పన్నమవుతుందని వారన్నారు. ఉక్రెయిన్ తమకే చెందుతుందంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆ దేశాన్ని ఆక్రమించుకున్నారు. తైవాన్‌ను బలప్రయోగంతోనైనా స్వాధీనం చేసుకుంటామని చైనా బెదిరింపులకు దిగుతోంది. ట్రంప్ కూడా పనామా, గ్రీన్‌ల్యాండ్‌లను సైనిక చర్యతో అయినా స్వాధీనం చేసుకుంటామంటున్నారు. ఆ రెండు దేశాలకు, అమెరికాకు తేడా ఏముంటుంది?' అని న్యూయార్క్‌కు చెందిన జర్నలిస్ట్ గెరాల్డో రివెరా 'ఎక్స్'లో పేర్కొన్నారు. సార్వభౌమ దేశాన్ని స్వాధీనం చేసుకుంటామనడం ట్రంప్ విస్తరణవాదానికి ఉదాహరణ అని వాషింగ్టన్‌కు చెందిన మరో జర్నలిస్ట్ పేర్కొన్నారు.

చైనాకు ఓ అవకాశం కానుందా?

పనామా కాలువతోపాటు సరిహద్దులను ఆనుకుని ఉన్న కెనడాను, ఉత్తర అట్లాంటిక్ సముద్రంలోని డెన్మార్క్ పాలనలోని గ్రీన్‌ల్యాండ్‌ను కలిపేసుకుంటామంటూ ట్రంప్ చేసిన ప్రకటనలు.. రష్యా, చైనాలు కూడా తమ ఆక్రమణలను అమెరికా గుర్తిస్తుందనే సంకేతాలిచ్చినట్లవుతుందని సీఎన్ఎన్ యాంకర్ జిమ్ సియుట్టో 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇటువంటి ప్రకటనలు అమెరికా విశ్వసనీయతను దెబ్బతీస్తాయని, చైనాకు విస్తరణకు గేట్లు తెరిచినట్లవుతుందని ఆ దేశ విశ్లేషకులు అంటున్నారు. ఒక వేళ అమెరికా గ్రీన్‌ల్యాండ్‌ను ఆక్రమిస్తే చైనా తైవాన్‌ను తప్పక స్వాధీనం చేసుకుంటుందని వాంగ్ జియాంగ్‌యు అనే హాంకాంగ్ ప్రొఫెసర్ స్పష్టం చేస్తున్నారు. అత్యంత క్లిష్టమైన తైవాన్ అంశం సహా అన్ని విషయాలపైనా ట్రంప్‌తో బేరసారాలకు అవకాశముంటుందని చైనా అధికార వర్గాలు భావిస్తున్నాయని షాంఘైలోని ఫుడాన్ వర్సిటీ ఇంటర్నేషనల్ స్టడీస్ ప్రొఫెసర్ ఝూవో మింగ్‌హావో అంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కాలువపై చైనా పెత్తనం నిజమేనా?

పసిఫిక్-అట్లాంటిక్ సముద్రాలను కలుపుతూ అమెరికా ప్రభుత్వం 1904-1914 సంవత్సరాల మధ్య పనామా కాలువను తవ్వించింది. దీనివల్ల ఈ రెండు సముద్రాల మధ్య ప్రయాణ దూరం చాలా తగ్గింది. 1977లో కుదిరిన ఒప్పందం ప్రకారం 1999 నుంచి పనామా నియంత్రణ కొనసాగుతోంది. పనామా కాలువ గుండా వెళ్లే ఓడల్లో 70 శాతం అమెరికావే కావడం గమనార్హం. భద్రతకు ముప్పు కలిగితే కాపాడేందుకు అమెరికా జోక్యం చేసుకోవచ్చు. ప్రస్తుతం, కాలువను చైనా నియంత్రించడం లేదు, నిర్వహించడం లేదు. కానీ, హాంకాంగ్‌కు చెందిన సీకే హచిసన్ అనుబంధ కంపెనీ పనామా కాలువలోని కరీబియన్, పసిఫిక్ ఎంట్రన్స్ వద్ద నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తోంది. ఇదికాకుండా, చైనా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో 2017లో చేరిన మొట్టమొదటి లాటిన్ అమెరికా దేశం పనామాయే. 2016లో చైనా ప్రభుత్వ సీవోఎస్‌సీవోకు చెందిన ఓట మొదటిసారిగా పనామా కాలువలోకి ప్రవేశించింది. అదే ఏడాది, చైనా కంపెనీ లాండ్‌బ్రిడ్జి గ్రూపు మార్గరిటా దీవిలోని అతిపెద్ద నౌకాశ్రయాన్ని కొనుగోలు చేసింది. పనామా కాలువపై మరో వంతెన నిర్మాణ కాంట్రాక్టును చైనా కంపెనీలే దక్కించుకున్నాయి. ఈ ప్రాంతంలో చైనా ప్రాబల్యం విస్తరిస్తుండటం అమెరికాకు కంటగింపుగా మారింది. 'సాంకేతికంగా కాలువపై హక్కులు మావే. మరో దేశం చేతుల్లోకి కాలువ వెళుతోంది. వాస్తవానికి పరాయి దేశం తన కంపెనీల ద్వారా కాలువపై పెత్తనం సాగిస్తోంది'అని విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం పేర్కొన్నారు. కాలువను అమెరికా కొంటుందనే ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు.

నెలలో 1,000 విస్ఫోటాలు

తూర్పు ఇండోనేషియాలో ఉత్తర మలుకు ప్రావిన్స్‌లోని మారుమూల ద్వీపం హల్మహెరాలోని ఇబూ అగ్నిపర్వతం ఈ జనవరి నెలలో కనీసం 1,000 సార్లు బద్దలైంది. గత ఆదివారం ఒక్కరోజే ఈ అగ్నిపర్వతం 17 సార్లు విస్ఫోటం చెందిందని ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ అధికారులు సోమవారం ప్రకటించారు. విస్ఫోటం దాటికి అగ్నిపర్వతం సమీపంలో నివసిస్తున్న ఆరు గ్రామాల్లో మూడు వేల మంది గ్రామస్తులను అధికారులు హుటాహుటిన ఖాళీ చేయిస్తున్నారు. పండించిన పంట చేతికొచ్చే సమయం కావడంతో చాలా మంది నివాసితులు ఖాళీ చేయడానికి విముఖత చూపుతున్నారు. అలాంటివారు సురక్షిత షెల్టర్లలో ఉండాలని అధికారులు సూచించారు. గత బుధవారం విస్ఫోటనంతో నాలుగు కిలోమీటర్ల ఎత్తుకు బూడిద ఎగసిపడింది. పర్వతంలో జనవరి 1 నుంచి ఇప్పటి వరకూ 1,079 విస్ఫోటాలు నమోదయ్యాయి. ఆదివారం జరిగిన విస్ఫోటకం తీవ్రంగా ఉందని ఏజెన్సీ తెలిపింది. 'స్థానిక కాలమానం ప్రకారం గత ఆదివారం తెల్లవారుజామున 1.15 గంటలకు 1.5 కిలోమీటర్ల ఎత్తుకు బూడిద మేఘం గాల్లోకి ఎగిసింది. ఈ ధూళి మేఘం నైరుతి దిశగా విస్తరిస్తోంది. మౌంట్ ఇబు అబ్జర్వేషన్ పోస్ట్ వరకు పెద్ద శబ్దం వినిపించింది''అని ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఎవ్వరూ వెళ్లొద్దని హెచ్చరికలు

ఇండోనేషియాలోని అత్యంత చురుకైన అగ్నిపర్వతాల్లో మౌంట్ ఇబూ ఒకటి. గత జూన్ నుంచి విస్ఫోటాలు గణనీయంగా పెరిగాయి. దీంతో అగ్ని పర్వతం శిఖరం చుట్టూ ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరం వరకు ఎవ్వరూ వెళ్లొద్దని హెచ్చరికలు జారీచేశారు. మౌంట్ ఇబు సమీపంలో నివసిస్తున్నవారు, పర్యాటకులు మాస్క్ ధరించాలని సూచించారు. అధికారిక గణాంకాల ప్రకారం 2022 నాటికి హల్మహెరా ద్వీపంలో సుమారు 7,00,000 మంది నివసిస్తున్నారు. విస్తారమైన ద్వీపసమూహమైన ఇండోనేషియా.. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ జోన్‌లో ఉండటంతో తరచూ భూకంపాలు, అగ్నిపర్వత పేలుళ్లకు చిరునామాగా మారింది. గత నవంబర్‌లో పర్యాటక ద్వీపం ఫ్లోర్స్‌లోని 1,703 మీటర్ల ఎత్తయిన జంట శిఖరాల అగ్నిపర్వతం మౌంట్ లెవోటోబి లాకి-లాకీ ఒక వారంలో అనేక మార్లు విస్ఫోటనం చెందింది. దీంతో తొమ్మిది మంది మరణించారు. ఉత్తర సులవేసి ప్రావిన్స్‌లోని రువాంగ్ పర్వతం గతేడాది ఆరుసార్లు విస్ఫోటనం చెందడంతో సమీప ద్వీపాల నుంచి వేలాది మందిని అధికారులు వెంటనే ఖాళీ చేయించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాల్సిందే

బీజేపీ నేతలు, కార్యకర్తలకు ప్రధాని మోదీ దిశానిర్దేశం

న్యూఢిల్లీ: .అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధించేలా కష్టపడి పని చేయాలని ఢిల్లీ బీజేపీ నేతలు, కార్యకర్తలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 50 శాతానికిపైగా పోలింగ్ బూత్‌ల్లో బీజేపీ జెండా రెపరెపలాడాలని చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వ పాలనపై ఢిల్లీ ప్రజలు తీవ్ర అంసతృప్తితో ఉన్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఆప్ సర్కార్‌కు పరాజయం తప్పదని పేర్కొన్నారు. బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మోదీ వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. వారికి దిశానిర్దేశం చేశారు. 'ఆప్' అంటే ఆపద అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో ఆ పార్టీ రోజుకో హామీ ఇస్తోందని ఎద్దేవాచేశారు. పూర్వాంచల్ ప్రజలను ఢిల్లీ నుంచి బయటకు పంపించడానికి కుట్ర పన్నిందని ఆరోపించారు. అబద్ధాలు, మోసాలు తప్ప ఆమ్ ఆద్మీ పార్టీకి ఏం తెలుసని మండిపడ్డారు. కాంగ్రెస్ సైతం ఢిల్లీ ప్రజలను దారుణంగా దగా చేసిందని మోదీ విమర్శించారు. గత 25 ఏళ్లుగా ఢిల్లీలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. ఇక్కడ విధ్వంసం తప్ప ప్రగతి కనిపించడం లేదన్నారు. అభివృద్ధి చెందిన భారత్‌కు అభివృద్ధి చెందిన రాజధాని కావాలంటే అరవింద్ కేజ్రీవాల్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని ఢిల్లీ ఓటర్లకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలో వస్తే రాజధానిని అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

మధ్యతరగతి లక్ష్యంగా ఆప్ 7 డిమాండ్లు

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న ఢిల్లీ శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మధ్యతరగతి ఓటర్లే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ మరో ఏడు అంశాలతో మేనిఫెస్టోను ప్రకటించింది. ఈ ఏడు అంశాలపై కేంద్రప్రభుత్వాన్ని పార్లమెంట్‌లో నిలదీస్తామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక వీడియో సందేశం విడుదలచేశారు. ''రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆప్ ఎంపీలు ఈ ఏడు అంశాలను లేవనెత్తుతారు. భారత ఆర్థికవ్యవస్థ పటిష్టతకు మధ్యతరగతి ప్రజలే అసలైన శక్తిని అందిస్తున్నారు. అంతటి కీలకమైన వర్గాన్ని కేవలం పన్నుల వసూళ్ల కోసమే వాడుకుంటూ గత ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. పన్ను ఉగ్రవాదానికి మధ్యతరగతి ప్రజలు బాధితులయ్యారు''అని ఆరోపించారు. ''సీనియర్ సిటిజన్ల కోసం ఆప్ ప్రభుత్వం ఇప్పటికే సంజీవని పథకాన్ని ప్రారంభించింది. పన్ను చెల్లింపు దారుల సొమ్మును తిరిగి వారి సంక్షేమం కోసం ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అయితే వాటిని ఉచితాలు అంటూ విమర్శిస్తున్నారు. ప్రజల సొమ్ము ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది''అని అన్నారు. ఆప్ ఢిల్లీలో తిరిగి అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలను మరింతగా విస్తరిస్తామని చెప్పారు. మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

మేనిఫెస్టోలోని 7 డిమాండ్లు..

- విద్య బడ్జెట్‌ను 2 శాతం నుంచి 10 శాతానికి పెంచాలి, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ ఉండాలి
- ఉన్నత విద్యకు కేంద్రం సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. అప్పుడే మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుంది
- జీడీపీలో ఆరోగ్య బడ్జెట్ వాటాను 10 శాతానికి పెంచాలి. ఆరోగ్య బీమా ప్రీమియంలపై పన్నును రద్దుచేయాలి
- ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి.
- మధ్యతరగతి కుటుంబాల వెన్నువిరుస్తూ నిత్యావసరాలపై విధిస్తున్న జీఎస్టీని తొలగించాలి
- సీనియర్ సిటిజన్ల కోసం మరింత మెరుగైన పింఛన్ పథకాలు ప్రవేశపెట్టాలి. వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత ఆరోగ్య సేవలు అందించాలి
- కోవిడ్‌కాలంలో రద్దుచేసిన సీనియర్ సిటిజన్‌లకు రైల్వే ప్రయాణాల్లో రాయితీని మళ్లీ పునరుద్ధరించాలి.

ఇప్పుడు భారత్‌లో 99.1 కోట్ల ఓటర్లు

న్యూఢిల్లీ: గత ఏడాది లోక్‌సభ ఎన్నికలప్పుడు 96.88 కోట్లుగా ఉన్న భారతీయ ఓటర్ల సంఖ్య ఇప్పుడు 99.1 కోట్లకు చేరుకుందని కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈసీ ఒక ప్రకటన విడుదలచేసింది. ''ఓటర్లలో యువత ఎక్కువగా ఉన్నారు. 18-29 ఏళ్ల వయసువారు ఏకంగా 21.7 కోట్ల మంది ఉన్నారు'' అని పేర్కొంది. 100 కోట్ల మంది ఓటర్లతో భారత్ త్వరలోనే ప్రపంచ రికార్డ్‌ను సృష్టించనుంది'' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఇటీవల ప్రకటించడం తెల్సిందే.

మరుగుతున్న నూనెలో పడి..

భోపాల్‌లో రెండేళ్ల బాలుడి మృతి

భోపాల్: బంధుమిత్రుల రాకతో సందడిగా సాగుతున్న కుటుంబవేడుకలో హఠాత్తుగా విషాదం నెలకొంది. రెండేళ్ల పిల్లాడు సలసలకాగుతున్న నూనె బాండీలో పడి ప్రాణాలు కోల్పోయాడు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లోని నిషాత్‌పురాలో సోమవారం పెళ్లివేడుకలో ఈ దుర్ఘటన జరిగింది. ఫంక్షన్‌హాల్‌లో పెళ్లి ముగిశాక రాత్రి 11 గంటలకు భోజనాల వేళ రెండేళ్ల పిల్లాడు గార్డెన్‌లో పరుగులు పెట్టాడు. పరుగెత్తుతున్న మార్గంలోనే పెద్ద బాండీలో నూనెను మరిగిస్తున్నారు. తండ్రి ఆపేందుకు ప్రయత్నించినా ఆలోపే పిల్లాడు పొరపాటున దాంట్లో పడ్డాడు. వెంటనే బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పిల్లాడి ఒళ్లు 50 శాతం కాలిపోయింది. దీంతో వైద్యులు శతథా ప్రయత్నించినా పిల్లాడిని కాపాడలేకపోయారు. మంగళవారం రాత్రి బాబు కన్నుమూయడంతో మొత్తం వేడుక విషాదంగా మారింది.

జన్మతః పౌరసత్వంపై కోర్టుకెక్కిన 22 రాష్ట్రాలు

వాషింగ్టన్: వలసవచ్చిన వారికి అమెరికా గడ్డపై పుడితే వచ్చే జన్మతః పౌరసత్వ హక్కును ట్రంప్ ఒక్క ఉత్తర్వుతో తొలగించడాన్ని విపక్షపాలిత రాష్ట్రాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ విషయంపై 22 రాష్ట్రాలు మంగళవారం కోర్టును ఆశ్రయించాయని న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. విపక్ష డెమొక్రటిక్ పార్టీ అధికారంలో ఉన్న 22 రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఫెడరల్ జిల్లా కోర్టుల్లో వేర్వేరుగా రెండు దావాలు వేశాయి. 22 రాష్ట్రాల్లో 18 రాష్ట్రాలు, శాన్‌ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్ డీసీ నగరాలు కలిపి మసాచుసెట్స్‌లోని ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టులో పిటిషన్ దాఖలుచేశాయి. రాజ్యాంగంలోని 14వ సవరణప్రకారం జన్మతః పౌరసత్వం అనేది ఆటోమేటిక్‌గా అమలవుతుందని వాదించాయి. అధ్యక్షుడిగానీ పార్లమెంట్‌లోని ప్రజా ప్రతినిధులసభ(దిగువ సభ) లేదంటే సెనేట్(ఎగువ సభ)కు కూడా ఈ హక్కు విషయంలో సవరణలు చేసే అధికారం లేదని వాదించాయి. మిగతా నాలుగు రాష్ట్రాలు వాషింగ్టన్‌లోని వెస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టులో దావా వేశాయి. మీకు ఉన్న 'తాత్కాలిక నిలుపుదల', 'ముందస్తు ఆదేశం'అధికారాలను ఉపయోగించి అధ్యక్షుడి ఉత్తర్వు అమలుకాకుండా అడ్డుకోండి''అని న్యూజెర్సీ అటార్నీ జనరల్ మాథ్యూ ప్లాట్కిన్ స్టాలు అభ్యర్థించారు. ''పుట్టగానే పౌరసత్వం రాదు అని ప్రకటించడమంటే మీరంతా అమెరికన్లు కాబోరు అని వివక్షచూపడమే''అని కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బోంటా వాదించారు.

ట్రంప్ ఉత్తర్వును తప్పుబట్టిన భారతీయ అమెరికన్ చట్టసభ్యులు

ట్రంప్ ఉత్తర్వును అమెరికా చట్టసభల్లోని భారతీయమూలాలున్న నేతలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ''ట్రంప్ తీసుకున్న నిర్ణయం అక్రమంగా వలసవచ్చిన వారి పిల్లలను మాత్రమేకాదు చట్టబద్ధంగా హెచ్-1బీ, హెచ్2బీ, బిజినెస్, స్టూడెంట్ వీసాల మీద వచ్చి అమెరికాలో ఉంటున్న వలసదారుల సంతానంపైనా పెను ప్రభావంచూపుతుంది. చట్టబద్ధ వలసవిధానానికి రిపబ్లికన్ పార్టీ వ్యతిరేకం అనే అపవాదు సైతం పడుతుంది. ఏదేమైనా జన్మతః పౌరసత్వం అనేది చట్టబద్ధం. దీని కోసం ఎంతకైనా తెగించి పోరాడతాం''అని డెమొక్రటిక్ పార్టీ నేత, ప్రతినిధుల సభలో భారతీయ మూలాలున్న నాయకుడు రో ఖన్నా ప్రకటించారు. ''ఒక్క కలంపోటుతో ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం. ఇది నిజంగా అమల్లోకి వస్తే దేశంలోని మిగతా చట్టాలను, రాజ్యాంగ నియమాలను అవమానించినట్లే''అని ప్రతినిధుల సభలో భారతీయ మూలాలున్న నాయకురాలు ప్రమీలా జయపాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే ట్రంప్ ఉత్తర్వుపై వలసదారుల హక్కుల సంఘాల కూటమి కోర్టులో దావావేసింది.

ఆ ఉద్యోగులు ఇక ఇంటికే!

డీఈఐ సిబ్బందికి తొలుత పెయిడ్ లీవులు ● ట్రంప్ ప్రభుత్వం ఆదేశం

వాషింగ్టన్: వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగులను ఇంటికి సాగనంపే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా తొలుత డీఈఐ(డైవర్సిటీ, ఈక్విటీ, ఇంక్లూజన్) సిబ్బందికి వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని ఆదేశించారు. తద్వారా వారిని ప్రస్తుతానికి విధులకు దూరంగా ఉంచాలని తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆఫీస్ ఆఫ్ ద పర్సనల్ మేనేజ్‌మెంట్ తాజాగా ఒక మెమో జారీ చేసింది. కొన్ని విభాగాల ఉద్యోగులను శాశ్వతంగా ఇంటికి పంపడానికి లేఆఫ్ ప్రణాళికలను ట్రంప్ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. జాతి వివక్షను నియంత్రించడం, మైనార్టీ రైతులకు ఆర్థిక సాయం అందించడం వంటి విధులను డీఈఐ ఉద్యోగులు నిర్వర్తిస్తుంటారు. వారి సేవలు ఇకపై అవసరం లేదని ట్రంప్ నిర్ణయానికొచ్చినట్లు సమాచారం.

శరణార్థులకు నిరాశ

అమెరికాలో అడుగుపెట్టడానికి ఇప్పటికే అనుమతి పొందిన శరణార్థులకు ట్రంప్ ప్రభుత్వం చేదువార్త చెప్పింది. రెఫ్యూజీ రీసెటిల్‌మెంట్ ప్రోగ్రామ్ కింద వారంతా ఈ నెల 27వ తేదీలోగా అమెరికాకు చేరుకోవడానికి గతంలోనే అనుమతి లభించింది. కానీ, ఆ అనుమతిని ప్రభుత్వం నిలిపివేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా వారు అమెరికాలోకి అడుగుపెట్టడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. దీంతో వేలాది మంది శరణార్థులకు నిరాశే ఎదురయ్యింది.

ట్రంప్ క్షమాభిక్ష తిరస్కరణ

యూఎస్ క్యాపిటల్ భవనంపై దాడి కేసులో నిందితులు/దోషులైన తన మద్దతుదారులకు డొనాల్డ్ ట్రంప్ క్షమాభిక్ష ప్రసాదించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ క్షమాభిక్షను పమేలా హెంఫిల్ అనే దోషి తిరస్కరించారు. ఆమె 60 రోజులపాటు జైల్లో ఉండివచ్చారు. 2021 జనవరి 6 క్యాపిటల్ భవనంపై దాడి ఘటనలో తాను పాల్గొన్నానని, తాను చేసింది తప్పేనని పేర్కొన్నారు. తనకు క్షమాభిక్ష అవసరం లేదని తేల్చిచెప్పారు. తప్పు చేసినవారికి క్షమాభిక్షలు అవసరం లేదని స్పష్టంచేశారు. ట్రంప్ నిర్ణయాన్ని ఆమె తప్పుపట్టారు.

30 ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు

థానే: 30 ఏళ్ల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన ఓ మహిళ 80 ఏళ్ల వయసులో ఇంటికి చేరింది. థానే మానసిక వైద్యశాల సిబ్బంది కృషితో తిరిగి తన కుటుంబాన్ని కలుసుకుంది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన ఓ మహిళ 13 ఏళ్ల కొడుకు మూడు దశాబ్దాల కిందట విద్యుత్ షాక్‌తో మరణించాడు. ఆ బాధను తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. ఆ తర్వాత నాసిక్ చేరుకుని ఏళ్ల తరబడి పంచవటి ప్రాంతంలో సంచరించింది. ఆమె శారీరక, మానసిక స్థితి క్షీణించినట్లు రెండేళ్ల క్రితం నాసిక్ పోలీసులు ఆమెను థానే మానసిక వైద్యాలయంలో చేర్పించారు. ఆసుపత్రిలో వైద్య బృందం ఆమెకు సపర్యలు చేసి ఆరోగ్యం కుదుటపడేందుకు శక్తిమేరకు కృషిచేశారు. దీంతో వాళ్ల కృషి ఫలించి మెల్లగా ఆమెకు గతం గుర్తుకొచ్చింది. స్వస్థలం గురించి కొన్ని ఆధారాలు వెల్లడించారు. ఆ ఆధారాలతో థానే ఆస్పత్రి అహ్మద్‌నగర్‌లోని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం అందుకున్న మహిళ కుటుంబ సభ్యులు జనవరి 17న ఆసుపత్రికి వచ్చారు. దీంతో ఏకంగా 30 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఆమె తన కుటుంబాన్ని కలుసుకోగలిగారు. కుటుంబసభ్యులు ఆమెను తమ వెంట అహ్మద్ నగర్‌కు తీసుకెళ్లారు. వైద్య బృందం చూపించిన అసాధారణ శ్రద్ధ, అంకితభావానికి జీవితాంతం రుణపడి ఉంటామని ఆమె కుటుంబసభ్యులు చెప్పారు. ఆమె మళ్లీ కుటుంబంతో కలవడం మాకు గొప్ప బహుమతి అని థానే మానసిక వైద్యశాల సూపరింటెడెంట్ డాక్టర్ నేతాజీ ములిక్ చెప్పారు.

ఆర్‌జీ కర్ ఘటనపై కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం ఘటనలో సుమోటో కేసుపై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో దోషి సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు విధిస్తూ ఈ నెల 20న కోల్‌కతా ట్రయల్ కోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. చనిపోయే దాకా అతడు జైల్లోనే ఉండాలని స్పష్టంచేసింది. అయితే, ఈ తీర్పుపట్ల చాలామంది అసంతృప్తి వ్యక్తంచేశారు. దోషికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో డాక్టర్‌పై హత్యాచారం ఘటనను సుప్రీంకోర్టు ధర్మాసనం సుమోటోగా విచారణకు స్వీకరించింది. సమయాభావం వల్ల తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేస్తున్నట్లు బుధవారం వెల్లడించింది. ఇదిలా ఉండగా, కోల్‌కతా ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సీబీఐ వర్గాలు తెలియజేశాయి. దోషి సంజయ్ రాయ్‌కి మరణశిక్ష విధించాలని హైకోర్టును కోరనున్నట్లు పేర్కొన్నాయి.

ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల పథకం విషయంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. కేంద్ర ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన ఈ పథకం కింద రాజకీయ పార్టీలకు అందిన రూ.16,518 కోట్ల విరాళాలను జప్తు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను 2024 ఆగస్టు 2న సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ తాజాగా రివ్యూ పిటిషన్ దాఖలైంది. అప్పటి నిర్ణయాన్ని సమీక్షించాలని పిటిషనర్ కోరారు. ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే తేల్చిచెప్పిందని గుర్తుచేశారు.

ముడి జనపనారకు ఎంఎస్పీ క్వింటాల్‌కు రూ.5,650

న్యూఢిల్లీ: ముడి జనపనారకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) 6 శాతం పెంచుతూ కేంద్ర కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో క్వింటాల్‌కు రూ.5,650 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. గత ఏడాది కంటే ఇది రూ.315 అధికం. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ బుధవారం సమావేశమైంది. జనపనారకు కనీస మద్దతు ధరపై చర్చించారు. 2014-15లో ముడి జనపనారకు ఎంఎస్పీ రూ.2,400 ఉండేది. ఇప్పుడు రూ.5,650కు చేరుతుంది. అంటే పదేళ్లలో 2.35 రెట్లు పెరిగింది. కనీస మద్దతు ధర పెంపుతో 40 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని కేంద్రం వెల్లడించింది. పశ్చిమ బెంగాల్, అస్సాం, బిహార్ రాష్ట్రాల్లో జనపనార రైతులు అధికంగా ఉన్నారు.

దర్శన్ తూగుదీప గన్ లైసెన్స్ రద్దు

బెంగళూరు: అభిమాని రేణుకస్వామి హత్య కేసులో ఇటీవల బెయిల్ పొందిన కన్నడ నటుడు దర్శన్ తూగుదీప గన్ లైసెన్స్ రద్దయింది. సాక్షులను బెదిరించడానికి ఆయన తుపాకీని ఉపయోగించే అవకాశం ఉందని బెంగళూరులోనిరాజరాజేశ్వర నగర్ పోలీసులు..డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(పరిపాలన)కు ఫిర్యాదుచేశారు. దీంతో దీనిపై వివరణ ఇవ్వాలని నగర పోలీసు కమిషనర్ నేతృత్వంలోని లైసెన్సింగ్ అథారిటీ దర్శన్‌కు నోటీసులు జారీ చేసింది. తర్వాత లైసెన్స్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తుపాకీని రాజరాజేశ్వరి నగర్ పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని దర్శన్‌ను ఆదేశించారు. చిత్రదుర్గకు చెందిన ఆటో డ్రైవర్ రేణుకస్వామి హత్య కేసులో గత ఏడాది జూన్ 11న నటుడు దర్శన్, అతనితో సన్నిహితంగా మెలిగే నటి పవిత్ర గౌడ అరెస్టయ్యారు. గతేడాది డిసెంబర్ 13న కర్ణాటక హైకోర్టు దర్శన్‌కు బెయిల్ మంజూరు చేసింది. కోర్టు పరిధిని విడిచి వెళ్లడానికి వీల్లేదని, సాక్షులను సంప్రదించడానికి, బెదిరించడానికి వీల్లేదని పేర్కొంది. అయితే దర్శన్, మరో ఆరుగురికి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కర్ణాటక ప్రభుత్వం సవాలు చేయనుంది.

24 గంటలు, 3 విమానాలు

ఓ పిల్లి ప్రయాణ ప్రహసనం

సాక్షి, నేషనల్ డెస్క్: అనగనగా ఓ పిల్లి. న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్ నుంచి ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వెళ్లేందుకు యజమాని మార్గే నీసీతో కలిసి ఎంచక్కా విమానమెక్కింది. మెల్‌బోర్న్‌లో యజమానితో సహా అందరూ దిగిపోయారు. కానీ కార్గో సిబ్బంది పిల్లిని గమనించకపోవడంతో విమానం నుంచి కిందకు దించలేదు. దాంతో కాసేపటికి తిరిగి క్రైస్ట్‌చర్చ్ బయల్దేరిన విమానంతో పాటే నిస్సహాయంగా అదీ తిరుగు ప్రయాణమైపోయింది! విషయం తెలియని మార్గో మెల్‌బోర్న్ విమానాశ్రయంలో మూడు గంటల పాటు తన పిల్లి కోసం పడిగాపులు పడింది. తర్వాత సిబ్బంది ఆమెకు చావుకబురు తీరిగ్గా చెప్పారు. ''విమానం బయల్దేరిపోయింది గనుక ఇప్పుడేం చేయలేం. చలికి గడ్డకట్టిపోకుండా హీటర్ ఆన్ చేశాం'' అంటూ ఊరడించారు. క్రైస్ట్‌చర్చ్ చేరగానే దాన్ని వెంటనే మెల్‌బోర్న్ విమానం ఎక్కించి యజమాని వద్దకు పంపేశారు. అలా 24 గంటల్లోనే సదరు పిల్లి ఏకంగా మూడుసార్లు విమానయానం చేసింది! అలుపులేని ప్రయాణంతో అది కాస్త చిక్కిందంటూ వాపోవడం మార్గో వంతయింది. ఈ తప్పిదంపై ఎయిర్ న్యూజిలాండ్ విచారణ జరుపుతోంది.

త్వరలో 100 సైనిక్ స్కూళ్ల ఏర్పాటు

అలప్పుజా(కేరళ): దేశంలో ప్రాథమిక విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచే లక్ష్యంతో దేశవ్యాప్తంగా కొత్తగా 100 సైనిక్ స్కూళ్లను ఏర్పాటుచేస్తామని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. కేరళలోని అలప్పుజాలో విద్యాధిరాజా సైనిక్ స్కూల్ 47వ వార్షికోత్సవంలో రాజ్‌నాథ్ పాల్గొని ప్రసంగించారు. ''దేశంలోని సాంస్కృతికంగా భిన్న నేపథ్యాలున్న ప్రతి జిల్లాలో ప్రతి రీజియన్‌లోని ప్రజలకు అందుబాటులో ఉండేలా సైనిక్ స్కూళ్లను నెలకొల్పుతాం. ఆరోగ్యం, కమ్యూనికేషన్లు, పరిశ్రమలు, రవాణా, రక్షణ వంటి భిన్న రంగాల్లో ఆధునికతతో భారత్ స్వావలంభనను సాధించింది. చిన్నారుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఇక విద్యారంగంలోనూ సంస్కరణలు తప్పనిసరి. సైనికుడిని కేవలం యుద్ధ కోణంలోనూ చూడకూడదు. క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావం, దేశభక్తి, నిస్వార్థ సేవ, స్వీయనియంత్రణ వంటి అంశాలను సైనికుల నుంచి మనం నేర్చుకోవచ్చు. ఇవే గొప్ప లక్షణాలు నాడు స్వామి వివేకానంద, ఆది శంకరాచార్య, రాజా రవివర్మ వంటి గొప్పవారిలోనూ ఉన్నాయి''అని రాజ్‌నాథ్ అన్నారు.

బంధాలతో పెనవేసుకునే మానవ జీవితం..

సమాజం అనేది ఒక క్రమపూర్వకమైన సామాజిక సంబంధాల వ్యవస్థగా ఉంటుంది. ప్రమాణాలు, విలువలపై ఆధారపడిన వ్యవస్థీకృత సమూహాన్ని 'సామాజిక సంస్థ'గా పేర్కొనవచ్చు. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఒక తరం నుంచి మరో తరానికి సంబంధాలు జాగ్రత్తగా కొనసాగుతాయి. ప్రతి సమాజంలోనూ బంధుత్వం, వివాహం, కుటుంబం, మతం, విద్య, ఆర్థిక, రాజకీయ సంస్థలు అనే ప్రాథమిక అంశాలుంటాయి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ



బంధుత్వం

సమాజంలో మానవుడు ఒంటరిగా జీవించలేడు. పుట్టింది మొదలు మరణించే వరకు ప్రతి వ్యక్తి సమాజంలోని విభిన్న వ్యక్తులతో విభిన్న సంబంధాలను ఏర్పరచుకుంటాడు. సమాజంలో వ్యక్తుల మధ్య ఏదో ఒక రకమైన సంబంధం కొనసాగుతూనే ఉంటుంది. అయితే వీటిలో రక్త సంబంధాలు లేదా వివాహం ఆధారంగా ఏర్పడే బంధాలు దగ్గరగా ఉంటాయి.

రక్తసంబంధం వల్ల లేదా వివాహం ద్వారా ఏర్పడే సంబంధాన్ని 'బంధుత్వం' అంటారు. పుట్టిన ప్రతి వ్యక్తి ఒక కుటుంబంలోని సభ్యుడే. పుట్టుకతో ప్రతి వ్యక్తి నిస్సహాయుడిగా ఉంటాడు. ఈ దశలో అతడికి సంరక్షణ కల్పించడంలో తల్లి ప్రధానపాత్ర పోషిస్తుంది. వ్యక్తి మొదటగా తల్లిదండ్రుల ద్వారా ఆ కుటుంబ సభ్యుల మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకొని దానికి అనుగుణంగా ప్రవర్తిస్తాడు.

అంతర్గత మానవ ప్రబోధన (ఇన్‌హెరెంట్ హ్యూమన్ డ్రైవ్)పై ఆధారపడి సర్వవ్యాప్తమైన బంధాలన్నింటిలో మౌలికంగా విలసిల్లేదే 'బంధుత్వం' (కిన్‌షిప్)అని డాక్టర్ ఎస్.మజుందార్ పేర్కొన్నారు.

బంధుత్వం - రకాలు

బంధుత్వం 2 రకాలు. **అవి:**

1. వైవాహిక బంధుత్వం
2. రక్త సంబంధ బంధుత్వం

వైవాహిక బంధుత్వం

వివాహం ద్వారా స్త్రీ, పురుషుల మధ్య ఏర్పడే సంబంధాన్ని 'వైవాహిక బంధుత్వం' అంటారు.

ఉదా: పెళ్లి ద్వారా సంబంధిత యువతీ యువకులకు ఇరుపక్షాల్లో వివిధ వ్యక్తులతో బంధుత్వం ఏర్పడుతుంది. వివాహం వల్ల ఏర్పడే బంధువులను వైవాహిక బంధువులుగా పేర్కొంటారు.

రక్త సంబంధ బంధుత్వం

ఒక కుటుంబంలో భార్య, భర్త, వారి పిల్లల మధ్య ఏర్పడే పరస్పర బంధాలను 'రక్త సంబంధ బంధుత్వం'గా పేర్కొంటారు. ఒక దంపతులకు పుట్టిన బిడ్డలందరి మధ్య రక్త సంబంధం ఉంటుంది. ఈ రక్త సంబంధాన్ని తెలిపేదే ఏకరక్త బంధుత్వం.

సమాజంలో ఏకరక్త బంధువులందరి మధ్య తప్పకుండా రక్తసంబంధం ఉంటుందని చెప్పలేం. కొంతమంది దత్తత తీసుకున్న శిశువును కూడా పుట్టిన బిడ్డగానే పరిగణిస్తారు. ఈ విధంగా రక్తసంబంధం సమాజ గుర్తింపు ఆధారంగా కూడా ఉంటుంది. సమాజం గుర్తించే బంధుత్వాన్ని సామాజిక బంధుత్వం (సోషియలాజికల్ కిన్‌షిప్)గా పేర్కొంటారు.

బంధుత్వ స్థానం (డిగ్రీ ఆఫ్ కిన్‌షిప్)

శాస్త్రీయ దృక్పథంలో బంధువులను 3 రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

I. ప్రాథమిక బంధుత్వం
II. ద్వితీయ బంధుత్వం (గౌణ బంధుత్వం)
III. తృతీయ బంధుత్వం

ప్రాథమిక బంధుత్వం

బంధువర్గంలోని వ్యక్తులను దగ్గరి లేదా దూరపు బంధువులుగా వర్గీకరించవచ్చు. వీరిలో కొంత మంది చాలా సన్నిహితంగా, ప్రత్యేకంగా ఉంటారు.

ఉదా: తండ్రి - కుమారుడు
సోదరి- సోదరుడు
భార్య - భర్త

వీరిని ప్రాథమిక బంధువులుగా పిలుస్తారు.

సామాజిక శాస్త్రవేత్త 'దూబే' ప్రకారం ప్రాథమిక బంధువులు 8 మంది. వారు..

1. భర్త - భార్య
2. తండ్రి- కుమారుడు
3. తల్లి - కుమార్తె
4. తండ్రి - కూతురు
5. తల్లి- కుమారుడు
6. సోదరులు
7. సోదరీమణులు
8. సోదరి - సోదరుడు

ద్వితీయ బంధువులు

ఒక వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక బంధువుల ప్రాథమిక బంధువులు ఆ వ్యక్తికి ద్వితీయ బంధువులు అవుతారు.

ఉదా: తండ్రి సోదరుడు

తృతీయ బంధువులు

ఒక వ్యక్తి ద్వితీయ బంధువుల ప్రాథమిక బంధువులు ఆ వ్యక్తికి తృతీయ బంధువులు అవుతారు.

ఉదా: భార్య యొక్క బావ

యుర్దాక్ ప్రకారం ప్రతి వ్యక్తికి 33 ద్వితీయ, 151 తృతీయ బంధుత్వాలు ఉంటాయి.

బంధుత్వ పరిభాష

బంధువర్గంలోని వ్యక్తులను సంబోధించే వరసలనే 'బంధుత్వ పరిభాష' అంటారు.

ఉదా: సాధారణంగా తెలుగు భాషలో బంధువులను పిలవడానికి ఉపయోగించే నాన్న, అమ్మ, చెల్లి, అక్క, అత్త.

బంధుత్వ పరిభాషను మోర్గాన్ 2 రకాలుగా వర్గీకరించాడు.

1. **వర్గాత్మక వ్యవస్థ:** వర్గాత్మక వ్యవస్థలో వివిధ సంబంధీకులందరినీ ఒకే వర్గంలో చేర్చడంతోపాటు వారిని ఒకే పదంతో సంబోధిస్తారు.

ఉదా: 'మామ' ఒక వర్గాత్మక పదం.

వర్గాత్మక వ్యవస్థలో బంధువులను సంబోధించే పద్ధతి ఆధారంగా బంధుత్వ పదాలను 3 రకాలుగా పేర్కొనవచ్చు.

ఎ. సంబోధన పదాలు
బి. అన్వయ పదాలు
సి. టెక్నానమీ

ఎ. **సంబోధన పదాలు:** ఒక వ్యక్తి తన బంధువులతో సంభాషించినప్పుడు వాడే పదాలనే సంబోధన పదాలు అంటారు.

ఉదా:

1. ఒక వ్యక్తి తన చెల్లితో సంభాషించినప్పుడు సోదరి అంటాడు.
2. ఒక వ్యక్తి తన తండ్రితో సంభాషించినప్పుడు 'నాన్నా' అని వాడతాడు.

బి. **అన్వయ పదాలు:** ఒక వ్యక్తి మూడో వ్యక్తితో తన బంధువుల్లో ఒకరి గురించి చెప్పేటప్పుడు ఉపయోగించే సంభాషణా పదమే 'అన్వయ పదం'.

ఉదా: ఒక వ్యక్తి తన నాన్న సోదరుడి గురించి మరో వ్యక్తికి చెప్పినప్పుడు నా 'చిన్నాన్న' అని వర్ణిస్తాడు. ఇక్కడ 'చిన్నాన్న' అనేది అన్వయ పదం.

సి. **టెక్నానమీ:** కొన్నిసార్లు కుటుంబంలోని ఓ బంధం గురించి మూడో వ్యక్తికి చెప్పినప్పుడు అతడి పేరు పెట్టి చెప్పకుండా ఒక ప్రత్యేకమైన బంధుత్వ పదాన్ని ఉపయోగిస్తారు. దీన్నే 'టెక్నానమీ' అంటారు.

ఉదా: ఒక మహిళ ఆమె భర్త గురించి మూడో వ్యక్తికి చెప్పేటప్పుడు అతడిని వారి పిల్లల తండ్రిగా పేర్కొంటుంది.

2. **వివరణాత్మక వ్యవస్థ:** ఇందులో ఒక సంబంధానికి ఒక పదాన్ని మాత్రమే సూచిస్తారు. వివరణాత్మక వ్యవస్థలో భాషా నిర్మిత పరంగా బంధుత్వ పదాలను 3 రకాలుగా వర్గీకరించవచ్చు.

i. ప్రాథమిక పదాలు
ii. ఉత్పన్న పదాలు
iii. వివరణాత్మక పదాలు

i. ప్రాథమిక పదాలు: కుటుంబంలోని దగ్గరి బంధువులను పిలవడానికి ఉపయోగించేవి ప్రాథమిక పదాలు. వీటిని విభజించడానికి వీలుకాదు.

ఉదా: తండ్రి, తల్లి


ii. ఉత్పన్న పదాలు: ఉత్పన్న పదాలను విడదీయవచ్చు. వీటిలో ఒక ప్రాథమిక పదం, మరో ఉత్పన్న పదంతో కలిసి కొత్త పదంగా ఏర్పడుతుంది.

ఉదా: చిన్నమ్మ
ఇక్కడ చిన్న + అమ్మ = చిన్నమ్మ
చిన్న → ఉత్పన్న పదం
అమ్మ → ప్రాథమిక పదం

iii. వివరణాత్మక పదాలు: రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాథమిక పదాలు కలవడం వల్ల ఒక కొత్త పదం ఏర్పడితే దాన్ని వివరణాత్మక పదం అంటారు.

ఉదా: నాన్నమ్మ → నాన్న+ అమ్మ
నాన్న → ప్రాథమిక పదం
అమ్మ → ప్రాథమిక పదం

సాపేక్షతా సిద్ధాంతం కనుగొన్నవారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం


ఫిజికల్ సైన్స్

ఆధునిక భౌతిక శాస్త్రం

ప్రపంచమంతా పదార్థంతో నిర్మితమైంది. పదార్థ ధర్మం అందులోని కణాలపై ఆధారపడి ఉంటుంది. కణాలు,పదార్థ ధర్మం గురించి వివరించడానికి ఈ ఆధునిక భౌతికశాస్త్రం దోహదపడుతుంది.

19వ శతాబ్దంలో 'మాక్స్‌ప్లాంక్' అనే భౌతిక శాస్త్రవేత్త 'క్వాంటం సిద్ధాంతం' ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం భౌతికశాస్త్ర విభాగంలో ఎన్నో అంశాలను వివరించడంతోపాటు నూతన ఆవిష్కరణలకు పునాది వేసింది. ఈ పాఠంపై అనేక పోటీ పరీక్షల్లో వస్తున్న ప్రశ్నలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన కొన్ని ముఖ్యాంశాలు.

- ఆటమ్ అంటే గ్రీకు భాషలో విభజించడానికి వీలులేనిది అర్థం.
- పరమాణువు అత్యంత సూక్ష్మమైన కణం అని డాల్టన్ అనే శాస్త్రవేత్త భావించారు. ఈయన 1808లో పరమాణు సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. డాల్టన్‌ను పరమాణు పితామహుడిగా అభివర్ణిస్తారు.
- పరమాణువును విభజించవచ్చని అభిప్రాయపడి, పరమాణు నమూనాను పుచ్చకాయతో పోల్చినవారు -జేజే థామ్సన్
- పుచ్చకాయలోని నల్లని గింజలు రుణావేశాన్ని కలిగి ఉంటాయి.
- పరమాణువులో ఉండే ప్రాథమిక కణాలు -ప్రోటాన్, ఎలక్ట్రాన్, న్యూట్రాన్
- పరమాణు కేంద్రకంలో ఉండే కణాలు -ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు
- పరమాణు కేంద్రకంలో లేని కణం - ఎలక్ట్రాన్
- పరమాణు కేంద్రకం ధనావేశాన్ని కలిగి ఉంటుంది.
- ప్రాథమిక కణాల్లో ఆవేశ రహిత కణం - న్యూట్రాన్
- ప్రాథమిక కణాల్లో ద్రవ్యరాశి స్వల్పంగా ఉండే కణం - ఎలక్ట్రాన్
- పరమాణు పరిమాణాన్ని తెలిపేందుకు వాడే ప్రమాణం ̄ ఆంగ్‌స్ట్రామ్).
  1 ̄ = 10^{-8} సెం.మీ. లేదా 10^{-10} మీ.
- పరమాణు కేంద్రక వ్యాసార్థాన్ని తెలిపే ప్రమాణం ఫెర్మి
  ఫెర్మి = 10^{-13}సెం.మీ. లేదా 10^{-15}మీ.
- పొడవును కొలవడానికి ఉపయోగించే అతి చిన్న ప్రమాణమే ఫెర్మి. అమెరికాలో 1942, డిసెంబర్‌లో న్యూక్లియర్ రియాక్టర్‌ను తయారుచేసిన ఎన్‌రిక్ ఫెర్మి పేరు మీదనే ఈ ప్రమాణాన్ని తీసుకున్నారు.
- పొడవును కొలవడానికి వాడే అతిపెద్ద ప్రమాణం పార్‌సెక్.
  పార్‌సెక్ = 3.26 కాంతి సంవత్సరం
- పార్‌సెక్‌ను నక్షత్రాల మధ్య దూరం కొలవడానికి ఉపయోగిస్తారు.
- కాంతి శూన్యంలో ఒక సంవత్సర కాలంలో ప్రయాణించిన దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- భూమి, నక్షత్రాల మధ్య దూరాన్ని కాంతి సంవత్సరాల్లో కొలుస్తారు.
- కాంతి సంవత్సరం = 9.46×10^{12} కి.మీ.
  = 9.46×10^{15} మీ.
- పరమాణు కేంద్రకానికి ధనావేశం ఉంటుందని రూథర్‌ఫర్డ్ α – కణ పరిక్షేపణ ప్రయోగంతో వివరించారు. ఈయన్ని పరమాణు కేంద్రక పితామహుడు అని పేర్కొంటారు. పరమాణు నిర్మాణాన్ని గ్రహమండల నమూనాతో వివరించారు.
- పరమాణు కేంద్రకంలో ఉండే కణాల మధ్య బలాలు - కూలుంబ్ బలాలు.
- పరమాణు కేంద్రకానికి, దానిచుట్టూ తిరిగే ఎలక్ట్రాన్‌కు మధ్య పని చేసే బలాలు - స్థిర విద్యుదాకర్షణ బలాలు
- పరమాణు కేంద్రకంలో ఉండే ప్రోటాన్‌ల సంఖ్యను పరమాణు సంఖ్య(z) అంటారు.
- పరమాణు కేంద్రకంలో ఉండే కణాల ద్రవ్యరాశుల మొత్తాన్ని పరమాణు ద్రవ్యరాశి అంటారు.



- కేంద్రకంలోని విడివిడి అనుఘటకాల మొత్తం ద్రవ్యరాశికి, కేంద్రకం మొత్తం ద్రవ్యరాశికి మధ్య ఉండే వ్యత్యాసాన్ని ద్రవ్యరాశి లోపం (Δm) అంటారు.
- ద్రవ్యరాశి లోపం అనేది కేంద్రక స్థిరత్వానికి కొలమానం.
- జర్మనీ దేశానికి చెందిన శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ద్రవ్యరాశి శక్తి తుల్యతా నియమాన్ని ప్రతిపాదించారు.

ఐన్‌స్టీన్ ప్రతిపాదనలు

- ద్రవ్యరాశి- శక్తి తుల్యతా నియమం
  $E = mc^2$
- సాపేక్షతా సిద్ధాంతం
- కాంతి విద్యుత్ ఫలితం. ఈ ఫలితాన్ని నిరూపించినందుకు 1921లో ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి లభించింది.
- ఐన్‌స్టీన్‌ను మిలీనియం శాస్త్రవేత్తగా పిలుస్తారు
- కేంద్రకంలోని కణాలను బంధించడానికి అవసరమయ్యే శక్తిని బంధన శక్తి అంటారు.
  కేంద్రక బంధన శక్తి (B.E.) =
  ద్రవ్యరాశి లోపం (Δm) × 931.5 mev
- ఒకే పరమాణు సంఖ్య కలిగి విభిన్న ద్రవ్యరాశి సంఖ్యలు, విభిన్న న్యూట్రాన్‌ల సంఖ్యలు ఉండే మూలకపు పరమాణువులను ఐసోటోపులు అంటారు.
- ఐసోటోపులను థామ్సన్, ఆస్టన్ కనుగొన్నారు.
- మానవ శరీరంలోని రక్త సరఫరాలో ఉండే లోపాలు తెలుసుకోవడానికి, హృదయస్పందనను నియంత్రించడానికి వాడే ఐసోటోపు - రేడియో సోడియం
- యంత్ర భాగాల అరుగుదల, మొక్కలు గ్రహించిన నీటిశాతం కనుగొనడానికి, మెదడులో ఏర్పడిన కణితి స్థానం గుర్తించడానికి వాడే ఐసోటోపు - రేడియో ఫాస్పరస్
- కాన్సర్ గడ్డల చికిత్సలో వాడే ఐసోటోపు - రేడియో కోబాల్ట్
  (కోబాల్ట్ ఉపయోగించి చేసే చికిత్సను కోబాల్ట్ థెరపీ అంటారు)
- శిలాజాల వయస్సును కనుగొనడానికి ఉపయోగించే పద్ధతి -కార్బన్ డేటింగ్
  (కార్బన్ డేటింగ్‌ను లిబ్బి అనే శాస్త్రవేత్త వివరించారు.)
- భూమి, శిలల వయస్సును అంచనా వేయడానికి, ఉపయోగించే ఐసోటోపు - యురేనియం డేటింగ్
- ఖనిజ లవణాలను కనుగొనడానికి ఉపయోగించే ఐసోటోపు -రేడియో సల్ఫర్
- రేడియో ఐసోటోపుల ఉత్పత్తిలో ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం -భారత్
- ఒకే ద్రవ్యరాశి సంఖ్య కలిగి ఉండి, విభిన్న పరమాణు సంఖ్యలు, విభిన్న న్యూట్రాన్ సంఖ్యలు ఉండే మూలక కేంద్రాన్ని ఐసోబార్ అంటారు.
- ఒకే న్యూట్రాన్ సంఖ్య కలిగి, విభిన్న ద్రవ్యరాశి సంఖ్యలు, విభిన్న పరమాణు సంఖ్యలు ఉండే మూలక కేంద్రాన్ని ఐసోటోన్‌లు అంటారు.
- ఒకే పరమాణు సంఖ్య, ఒకే ద్రవ్యరాశి సంఖ్య, ఒకే న్యూట్రాన్ సంఖ్య కలిగి, విభిన్న రేడియోధార్మికతలు, విభిన్న భౌతిక ధర్మాలు ఉండే మూలక కేంద్రాన్ని ఐసోమర్ అంటారు.
- రేడియోధార్మికతను 1896లో ఫ్రెంచి భౌతిక శాస్త్రవేత్త ఎ.హెచ్. బెక్వరల్ వివరించారు.
- రేడియోధార్మికత కేంద్రక జలాల స్వభావంపై ఆధారపడి ఉంటుంది.
- ప్రకృతిలోని ప్రాథమిక బలాల్లో అత్యంత బలమైంది - బలమైన కేంద్రక బలం.
- ప్రకృతిలో అత్యంత బలహీనమైన బలం - గురుత్వాకర్షణ బలం.
- కేంద్రకంలోని బలాలను కూలుంబ్ వర్గీకరించారు.
- ఆవేశానికి ప్రమాణం -కూలుంబ్
- పరమాణు సంఖ్య అధికంగా ఉన్నా, స్థిరత్వ ధర్మాన్ని ప్రదర్శించే మూలకం -సీసం.
  (సీసం లాటిన్ పేరు ప్లంబం. కాబట్టి దీన్ని pb తో సూచిస్తారు)
- ప్రోటీయం, డ్యుటీరియం, ట్రిటియంలను ఏర్పరిచే మూలకం -హైడ్రోజన్
- హైడ్రోజన్‌ను హెన్రీ కావెండిష్ కనుగొన్నారు. ఇది అత్యంత తేలికైన మూలకం.
- న్యూట్రాన్ రహిత ఏకైక మూలకం - హైడ్రోజన్
- అయోడిన్ లోపం వల్ల కలిగే వ్యాధి - గాయిటర్
- పరమాణు సంఖ్య 83 కంటే ఎక్కువగా ఉండే మూలక కేంద్రకాలు అస్థిరత్వం వల్ల వికిరణాలను ఉద్గారం చేస్తూ స్వచ్ఛంద, విఘటనం చెందే దృగ్విషయాన్ని సహజ రేడియోధార్మికత అంటారు.
- సహజ రేడియోధార్మికతను ఎ.హెచ్. బెక్వరల్ వివరించారు.
- యురేనియం నుంచి విడుదలైన వికిరణాలను బెక్వరల్ కిరణాలు పిలుస్తారు.
- DAE అంటే..
  Department of Atomic Energy
- BRIT అంటే..
  Board of Radiation and Isotope Technology

ఎలక్ట్రాన్

- పరమాణువులోని మూల కణాల్లో మొదట కనుగొన్న కణం - ఎలక్ట్రాన్
- దీనిని 1897లో కనుగొన్నారు.
- ఎలక్ట్రాన్‌ను జె.జె.థామ్సన్ ప్రయోగపూర్వకంగా కనుగొన్నాడు.
- రుణావేశ కణానికి జి.జె. స్టోనీ ఎలక్ట్రాన్ అని పేరు పెట్టాడు.
- ఎలక్ట్రాన్ ద్రవ్యరాశి, ప్రోటాన్ ద్రవ్యరాశిలో 1837వ వంతు ఉంటుంది.
- ఎలక్ట్రాన్ ఆవేశం, ద్రవ్యరాశుల మధ్య నిష్పత్తిని ఎలక్ట్రాన్ విశిష్టావేశం అంటారు.
- ఎలక్ట్రాన్ విశిష్టావేశం (e/m) (సెం.మీ) విలువ: 1.759×10^{11} col / kg
- ఈ విలువను జేజే థామ్సన్ కనుగొన్నాడు.

న్యూట్రాన్

- న్యూట్రాన్‌ను 1932లో జేమ్స్ ఛాడ్విక్ కనుగొన్నాడు.
- న్యూట్రాన్‌కు కేంద్రకం బయట జీవితకాలం.. 13 నిమిషాలు.
- న్యూట్రాన్ ద్రవ్యరాశి విలువ ప్రోటాన్ మూలకణ ద్రవ్యరాశికి దాదాపుగా సమానంగా ఉంటుంది.
- కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియలో ఉపయోగపడే మూలకణం న్యూట్రాన్.

ప్రోటాన్

- ప్రోటాన్‌ను మొదట గోల్డ్ స్టెయిన్ గుర్తించాడు.
- 1920లో రూథర్‌ఫర్డ్ ప్రోటాన్‌ను ప్రయోగపూర్వకంగా కనుగొన్నాడు.
- ప్రోటాన్ ద్రవ్యరాశి: 1.0073 a.m.u.
- ప్రోటాన్ ఆవేశం $+1.602\times10^{-19}$ col
- పరమాణు కేంద్రకం ఆవేశానికి కారణమైన మూలకం ప్రోటాన్.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పరమాణువులోని న్యూక్లియర్ వ్యాసం?
   ఎ) 10^{-10} సెం.మీ.
   బి) 10^{-13} సెం.మీ.
   సి) 10^{10} సెం.మీ.
   డి) 10^{13} సెం.మీ.
2. ప్రోటాన్‌ను మొదట గుర్తించిన శాస్త్రవేత్త?
   ఎ) ఛాడ్విక్ బి) స్మిత్
   సి) థామ్సన్ డి) గోల్డ్ స్టెయిన్
3. ఎలక్ట్రాన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
   ఎ) డా. ఎవంజిలానా విల్లెగాస్
   బి) పి.ఎస్. రాస్మునిన్
   సి) రూథర్‌ఫర్డ్
   డి) ఎవరూ కాదు
4. రేడియోధార్మికత కింది వాటిలో దేనికి సంబంధించింది?
   ఎ) అమెచ్యూర్ రేడియో
   బి) రేడియో ఖగోళం
   సి) మూలక కేంద్రం డి) పైవన్నీ
5. రేడియోధార్మికత లేని మూలకం?
   ఎ) హీలియం బి) రేడియం
   సి) థోరియం డి) యురేనియం
6. సాపేక్షతా సిద్ధాంతం కనుగొన్నవారు?
   ఎ) మార్కోని బి) ఐన్‌స్టీన్
   సి) జి.జె.స్టోనీ డి) బెర్లిన్

సమాధానాలు

1) బి; 2) డి; 3) డి; 4) సి; 5) ఎ; 6) బి.

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్ఆర్ఆర్ఎల్, రాజస్థాన్‌లో 121 పోస్టులు

రాజస్థాన్‌లోని హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్(జాయింట్ వెంచర్ కంపెనీ) ఎగ్జిక్యూటివ్, ఇంజనీరింగ్, మేనేజీరియల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 121.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్ -80, ఇంజనీర్-06, ఆఫీసర్-01, సీనియర్ ఇంజనీర్-11, సీనియర్ మేనేజర్-23.
» **విభాగాలు:** కెమికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ప్రాసెస్(రిఫైనరీ), టెక్నికల్ ప్లానింగ్(రిఫైనరీ-పెట్రోకెమికల్), ప్రాసెస్(ఆఫ్‌సైట్ అండ్ ప్లానింగ్) క్వాలిటీ కంట్రోల్(రిఫైనరీ/పెట్రోకెమికల్), మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫైర్ అండ్ సేఫ్టీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు జూనియర్ ఎగ్జిక్యూటివ్‌కు రూ.30,000 నుంచి రూ.1,20,000, ఇంజనీర్, ఆఫీసర్ పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000, సీనియర్ ఇంజనీర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, సీనియర్ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000.
» **వయసు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్‌కు 25 ఏళ్లు, ఇంజనీర్, ఆఫీసర్ పోస్టులకు 29 ఏళ్లు, సీనియర్ ఇంజనీర్‌కు 34 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.02.2025.
» **వెబ్‌సైట్:** https://hrrl.in

ఐఎఫ్‌సీఐ, న్యూఢిల్లీలో ఫైనాన్స్ అకౌంట్స్ ట్రైనీ / అడ్మినిస్ట్రేషన్ ట్రైనీ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఐఎఫ్‌సీఐ).. ఒప్పంద ప్రాతిపదికన ఫైనాన్స్ అకౌంట్స్ ట్రైనీ/అడ్మినిస్ట్రేషన్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **అర్హత:** బీకాం/బీబీఏ-ఫైనాన్స్ ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.15,000.
» **వయసు:** 31.12.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.01.2025.
» **వెబ్‌సైట్:** https://www.ifciltd.com

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సరైన ప్రణాళికలే సమస్యకు పరిష్కారం!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

భారతదేశంలో ఉపాధి స్థితిగతులు

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అయిన భారతదేశంలో నిరుద్యోగ స్వభావం అభివృద్ధి చెందిన దేశాలకు భిన్నంగా ఉంటుంది. సార్థక డిమాండ్ లోపించడం వల్ల అభివృద్ధి చెందిన దేశాల్లో నిరుద్యోగం ఏర్పడుతుందని ఆర్థికశాస్త్ర నిపుణులు కీన్స్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రచ్ఛన్న నిరుద్యోగిత, వ్యవస్థాపరమైన నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత, రుతు సంబంధ నిరుద్యోగిత, విద్యావంతుల్లో నిరుద్యోగిత అనే వివిధ రకాలైన నిరుద్యోగం ఏర్పడుతుంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో నిరుద్యోగ సమస్య నివారణకు అనేక స్వయం ఉపాధి, వేతన ఉపాధి పథకాలను అమలు పరిచారు. అయినప్పటికీ పథకాల అమల్లో లోపాల కారణంగా ఇప్పటికీ నిరుద్యోగ సమస్య పరిష్కారం కాలేదు.

15 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి, పనిచేసే సామర్థ్యం, పని చేయాలనే కోరిక ఉన్న వ్యక్తులకు మార్కెట్‌లో నెలకొన్న వేతన రేట్ల వద్ద పని లభించని పరిస్థితిని 'నిరుద్యోగ స్థితి'గా పేర్కొనవచ్చు. నిరుద్యోగ సమస్యపై పరిశీలన కోసం బి. భగవతి నేతృత్వంలో ఒక కమిటీని నియమించారు. ఇది 1973 మేలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీని ప్రకారం.. 1971లో దేశంలో మొత్తం శ్రామిక శక్తి 180.4 మిలియన్లు కాగా, వీరిలో 148.4 మిలియన్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో, 32 మిలియన్ల మంది పట్టణ ప్రాంతాల్లో ఉన్నారు. దేశంలో మొత్తం నిరుద్యోగితను 18.7 మిలియన్లుగా కమిటీ అంచనా వేసింది. వీరిలో 9 మిలియన్ల మందికి ఏవిధమైన ఉపాధి లేదు. మిగిలిన 9.7 మిలియన్ల మంది వారంలో 14 గంటల కంటే తక్కువ ఉపాధి పొందుతున్న వారున్నారు. మొత్తం 18.7 మిలియన్ల నిరుద్యోగుల్లో 16.1 మిలియన్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో, 2.6 మిలియన్ల మంది పట్టణ ప్రాంతాల్లో ఉన్నారు. దేశంలో మొత్తం శ్రామిక శక్తిలో నిరుద్యోగిత వాటా 10.4 శాతం. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 10.9 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 8.1 శాతంగా నమోదైంది.

నేషనల్ శాంపిల్ సర్వే అంచనాలు

దేశంలో పంచవర్ష ప్రణాళికల అమలు ప్రారంభమైన తర్వాత వివిధ సంస్థలు, వ్యక్తులు విభిన్న పద్ధతుల్లో నిరుద్యోగితను అంచనా వేశారు. వీటిలో ముఖ్యమైంది 'జాతీయ నమూనా సర్వే వ్యవస్థ'. నిరుద్యోగిత అంచనాల కోసం ప్రణాళికా సంఘం 1969లో దంత్‌వాలా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు జాతీయ నమూనా సర్వే వ్యవస్థ తన 27వ రౌండు నుంచి (1972–73) దేశ పరిస్థితులకు అనుగుణంగా నిరుద్యోగితను మూడు విధాలుగా విభజించి అంచనా వేస్తోంది. **అవి:**

1. సాధారణ స్థితి నిరుద్యోగిత
2. వారంవారీ స్థితి నిరుద్యోగిత
3. రోజువారీ స్థితి నిరుద్యోగిత

సాధారణ స్థితి నిరుద్యోగిత: సర్వే చేసే తేదీకి ముందు ఒక సంవత్సర కాలానికి సంబంధించి మొత్తం కాలంలో నిరుద్యోగులుగా ఉన్న వారిని సాధారణ స్థితి నిరుద్యోగులుగా పరిగణిస్తారు. సంవత్సరంలో ఏ కొద్ది రోజులు పనిలో ఉన్నా, వారిని ఈ రకమైన నిరుద్యోగులుగా పరిగణించరు. 1977–78లో ఈ రకమైన నిరుద్యోగిత దేశంలో 4.23 శాతం కాగా, 1980లో ఇది 4.4 శాతానికి పెరిగింది. 2011–12లో ఈ రకమైన నిరుద్యోగం 2.2 శాతంగా నమోదైంది.

వారంవారీ స్థితి నిరుద్యోగిత: నిరుద్యోగితకు సంబంధించిన సర్వే జరిపే రోజుకు ముందు వారంలో ఏ ఒక్క గంట కూడా పని లభించని స్థితిని 'వారంవారీ స్థితి నిరుద్యోగిత' అంటారు. ఈ వారం రోజుల్లో ఏ ఒక్క రోజైనా ఒక్క గంట పని దొరికినా వారిని ఉపాధి పొందిన వారుగానే భావిస్తారు. 1977–78లో ఈ రకమైన నిరుద్యోగిత 4.48 శాతం నుంచి 4.54 శాతానికి పెరిగింది. 2009–10లో ఈ విధమైన నిరుద్యోగిత గ్రామీణ ప్రాంతాల్లో 3.3 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 4.2 శాతంగా, దేశంలో 3.6 శాతంగా నమోదైంది.

రోజువారీ స్థితి నిరుద్యోగిత: నిరుద్యోగులకు సంబంధించి ఏడు రోజుల శ్రమ దినాల్లో నిరుద్యోగిగా ఉన్న శ్రమ దినాలు ఎన్ని ఉన్నాయో లెక్కించి, మొత్తం శ్రమ దినాల్లో నిరుద్యోగిత ఉన్న శ్రమదినాల నిష్పత్తిని 'రోజువారీ స్థితి నిరుద్యోగిత' తెలియజేస్తుంది. 1977–78లో ఈ రకమైన నిరుద్యోగిత 8.18 శాతం కాగా, 1980లో 7.84 శాతానికి తగ్గింది. 2011–12లో ఈ రకమైన నిరుద్యోగం 5.6 శాతంగా నమోదైంది.

ఉపాధి నాణ్యత సూచీలు

1. శ్రామికులు పొందిన వేతనాలు.
2. సంవత్సర కాలంలో క్యాజువల్ శ్రామికులు ఉపాధి పొందిన పని దినాలు.
3. సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉపాధి పొందిన శ్రామికుల వాటా.
4. మొత్తం ఉపాధిలో స్వయం ఉపాధి, శాశ్వతంగా వేతనాలు పొందిన ఉద్యోగస్థులు, క్యాజువల్ శ్రామికుల నిష్పత్తి.
5. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ కార్యకలాపాల్లో ఉపాధి పంపిణీ.
6. విద్యా స్థాయి, నేర్పరితనానికి అనుగుణంగా శ్రామిక ఉత్పాదకత.

సంస్కరణల అనంతర కాలంలో ఉపాధి విధానాలు

ఎనిమిదో ప్రణాళిక (1992–97): 1990 ప్రారంభంలో అప్పటికే ఉన్న నిరుద్యోగిత (Backlog of unemployed) 28 మిలియన్లు కాగా, 1990–95 మధ్యకాలంలో శ్రామిక శక్తికి అదనంగా 37 మిలియన్ల మంది తోడవుతారని అంచనా వేశారు. ఎనిమిదో పంచవర్ష ప్రణాళికలో మొత్తం 65 మిలియన్ల మందిని నిరుద్యోగులుగా అంచనా వేశారు. 1995–2000 మధ్యకాలంలో శ్రామికశక్తికి అదనంగా 41 మిలియన్ల మంది తోడవుతారని, 2000 సంవత్సరం నాటికి ఉపాధి కోరుకునే వారి సంఖ్య 106 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేశారు.

తొమ్మిదో ప్రణాళిక (1997–2002): ఈ ప్రణాళికలో 53 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంటుందని భావించారు. 2002–07 మధ్యకాలంలో శ్రామిక శక్తికి అదనంగా 58 మిలియన్లు, 2007–12 మధ్యకాలంలో 55 మిలియన్ల మంది తోడవుతారని అంచనా వేశారు. ఉపాధి నాణ్యత తక్కువగా ఉండటంతో పాటు ఆదాయ స్థాయి తక్కువైనందువల్ల పేదరిక స్థాయి పెరుగుతుందని భావించారు. మొత్తం శ్రామికుల్లో 70 శాతం మంది నిరక్షరాస్యులుగా లేదా ప్రాథమిక స్థాయికంటే తక్కువ విద్యను అభ్యసించిన వారుగా ఉన్నట్లు ప్రణాళిక డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. అధిక ఉపాధి కల్పించే సామర్థ్యం ఉన్న రంగాలపై దృష్టి సారించడం ద్వారా ఉపాధి పెంపొందించాలనే వ్యూహాన్ని రూపొందించారు. ఈ వ్యూహంలో భాగంగా విధాన నిర్ణేతలు వ్యవసాయం, వాణిజ్యం, రవాణా, నిర్మాణ రంగాలపై దృష్టి సారించారు.

పదో ప్రణాళిక (2002–2007): పదో ప్రణాళికలో 50 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ మొత్తంలో స్వయం ఉపాధి పథకాల ద్వారా 20 మిలియన్లు, ఆర్థిక వృద్ధి రేటు పెంపు ద్వారా వివిధ రంగాల నుంచి 30 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని అంచనా వేశారు. ఎంపిక చేసిన ప్రత్యేక కార్యక్రమాలు ఒకేసారి కాకుండా క్రమంగా ఉపాధి కల్పించగలవని ప్రణాళిక రచయితలు భావించారు. నూతన ఉపాధి అవకాశాల్లో 90 శాతం వరకు చిన్న, మధ్య తరహా సంస్థలకు, స్వయం ఉపాధికి వాటా ఉండగలదని విధాన నిర్ణేతలు భావించారు.

పదకొండో ప్రణాళిక (2007–2012): పదకొండో ప్రణాళిక ప్రారంభం నాటికి ఉపాధి కోసం వేచి ఉన్నవారి సంఖ్య 35 మిలియన్లు కాగా, పదకొండో ప్రణాళికా కాలంలో శ్రామిక శక్తికి అదనంగా 65 మిలియన్ల మంది తోడవుతారని అంచనా వేశారు. పదకొండో ప్రణాళికలో మొత్తం నిరుద్యోగుల సంఖ్యను 100 మిలియన్లుగా అంచనా వేశారు. ఈ ప్రణాళికలో 58 మిలియన్ల అదనపు ఉపాధి అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు విద్యావంతుల్లో నిరుద్యోగిత రేటును 5 శాతానికి తగ్గించడం, నైపుణ్యం కొరవడిన శ్రామికుల్లో వాస్తవిక వేతనాలను 20 శాతం పెంచడం లక్ష్యాలుగా తీసుకున్నారు.

ఆర్థిక సంస్కరణల కాలంలో ఉపాధి వృద్ధికి సంబంధించిన బలహీనతల గురించి పదకొండో పంచవర్ష ప్రణాళికలో కింది అంశాలను పేర్కొన్నారు.

1. 1993–94లో నిరుద్యోగిత రేటు 6.1 శాతం నుంచి 1999–2000లో 7.3 శాతానికి, 2004–05లో 8.3 శాతానికి పెరిగింది.
2. వ్యవసాయ శ్రామిక కుటుంబాల్లో నిరుద్యోగం 1993–94లో 9.5 శాతం కాగా, 2004–05లో 15.3 శాతానికి పెరిగింది.
3. 2004–05లో సాధారణ స్థితి నిరుద్యోగం 2.60 శాతానికి, రోజువారీ స్థితి నిరుద్యోగం 8.54 శాతానికి పెరిగింది.
4. 1999–2000 నుంచి 2004–05 మధ్యకాలంలో వ్యవసాయేతర ఉపాధి వృద్ధిరేటు 4.7 శాతంగా నమోదైంది. ఈ వృద్ధి అధిక భాగం అసంఘటిత రంగంలో చోటు చేసుకుంది.
5. జి.డి.పి. వృద్ధి రేటులో పెరుగుదల ఏర్పడినప్పటికీ సంఘటిత రంగంలో ఉపాధి క్షీణించింది. తద్వారా చదువుకున్న యువతలో నిరాశ, నిస్పృహ పెరిగింది.



నిరుద్యోగం, అల్ప ఉద్యోగిత తగ్గింపునకు పథకాలు

భగవతి కమిటీ 1973లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన తర్వాత ఉపాధి పెంపొందించడం ద్వారా అల్ప ఉద్యోగిత నిర్మూలించడానికి ప్రభుత్వం కింద పేర్కొన్న పథకాలను ప్రవేశపెట్టింది.

1. రూరల్ వర్క్స్ ప్రోగ్రామ్.
2. ఉపాంత రైతులు, వ్యవసాయ కార్మికుల అభివృద్ధి పథకంలో భాగంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సంబంధించి ఆయా కుటుంబాలకు సబ్సిడీతో కూడిన పరపతిని అందించారు. వ్యవసాయ అనుబంధాలకు సంబంధించి డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీ, హార్టికల్చర్ ఆపరేషన్స్‌ను ప్రోత్సహించడానికి తగిన చర్యలు చేపట్టారు.
3. చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీలో భాగంగా సాంద్ర వ్యవసాయ పద్ధతులు అవలంబించడానికి, చిన్న రైతులు తమ కార్యకలాపాలను విస్తరించుకోవడానికి తగిన పరపతి కల్పించారు.
4. **ఆగ్రో–సర్వీసు కేంద్రాల ఏర్పాటు:** నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు; మెకానికల్, అగ్రికల్చర్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సంబంధిత రంగాల డిప్లొమా హోల్డర్లకు స్వయం ఉపాధి కల్పించడానికి ఈ పథకం తగిన చేయూతనిస్తుంది.
5. **సమీకృత మెట్ట వ్యవసాయ భూముల అభివృద్ధి:** ఈ పథకంలో భాగంగా భూసార పరిరక్షణ, భూమి అభివృద్ధి, నీటి వినియోగం తదితర పనులు చేపడతారు. ఈ పథకం కింద చేపట్టిన పనులు శ్రమ–సాంద్రతతో కూడినవై తగిన ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి.
6. **క్రాష్ స్కీం ఫర్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్:** శ్రమ సాంద్రత, అధిక ఉత్పాదకతతో కూడిన అనేక గ్రామీణ ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా అదనపు ఉపాధి కల్పన ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

భారతదేశంలో నిరుద్యోగ సమస్యకు కారణాలు

- మానవ వనరుల ప్రణాళికలు సక్రమంగా రూపొందించకపోవడం.
- పారిశ్రామిక రంగంలో అభివృద్ధి వేగవంతం కాకపోవడం.
- పెరుగుతున్న జనాభాతోపాటు శ్రామికశక్తికి అదనంగా తోడవుతున్న జనాభాలో పెరుగుదల.
- ఉపాధి రహిత వృద్ధి.
- చిన్న తరహా, కుటీర పరిశ్రమల్లో రుగ్మత పెరగడం.
- మూలధన కల్పన రేటు తక్కువగా ఉండటం.
- లోపభూయిష్ట విద్యావిధానం.
- శ్రామికుల గమనశీలత తక్కువగా ఉండటం.
- మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా శ్రామికులకు తగిన శిక్షణ అందించకపోవడం.
- వ్యవసాయ రంగ వృద్ధి రేటు తక్కువగా ఉండటం.

Spiral Model was developed by?

BANK EXAMS
COMPUTER AWARENESS

SDLC
(Software Development Life Cycle)

SDLC, Software Development Life Cycle is a process used by software industry to design, develop and test high quality softwares. It is also called as Software development process.

❖ ISO/IEC 12207 is an international standard for software life-cycle processes. It aims to be the standard that defines all the tasks required for developing and maintaining software. A typical Software Development life cycle consists of the following stages:


Stage1: Planning and Requirement Analysis
Stage 2: Defining Requirements
Stage 3: Designing the product architecture
Stage 4: Building or Developing the Product
Stage 5: Testing the Product
Stage 6: Deployment in the Market and Maintenance

SDLC Models

- ❖ Waterfall Model ❖ Iterative Model
- ❖ Spiral Model ❖ V-Model
- ❖ Big Bang Model

The other related methodologies are Agile Model, RAD Model, Rapid Application Development and Prototyping Models.

SDLC Waterfall Model



The sequential phases in Waterfall model are:

❖ **Requirement Gathering and analysis:** All possible requirements of the system to be developed are captured in this phase and documented in a requirement specification doc.

❖ **System Design:** The requirement specifications from first phase are studied in this phase and system design is prepared. System Design helps in specifying hardware and system requirements and also helps in defining overall system architecture.


❖ **Implementation:** With inputs from system design, the system is first developed in small programs called units, which are integrated in the next phase. Each unit is developed and tested for its functionality which is referred to as Unit Testing.

❖ **Integration and Testing:** All the units developed in the implementation phase are integrated into a system after testing of each unit. Post integration the entire system is tested for any faults and failures.

❖ **Deployment of system:** Once the functional and non functional testing is done, the product is deployed in the customer environment or released into the market.

❖ **Maintenance:** There are some issues which come up in the client environment. To fix those issues patches are released. Also to enhance the product some better versions are released. Maintenance is done to deliver these changes in the customer environment.All these phases are cascaded to each other in which progress is seen as flowing steadily downwards (like a waterfall) through the phases. The next phase is started only after the defined set of goals are achieved for previous phase and it is signed off, so the name "Waterfall Model". In this model phases do not overlap.

SDLC Iterative Model



This model is most often used in the following scenarios:

❖ Requirements of the complete system are clearly defined and understood.

❖ Major requirements must be defined; however, some functionalities or requested enhancements may evolve with time.

❖ A new technology is being used and is being learnt by the development team while working on the project.

❖ Resources with needed skill set are not available and are planned to be used on contract basis for specific iterations.

❖ There are some high risk features and goals which may change in the future.

SDLC Spiral Model



❖ **Identification:** This phase starts with gathering the business requirements in the baseline spiral. In the subsequent spirals as the product matures, identification of system requirements, subsystem requirements and unit requirements are all done in this phase.

At the end of the spiral the product is deployed in the identified market.

❖ **Design:** Design phase starts with the conceptual design in the baseline spiral and involves architectural design, logical design of modules, physical product design and final design in the subsequent spirals.

❖ **Construct or Build:** Construct phase refers to production of the actual software product at every spiral. In the baseline spiral when the product is just thought of and the design is being developed a POC (Proof of Concept) is developed in this phase to get customer feedback.

❖ **Evaluation and Risk Analysis:** Risk Analysis includes identifying, estimating, and monitoring technical feasibility and management risks, such as schedule slippage and cost overrun.

Summary

❖ Waterfall and V model are traditional SDLC models and are of sequential type. Sequential means that the next phase can start only after the completion of first phase. Such models are suitable for projects with very clear product requirements and where the requirements will not change dynamically during the course of project completion.

❖ Iterative and Spiral models are more accommodative in terms of change and are suitable for projects where the requirements are not so well defined, or the market requirements change quite frequently.

❖ Big Bang model is a random approach to Software development and is suitable for small or academic projects.

❖ Agile is the most popular model used in the industry. Agile introduces the concept of fast delivery to customers using prototype approach.

MODEL QUESTIONS

1. Spiral Model was developed by?
   1) Bev Littlewood
   2) Berry Bohem
   3) Roger Pressman
   4) Victor Bisili
   5) None of Above
2. Which model is popular for students small projects ?
   1) Waterfall Model
   2) Spiral Model
   3) Quick and Fix model
   4) Prototyping Model
   5) None of Above
3. Which is not a software life cycle model?
   1) Spiral Model
   2) Waterfall Model
   3) Iterative Model
   4) Capability maturity Model
   5) V-Shape Model
4. Project risk factor is considered in ?
   1) Spiral Model
   2) Waterfall Model
   3) Prototyping Model
   4) Iterative enhancement Model
   5) None of Above
5. SDLC stands for?
   1) Software design life cycle
   2) Software development life cycle
   3) System design life cycle
   4) System development life cycle
   5) None of Above
6. SPIRAL model has?
   1) 3 Phases 2) 1 Phase
   3) 2 Phases 4) 4 Phases
   5) None of Above
7. SRS stands for?
   1) Software requirement specification
   2) Software requirement solution
   3) System requirement specification
   4) System requirement ossification
   5) None of Above
8. Waterfall model is not suitable for?
   1) Small Projects
   2) Complex Projects
   3) Accommodating change
   4) Diminutive Projects
   5) None of Above
9. RAD stands for?
   1) Rapid Application Development
   2) Relative Application Development
   3) Ready Application Development
   4) Repeated Application Development
   5) None of Above
10. RAD Model was purposed by?
    1) IBM 2) Motorola
    3) Microsoft 4) Lucent Technologies
    5) None of Above
11. Software engineering aims at developing?
    1) Reliable Software
    2) Cost Effective Software
    3) Reliable and cost effective Software
    4) All of above 5) None of Above
12. A good specification should be?
    1) Unambiguous
    2) Distinctly Specific
    3) Functional 4) All of Above
    5) None of Above
13. Which of the following is a tool in design phase?
    1) Abstraction 2) Refinement
    3) Information Hiding
    4) All of Above
    5) None of Above
14. Information hiding is to hide from user, details ?
    1) That are relevant to him
    2) That are not relevant to him
    3) That may be maliciously handled by him
    4) That are confidential
    5) None of Above
15. Which of the following is required to communicate between two computers?
    1) Communications software
    2) Protocol
    3) Communications hardware
    4) Access to transmission medium
    5) All of the above
16. Devices is used to connect two similar LAN with same protocols
    1) Bridges 2) Router
    3) Gateway 4) Switch
    5) None of these
17. DSL is an example of a (n) ______ connection.
    1) Network 2) Wireless
    3) Slow 4) Broadband
    5) None of these
18. FTP is______
    1) used to send email
    2) used to browse the Web
    3) is part of Netscape
    4) Is a protocol for the transfer of files between computers
    5) None of these
19. Telnet is-
    1) Used to send email
    2) Uses telephone lines
    3) Is part of Netscape
    4) Is a protocol that allows for remote login
    5) None of these
20. = sum(BI:B8) is an example of a-
    1) Function 2) formula
    3) Cell address 4) value
    5) None of these

KEY

1) 2	2) 1	3) 4	4) 1
5) 2	6) 4	7) 1	8) 3
9) 1	10) 1	11) 3	12) 4
13) 4	14) 3	15) 5	16) 1
17) 4	18) 4	19) 4	20) 2